సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 269

శుక్రవారం 20-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'



ట్రాన్స్‌'జెమ్‌'డర్స్‌..

ట్రాఫిక్‌ అసిస్టెంట్లుగా ఎంపికై విధుల్లో చేరనున్న ట్రాన్స్‌జెండర్లపై కథనం -13లో



'రికార్డు' విజయం

టి20ల్లో భారత మహిళల జట్టు అత్యధిక స్కోరు. విండీస్‌పై సిరీస్‌ గెలుపు -15లో



అభిశంసన నోటీసు తిరస్కరణ

రాజ్యసభ ఛైర్మన్‌ జగదీప్‌ ధన్‌ఖడ్‌పై విపక్షాలు రాజ్యసభలో ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మాన నోటీసు తిరస్కరణకు గురైంది.

వివరాలు 6లో ▸



మార్చి 21 నుంచి టెన్త్‌ పరీక్షలు

రాష్ట్రంలో మార్చి 21 నుంచి ఏప్రిల్‌ 4 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 6 సబ్జెక్టులు, 7 పేపర్లు ఉండనున్నాయి.

వివరాలు 16లో ▸



'బలగం' మొగిలయ్య ఇకలేరు

బలగం సినిమాలోని పాటతో పేరుగాంచిన బుడగ జంగాల కళాకారుడు పస్తం మొగిలయ్య అనారోగ్యంతో కన్నుమూశారు.

వివరాలు 5లో ▸

ఐదుగురు ఉగ్రవాదులు హతం

జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిజ్బుల్‌ ముజాహిదీన్‌ టాప్‌ కమాండర్‌ సహా ఐదుగురు ముష్కరులు హతమయ్యారు.



వివరాలు 6లో ▸

రూ. 7.11 లక్షల కోట్ల అప్పు చేసి బుకాయింపా?

- ఆర్థిక స్థితిపై చర్చలో బీఆర్‌ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి ఫైర్‌
- ఎస్పీవీల ద్వారా తెచ్చిన రూ. 1.27 లక్షల కోట్ల అప్పు ఎవరు కడతారని నిలదీత
- ఆర్‌బీఐ నివేదిక పేరుతో హరీశ్‌రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజం
- తాము కట్టిన అప్పులు, వడ్డీలే రూ. 1.18 లక్షల కోట్లని... తెచ్చిన అప్పు 1.06 లక్షల కోట్లని వెల్లడి

రాజీనామాకు సిద్ధం

- అప్పులపై నేను అసత్యాలు చెప్పినట్లు రుజువు చేయండి
- అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు
- 'ఫార్ములా–ఈ'పై సభలో చర్చించాలని డిమాండ్‌

- వివరాలు 2లో

ఏ1 కేటీఆర్‌

ఫార్ములా- ఈ కార్‌ రేసు వ్యవహారంపై ఏసీబీ కేసు

- రేసు నిర్వహణకు అనుమతుల్లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా రూ.54.88 కోట్లు చెల్లించినట్లు ఆరోపణలు
- ఏ–2గా అప్పటి ఎంఏయూడీ స్పెషల్‌ సీఎస్‌ అర్వింద్‌కుమార్‌, ఏ–3గా హెచ్‌ఎండీఏ మాజీ సీఈ బీఎల్‌ఎన్‌ నర్సింహారెడ్డి
- పీసీ యాక్ట్‌, ఐపీసీ 409, 120–బీ సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్‌
- నేరపూరిత కుట్ర, అధికార దుర్వినియోగం ఆరోపణలతో కేసులు



సాక్షి, హైదరాబాద్‌: ఫార్ములా–ఈ కార్‌ రేసు వ్యవహారంపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీ రామారావును ఏ–1 (మొదటి నిందితుడు)గా, పురపాలక శాఖ (ఎంఏయూడీ) మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను ఏ–2గా, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్‌ ఇంజనీర్‌ బీఎల్‌ఎన్‌ రెడ్డిని ఏ–3గా చేర్చింది. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో కొందరు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా, ప్రభుత్వ అనుమతి లేకుండానే.. పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌ ఆదేశాలతో ఫార్ములా–ఈ కార్‌ రేసు నిర్వహణకు సంబంధించి పలు దఫాల్లో రూ.54,88,87,043 బదిలీ చేశారన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్‌ ఫిర్యాదుతో.. ఏసీబీ సెంట్రల్‌ ఇన్వెస్టిగేషన్‌ యూనిట్‌ (సీఐయూ) డీఎస్పీ మాజిద్‌ అలీఖాన్‌ అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్‌)లోని సెక్షన్‌ 13(1) (ఏ), 13(2), ఐపీసీ సెక్షన్‌ 409, 120–బీ కింద

మిగతా 3వ పేజీలో ▶

హైకోర్టులో నేడు కేటీఆర్‌ క్వాష్‌ పిటిషన్‌!

తనపై నమోదైన కేసు కొట్టివేయాలని, అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు చేపట్టకుండా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కేటీఆర్‌, ఇతర నిందితులు హైకోర్టులో క్వాష్‌ పిటిషన్‌ దాఖలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కేటీఆర్‌ ప్రజా ప్రతినిధి కావడంతో పోర్ట్‌ఫోలియో ప్రకారం జస్టిస్‌ కె.లక్ష్మణ్‌ వద్ద ఇది విచారణకు వస్తుంది. అయితే శుక్రవారం ఆయన సెలవులో ఉండటంతో జస్టిస్‌ ఎన్వీ శ్రవణ్‌కుమార్‌ వద్ద లంచ్‌మోషన్‌ రూపంలో పిటిషన్‌ దాఖలు చేసే చాన్స్‌ ఉన్నట్లు సమాచారం.

రేవంత్‌ కుంభకోణాలు బయటపెడుతున్నందుకే..

ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పాల్పడుతోంది: కేటీఆర్‌

- ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో దురుద్దేశంతోనే కేసు
- ఆధారాలుంటే అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిపై చర్చించాలి.. అవినీతిని బయట పెట్టాలి
- ఇందులో అణా పైసా కూడా వృథా కాలేదని స్పష్టీకరణ
- ఉద్యమకారులం..చిల్లర కుట్రలకు భయపడబోమని వ్యాఖ్య

3 లో





పార్లమెంట్‌ ఆవరణలో నిరసన తెలుపుతున్న ప్రియాంక, ఖర్గే సహా కాంగ్రెస్‌, ఇండియా కూటమి ఎంపీలు. గాయపడిన బీజేపీ ఎంపీ ప్రతాప్‌ సారంగి

పార్లమెంట్‌ ప్రాంగణంలో తీవ్ర ఘర్షణ

మకరద్వారం వద్ద ఎన్డీయే, ఇండియా ఎంపీల మధ్య తోపులాట

- పార్లమెంట్‌లోకి వెళ్లకుండా తమను అడ్డుకున్నారని కాంగ్రెస్‌ ఆగ్రహం
- రాహుల్‌ గాంధీ తమపై దౌర్జన్యం చేశారని బీజేపీ ధ్వజం
- ఘర్షణలో బీజేపీ ఎంపీలు ప్రతాప్‌ సారంగి, ముకేశ్‌ రాజ్‌పుత్‌లకు గాయాలు
- పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్న ఇరువర్గాలు
- లోక్‌సభ స్పీకర్‌, రాజ్యసభ చైర్మన్‌కు సైతం ఫిర్యాదులు
- బీజేపీ సభ్యుల దాడిలో తన మోకాలికి గాయమైందన్న మల్లికార్జున ఖర్గే
- రాహుల్‌ నాతో అభ్యంతరకరంగా ప్రవర్తించారు: బీజేపీ మహిళా ఎంపీ కోన్యాక్‌ ఆరోపణ
- రాహుల్‌పై పార్లమెంట్‌ హౌస్‌ స్టేషన్‌లో బీజేపీ ఫిర్యాదు.. కేసు నమోదు

6 లో

ఔటర్‌ లీజు టెండర్లపై సిట్‌

- శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- ఎన్నికల్లో ఓడిపోతున్నామని తెలిసి ఓఆర్‌ఆర్‌ను అప్పనంగా అమ్ముకున్నారని ఆరోపణ
- పూర్తిస్థాయి విచారణకు విధి విధానాలు కేబినెట్‌లో చర్చిస్తామని వెల్లడి

- వివరాలు 2లో▶

క్లుప్తంగా...

ఫుడ్ పాయిజన్ జరిగితే అధికారులదే బాధ్యత

మండలిలో మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: గురుకుల పాఠశాలల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీలు వేశామని, ఇకపై ఎక్కడ తప్పు జరిగినా అధికారులదే బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శాసనమండలిలో గురువారం మధ్యాహ్నం గురుకులాలపై జరిగిన స్వల్పకాలిక చర్చలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానమిచ్చారు. గురుకులాలు పరిశీలించాలని..నెలలో ఎన్ని గురుకులాలు తిరిగారు అని వారి షెడ్యూల్ పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ల మీటింగ్‌లో ముఖ్యమంత్రి ఇప్పటికే చెప్పారన్నారు. ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేయడానికి బదులు గురుకులాలను సందర్శించాలని కోరారు. గురుకుల విద్యార్థుల విషయంలో రాజకీయాలు వద్దన్నారు. ఈ అంశంపై జరిగిన చర్చలో సత్యవతిరాథోడ్, జీవన్ రెడ్డి, వాణి, రఘోత్తమ్‌రెడ్డి, ఏవీఎన్ రెడ్డి, బల్మూరి వెంకట్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న, తాతామధు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ట్రాప్‌లో పడను

మంత్రి పదవి వచ్చేటప్పుడు వస్తది: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మంత్రి పదవి వచ్చేటప్పుడు అదే వస్తుందని, బీఆర్‌ఎస్ ట్రాప్‌లో మాత్రం తాను పడబోనని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయం ముందు ఆ పార్టీ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌లు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి తారసపడ్డారు. 'మీరు మంత్రి అవుతారా? ముఖ్యమంత్రి అవుతారా?' అని బీఆర్‌ఎస్ నేతలు ప్రశ్నించగా.. ఆయన పై విధంగా స్పందించారు. ఇప్పటి వరకు తాను పదవులు అడుక్కోలేదని, అధిష్టానం అనుకున్న వాళ్లకు మంత్రి పదవి ఇస్తుందని చెప్పారు. బీఆర్‌ఎస్‌కు భవిష్యత్ లేదని, ఆ పార్టీ నుంచి కొందరు కాంగ్రెస్‌లోకి వస్తారని, మరికొందరు బీజేపీలోకి వెళ్తారని చెప్పారు. నల్ల చొక్కాలు వేసుకున్నా, ఆటో డ్రైవర్ల డ్రెస్ వేసుకున్నా బీఆర్‌ఎస్ నేతలకు చివరకు జైలు డ్రెస్సే గతి అని ఎద్దేవా చేశారు. లెజెండరీ నాయకుడైన ఎన్టీఆర్ గురించి తాను అనని మాటల్ని అన్నట్లుగా ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నల్లగొండ మంత్రులు భోళా శంకరులు

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు భోళా శంకరుల్లాంటి వారని, ఎమ్మెల్యేలు ఏమడిగినా.. సరే అంటారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు సంబంధించిన అంశాలను మంత్రుల ముందు పెడితే చాలు.. వారు వెంటనే అంగీకరిస్తారని చెప్పారు. కానీ, తన జిల్లా ఉమ్మడి ఖమ్మంకు చెందిన మంత్రులు ఏదడిగినా ఆలోచించి వ్యవహరిస్తారన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. మరీ ఎక్కువగా ఆచితూచి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

'ఎన్టీఆర్ ఘాట్ జోలికొస్తే ఊరుకోం'

సాక్షి, హైదరాబాద్: సచివాలయం పక్కన ఉన్న ఎన్టీఆర్ ఘాట్ స్థలంలో కొత్త అసెంబ్లీ భవనం నిర్మిస్తే బావుంటుందన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ ఘాట్ జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్టీఆర్‌ను బతికుండగా వేధించిన కాంగ్రెస్ నేతలు.. ఆయన చనిపోయాక కూడా వదలడం లేదని ఆరోపించారు. గతంలో ట్యాంక్‌బండ్ అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకున్నా.. ఎన్టీఆర్ అభివృద్ధి చేశారని చెప్పారు.



అర్జెంటుగా 'యుద్ధ'నివారణ టీకా కావాలని ప్రపంచ దేశాలు అడుగుతున్నాయ్ సార్..

ఔటర్ లీజు టెండర్లపై సిట్

శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

- ఎన్నికల్లో ఓడిపోతున్నామని తెలిసి ఓఆర్ఆర్‌ను అప్పనంగా అమ్ముకున్నారని ఆరోపణ
- పూర్తిస్థాయి విచారణకు విధి విధానాలు కేబినెట్‌లో చర్చిస్తామని వెల్లడి



అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఔటర్ రింగ్ రోడ్డును 30 ఏళ్ల పాటు ప్రైవేటు సంస్థలకు లీజుకు అప్పగించడంపై విచారణ జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 'ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు కోసం చేసిన అప్పు మొత్తం రూ.5,600 కోట్లు తీర్చేశాం. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ గత ఎన్నికలకు ముందు అప్పనంగా, ఆయాచితంగా దానిని అమ్ముకుంది..'అని ఆయన ఆరోపించారు. గురువారం శాసనసభలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు ఓఆర్ఆర్ ప్రాజెక్టు లీజు టెండర్లలో అక్రమాలు జరిగితే రద్దు చేయాలంటూ చేసిన వ్యాఖ్యలపై సీఎం స్పందించారు. ఎన్నికల్లో తాము ఓడిపోతున్నామని, ప్రజలు బొంద పెట్టబోతున్నారని తెలిసి, ఉన్నదంతా తెగనమ్ముకొని దేశం విడిచి పారిపోవాలన్న ఉద్దేశంతో వేల, లక్షల కోట్ల విలువైన ఓఆర్ఆర్‌ను అమ్ముకున్నారని ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్షం, మాజీ ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు కోరిక మేరకు ఓఆర్ఆర్ లీజు టెండర్లపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశిస్తున్నామన్నారు. విచారణకు సంబంధించి విధి విధానాలను మంత్రివర్గంలో చర్చిస్తామని తెలిపారు.

అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి

'హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో రైలును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో తీసుకొచ్చింది. ఈ రోజు హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి నగరంగా రాణించడానికి.. కృష్ణా గోదావరి జలాలు, ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, మెట్రో రైలు, ఐటీ, ఫార్మా కంపెనీలు, శాంతిభద్రతలు, మత సామరస్యత పరిరక్షణే కారణం. విధానపరమైన ఎన్నో కఠిన నిర్ణయాలు తీసుకోవడం, పరిశ్రమలకు ఒక్క గంట కూడా అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేయడం వంటి కారణాలతో ప్రపంచ స్థాయిలో పెట్టుబడులు వచ్చి నగరం అభివృద్ధి చెందింది. ఇక్కడ చదువుతున్న యువతీ యువకులు రాణించేందుకు ఆనాటి ప్రభుత్వాలు ఐఎస్‌బీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీలు వంటి అంతర్జాతీయ విద్యాసంస్థలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ స్థాయి క్రీడలను నిర్వహించడం వల్ల ప్రపంచ ఖ్యాతి లభించింది. జలయజ్ఞం కింద ప్రతి ఎకరాకు సాగునీటిని అందించాలన్న లక్ష్యంలో భాగంగా కల్వకుర్తి, నెట్టెంపాడు, జూరాల, ఆర్‌డీఎస్ ప్రాజెక్టులు, ఎల్లంపల్లి, దేవాదులతో పాటు చేవెళ్ల–ప్రాణహిత ప్రాజెక్టులు చేపట్టాం..'అని రేవంత్‌రెడ్డి చెప్పారు.



రద్దు చేసి స్వాధీనం చేసుకోండి: హరీశ్‌రావు

ఔటర్ రింగ్ రోడ్డు టోల్ లీజుపై విచారణ జరిపించాలని తాను కోరడం వల్లనే విచారణకు ఆదేశిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం సరికాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. 'నేను విచారణ కోరలేదు. మీరు అధికారంలో ఉన్నారు. అవకతవకలు జరిగితే టెండర్ రద్దు చేసి స్వాధీనం చేసుకోండి..' అని మాత్రమే అన్నానని వివరించారు. అయితే ఎలాగూ ప్రకటించారు కనుక విచారణను స్వాగతిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు.

'స్థానిక సంస్థల' రిజర్వేషన్లు ప్రతి టర్మ్‌లో మార్పు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి
- పంచాయతీరాజ్ సవరణ బిల్లును ఆమోదించిన శాసనసభ
- హైడ్రాపై బీజేపీ–ఎంఐఎం వాగ్వాదం

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఇకపై ప్రతి టర్మ్‌లో మారుతాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఇదివరకు రెండు టర్మ్‌లకు ఒకసారి రిజర్వేషన్లు మారేలా పంచాయతీరాజ్ చట్టం ఉందని, ఇప్పుడు ప్రతి టర్మ్‌లో రిజర్వేషన్లు మారేలా బిల్లును సవరించామని చెప్పారు. బీసీ రిజర్వేషన్లు మాత్రం డెడికేటెడ్ బీసీ కమిషన్ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా ఉంటాయన్నారు. గురువారం శాసనసభలో తెలంగాణ మున్సిపాలిటీల సవరణ బిల్లు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సవరణ బిల్లు, తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లు చర్చలో భాగంగా సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సమాధానం ఇచ్చారు. అనంతరం ఈ మూడు బిల్లులను సభ రాత్రిపొద్దుపోయాక ఆమోదించింది. జీహెచ్ఎంసీ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా హైడ్రా అవసరం లేదని, ఆ బిల్లును ఉపసంహరించుకోవాలని అక్బరుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగా ఓ పార్టీ నేతలు మా విద్యాసంస్థను కూల్చివేయాలంటూ రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఇంతలో బీజేపీ శాసనసభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి కలగజేసుకుంటూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అలాంటి నిర్మాణాన్ని కూడా కూల్చాలని, ప్రభుత్వానికి ఏదైనా అంతర్గత సమస్య ఉంటే బీజేపీ అధికారంలోకి వచ్చాక తప్పకుండా కూల్చివేతలుంటాయని స్పష్టం చేశారు. దీంతో ఇరు పార్టీల సభ్యులు వాగ్వాదానికి దిగారు. దీంతో స్పీకర్ కలగజేసుకుంటూ మంత్రి శ్రీధర్‌బాబును సమాధానం చెప్పాలని కోరారు. దీంతో మంత్రి జోక్యం చేసుకోవడంతో వాగ్వాదం సద్దుమణిగింది. సభ నుంచి బీఆర్‌ఎస్, బీజేపీ వాకౌట్ చేశాయి. కాగా, సభను శుక్రవారం ఉదయం పది గంటలకు వాయిదా వేశార

బిజినెస్‌తో సంబంధం లేకుండా మార్పులేంటి?

ఆర్థిక స్థితిపై చర్చను తప్పుపట్టిన అక్బరుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: ఫ్లోర్ లీడర్లను పరిగణనలోకి తీసుకోకుండా సభలో చర్చించాల్సిన అంశాన్ని పక్కనబెట్టి ఇష్టానుసారంగా అసెంబ్లీలో బిజినెస్ తీసుకోవడం ఏంటని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో గురువారం ముందుగా భూభారతి బిల్లుతోపాటు ఇతర బిల్లులపై చర్చ ఉంటుందని చెబితే, తామంతా సిద్ధమయ్యామని, అకస్మాత్తుగా ఆర్థిక పరిస్థితిపై స్వల్పకాలిక చర్చ కింద తీసుకోవడం సరికాదన్నారు. గురువారం మధ్యాహ్న విరామం తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రాష్ట్ర ఆర్థిక స్థితిపై చర్చకు అనుమతిస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతుండగా, అక్బరుద్దీన్ ఒవైసీ అడ్డు తగిలారు. బీజేపీ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి కూడా బిజినెస్ మార్పుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ హరీశ్‌రావు ప్రివిలేజ్ మోషన్ ఇచ్చారని, దాంతో స్పీకర్ అనుమతితోనే ముందుగా ఆర్థిక అంశాన్ని తీసుకున్నట్టు వివరించారు.

ఆర్థిక మంత్రిది అంతా అంకెల గారడీనే

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వాస్తవాలను వెల్లడించలేదని, అంకెల గారడీ చేశారని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. వాస్తవాలు ఎందుకు మరుగున పర్చారో తెలపాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ డాక్యుమెంట్‌పై శాసనసభలో గురువారం ఆయన మాట్లాడుతూ, డిప్యూటీ సీఎం వాస్తవాలను వెల్లడించి ఉంటే బాగుండేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రావల్ల రియల్ ఎస్టేట్ పతనమైందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిందని, ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. క్రీడాభివృద్ధి కోసం ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు, బిల్లీరావుకు కట్టబెట్టిన 850 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునేందుకు న్యాయపోరాటం చేయాలన్నారు. దీనిపై దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన న్యాయ పోరాటాన్ని ఆయన ప్రశంసించారు.

'భూభారతి'పై బీఆర్‌ఎస్ సభాహక్కుల ఉల్లంఘన నోటీసు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఆమోదం పొందని భూభారతి బిల్లును చట్టంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీఆర్‌ఎస్ విమర్శించింది. శాసనసభ్యుల హక్కులకు భంగం కలిగే విధంగా ప్రభుత్వం వ్యవహరించిందని పేర్కొంటూ గురువారం బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం స్పీకర్‌కు సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చింది. సభాహక్కులను రక్షించాలని స్పీకర్‌ను కోరింది. 2024 డిసెంబర్ 19న దినపత్రికల్లో భారీ ప్రకటనల ద్వారా ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. శాసనసభలో చర్చ దశలో ఉన్న బిల్లును చట్టంగా ప్రభుత్వం పేర్కొనడం సరికాదన్నారు. ఆర్టికల్ 245 ప్రకారం సభా హక్కులకు భంగం కలిగించడమేనని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆ నోటీసులో పేర్కొన్నారు.

కోమటిరెడ్డి వ్యాఖ్యలపై ఫిర్యాదు: అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సందర్భంగా రెండురోజుల క్రితం అసెంబ్లీలో హరీశ్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. 'సభ జరుగుతున్న సమయంలో స్పీకర్ అనుమతి తీసుకోకుండా నిరాధార ఆరోపణలు చేయడం సభా నియమావళి ఉల్లంఘనే అవుతుంది. రూల్ 319 (2, 3) ప్రకారం సభ్యులపై వ్యక్తిగత ఆరోపణలు చేయడానికి అనుమతి ఉండదు. రూల్ 320 ప్రకారం సభలో మాట్లాడేందుకు స్పీకర్‌కు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. రూల్ 45 ప్రకారం సభా ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలు సభా నియమావళికి విరుద్ధం 'అని స్పీకర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. హరీశ్‌రావుపై సభలో వ్యక్తిగత ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

సాగులోకి మరో 60వేల ఎకరాలు

- మూడు కాలువలతో ఉమ్మడి నల్లగొండలో అదనపు ఆయకట్టు
- ఎమ్మెల్యేలు భూసేకరణకు చొరవ చూపాలి
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డి కాలువ, బున్యాదిగాని కాలువల ద్వారా మూసీ నది నుంచి అదనపు నీటిని తరలించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొత్తగా 60 వేల ఎకరాలను సాగులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వేముల వీరేశం, హరీశ్‌రావు, రామారావు పాటిల్, సామెల్, అనిల్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్, పల్లా రాజేశ్వరరెడ్డి, పాయల్ శంకర్ తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉత్తమ్ సమాధానమిచ్చారు. వచ్చే రెండేళ్లలో మూసీ నది నీటిని వాటి ద్వారా తరలించే చర్యలు తీసుకుంటామని, సంబంధిత ఎమ్మెల్యేలు భూసేకరణకు చొరవ చూపితే పనులు ఏడాదిలోనే పూర్తవుతాయన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో చాలాచోట్ల భూసేకరణ ఇబ్బందిగా మారినందున స్థానిక శాసనసభ్యులు చొరవ తీసుకోవాలన్నారు. ఐటిపాముల లిఫ్టు భూసేకరణ వల్లనే ఆగిపోయిందని, భూసేకరణ పూర్తయితే ఆ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాన కాలువలు పూర్తి చేసేందుకు భూసేకరణ కోసం రూ.70 కోట్లు విడుదల చేశామని, దాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఎత్తిపోతల పథకాల రైతుల బాధ్యత

మారుమూల ప్రాంతాల్లోని ఎత్తిపోతల ప్రాజెక్టుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, ఎలక్ట్రానిక్ ప్యానెల్స్, ఇతర పరికరాలు దొంగలపాలు కాకుండా ఎమ్మెల్యేలు, సంబంధిత రైతు సంఘాలు కాపాడుకోవాలన్నారు. చనకా– కొరాట ప్రాజెక్టును కేటగిరీ–ఏలో ఉంచామని, దాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. ఓ ప్రాజెక్టుకు రూపకల్పన చేసినప్పుడే భూసేకరణ చేపట్టాలని, ఇతర పనులు చేసిన తర్వాత భూసేకరణకు దిగితే భూముల ధరలు పెరిగిపోతాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు

సంక్రాంతి తర్వాత అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రేషన్ దుకాణాలకు తరలుతున్న 50 కేజీల బస్తాల్లో బియ్యం పరిమాణం తక్కువగా ఉంటున్న మాట వాస్తవమేనని, దీన్ని నియంత్రించేందుకు అన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద వే బ్రిడ్జీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించారు.

త్వరలో వేయి సర్వేయర్ పోస్టులు

- రెండుమూడు నెలల్లో నియమిస్తాం
- 982 మందికి ప్రస్తుతం 242 మందే ఉన్నారు
- భూ భారతి ద్వారా స్థానికంగానే భూ సమస్యల పరిష్కారం
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెండుమూడు నెలల్లో వేయి మంది రెవెన్యూ సర్వేయర్లను నియమించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. పెద్ద మండలాలకు ఇద్దరు చొప్పున సర్వేయర్లను కేటాయిస్తామని చెప్పారు. వారిని నియమించిన తర్వాత ఆయా మండలాల్లో భూములను సర్వే చేయించి రెవెన్యూ–అటవీ శాఖల మధ్య భూ వివాదాలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 892 మంది సర్వేయర్లు ఉండాలని, కానీ ప్రస్తుతం 242 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. 35 నియోజకవర్గాల్లో రెవెన్యూ–అటవీ శాఖల మధ్య భూ వివాదాలు ఉన్నాయని చెప్పారు. వాటి వివరాలను స్థానిక ఎమ్మెల్యే లిఖితపూర్వకంగా తనకు అందిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పోడు భూముల సరిహద్దు వివాదాలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కరించాలి

భూ భారతి బిల్లు చట్టరూపం దాల్చిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకు వెళ్లి ప్రజలతో చర్చించి వారి భూ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని పొంగులేటి సూచించారు. ప్రజలు హైదరాబాద్ వరకు రావాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ సంబంధిత అధికారాలను వికేంద్రీకరించామని, స్థానిక యంత్రాంగమే వాటిని పరిష్కరిస్తుందని తెలిపారు. బోగస్ ఓఆర్‌సీల వల్ల కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని తెలిపారు.

అశాస్త్రీయంగా జోనల్ విధానం

- రాష్ట్రపతి ఉత్తర్వుల్లో మార్పులు చేయాలి: మండలిలో శ్రీధర్‌బాబు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐవీఎఫ్ సేవలు: మంత్రి దామోదర
- అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంపు: సీతక్క




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జోనల్ విధానాన్ని పూర్తిగా అశాస్త్రీయంగా రూపొందించారని, దీనివల్ల ఉద్యోగులతోపాటు నిరుద్యోగులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే రాష్ట్రపతి ఉత్తర్వుల్లో మార్పులు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు జీవన్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఏడు జోన్లు, రెండు మల్టీజోన్ల ఏర్పాటులో శాస్త్రీయత లేదని తెలిపారు. జీఓ 317 ద్వారా ఉద్యోగ కేటాయింపులు జరపడంతో మెజార్టీ ఉద్యోగులు సొంత ప్రాంతాల్లో పనిచేసే అవకాశాన్ని కోల్పోయారని చెప్పారు. ఫిర్యాదుల నేపథ్యంలో జీఓ 317ను రద్దు చేసే అంశాన్ని కూడా పరిశీలించామని, కానీ దానివల్ల అన్నివర్గాలకు న్యాయం జరగదని భావించి వెనక్కు తగ్గినట్లు వెల్లడించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల్లో సవరణ చేస్తేనే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని, ఈ దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని వెల్లడించారు. ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు స్వీకరించి కేంద్రానికి పంపుతామని తెలిపారు.

ఐవీఎఫ్ సేవలు మరింత విస్తృతం: దామోదర

రాష్ట్రంలో ఐవీఎఫ్ సేవలను మరింత విస్తరిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రంలో సంతానలేమితో దాదాపు 26 శాతం మంది బాధపడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 358 ప్రైవేటు ఫెర్టిలిటీ కేంద్రాలున్నాయని వెల్లడించారు. తమ ప్రభుత్వం గాంధీ, పేట్లబుర్జు, వరంగల్ ఎంజీఎం ఆసుపత్రుల్లో ఫెర్టిలిటీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని వివరించారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ ప్యాకేజీని రూ.2 లక్షలు, రూ.లక్ష చొప్పున నిర్ణయించామని మంత్రి సీతక్క తెలిపారు. ఇకపై ప్రతినెలా టీచర్లు, హెల్పర్లకు వేతనాలు చెల్లిస్తామని చెప్పారు.

రూ.7.11 లక్షల కోట్ల అప్పు చేసి బుకాయింపా?

- ఆర్థిక స్థితిపై చర్చలో బీఆర్‌ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి ఫైర్
- ఎస్పీవీల ద్వారా తెచ్చిన రూ. 1.27 లక్షల కోట్ల అప్పు ఎవరు కడతారని నిలదీత
- ఆర్‌బీఐ నివేదిక పేరుతో హరీశ్‌రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజం



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో చేసిన రూ.7.11 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు ఏటా రూ.లక్ష కోట్లకు పైగా చెల్లిస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు తెచ్చిందంటూ బీఆర్‌ఎస్ గగ్గోలు పెడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. లక్షల కోట్ల అప్పులు తెచ్చి, ప్రభుత్వ ఆస్తులను అడ్డగోలుగా విక్రయించి, ఇప్పుడు బుకాయిస్తున్నారని ఆ పార్టీ నేతలపై మండిపడ్డారు. రాష్ట్ర రుణాలపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా భట్టి సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి హరీశ్‌రావు తీరుపై పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌బీఐ నివేదిక పేరుతో హరీశ్‌రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. గత ఏడాది అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో బీఆర్‌ఎస్ హయాంలో చేసిన రుణభారం రూ.6,71,757 కోట్లుగా నిర్ధారించి సభ ముందుంచినట్లు తెలిపారు. ఇందులో మార్కెట్ నుంచి ఎఫ్ఆర్‌బీఎంకు లోబడి రూ.3,89,673 కోట్లు, ఎస్పీవీలకు ప్రభుత్వం గ్యారంటీనిచ్చి చెల్లించే రుణాలు రూ.1,27,208 కోట్లు, ప్రభుత్వ గ్యారంటీతో కార్పొరేషన్ తీసుకున్న రుణాలు రూ. 59,414 కోట్లు కాగా, అన్నీ కలిపి రూ.6,71,757 కోట్లు అని వివరించారు. ఇక పెండింగ్ బిల్లులు 40,154 కోట్లు కలిపితే ఆనాటి అప్పు రూ.7,11,911 కోట్లు అని పేర్కొన్నారు. అయితే ఎస్పీవీల ద్వారా ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చి చెల్లించే రుణాలైన రూ.1,27,208 కోట్లకు సంబంధించి హరీశ్‌రావు అభ్యంతరాలు చెబుతున్నారని, దానిని రూ. 38,000 కోట్లుగా మాత్రమే చూపిస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ. 64,651.93 కోట్లు అప్పు చేసి కేవలం రూ. 16వేల కోట్ల అప్పును మాత్రమే చూపించారని పేర్కొన్నారు. రూ. 1.29 లక్షల కోట్ల అప్పును రూ. 32వేల కోట్లుగా చూపారని చెప్పారు. తప్పుడు సమాచారంతో అప్పులను తగ్గించి చూపి, 200 శాతం అధికంగా కొత్త అప్పులు తెచ్చుకునేందుకు ప్రయత్నం చేశారని మండిపడ్డారు.

1వ తేదీనే జీతాలిస్తున్నాం..

ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలో ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల మేరకు చేసిన అప్పు రూ. 52,118 కోట్లని, అందులో నుంచి చెల్లించిన గత అప్పుల్లోని అసలు రూ.17,018 కోట్లు, వడ్డీ రూ. 26,298 కోట్లు అని భట్టి తెలిపారు. ఇక ఎస్పీవీల ద్వారా తీసుకున్న అప్పు రూ. 2,823 కోట్లు కాగా, గత అప్పుల్లోని రూ. 10,821 కోట్లు అసలు, వడ్డీ రూ. 9,658 కోట్లు అని పేర్కొన్నారు. ఇక కార్పొరేషన్లకు గ్యారంటీతో తీసుకున్న అప్పు రూ.40,203 కోట్లు కాగా.. తిరిగి చెల్లించింది రూ. 41,118 కోట్లని చెప్పారు. కార్పొరేషన్లు చెల్లించే విధంగా నాన్ గ్యారంటీ అప్పులు రూ. 11,103 కోట్లు అయితే.. చెల్లించింది రూ.13,450 కోట్లు అని భట్టి వివరించారు. మొత్తంగా ఈ ఏడాదిలో ప్రభుత్వం చేసిన అప్పులు రూ.1,06,297 కోట్లు అయితే అప్పులు, వడ్డీల కింద చెల్లించింది రూ. 1,18,364 కోట్లు అని పేర్కొన్నారు. అలాగే, ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్లకు మార్చి 1 నుంచి ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు భట్టి వెల్లడించారు. అలాగే, వివిధ సంక్షేమ పథకాల కింద రైతు భరోసాకు చెల్లించిన మొత్తాలను వివరించారు.

రాజీనామాకు సిద్ధం

అప్పులపై నేను అసత్యాలు చెప్పినట్టు రుజువు చేయండి

- అసెంబ్లీలో మాజీమంత్రి హరీశ్‌రావు
- అవాస్తవాలు చెప్పిన ఆర్థికమంత్రి భట్టి గవర్నర్‌కు రాజీనామా పత్రాన్ని పంపుతారా అంటూ సవాల్
- 'ఫార్ములా ఈ'పై సభలో చర్చించాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ అప్పులు, ప్రస్తుత ప్రభుత్వ అప్పుల విషయంలో తాను అసత్యాలు చెప్పినట్లు రుజువు చేస్తే రాజీనామాకు సిద్ధమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ సాక్షిగా అసత్యాలు చెప్పిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గవర్నర్‌కు రాజీనామా పత్రాన్ని పంపుతారా అంటూ సవాల్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులు రూ.4.17 లక్షల కోట్లు మాత్రమేనని, తాము చేయని అప్పులను కాంగ్రెస్ తమ ఖాతాలో వేస్తోందని మండిపడ్డారు. 'రాష్ట్ర ప్రభుత్వ అప్పులు'అంశంపై శాసనసభలో గురువారం జరిగిన స్వల్పకాలిక చర్చలో హరీశ్‌రావు మాట్లాడారు. ఓఆర్ఆర్ టెండర్లను రద్దు చేసి విచారణ జరపాలన్నారు. కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఫార్ములా–ఈ కార్ రేసు అంశంపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ అప్పులు రూ.4.17 లక్షల కోట్లే..

'బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రూ.6.71 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు ప్రభుత్వం చెప్పడంలో వాస్తవం లేదు. ఉమ్మడి రాష్ట్రం నుంచి రూ.72,658 కోట్ల అప్పు వారసత్వంగా రాగా, మరో రూ.15 వేల కోట్లు ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన గ్యారంటీలకు సంబంధించినవి. ఇక 2023 డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి వరకు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.15,118 కోట్లను కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఖాతాలో వేశారు. మొత్తంగా మేము చేయని రూ.99,385 కోట్ల అప్పును కూడా మాపై వేసి అసత్య ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి రూ. 3,89,673 కోట్లు, కార్పొరేషన్ల ద్వారా రూ. 1,27,208 కోట్లు అప్పుగా తెచ్చాం. వీటితో పాటు గ్యారంటీ ఇచ్చినవి రూ.95 వేల కోట్లు, గ్యారంటీ ఇవ్వనవి రూ.59 వేల కోట్లు ఉన్నాయి. ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చినివి, ఇవ్వనివి కలిపి మొత్తం రూ.1,54,876 కోట్లు తిరిగి కట్టాల్సిన అవసరం లేదు. మొత్తంగా బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో తీసుకున్న అప్పుల మొత్తం రూ.4.17 లక్షల కోట్లు మాత్రమే..' అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ఏడాది అప్పు రూ.1.27 లక్షల కోట్లు

'అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.27 లక్షల కోట్లు అప్పు చేసినట్లు డిప్యూటీ సీఎం ఒప్పుకున్నారు. ఇదే పద్ధతి కొనసాగితే ఐదేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులు రూ. 6.38 లక్షల కోట్లకు చేరతాయి. ఎఫ్ఆర్‌బీఎం పరిమితి పెరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం అప్పు రూ.7 లక్షల కోట్లకు చేరుతుందని ప్రభుత్వ నివేదికలు చెప్తున్నాయి. మేము కాంగ్రెస్ ప్రభుత్వానికి రూ. 1,700 కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పగించాం. రూ.30 వేల కోట్లు రాబట్టేందుకు ఈ ఏడాది జూన్‌లో రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి సర్వే నంబరులోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎకరాకు రూ.75 కోట్ల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం విక్రయించింది. ఇదే భూమిపై రూ.20 వేల కోట్లు అప్పు తెచ్చేందుకు టీజీఐఐసీ ప్రయత్నిస్తోంది. గత ప్రభుత్వం దండుమల్కాపూర్‌లో 400 ఎకరాల భూమిని ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా టీఎస్ఐఐసీకి ఉచితంగా బదలాయించింది. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతుబంధుకు రూ.73,162 కోట్లు, రైతుబీమాకు రూ.5,465 కోట్లు, రుణమాఫీకి రూ.28 వేల కోట్లు, ఉచిత విద్యుత్‌కు రూ.65 వేల కోట్లు, నీటిపారుదల ప్రాజెక్టులకు రూ.2.37 లక్షల కోట్లు కలిపి మొత్తంగా రైతుల కోసం రూ.4.08 లక్షల కోట్లను ఖర్చు చేశాం. 2014లో రాష్ట్ర బడ్జెట్ రూ.68 వేల కోట్లు కాగా, పదేళ్లలో రూ.2.93 లక్షల కోట్లకు చేర్చాం. తొమ్మిదిన్నరేళ్లలో రూ.3 లక్షల కోట్ల అప్పులు చెల్లించాం..'అని హరీశ్‌రావు తెలిపారు.

ఎవడయ్యా యూజ్‌లెస్ ఫెలో.. నన్ను దొంగ అన్నది

భట్టి మాట్లాడుతుండగా హరీశ్‌రావు కల్పించుకొని కాంగ్రెస్‌లో అబద్ధాలు మాత్రమే చెబుతారు. నిజం చెప్పరు అని కామెంట్ చేయగా, సభలోని ఒక సభ్యుడు 'దొంగ'అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దీంతో హరీశ్‌రావు 'ఎవడయ్యా యూజ్‌లెస్ ఫెలో నన్ను దొంగ అన్నది'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 'ఆ మాట ఎవరన్నారో తెలియదు కానీ, మైక్‌లో మీరు యూజ్‌లెస్‌ఫెలో అన్నది మాత్రం వినబడింది'అని వ్యాఖ్యానించారు.

మరో శ్రీలంకను చేయొద్దు: ఏలేటి

'ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రభుత్వం దొరికిన ప్రతిచోటా అప్పులు చేస్తోంది. రాష్ట్రాన్ని మరో శ్రీలంకను చేయొద్దు..'అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. 'ఫీజు బకాయిలు, కాంట్రాక్టర్ల బకాయిలను అప్పులు చేసైనా తీర్చండి' అని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. పాలనను గాడిన పెట్టేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు.

తప్పు చేయకుంటే భయమెందుకు?

- కేసు భయంతోనే అసెంబ్లీలో చర్చించాలంటున్నారు
- ఏసీబీ ముందే కేటీఆర్ నిజాయితీ నిరూపించుకోవాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా –ఈ రేస్ వ్యవహారంలో తప్పు చేయకపోతే విచారణకు మాజీ మంత్రి కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదయ్యింది కాబట్టే అసెంబ్లీలో చర్చించాలని అడుగుతున్నారని విమర్శించారు. కేటీఆర్ నిజంగా తప్పు చేయకపోతే ఏసీబీ ముందే ఆయన నిజాయితీని నిరూపించుకోవాలని గురువారం రాత్రి ఒక ప్రకటనలో సవాల్ చేశారు. 'ఫార్ములా రేస్ హైదరాబాద్‌లో మొదటిసారి నిర్వహించినప్పుడే దాదాపు రూ.200 కోట్లు నష్టం వచ్చింది. హెచ్ఎండీఏ కూడా నష్టపోయింది. అందుకే రెండోసారి ప్రమోటర్ కూడా ముందుకు రాలేదు. అవన్నీ తెలిసినా హెచ్ఎండీఏ వైస్ చైర్మన్‌గా ఉన్న కేటీఆర్ ఎందుకు రూ.55 కోట్లు చెల్లించారు? అవి ఆయన సొంత డబ్బులా? హెచ్ఎండీఏ డబ్బును ఎవరి అనుమతి లేకుండా వాడుకునే వీలుందా? అక్టోబర్ 5న, 11న డబ్బులు బదిలీ చేసినట్లు బాహాటంగా చెప్పుకుంటున్న కేటీఆర్‌కు అప్పుడు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన విషయం తెలియదా? ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు డబ్బులు చెల్లించటం నేరం కాదా?' అని ప్రశ్నించారు.

అక్కసుతోనే కేటీఆర్‌పై కేసు

బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర



సాక్షి, న్యూఢిల్లీ: కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసు.. ప్రభుత్వం అక్కసుతో చేసినట్లుందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. కేటీఆర్‌పై కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ పటంలో తెలంగాణ ప్రాధాన్యాన్ని చాటిచెప్పిన వ్యక్తి కేటీఆర్ అని స్పష్టం చేశారు. కేటీఆర్ ఏ తప్పూ చేయలేదు కాబట్టే అసెంబ్లీలో 'ఫార్ములా–ఈరేస్'పై చర్చ జరపాలని కోరారు. చర్చకు తావు లేకుండా నేరుగా ఏ–1గా ఆయనపై కేసు నమోదు చేయడం అత్యంత హేయకరమైన చర్యగా అభివర్ణించారు. హైదరాబాద్‌లో ఫార్ములా–ఈ నిర్వహించడం వల్ల ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూసిందని గుర్తు చేశారు. అక్రమంగా ఒక్క రూపాయి దుర్వినియోగం కాలేదన్నారు. 'ఫార్ములా–ఈరేస్'వ్యవహారంలో తమ నాయకుడు కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటపడతారని రవిచంద్ర ధీమా వ్యక్తం చేశారు.

రేవంత్ కుంభకోణాలు బయటపెడుతున్నందుకే..

ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పాల్పడుతోంది

ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో అవినీతిపై ఆధారాల్లేకున్నా దురుద్దేశంతోనే కేసు: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబం చేస్తున్న అవినీతి కుంభోణాలను బయట పెడుతున్నందునే రాష్ట్ర ప్రభుత్వం మాపై రాజకీయ వేధింపులకు దిగుతోంది. అవినీతి జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేకున్నా రాజకీయ దురుద్దేశంతోనే కేసు నమోదు చేసింది. ఫార్ములా–ఈ రేస్ వ్యవహారంలో అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉంటే ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చించాలని సవాలు చేస్తున్నా. కానీ అసెంబ్లీలో మాట్లాడలేని సీఎం, దద్దమ్మ మంత్రులు లీకులతో దుష్ప్రచారం చేస్తున్నారు. సీఎం, మంత్రులకు ఈ అంశంపై అవగాహన ఉంటే అసెంబ్లీ సాక్షిగా అవినీతిని బయట పెట్టాలి. ఈ మొత్తం వ్యవహారంలో అణా పైసా వృథా కాలేదు అనేందుకు నా వద్ద ఆధారాలు ఉన్నాయి..' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనం వల్లే రేసులు రద్దయ్యాయి. దీంతో ఈవీ రంగంలో రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు, పేరు రాకపోవడంతో పాటు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ దెబ్బతింది. రాష్ట్ర ప్రభుత్వ కుట్రలు, మోసాలను ప్రజాస్వామ్య యుతంగా ప్రజల ముందు పెడతాం. నాపై నమోదైన కేసులపై చట్ట ప్రకారం ముందుకు వెళతాం. ఉద్యమ నాయకుడి బిడ్డలం.. ఉద్యమకారులం, అణిచివేతలు, చిల్లర కుట్రలకు భయపడకుండా కొట్లాడతాం..' అని అన్నారు. ఫార్ములా–ఈ రేస్ అంశంలో తనపై కేసు నమోదైన నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. తెలంగాణ భవన్‌లో గురువారం రాత్రి ఆయన మాట్లాడారు.

'ఈవీ'కి తెలంగాణను హబ్‌గా చేయాలనుకున్నాం..

'కేసీఆర్ నాయకత్వంలో ఆటోమొబైల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల రంగానికి హైదరాబాద్‌ను కేంద్రంగా తీర్చిదిద్దాలని అనుకున్నాం. ఎలక్ట్రిక్ వాహన వాతావరణాన్ని అభివృద్ధి చేసేందుకు 'ఫార్ములా–ఈ రేస్'ను నిర్వహించాలని భావించాం. నాలుగు సీజన్ల పాటు నిర్వహించేలా 2022 అక్టోబర్ 25న ఒప్పందం కుదిరింది. 2023 ఫిబ్రవరి 10న తొలి సీజన్ రేసింగ్ నిర్వహించాం. రేస్ నిర్వహణకు హెచ్ఎండీఏ రూ.35 కోట్లు, ప్రమోటర్ సంస్థ గ్రీన్ కో రూ.110 కోట్లు ఖర్చు చేసింది. దీనివల్ల అదనంగా రూ.700 కోట్ల మేర ఆర్థిక లబ్ధి చేకూరిందని నీల్సేన్ సర్వే సంస్థ తెలిపింది. అయితే నష్టాలను కారణంగా చూపుతూ రెండో సీజన్‌లో ప్రమోటర్ గ్రీన్ కో తప్పుకోవడంతో హెచ్ఎండీఏ నుంచి రెండు విడతల్లో రూ.55 కోట్లు చెల్లించాలని నాటి మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్‌ను



సీఎం రేవంత్, ఫార్ములా–ఈ సహ వ్యవస్థాపకుడు అల్బర్టో లొంగోతో కలిసి ఉన్న ఫొటోను విలేకర్లకు చూపిస్తున్న కేటీఆర్

ఆదేశించా. ఎలాన్ మస్క్‌ను రప్పించి ప్రపంచ దృష్టిని ఆకర్షించడం ద్వారా ఈవీ రంగానికి తెలంగాణను హబ్‌గా ప్రమోట్ చేయాలని అనుకున్నాం..' అని కేటీఆర్ తెలిపారు.

అవినీతే జరగనప్పుడు కేసు ఎలా?

'ఈ నేపథ్యంలో తదుపరి చెల్లింపులు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గత ఏడాది డిసెంబర్ 7న ఫార్ములా–ఈ సంస్థ కోరింది. దీని సహ వ్యవస్థాపకుడు అల్బర్టో లొంగోతో అదే నెల 13న సీఎం రేవంత్, నాటి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ సమావేశయ్యారు. తర్వాత రేస్ నిర్వహణకు సానుకూలత వ్యక్తం చేస్తూ, కాంట్రాక్టు నిబంధనలు ప్రస్తావిస్తూ డిసెంబర్ 21 లోగా నిర్ణయం తెలపాలని సంస్థ లేఖ రాసింది. డిసెంబర్ 26 వరకు వేచి చూసి ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రేస్ నిర్వహణ సాధ్యం కాదని చెప్తూ నిర్వాహక సంస్థ రూ.73 లక్షల రేస్ ఫీజును కూడా వెనక్కి పంపింది. ఎఫ్ఈఓ ఎన్నిమార్లు కోరినా తెలంగాణ ప్రభుత్వం ఈ ఫీజును వెనక్కి తీసుకోవడం లేదు. రూ.55 కోట్లు రెండు వాయిదాలలో తమకు ముట్టిన విషయాన్ని నిర్ధారిస్తూ మూడో వాయిదా చెల్లించడంపై ప్రభుత్వంతో పలుసార్లు లేఖల రూపంలో సంస్థ సంప్రదింపులు కొనసాగించింది. అత్యంత చట్టబద్ధంగా పారదర్శకంగా హెచ్ఎండీఏ ఇండియన్ ఓవర్సీస్ ప్రభుత్వ బ్యాంకు నుంచి ఈ నిధులను ఆ సంస్థకు చెల్లించింది. అవినీతే జరగనప్పుడు కేసు నమోదు చేసే అంశం ఏసీబీ పరిధిలో లేదు. అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హరీశ్ సాల్వే అనే ప్రముఖ న్యాయవాదితో ఫార్ములా–ఈపై తెలంగాణ ప్రభుత్వం వేసిన కేసును రాష్ట్ర ప్రభుత్వం దాచి పెట్టింది..' అని కేటీఆర్ చెప్పారు.

రేవంత్.. నా వెంట్రుక కూడా పీకలేవు

ఫార్ములా–ఈ రేసులో కేసు పెట్టాల్సింది సీఎం రేవంత్ రెడ్డిపైనే అని కేటీఆర్ అన్నారు. అంతటి ప్రఖ్యాత రేసింగ్ దేశానికి రాకపోవడానికి రేవంతే కారణమని చెప్పారు. 'రేవంత్.. ఏం చేసుకుంటావో చేసుకో.. నా వెంట్రుక కూడా పీకలేవు. నేను ఏ తప్పూ చేయలేదు. అందుకే నాకు ఆత్మవిశ్వాసం ఎక్కువ..' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

చంద్రబాబు హయాంలో ఫార్ములా వన్ యోచన

'చంద్రబాబు హయాంలో 2001లో 'ఫార్ములా వన్' నిర్వహించాలనుకున్నారు. ట్రాక్ ఏర్పాటుకు కేటాయించిన భూముల్లో సీఎం రేవంత్‌రెడ్డికి సంబంధించిన 15 ఎకరాల భూమి కూడా ఉంది. ఈ విషయాన్ని 2013 ఎన్నికల అఫిడవిట్‌లోనూ రేవంత్ ప్రస్తావించారు. ట్రాక్ ఏర్పాటు కోసం గోపన్‌పల్లిలో మొత్తం 580 ఎకరాల భూ సేకరణకు గతంలో రెవెన్యూ శాఖ నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. ప్రభుత్వం మారడంతో ట్రాక్ ఏర్పాటు ప్రతిపాదనలు వెనక్కి పోగా రైతులు తమ భూమి కోసం నేటికీ న్యాయ పోరాటం చేస్తున్నారు..' అని కేటీఆర్ వివరించారు.

అదానీతో అనుబంధంపై మీ సీఎంను ప్రశ్నిస్తారా?

రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ

అదానీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉన్న అనుబంధంపై ప్రశ్నిస్తారా? లేక ఆయన వ్యక్తిగత ప్రయోజనాలు కాపాడేందుకు మౌనంగా ఉంటారా? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. అదానీకి వ్యతిరేకంగా నిరసనల పేరిట కాంగ్రెస్ పార్టీ రాజకీయ డ్రామా చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు గురువారం రాహుల్‌గాంధీకి కేటీఆర్ లేఖ రాశారు. జాతీయ స్థాయిలో అదానీపై వ్యతిరేకతను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్, తెలంగాణలో మాత్రం రేవంత్ నాయకత్వంలో అనుకూలంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తూనే, తెలంగాణలో అదానీ గ్రూప్‌నకు రేవంత్ ఎర్ర తివాచీ పరచడం విడ్డూరంగా ఉందన్నారు. గౌతమ్ అదానీ సీఎం రేవంత్‌కు ఇచ్చిన రూ.100 కోట్ల విరాళం పరస్పర ప్రయోజనాలకు ఉదాహరణ అని స్పష్టం చేశారు.

ముందస్తు బెయిల్ అడగాల్సిన అవసరం లేదు

'ఫార్ములా–ఈ రేసు ఆరోపణల్లో విషయమే లేనప్పుడు ముందే నేను కోర్టులకు వెళ్లి ముందస్తు బెయిల్ అడగాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ ఆరోపణలు పరిశీలిస్తే ఏ జడ్జి అయినా వెంటనే కేసు కొట్టేస్తారనే నమ్మకం ఉంది. కేబినెట్ అంటే గాసిప్ బ్యాచ్‌లాగా తయారైంది' అని అసెంబ్లీ లాబీల్లో కేటీఆర్ మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

ఏ1 కేటీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

గురువారం కేసు (ఎఫ్ఐఆర్) నమోదు చేశారు. ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతివ్వడంతో ఏసీబీ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాల ప్రకారం కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

సాధారణ నిధుల నుంచే రూ.54,88,87,043 చెల్లింపులు

హైదరాబాద్‌లో ఫార్ములా– ఈ కార్ రేసు సీజన్ 9, 10, 11, 12 నిర్వహించేందుకు 2022 అక్టోబర్ 25న యూకేకు చెందిన ఫార్ములా–ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఈఓ), తెలంగాణ ప్రభుత్వ పురపాలక శాఖ, ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేటు లిమిటెడ్ (స్పాన్సర్)కు మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. 2023 ఫిబ్రవరి 11న నిర్వహించిన ఫార్ములా–ఈ రేస్ మొదటి సీజన్ (9) కోసం హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు పెట్టింది. ఆ తర్వాత ఎఫ్ఈఓకు స్పాన్సర్‌కు మధ్య వచ్చిన విభేదాలతో ఫార్ములా– ఈ కార్ రేసు సీజన్ 10 నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రైవేటు స్పాన్సర్ స్థానంలో తామే అన్ని ఖర్చులు భరించేలా హెచ్ఎండీఏ అధికారులు, ఎఫ్ఈఓ మధ్య చర్చలు జరిగాయి. సీజన్ 10 కార్ రేసు నిర్వహణకు సంబంధించిన ఫీజుల నిమిత్తం, ఇతర సదుపాయాల ఏర్పాటుకు అయ్యే మొత్తం రూ.160 కోట్లు ఖర్చు పెట్టేందుకు పురపాలక అధికారులు పరిపాలన అనుమతులిచ్చారు. ఇందులో మొదటి దఫా కింద 2023 అక్టోబర్ 3న రూ.22,69,63,125 చెల్లించేందుకు హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ మంజూరు ఇచ్చారు. రెండో దఫా కింద 2023 అక్టోబర్ 11న మరో రూ.23,01,97,500 ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, హిమాయత్‌నగర్ బ్రాంచ్ నుంచి యూకేలోని ఎఫ్ఈఓ కంపెనీ ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఇంత పెద్ద మొత్తంలో విదేశాలకు నిధులు బదిలీ చేయడంలో నిబంధనలు పాటించకపోవడంతో హెచ్ఎండీఏ ఆదాయ పన్ను శాఖకు మరో రూ.8,06,75,404 పన్నుల రూపంలో చెల్లించాల్సి వచ్చింది. అదేవిధంగా ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియాకు ఇంటర్ స్టేట్ చాంపియన్‌షిప్ క్యాలెండర్ ఫీజు, పర్మిట్ ఫీజు కోసం మరో రూ.1,10,51,014 హెచ్ఎండీఏ చెల్లించింది. ఇలా మొత్తం రూ.54,88,87,043 హెచ్ఎండీఏ చెల్లించింది. ఇవన్నీ సాధారణ నిధుల నుంచే సంస్థ చెల్లించిందని ఏసీబీ పేర్కొంది.

ఏమిటీ సెక్షన్లు.. శిక్ష ఏమిటి?

- నిజాయితీ లేకుండా, మోసపూరితంగా సొంత ప్రయోజనం కోసం ప్రభుత్వ ఆస్తిపై ఇతరులకు హక్కు కట్టబెట్టడం అవినీతి నిరోధక చట్టం–1988 సెక్షన్ 13(1) (ఏ), సెక్షన్ 13(2) కిందకు వస్తాయి. నేరపూరిత దుష్ప్రవర్తన, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టుగా రుజువైతే ఏడాదికి తక్కువ కాకుండా అత్యధికంగా ఏడేళ్ల వరకు ఈ సెక్షన్ల కింద జైలు శిక్ష వేయవచ్చు. అదనంగా జరిమానా కూడా విధించవచ్చు.
- ఐపీసీ సెక్షన్ 409, 120–బీ నేరపూరిత కుట్రకు సంబంధించినది. ప్రభుత్వోద్యోగి, బ్యాంకర్, వ్యాపారి నేరపూరితంగా విశ్వాస ఉల్లంఘనకు పాల్పడటం
- పబ్లిక్ సర్వెంట్ హోదాలో ఉండి అతని అధీనంలోని ఆస్తి విషయంలో నేర ఉల్లంఘనకు పాల్పడటం, నిధులను పక్కదారి పట్టించడం వంటివి దీని కిందకు వస్తాయి. నేరం రుజువైతే ఏడాది నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష, అదనంగా జరిమానా కూడా విధించవచ్చు.

అనుమతుల్లేకుండానే చెల్లింపులు

- హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం రూ.10 కోట్లకు మించి ఖర్చు అయ్యే పనులు చేసేందుకు పరిపాలన అనుమతులు ఇవ్వాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. కానీ అనుమతి తీసుకోలేదు.
- హెచ్ఎండీఏ చెల్లించిన రూ.54,88,87,043కు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరి. కానీ ఆర్థికశాఖ దృష్టికే తీసుకెళ్లలేదు.
- హెచ్ఎండీఏ అగ్రిమెంట్‌లో పార్టీ కాకపోయినా నగదు చెల్లింపులు చేసింది.
- ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండానే 2023 అక్టోబర్ 30న అగ్రిమెంట్లు కుదుర్చుకున్నారు.
- ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా.. ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండానే ఎఫ్ఈఓకు హెచ్ఎండీఏ నుంచి చెల్లింపులు జరిగాయి.
- ఫారిన్ ఎక్స్ఛేంజ్ రెమిటెన్స్ నిబంధనలను ఉల్లంఘించి విదేశీ మారకద్రవ్యం రూపంలో చెల్లింపులు జరిగాయి.
- ప్రభుత్వం తరఫున ఏవైనా అగ్రిమెంట్లు చేసుకోవాలంటే ఆర్థిక, న్యాయశాఖల సమ్మతితో పాటు కేబినెట్ అనుమతి తీసుకోవాలి. తీసుకోలేదు. ఈ ఒప్పందాలన్నీ మోసపూరితమైనవని ప్రభుత్వం దృష్టికి వచ్చింది.
- అధికారులు, మాజీ మంత్రి కేటీఆర్ కలిసి నేరపూరిత కుట్రకు, ఉల్లంఘనలకు పాల్పడ్డారు. అధికార దుర్వినియోగం చేశారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చేలా వ్యవహరించారని ఏసీబీ తన ఎఫ్ఐఆర్‌లో ఆరోపించింది.

ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తూ – ముహమ్మద్ మీద అవతరింపజేయబడిన దానిని – తమ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యమని నమ్మారో వారి పాపాలను ఆయన తుడిచి వేశాడు. వారి స్థితిని బాగుపరిచాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 20 డిసెంబర్ 2024

కుదుపు రేపే నిర్ణయం

భారత క్రికెట్ రంగంలో బుధవారం ఉరుము లేని పిడుగు పడింది. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా భారత జట్టు అయిదు టెస్టులు ఆడుతుండగా సిరీస్ మధ్యలోనే అగ్రశ్రేణి భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన రిటైర్మెంట్ ప్రకటించడం అనేకమందిని ఆశ్చర్యపరిచింది. ఆస్ట్రేలియాలో బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్‌లోని మూడో టెస్ట్‌తో పాటు అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ సైతం ముగిసింది. సంచలనం రేపిన ఈ వార్త పలు అనుమానాలు, ఊహాగానాలకు కూడా తెర తీసింది. తాజాగా పెర్త్, బ్రిస్బేన్ మ్యాచ్‌లలో తుది జట్టులో స్థానం దక్కకపోవడంతో అశ్విన్ స్వచ్ఛందంగా ఆట నుంచి రిటైర్ అవుతున్నట్టు ప్రకటించారు. 'సిరీస్‌లో ఇప్పుడు నా అవసరం లేనట్టయితే, ఆటకు గుడ్‌బై చెప్పేస్తాను' అంటూ రిటైర్మెంట్‌కు ముందు భారత కెప్టెన్ రోహిత్ శర్మకు ఆయన తేల్చిచెప్పేశారు. 'ఆడే సత్తా నాలో ఇంకా మిగిలే ఉంది. బహుశా, (ఐపీఎల్ లాంటి) క్లబ్–స్థాయి క్రికెట్‌లో దాన్ని చూపుతాను. భారత జట్టు తరఫున ఆడడం మాత్రం ఇదే ఆఖరి రోజు' అన్న అశ్విన్ ప్రకటన క్రికెట్ అభిమానులు జీర్ణించుకోలేని విషయమే.

మొత్తం 106 టెస్టుల్లో 537 వికెట్లు సాధించిన అశ్విన్ అత్యధిక వికెట్లు పడగొట్టిన రెండో భారత క్రికెటర్. 132 మ్యాచ్‌లలో 619 వికెట్లు సాధించిన నిన్నటి తరం అగ్రశ్రేణి స్పిన్నర్ అనిల్ కుంబ్లే తరువాత అలా ద్వితీయ స్థానంలో నిలిచారు అశ్విన్. బంతితోనే కాదు... బ్యాట్‌తోనూ అరడజను శతకాలు, 14 అర్ధ శతకాలతో 3,503 పరుగులు సాధించిన ఘనత ఆయనది. ఇంకా చెప్పాలంటే, గత 14 ఏళ్ళ పైచిలుకు కాలంలో స్వదేశంలో భారత జట్టు తిరుగులేని శక్తిగా ఎదగడం వెనుక ఈ తమిళ తంబి కీలక పాత్రధారి. ఈ ఏడాది బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఆయన ఏకంగా 11వ సారి మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికై, ప్రపంచ రికార్డును సమం చేశారు. బరిలో ఓర్పు, బంతి విసరడంలో నేర్పు, ప్రత్యర్థిని బోల్తా కొట్టించడంలో నైపుణ్యం ఉన్న తెలివైన ఆటగాడాయన. అందుకే, ఆటలో ఈ అగ్రశ్రేణి ఆఫ్ స్పిన్నర్ చూపే ప్రతిభకు ప్రేక్షకులు జేజేలు పలికారు. ప్రస్తుత భారత జట్టు బౌలర్లలో ప్రత్యేకంగా నిలిచారు. ఏ క్రికెటరైనా విదేశాల్లో కాకుండా సొంతగడ్డపై ఆటకు స్వస్తి పలకాలనుకుంటారు. అది సర్వసాధారణం. ఎందుకంటే, స్వదేశంలో సొంత క్రీడాభిమానుల జయజయ ధ్వానాల మధ్య ఘనంగా వీడ్కోలు పలకవచ్చని భావిస్తారు. కానీ, అశ్విన్ అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించారు. దానికి కారణాలు లేకపోలేదు.

ఆడే సత్తా ఉన్న ఏ క్రీడాకారుడైనా బరిలో ఉండాలనుకుంటాడే తప్ప, అవకాశం కోసం నిరీక్షిస్తూ బెంచ్ మీద కూర్చొనే జాబితాలో చేరాలనుకోడు. అది ఎవరికైనా బాధాకరమే. అలాంటిది... టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఆరు టెస్ట్ సెంచరీలు, 500కు పైగా వికెట్లు తీసుకొన్న ఏకైక క్రికెటర్‌కు తరచూ అలాంటి అనుభవం ఎదురైతే? అది మరింత బాధ కలిగిస్తుంది. 38 ఏళ్ళ వయస్సులో, కెరీర్‌లో కాలం కరిగిపోతున్న వేళ... అశ్విన్‌కు అది అవమానమూ అనిపించింది. భారత క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా సిరీస్‌లో మధ్యలో ఆయన హఠాత్తుగా తన రిటైర్మెంట్ ప్రకటించారనుకోవాలి. సరిగ్గా పదేళ్ళ క్రితం 2014 డిసెంబర్‌లో మరో అగ్రశ్రేణి భారత క్రికెటర్ ధోనీ సైతం ఇలాగే ఆటకు అల్విదా చెప్పారు. ఈ వాస్తవ పరిణామాలన్నీ గమనిస్తూ, క్షేత్రస్థాయి అంశాలను గమనంలోకి తీసుకున్న వారికి మాత్రం అశ్విన్ నిర్ణయం మరీ దిగ్భ్రాంతికరంగా తోచదు. అదే సమయంలో జీవితంలో, ఆటలో అత్యంత కఠినమైన ఈ నిర్ణయం తీసుకుంటున్నప్పుడు కూడా విమర్శల జోలికి పోకుండా, పక్కా జెంటిల్మన్‌గానే వ్యవహరిస్తూ అశ్విన్ తన నిర్ణయాన్ని ప్రకటించడం చెప్పుకోదగ్గ విషయం.

ఆస్ట్రేలియా సిరీస్‌లోని తొలి మూడు టెస్టుల్లో అడిలైడ్‌లోని రెండో టెస్ట్‌లో మాత్రమే అశ్విన్‌కు జట్టులో స్థానం దక్కింది. ప్రతిభావంతుడైన పాతికేళ్ళ వాషింగ్టన్ సుందర్ అంతకంతకూ ముందుకొస్తూ, అశ్విన్‌ను పక్కకు జరిపి జట్టులో చోటు సంపాదించుకుంటూ పోతున్నారు. ఫలితంగా అశ్విన్ హుందాగానే పక్కకు తప్పుకున్నారు. వికెట్లు పడగొట్టడంలో పేరున్న ఈ స్పిన్నర్ నిర్ణయం 'వ్యక్తిగతం' అని రోహిత్ శర్మ చెప్పారు కానీ రిటైర్మెంట్ ప్రకటన అనంతరం విలేఖరుల ప్రశ్నలు వద్దని అశ్విన్ సున్నితంగానే తప్పుకోవడంతో కంటికి కనిపించని కథలున్నాయనే వాదనకు బలం చేకూరింది. అయితే, అశ్విన్ ఆది నుంచి జట్టు సమష్టి ప్రయోజనాలకై ఆడినవారే. అనేక సందర్భాల్లో సెలెక్టర్ల బంతాటలో వైట్ బాల్ గేమ్స్‌లో స్థానం దక్కించుకోకున్నా, పట్టుదలతో ఆడుతూ తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పటికీ కనీసం మరో రెండేళ్ళ పాటు అంతర్జాతీయ స్థాయిలో ఆడగల సత్తా ఆయనకుంది. అయినా పక్కకు తప్పుకున్నారు. గతంలో ధోనీ ఆస్ట్రేలియాతోనే మెల్‌బోర్న్ టెస్ట్‌లో హుందాగా టెస్ట్ క్రికెట్ నుంచి పక్కకు తప్పుకొని, యువకులకు దోవ ఇచ్చారు. కారణాలేమైనా, అశ్విన్ ప్రస్తుతానికి పెదవి విప్పి పెద్దగా చెప్పకుండానే పదవీ విరమణ ప్రకటించారు.

పేరు ప్రతిష్ఠలు, డబ్బు అన్నీ కెరీర్‌లో భాగమైన ఆటగాళ్ళు వాటన్నిటినీ వదులుకొని, రిటైరవుతున్నట్టు చెప్పడం నిజానికి ఎప్పుడూ కష్టమే. అశ్విన్ కూడా అందుకు మినహాయింపేమీ కాదు. కాకుంటే, పైకి గంభీరంగా కనిపిస్తూ భావోద్వేగాల్ని ప్రదర్శించకపోవడం విశేషం. అశ్విన్ వ్యక్తిగతం మాటెలా ఉన్నా, ఆయన నిష్క్రమణతో భారత క్రికెట్ ఇప్పుడో చిత్రమైన సంధి దశలో నిలిచింది. బహుశా, ఈ ప్రతిభావంతుడి తాజా నిర్ణయంతో ఒకప్పటి ఫామ్ కోల్పోయి, తడబడుతున్న రోహిత్ శర్మ, కోహ్లీలు సైతం ఆత్మపరిశీలనలో పడాల్సి రావచ్చు. ఎంతైనా ఆర్ట్ ఆఫ్ 'లీవింగ్' కూడా ఆర్ట్ ఆఫ్ 'లివింగ్'లో భాగమే కదా! వెరసి, అశ్విన్ స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడి కోసం అన్వేషణతో పాటు ఆయన నిష్క్రమణకు దారి తీసిన పరిస్థితులపై చర్చ చాలాకాలం కొనసాగడం ఖాయం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.పంచమి ప.12.33 వరకు, తదుపరి షష్ఠి. **నక్షత్రం:** మఖ తె 5.52 వరకు (తెల్లవారితే శనివారం) తదుపరి పుబ్బ, **వర్జ్యం:** సా.5.08నుండి 6.50 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.40 నుండి 9.24 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.03 వరకు, **అమృత ఘడియలు:** రా.3.18 నుండి 5.01 వరకు

సూర్యోదయం : 6.28
సూర్యాస్తమయం: 5.26
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

అంబేడ్కర్ పేరు ఒక భరోసా!

సందర్భం



కె.ఎన్. మల్లీశ్వరి

అంబేడ్కర్ గురించి మాట్లాడడం ఫ్యాషన్ అయిపోయిందని పార్లమెంట్‌లో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఇప్పటివరకూ కప్పి ఉంచిన కొన్ని వాస్తవాలను వెలికి తీశాయి. 'తాము మాట్లాడితే ప్రేమ, ఎదుటివారు మాట్లాడితే ఫ్యాషన్' అన్నంతగా బీజేపీ ప్రభుత్వానికి అంబేడ్కర్ పట్ల స్వాధీనత ఉందని మాట వరసకి అనుకుందాం. కానీ తర్వాతి వాక్యాలని గుడ్డిగా సమర్థించుకోవడం ఆశ్చర్యమే. కాంగ్రెస్ సభ్యులు అంబేడ్కర్‌ని ప్రస్తావించడం మీద అమిత్ షా వ్యాఖ్యానిస్తూ 'అంబేడ్కర్ అంబేడ్కర్ అంబేడ్కర్... వారు ఇన్ని సార్లు దేవుడి నామం స్మరిస్తే ఏడేడు జన్మల స్వర్గలోక ప్రాప్తి వచ్చే'దని అనడం అంబేడ్కర్ పట్ల గౌరవాన్ని వ్యక్తపరిచినట్లు కాదు; అలాగని ఆ కామెంట్స్ కేవలం కాంగ్రెస్ మీద చేసిన విమర్శగా కూడా చూడలేము. కాంగ్రెస్ మీది కోపాన్ని అంబేడ్కర్ మీద చూపినట్లుగా మాత్రమే కాక, లోపల జీర్ణించుకున్న చులకనభావం బైట పడినట్లుగా కూడా ఆ మాటలు ఉన్నాయి.

సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో జాతి నిర్మాణం కోసం పాటుపడిన అంబేడ్కర్‌ని – విశ్వాసాల మీద ఆధారపడిన దైవభావనతో పోల్చి తక్కువ చేయడం వ్యతిరేకించాల్సిన విషయం. కడుపు నిండిన వారికి స్వర్గలోక ద్వారాల వైపు చూపు ఉండొచ్చు. కానీ కులం, మతం, జెండర్ వంటి అనేక వివక్షలకి లోనయ్యే పీడితులు, పేదలు అంబేడ్కర్‌ని తమ 'అన్నం గిన్నె'గా అభివర్ణించుకుంటారు. అంబేడ్కర్ పేరు పదేపదే స్మరించడం వారి జీవితాలకి భరోసా.

ప్రధాని 'ఎక్స్' వేదికగా అమిత్ షా వ్యాఖ్యలను సమర్థించడం మరొక విచిత్రం. అసలు వ్యాఖ్యల సంగతి వదిలేసి చరిత్రలో కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌కి చేసిన అన్యాయాలను తవ్వితీయడం గొప్ప చతురత. కాంగ్రెస్ చేసిన అన్యాయాలను అంబేడ్కర్‌వాదులు తప్పక ప్రశ్నిస్తారు కానీ ఇప్పటి అమిత్ షా వ్యాఖ్యల సంగతేమిటి? ప్రజలకి నిజం తెలుసుననీ, అది కాంగ్రెస్ వారి దురదృష్టమనీ అన్నారు. అవును, ప్రధానమంత్రి గారూ, ప్రజలకి నిజం తెలుసు. అయితే అది మీరు నిర్మించే నిజం కాదు.

అంబేడ్కర్ చరిత్రను తుడిచివేసేందుకు కాంగ్రెస్ చేసిన పన్నాగాలను బట్టబయలు చేశామన్న ప్రధానమంత్రి, అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు బీజేపీ ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణ వివరించారు. పంచ తీర్థ, చైత్యభూమి సమస్య, అంబేడ్కర్ చివరి దశలో గడిపిన ఇల్లు, లండన్‌లో అంబేడ్కర్ నివసించిన ఇల్లు





డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ : లోక్‌సభలో సమావేశ దృశ్యం

కొనుగోలు చేయడం ద్వారా ఆయన ఆశయాలు నెరవేర్చే పనులు చేశామని అన్నారు. ఇవన్నీ అంబేడ్కర్ పట్ల కృతజ్ఞతతో ప్రజలూ ప్రభుత్వాలూ తమ కోసం తాము ప్రతీకగా చేసే పనులు. నాయకారాధన పట్ల స్పష్టమైన అవగాహనతో మాట్లాడిన అంబేడ్కర్ ఎపుడూ తన చిహ్నాల ఉద్ధరణ తన ఆశయమని చెప్పలేదు. ఆయన రచనలు, ప్రసంగాలు, ఆచరణ గురించి తెలుసుకుంటే ఆశయాలు ఏమిటో తెలుస్తాయి. అవి మతతత్వ, కులవాద, పితృస్వామిక రాజకీయ పార్టీలను, వ్యవస్థలను నిరంతరం నిలదీస్తాయి. వాటి పీడనకి, వివక్షకి గురయ్యేవారిని అక్కున చేర్చుకుని 'సమీకరించు, బోధించు, పోరాడు' అని వెన్ను తడతాయి. కానీ పీడక పార్టీలు, వ్యవస్థలు ఈరోజు అంబేడ్కర్ ప్రభావాన్ని విగ్రహాలకి, నివసించిన స్థలాలకి కుదించి అవే ఆయన ఆశయాలని ప్రచారం చేస్తున్నాయి.

బీజేపీ ప్రభుత్వానికి అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలన్న ఆకాంక్ష బలంగా ఉంటే రాజకీయాల్లో మెజారిటీ మత చొరబాట్లను నిరోధించి లౌకిక విలువలను స్వయంగా ప్రచారం చేయాలి. కుల నిర్మూలనకి అంబేడ్కర్ ఇచ్చిన సూచనలు అమలు చేయాలి. కులాంతర, మతాంతర పెళ్లిళ్లను ప్రోత్సహించాలి. వేదాలు, పురాణాలు స్త్రీలను, దళితులను ఎంత అమానవీయంగా చూశాయో గుర్తించి వాటిని కల్పనా సాహిత్యంగా మాత్రమే పరిగణించాలి. దళితుల విద్యా ఉద్యోగ రాజ్యాధికారాలకి ప్రణాళికలు వేయాలి. పౌరులకు ఉన్న రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవించాలి. మరీ ముఖ్యంగా మాట్లాడితేనో, నచ్చిన ఆహారం తింటేనో తీసుకెళ్ళి జైళ్ళలో పడేయకూడదు. ప్రజాస్వామ్య భావనని దాని నిజార్థంలో ఆచరించాలి. ఏకత – ఐక్యతలు ఒకటి కావని గుర్తించాలి. ఇలా మన ప్రభుత్వ వ్యవస్థల నియంతృత్వాన్ని సమూలంగా మార్చేయగల అనేక మార్పులను చేయడమే ఆయన ఆశయాలను నెరవేర్చడం.

అందుకే కేవలం ఎక్కడో నాలుగు విగ్రహాలు పెట్టి గొప్ప ఆచరణగా ప్రకటించడం కన్నా, అసంఖ్యాకంగా ఉన్న అంబేడ్కర్ రచనలను, ప్రసంగాలను, వివిధ ఘట్టాల్లో ఆయన పని తీరును అధ్యయనం చేయడం ద్వారా ప్రజలకు మేలు చేసే నిజమైన కార్యాచరణ రూపొందించుకోవచ్చు. 'అంబేడ్కర్ ఆలోచనల తాత్వికత' పేరిట ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక అంతర్జాల మాధ్యమంలో 21 వారాల పాటు 48 ప్రసంగాల సిరీస్ నిర్వహిస్తున్నది. 2024 డిసెంబర్ 22 నుంచి 2025 మే 18 వరకూ నడిచే ఈ సిరీస్‌లో తెలుగు సమాజంలోని మేధావులు అంబేడ్కర్ ఆలోచనల తాత్వికతను ఆయన రచనలు, ప్రసంగాల ఆధారంగా పరిచయం చేస్తారు. ఆసక్తి ఉన్నవారు (zoom ID: 8254545523 Password PRARAVERK) ద్వారా పాల్గొనవచ్చు.

వ్యాసకర్త ప్రరవే ఏపీ కార్యదర్శి । 88850 16788

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

జ్ఞానం పెంచే పండుగ



ఇందు గలదు అందు లేదు అను సందేహంబు వలదు... ఎందెందు వెతికినా అందందు కలదు పుస్తకం. ఇది ఒకప్పటి మాట. కానీ, ఇప్పుడు ఏ చోట చూసినా సెల్‌ఫోన్లు రాజ్యమేలుతున్నాయి. ఫలితంగా పుస్తకాభిమానుల సంఖ్య తగ్గుతోంది. తాజాగా ఈ ఏడాది కూడా రెండు రాష్ట్రాల్లో వరుస పుస్తక మహోత్సవాలతో అక్షరాల పండుగకు తెర లేచిన నేపథ్యంలో పుస్తక పఠనం పెంచాల్సిన ఆవశ్యకతపై మేధామథనం జరగవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. చరవాణులు హస్తభూషణమై దేదీప్యమానంగా వెలుగుతున్న ఈ రోజుల్లో పుస్తకం యొక్క ప్రాధాన్యం మసకబారడం విచారకరం. మనం సాంకేతికంగా విజయాలు సాధించడానికి హేతువులు అక్షర పరిజ్ఞానమే. ఆ మూలాలను మనం విస్మరిస్తున్నాం. నిజానికి, పుస్తకం విజ్ఞాన నేత్రం. మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా పుస్తకం కూడా తన రూపురేఖలు మార్చుకుంటోంది. యువతరం విపరీత అభిరుచుల కారణంగా అనుకున్న స్థాయిని అందుకోలేకపోతుంది.

పుస్తకాలు చదివి తాము ఉన్నత స్థాయి అధిరోహించామని గొప్ప వ్యక్తులు చెప్పిన విజయ గాథలు నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలి. స్వాతంత్ర్య పోరాటంలో గ్రంథాలయాలు పోషించిన పాత్ర అద్వితీయం. ఇప్పడు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు తప్ప ఇతరులు గ్రంథాలయాలకు వస్తున్నారా అన్నది సందేహంగా మారింది. ఇది విషాదం. కొద్దిమంది ఉత్తమ పాఠకులు ఉన్నందు వలన గ్రంథాలయాల్లో పుస్తకాలకు ఆదరణ లభిస్తున్నది.

చందమామ, బాల మిత్ర, పంచతంత్ర కథల వంటి పుస్తకాలతో ఎదగవలసిన బాల్యం ఇవాళ ఆన్ లైన్ వీడియో గేములు, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లకు బానిస అవుతోంది. దీన్ని అరికట్టి, పిల్లలను సవ్యమైన దారిలో పెట్టాల్సిన బాధ్యత తల్లితండ్రులు, ఉపాధ్యాయులదే. మార్కులు, ర్యాంకుల పైనే మనం సృష్టించిన మోజుతో పాఠ్య పుస్తకాలు తప్ప కథల పుస్తకాలంటే ఏమిటో తెలియని పిల్లలు ఈనాడు ప్రతి చోటా ఉన్నారు. కేవలం పదుల రూపాయల ఖర్చుతో పిల్లలకు జ్ఞానాన్ని బోధించే పుస్తకాలు అనేకం. వాటిని కొనిపెట్టి, పిల్లలతో చదివించే బాధ్యత తల్లితండ్రులు తీసుకోవాలి.

పుస్తక పఠనం ఉత్తమాభిరుచికి నిదర్శనం. ఆదర్శవతమైన జీవనానికి మార్గదర్శి. సంస్కృతి, సభ్యత, చరిత్ర, జీవన విధానాలకు దిక్సూచి అయిన పుస్తకాల పట్ల గౌరవాన్ని పెంచాలి. పుస్తకాలు చదవాలి. పుస్తక పఠనం రోజువారీ చర్యలో భాగమవ్వాలి. రేపటి తరానికి విలువైన వారసత్వ సంపదగా పరిగణించే విద్యార్థుల అభిరుచిని చెడుదారుల్లో పయనించకుండా పుస్తక పఠనం వైపు మళ్లించే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు మాత్రమే కాకుండా సమాజ శ్రేయస్సును కాంక్షించే ప్రతి ఒక్కరూ తీసుకోవాలి. అందుకు ఈ పుస్తక మహోత్సవాల మొదలు సంకల్పం చేసుకోవాలి.

– దుర్గమ్ భైతి,
ఉపాధ్యాయులు । 99590 07914

సోషల్ మీడియా

ఇలాంటి ప్రవర్తనా?



పార్లమెంటులో బాబాసాహెబ్ అంబేడ్కర్, రాజ్యాంగ నిర్మాతల గురించి సంబరం జరుపుకోవాల్సిన 75 యేళ్ళ రాజ్యాంగంపై చర్చ చివరకు మన రాజకీయాలు ఎంత తీవ్రంగా విభజితమయ్యాయో చూపే తమాషాగా మారిపోయింది. ఎంపీలు ఒకరినొకరు నెట్టుకోవడం, హింసాపూరిత ప్రవర్తనపై పరస్పరం నిందించుకోవడం... ఎక్కడికి వచ్చాం మనం? – రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఇవ్వాళేమిటి?



ప్రభుత్వం మాట్లాడితే 1947 అంటుంది లేకపోతే 2047. నేటి భారతం గురించి ఏమీ మాట్లాడదు. వర్తమానంలో జీవించడం గురించి ఒకట్రెండు విషయాలు ప్రభుత్వం తెలుసుకోవాలి. ఇవ్వాళ్టి ఇండియాకు ఫోకస్ చాలా అవసరం.

– డి. ముత్తుకృష్ణన్, ఫైనాన్సియల్ ప్లానర్

మూట గట్టి...




కోటీశ్వరులు ఎందుకు అంత డబ్బు సంపాదిస్తారు. ఎందుకు తర్వాత దాన్ని ఏవో ఛారిటీలకు ఇచ్చేస్తారు? ఎందుకు వాళ్లు తమ ఉద్యోగులకు మంచి వేతనాలు చెల్లించరు?

– తమిళ్ రవి, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

మెరుగైన సమాజం కోసం...

ప్రస్తుతంపై మనస్సును లగ్నం చేయడాన్ని ధ్యానం అనవచ్చు. ఇది చాలా ప్రాచీన కాలం నుంచి అనేక సంస్కృతుల్లో భాగంగా కొనసాగుతోంది. వ్యక్తిగత శ్రేయస్సు, మానసిక ఆరోగ్యానికి ఇది ఉపయోగపడుతుంది. అయితే భారతీయ సంస్కృతిలో యోగా, ధ్యానం మిళితమై కనిపిస్తాయి. అందుకే మన ప్రాచీన గ్రంథాలు కానీ, శిల్పాలు కానీ ధ్యాన ముద్రను ప్రతిబింబిస్తూ ఉంటాయి.



జూన్ 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా జరపాలని ఐక్యరాజ్య సమితి (యూఎన్ఓ) నిర్ణయించడం ముదావహం. ధ్యానం యొక్క శక్తిని గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ధ్యానం మానసిక, భౌతిక శక్తి సామర్థ్యాలను వృద్ధి చేయడమే కాక మనస్సును ఒక విషయంపై లగ్నం చేయడానికి ఉపకరిస్తుంది.

ఆధునిక కాలపు ఒత్తిడులను తట్టుకోవడానికి ధ్యానం ఇప్పుడు ప్రధాన సాధనం అయ్యింది. అలాగే వ్యక్తిగత ప్రయోజనాలకన్నా సామూహిక శ్రేయస్సుకు ఇది దోహదం చేస్తుంది. దైనందిన జీవితంలో ధ్యానాన్ని ఒక భాగం చేసుకుంటే మానసిక ఒత్తిడుల నుంచి బయటపడవచ్చని నిపుణులు అంటున్నారు. యోగాకు ధ్యానాన్ని జోడిస్తే రక్తపోటు, స్థూలకాయం, ఆందోళన, నిద్రలేమి వంటి వాటి నుంచి బయటపడవచ్చు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవడానికి ధ్యాన, యోగాలు ఎంతగానో ఉపయోగపడతాయంటున్నారు. మనస్సు– శరీరం మధ్య అవినాభావ సంబంధాన్ని మన ప్రాచీన యోగశాస్త్రం చెబుతుంది. కానీ ఆధునిక వైద్యులు మనస్సునూ, శరీరాన్నీ రెండు వేరువేరు విభాగాలుగా చూస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో ఈ ధోరణిలో కొంత మార్పు గమనించవచ్చు. ఆరోగ్యవంతమైన జనాభాను, సుస్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడానికి ధ్యానం ఒక మార్గంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది.

– జంగం పాండు; పరిశోధక విద్యార్థి, హైదరాబాద్
(రేపు ప్రపంచ ధ్యాన దినోత్సవం)

సిరియా భవిష్యత్తు ఏమిటి?

సంక్షోభంలో కూరుకు పోయిన సిరియాలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటయ్యింది. 13 ఏళ్ల అంతర్యుద్ధాన్ని, ఐదు దశాబ్దాల నియంతల కుటుంబ పాలనను చవిచూసిన ఆ దేశం ఇప్పుడు కొత్త గాలుల్ని పీల్చుకుంటోంది. జనజీవనం క్రమంగా సాధారణ స్థితికి వస్తోంది. పాఠశాలలు తెరుచుకున్నాయి. పిల్లలు తరగతులకు హాజరవుతున్నారు. జైళ్లలో మగ్గుతున్న ఖైదీలు బయట కొచ్చారు. దాదాపు 7,600 మంది శరణార్థులుగా వెళ్లినవారు టర్కీ సరిహద్దుల మీదుగా తిరిగి ఇళ్లకు చేరుకుంటున్నారు.

సిరియాను 50 ఏళ్ల పాటు అసద్ కుటుంబమే పాలించింది. 2000 నుంచి మొన్న అధికారం కోల్పోయే వరకూ అసద్ పాలిస్తే అంతకు ముందు... 1970 నుంచి 2000 వరకూ అసద్ తండ్రి హాఫీజ్ ఏలాడు. ఇద్దరూ నియంతలుగానే పేరు తెచ్చుకున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు 2011లో ప్రారంభమయ్యాయి. ఇవే అంతర్యుద్ధంగా రూపు దాల్చాయి. ఈ యుద్ధంలో లక్షలాది మంది మరణించారు. రష్యా, ఇరాన్ దేశాల మిలటరీ; హెజ్‌బొల్లా ఆయుధాలతో దేశంలో 2/3 వంతు భూభాగంపై అసద్ తన పట్టు బిగించాడు. సొంత ప్రజలపైనే రసాయన, సిలిండర్ దాడులు చేయించి లక్షలాది మందిని జైళ్లపాలు చేశాడు. దాదాపు 3 లక్షల మంది దాకా జైళ్లలో మగ్గుతూ ఉంటారని అంచనా.

అసద్ పాలనలో సిరియా దుర్భర పరిస్థితులను చవి చూసింది. 90 శాతం ప్రజలు దారిద్ర్యరేఖ దిగువకి చేరారు. ప్రజలకు 24 గంటల కరెంట్ అందుబాటులో లేదు. మందులు లేవు. పెట్రోలుకి రేషన్ ఉంది. బ్రెడ్ కొనుక్కోవటానికి గంటల తరబడి లైన్‌లో నిలబడాలి. చాలా మందికి ఉపాధి లేదు. పొట్ట చేత పట్టుకుని ఎక్కడెక్కడికో వెళుతున్నారు. సిరియా పౌండ్ దాని విలువలో 99 శాతం కోల్పోయింది. రాజధాని నగరమైన డమాస్కస్ మినహా దేశం ఏ నగరాన్ని చూసినా ఇప్పుడు యుద్ధం మిగిల్చిన విధ్వంసపు ఛాయలు స్పష్టంగా కనిపిస్తాయి. దేశాన్ని పునర్నిర్మించటానికి 250 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని ఐక్యరాజ్యసమితి అంచనా.

అసద్‌ను పదవి నుంచి తొలగించి సున్నీ పాలనను స్థాపించాలనే లక్ష్యంతో పోరాడిన హయత్



తహీర్ అల్ షమ్ (హెచ్‌టీఎస్) సంస్థ విజయం సాధించింది. రెండో తిరుగుబాటు బృందం సిరియన్ డెమాక్రటిక్ ఫోర్సెస్ కుర్దుల మిలిటెంట్ల సమూహం. మూడోది అటు అసద్‌నూ, ఇటు కుర్దులనూ వ్యతిరేకించే సిరియన్ నేషనల్ ఆర్మీ. సిరియాలో రెబెల్ గ్రూపులకు ప్రధానంగా హెచ్‌టీఎస్‌కు టర్కీ ప్రధాన మద్దతుదారుగా ఉంది. సిరియన్ నేషనల్ ఆర్మీకి ఆయుధాలు, మందుగుండు సామగ్రి, సైన్యాన్ని అందించటంతో పాటు రాజకీయంగా కూడా మద్దతుగా నిలిచింది. అలాగే సిరియాలోని ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) గ్రూపునకు వ్యతిరేకంగా అమెరికా పోరాడుతోంది. సిరియా మిలటరీ స్థావరాలపై ఇటీవల కాలంలో అనేక మార్లు ఇజ్రాయెల్ మిస్సైల్ దాడులు చేసింది. ఆగ్నేయ ప్రాంతంలోని క్వెనిత్రాలోని రోడ్లు, విద్యుత్ ప్రసార సాధనాలు, వాటర్ నెటవర్క్‌ను ధ్వంసం చేసింది. తాము సిరియాలో ఉన్న ఇరాన్ మిలటరీ స్థావరాలపై దాడులు చేస్తున్నామని... ఆ దేశం ఈ దాడులను సమర్థించుకుంటోంది.

అసద్‌ను పదవీచ్యుతుడిని చేసిన హెచ్‌టీఎస్ కమాండర్ ఇన్ ఛీఫ్ అహ్మద్ అల్ షారా సిరియా నాయకత్వ బాధ్యతలను మహ్మద్ అల్ బషర్ చేతిలో పెట్టారు. ఆయన ఇడిబ్ లోని సిరియన్ సాల్వేషన్ గ్రూపు (ఎస్ఎస్‌జీ) నాయకుడు. ప్రస్తుతం కేర్ టేకర్ ప్రభుత్వానికి బషర్ నాయకునిగా వ్యవహరిస్తారు. మార్చి 1 వరకూ ఆయన పదవిలో ఉంటారు. పౌర సేవలు సక్రమంగా అందటానికి, సాయుధ దళాల చేతిలోకి అధికార పగ్గాలు వెళ్లకుండా చూడాలనే ఉద్దేశ్యంతో ఈ ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు.

ఒకప్పుడు అల్ ఖైదాకు అనుబంధంగా పని చేసిన హెచ్‌టీఎస్‌ను తీవ్రవాద సంస్థగా ముద్ర వేసినా, ఇప్పుడు హెటీఎస్ నేతలతో బైడెన్ ప్రభుత్వం టచ్‌లో ఉంటోంది. యూఎస్ విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకన్ దీనిపై మాట్లాడారు. ముందు ముందు పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాలి.

– డా॥ పార్థసారథి చిరువోలు,
సీనియర్ జర్నలిస్టు

స్వార్థం– దైవ చింతన

మానవుడు ప్రధానంగా స్వప్రయోజనా దృష్టి గల జీవి. అది అతన్ని జీవితాంతం వెన్నంటే ఉంటుంది. దీనికి తోడు ఇతర ప్రాణులకు లేని బుద్ధి బలం కూడా మనిషికి ఉంది. మనిషి లోని సహజ లక్షణమైన ఈ స్వార్థ గుణాన్ని గురించి ఉపనిషత్తులు కూడా వివరించాయి. యాజ్ఞవల్క్య మహర్షి తన భార్య మైత్రేయితో... 'భార్య భర్తను ప్రేమిస్తున్నదంటే అది తన ఆనందం కోసమే. భర్త భార్యను ప్రేమిస్తున్నాడన్నా అతని ఆనందం కోసమే. ఇంకా పుత్రుల మీద, దేశం మీద, మానవులకున్న ప్రేమ వారి ఆనందం కోసం కాదు తన ఆనందం కోసమే' అని చెపుతాడు.



తన స్వార్థం కోసం ఉపయోగ పడేంతవరకు మానవుడు సమాజంతో సంబంధం పెట్టుకుంటాడు. మనిషిలో సహజంగా ఉండే ఈ స్వార్థాన్ని నియంత్రణ లేకుండా వదిలిపెడితే భూమిపై సుఖ శాంతులు పూర్తిగా కరువైపోతాయి. తన స్వార్థ ప్రయోజనాలకు బలహీనులను పట్టి పీడిస్తాడు. పెద్ద చేప చిన్న చేపను మింగినట్లు ప్రవర్తిస్తాడు. కొన్నాళ్ళకు తనూ తన కంటె బలవంతుని చేతిలో బలవుతాడు. లోకనాశనానికి దారి తీసే ఈ స్వార్థ గుణాన్ని అణిచి వేసి, మనిషి మనసులో గొప్ప మార్పు దైవ చింతన తీసుకు రాగలదు. మానవులకు శాంతిమయ జీవితాన్ని ఇవ్వటానికి భగవంతుడు వివిధ రూపాలలో అవతరిస్తుంటాడు.

ఇహ లోకంలో ప్రశాంత జీవితం గడపటానికి, పరంలో శాశ్వతానందాన్ని పొందటానికి తగిన ఉపదేశాన్ని మానవాళికి అందజేసిన గ్రంథ రాజం భగవద్గీత. రోజుకొక శ్లోకం చదివినా, నేర్చుకున్నా ఆలోచనలు భగవంతునిపై నిలుస్తాయంటారు పెద్దలు. 'భక్తుడు ఏ దేవతా రూపాన్ని శ్రద్ధగా పూజిస్తాడో అతనికి ఆ రూపంపై శ్రద్ధ నిలిచేటట్లు చేస్తాను' అంటాడు భగవంతుడు.

అలా పూజించినందుకు తగిన ఫలాన్ని అందజేస్తాడు. భగవంతుని చింతనలో మనసు పునీతమై, మనిషి నిస్వార్థ జీవిగా మారి, విశాల దృక్పథాన్ని అలవరచుకుంటాడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

హీరో నాగార్జున పరువు నష్టం కేసు 26కు వాయిదా

సిటీ కోర్టులు: మంత్రి కొండా సురేఖపై సినీనటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆమె గురువారం కోర్టుకు హాజరుకాలేకపోతున్నారని మంత్రి తరపు న్యాయవాది గుర్మీత్‌సింగ్ కోర్టుకు తెలిపారు. అనంతరం 317 సీఆర్‌పీసీ పిటిషన్‌ను దాఖలు చేశారు. కాగా పిటిషనర్ నాగార్జున కూడా గైర్హాజరు కావడంతో ఆయన తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన జడ్జి శ్రీదేవి విచారణను ఈనెల 26కు వాయిదా వేస్తున్నట్టు తెలిపారు.

బీడీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా గాయత్రి ప్రసాద్



సాక్షి, హైదరాబాద్: భారత్ డైనమిక్ లిమిటెడ్ (బీడీఎల్) ఫైనాన్స్ డైరెక్టర్‌గా జి.గాయత్రి ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నాగార్జున యూనివర్సిటీలో పట్టభద్రుడైన గాయత్రి ప్రసాద్ .. 1997లో బీడీఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీగా చేరారు. సంస్థలో 27 ఏళ్లుగా పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగారు.

పోలీసులు వేధిస్తున్నారని..

- నలుగురు యువకుల ఆత్మహత్యా యత్నం



హెయిర్ డై తాగుతున్న యువకులు

మందమర్రి రూరల్: పోలీసులు వేధిస్తున్నారంటూ నలుగురు యువకులు గురువారం ఆత్మహత్యాయత్నం చేశారు. దీనికి సంబంధించి విడుదల చేసిన సెల్ఫీ వీడియో కలకలం రేపింది. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ఆవుల షారూక్, మేస్రం రాజు, యాపల్ ప్రాంతానికి చెందిన బామండ్ల శివ, సెగ్గం అజయ్‌కుమార్ మందమర్రి పోలీసులు తమపై అక్రమ కేసులు బనాయించి, చేయని కేసులను ఒప్పుకోమని బలవంతం చేస్తున్నారని ఆరోపించారు. డబ్బుల కోసం వేధిస్తున్నారని, ఇది భరించలేక చనిపోదామనే ఉద్దేశంతో హెయిర్ డై తాగి ఆత్మహత్య చేసుకుంటూ సెల్ఫీ వీడియో తీసుకున్నారు. దీనిపై సమాచారం అందడంతో వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువకుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని తెలిసింది. కాగా, ఈ విషయమై మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ స్పందిస్తూ ఆత్మహత్యకు యత్నించిన నలుగురు యువకులు పాత కేసుల్లో నిందితులన్నారు. వారిపై మందమర్రి, కాసిపేట, రామకృష్ణాపూర్, మంచిర్యాల స్టేషన్లలో పలు కేసులు నమోదైనట్టు పేర్కొన్నారు.

‘బలగం’ మొగిలయ్య ఇక లేరు

- మూడేళ్లుగా అనారోగ్యంతో ఇబ్బందులు
- బలగం సినిమాలో ‘తోడుగా మాతో ఉండి’ పాట ద్వారా ప్రత్యేక గుర్తింపు
- వరంగల్ జిల్లా దుగ్గొండి గ్రామంలో అంత్యక్రియలు

సాక్షి, వరంగల్/దుగ్గొండి: ‘తోడుగా మాతో ఉండి.. నీడగా మాతో నడిచి...నువ్వెక్కడికెళ్లినావు కొంరయ్యా..’ అంటూ ‘బలగం’ సినిమాలో క్లైమాక్స్ పాటతో అందరినీ కంటతడి పెట్టించిన బుడగ జంగాల కళాకారుడు పస్తం మొగిలయ్య గురువారం తుదిశ్వాస విడిచారు. మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న జానపద యక్షగాన కళాకారుడు మొగిలయ్య నాలుగు రోజుల క్రితం అస్వస్థతకు గురికావడంతో భార్య కొంరమ్మ వరంగల్‌లోని సంరక్ష ఆసుపత్రికి తీసుకొచ్చారు. గురువారం తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశారు. పలువురు కవులు, కళాకారులు దుగ్గొండి గ్రామానికి వచ్చి పార్థివదేహాన్ని సందర్శించి పాటతో నివాళులర్పించారు. వేలాదిమంది అశ్రునయనాల మధ్య మొగిలయ్య అంత్యక్రియలను కుమారుడు సుదర్శన్ పూర్తి చేశారు.

యక్షగానం నుంచి...

వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన పస్తం మొగిలి (67), కొంరమ్మ దంపతులు గ్రామాల్లో శారదకథలు చెబుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ‘బలగం’ సినిమాలోని చివరిఘట్టంలో వచ్చే ‘తోడుగా మాతో ఉండి..’ అనే పాటను దర్శకుడు యెల్దండి వేణు మొగిలయ్య చేత పాడించారు. అయితే కిడ్నీల సమస్యతో అప్పటికే రెండు కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఈ సినిమాను చూడలేకపోయానని మొగిలయ్య బాధపడుతుండేవాడు. మొగిలయ్య మృతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ‘బలగం’లో మొగిలయ్య పాడిన పాట చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా సంతాపం ప్రకటించారు.

‘బలగం’ చివరిఘట్టం ఆవిష్కృతం

బలగం సినిమా చివరి ఘట్టంలో మొగిలయ్య, కొంరమ్మ భావోద్వేగమైన పాట పాడి అందరినీ కంటతడిపెట్టించారు. అదే సన్నివేశం మొగిలయ్య అంతిమయాత్రకు ముందు ఆవిష్కృతమైంది. మొగిలయ్య మృతదేహం వద్ద ఆయన భార్య పాట రూపంలో ఇద్దరి బంధాన్ని గుర్తు చేసుకుంటూ 15 నిమిషాలపాటు పాటపాడటంతో అక్కడున్న వారంతా కంటతడి పెట్టారు.



మొగిలయ్య భౌతికకాయం వద్ద పాట పాడుతున్న భార్య కొంరమ్మ. ఇన్‌సెట్‌లో మొగిలయ్య (ఫైల్)

మోహన్‌బాబుకు దక్కని ఊరట

- మధ్యంతర ఉత్తర్వులకు హైకోర్టు నిరాకరణ



సాక్షి, హైదరాబాద్: జర్నలిస్ట్‌పై దాడి కేసులో ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు హైకోర్టులో ఎలాంటి ఊరట దక్కలేదు. అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. ‘మైక్‌తో దాడి చేసి గాయపరిచారన్నది ఆరోపణ. అనుమతి లేకుండా మోహన్‌బాబు ఇంట్లోకి వెళ్లిన కారణంగానే ఘటన జరిగింది. తొలుత బీఎన్‌ఎస్ 118 సెక్షన్ కింద కేసు పెట్టిన పోలీసులు జర్నలిస్ట్ రంజిత్ వాంగ్మూలం తీసుకుని సెక్షన్ 109గా మార్చారు. మోహన్‌బాబు, రంజిత్ మధ్య ఎలాంటి వివాదం లేదు. హత్యకు ప్రయత్నించారనడానికి ఎలాంటి కారణాలు లేవు. సుప్రీంకోర్టు తీర్పుల మేరకు పిటిషనర్ బెయిల్‌కు అర్హుడు’అని పేర్కొన్నారు. మనోజ్ జిమ్ ట్రైనర్‌తోపాటు మరొకరి స్టేట్‌మెంట్ రికార్డు చేశామని ఏపీపీ జితేందర్‌రావు చెప్పారు. కౌంటర్ కూడా దాఖలు చేశామన్నారు. మోహన్‌బాబు కావాలని చేయకున్నా.. తెలిసి దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. ‘రంజిత్‌కు తగిలిన గాయంపై ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన నివేదిక ఆధారంగా సెక్షన్‌ను మార్చాల్సి వచ్చింది. వారంపాటు ఆస్పత్రిలోనే ఉన్నారు. 20 రోజుల వరకు ద్రవ పదార్థాలు మాత్రమే తీసుకోవాలని చెప్పారు. పిటిషనర్ కుమారుడి ఆహ్వానం మేరకు మీడియా ప్రతినిధులు వెళ్లారు. మోహన్‌బాబు దుబాయ్ వెళ్లే అవకాశం ఉంది. ఆయనకు జీవితకాల శిక్ష పడే అవకాశం కూడా ఉంది’అని చెప్పారు. అయితే మోహన్‌బాబు దుబాయ్ వెళ్లడం లేదని రవిచందర్ పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఇరు పార్టీలను అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ సోమవారానికి వాయిదా వేశారు. సోమవారం వరకు అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని రవిచందర్ కోరగా, నిరాకరించారు.

తెలంగాణను మించిన పర్యాటక ప్రాంతం లేదు

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి
- ఎయిర్‌పోర్టులో పర్యాటక సమాచార కేంద్రం ప్రారంభం



టూరిజం సమాచార కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

శంషాబాద్: దేశంలో తెలంగాణ అత్యంత గొప్ప పర్యాటక ప్రాంతమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సాంస్కృతిక వైవిధ్యం, వారసత్వ సంపద కలిగిన అనేక కట్టడాలు, అబ్బురపరిచే ప్రకృతితో కూడిన పర్యాటక ప్రాంతాలు తెలంగాణ సొంతమన్నారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో శంషాబాద్ విమానాశ్రయంలోని ఎయిర్‌పోర్టు విలేజ్‌లో ఏర్పాటు చేసిన సమాచార కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ, విదేశీ పర్యాటకులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలను ప్రవేశపెడుతోందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. ఈ సమాచార కేంద్రం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఇందులో పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణికర్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, టూరిజం ఎండీ ఎస్.ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌తో గురుకుల విద్యార్థినులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఘట్‌కేసర్: ఫుడ్ పాయిజన్‌తో మైనారిటీ గురుకులానికి చెందిన విద్యార్థినులు అస్వస్థతకు లోనయ్యారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా నాగారంలోని మైనారిటీ గురుకులంలో 450 మంది విద్యార్థినులు ఉన్నారు. గురువారం ఉదయం అల్పాహారం బోండా, మధ్యాహ్నం చికెన్‌తో భోజనం చేశారు. తిరిగి సాయంత్రం అల్పాహారంలో బొప్పాయి తిన్నట్టు విద్యార్థినులు తెలిపారు. కొద్ది సేపటి తర్వాత కొంత మంది విద్యార్థినులకు కడుపు నొప్పి, వికారంగా అనిపించడంతో ప్రిన్సిపాల్ స్వప్నకు తెలిపారు. ఆమె ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి విద్యార్థినులను వెంటనే తీసుకెళ్లారు. 33 మంది విద్యార్థినులను పరీక్షించి 9 మందిని అడ్మిట్ చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు ఆస్పత్రికి వెళ్లగా వార్డెన్, ఇతర సిబ్బందితో కలిసి దుర్భాషలాడింది. ఆస్పత్రికి మీరెందుకు వచ్చారంటూ ఫొటోలు తీయకుండా అడ్డుకున్నారు. ప్రిన్సిపాల్ స్వప్న ను వివరణ కోరగా కడుపు నొప్పి ఉందంటే విద్యార్థినులను ముందస్తుగా ఆస్పత్రికి తీసు కొచ్చామన్నారు. డాక్టర్ యాదయ్యను వివ రణ కోరగా 33 మందిని పరీక్షించామని అందులో 9 మందిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నామన్నారు. ఫుడ్ పాయిజన్‌తోనే ఇలా అయ్యిందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

విస్తరాకులో పెట్టి.. శ్మశానంలో వదిలేసి..

- మగ శిశువును వదిలేసి వెళ్లిన తల్లి

కొత్తగూడెం అర్బన్: అప్పుడే పుట్టిన మగ శిశువును ఓ తల్లి శ్మశానంలో వదిలేసిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. న్యూగొల్లగూడెం శ్మశాన వాటిక వద్ద పసి పిల్లవాడి ఏడుపు వినిపించడంతో స్థానికులు వెళ్లి చూడగా విస్తరాకులో మగశిశువు కనిపించింది. సమాచారం అందుకున్న వార్డు కౌన్సిలర్ భర్త మాచర్ల శ్రీనివాస్, పోలీసులతో కలిసి వెళ్లి శిశువును రామవరంలోని మాతాశిశు సంక్షేమ కేంద్రానికి తరలించారు. ఆపై భద్రాచలంలోని శిశు గృహానికి తీసుకెళ్లారు. విచారణలో పోలీసులు శిశువుకు జన్మనిచ్చిన యువతిని గుర్తించారు. న్యూగొల్లగూడెం ఏరియాకు చెందిన 19 ఏళ్ల యువతిని నాగరాజు అనే యువకుడు ప్రేమించాడు. శారీరకంగా దగ్గరయ్యారు. గర్భం దాల్చిందని తెలియగానే ఆ యువకుడు పరారయ్యాడు. దీంతో తల్లి వద్ద ఉంటున్న యువతి ప్రసవం తర్వాత శిశువును శ్మశాన వాటికలో వదిలి వెళ్లిపోయిందని పోలీసులు తెలిపారు. ఆమెను కూడా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

కూరగాయల సాగు పెంచేందుకు ప్రత్యేక కృషి

రైతులకు నారు, పందిళ్ల ఏర్పాటుకు రాయితీలు

‘సాక్షి’ కథనంపై స్పందించిన ఉద్యానవన శాఖ సంచాలకుడు షేక్ యాస్మిన్ బాషా

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కూరగాయల సాగు పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తూ, తదనుగుణంగా ఫలితాలు రాబడుతున్నట్లు ఉద్యానవన శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. ఈనెల 16న ‘సాక్షి’లో ‘వెజి ట్రబుల్స్’ శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనంపై ఆమె వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో గత నాలుగైదేళ్ల నుంచి సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కావడం వల్లనే రైతులు కూరగాయల సాగు నుంచి వరి వైపు మొగ్గుచూపు తున్నారని తెలిపారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకంలో కూరగాయల విస్తీర్ణం పెంచడానికి, రైతులను ప్రోత్సహించడానికి ఉద్యానవన శాఖ రైతులకు శాశ్వత పందిళ్లు, పాలి హౌస్‌లు, షేడ్ నెట్లు, షేడ్ నెట్ హౌస్‌ల నిర్మాణానికి రాయితీలతో కూడిన సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే బిందు సేద్యం, స్ప్రింక్లర్లు రాయితీపై ఇస్తున్నామని చెప్పారు. 2024–25లో రైతులకు రూ. 81.80 లక్షల వ్యయంతో 1,023 ఎకరాలకు నారు 100 శాతం రాయితీపై ఇచ్చినట్లు తెలిపారు. ఈ సంవత్సరంలో తొలిసారిగా క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బ్రకోలీ, క్యాప్సికం, రెడ్ క్యాబేజీ మొదలైన పంటలకు సంబంధించిన కూరగాయల నారును 100 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేసినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత శాశ్వత పందిళ్ల కోసం రూ. 45.54 కోట్ల రాయితీ ఇచ్చినట్లు వెల్లడించారు.

బీమా సొమ్ము తిన్న ఏఈఓ కల్యాణ్ సస్పెండ్

సాక్షి ఎఫెక్ట్

కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామ ఏఈఓ బానోత్ కల్యాణ్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ నుంచి సస్పెన్షన్ ఉత్తర్వులు పంపించారని చెప్పారు. ఉత్తర్వులను సదరు ఏఈఓకు అందించినట్లు చెప్పారు. చనిపోయిన రైతుల బీమా సొమ్మును ఏఈఓ కల్యాణ్ తన బ్యాంకు ఖాతాలోకి మళ్లించుకొన్న ఘటనపై ‘సాక్షి’లో ఈ నెల 18న ‘బీమా సొమ్ము ఏఈఓ ఖాతాలోకి’ శీర్షికన ప్రచురితమైన కథనానికి వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. గ్రామంలో విచారణ జరిపి నివేదికను రాష్ట్ర వ్యవసాయ కమిషనర్‌కు పంపించారు. దీంతో కల్యాణ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

ముంబై బోటు ప్రమాద మృతుల్లో బీబీనగర్ వాసి

- మృతుడు నేవీ ఉద్యోగి



ప్రవీణ్‌కుమార్ శర్మ

బీబీనగర్: ముంబైలో బుధవారం జరిగిన బోటు ప్రమాదంలో మృతి చెందిన వారిలో యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు చెందిన నేవీ ఉద్యోగి ప్రవీణ్‌కుమార్‌శర్మ(34) ఉన్నారు. బిహార్ రాష్ట్రానికి చెందిన రామ్‌నాథ్‌శర్మ 40 ఏళ్ల క్రితం కుటుంబంతో కలసి బీబీనగర్‌కు వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. రామ్‌నాథ్‌శర్మ కుమారుడైన ప్రవీణ్‌కుమార్‌శర్మ నేవీలో ఉద్యోగం సంపాదించి 14 ఏళ్లుగా బోట్ మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నెలలో రెండు, మూడుసార్లు బీబీనగర్‌కు వచ్చి వెళ్తూ ఉంటారు. విధుల్లో భాగంగా బుధవారం ముంబైలోని సముద్ర తీరంలో ప్రవీణ్‌కుమార్‌శర్మతో పాటు మరికొందరు కొత్త స్పీడ్ బోట్‌లో ట్రయల్ రన్ చేస్తుండగా.. అదే సమయంలో పర్యాటకులతో వెళ్తున్న బోట్‌ను ఢీకొట్టారు. కాగా, ప్రవీణ్‌కుమార్‌కు ఇటీవలే పెళ్లి జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఐదు నెలల క్రితమే ప్రవీణ్‌కుమార్ తండ్రి రామ్‌నాథ్‌శర్మ మృతిచెందారు. కొన్ని నెలల వ్యవధిలోనే తండ్రి, కుమారుడు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ప్రవీణ్‌కుమార్‌శర్మ మృతదేహం శుక్రవారం తెల్లవారుజాము వరకు బీబీనగర్‌కు చేరుకుంటుందని తెలుస్తోంది.

ధాన్యం విక్రయానికి అడ్డంకులు ఎందుకు?

- కర్ణాటక రైతుల ఆగ్రహం



కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న శక్తినగర్ వద్ద ధర్నా చేస్తున్న ఆ రాష్ట్ర రైతులు

కృష్ణా: ధాన్యం విక్రయంలో అడ్డంకులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నారాయణపేట జిల్లా కృష్ణా మండల సరిహద్దు కర్ణాటకలోని శక్తినగర్‌లో రాయచూర్ జిల్లా రైతు సంఘం నాయకులు తెలంగాణ రైతుల ధాన్యం వాహనాలను అడ్డుకొని రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటు కర్ణాటకలో, ఇటు తెలంగాణలో తమ రైస్ మిల్లులు ఉన్నాయని, నిరంతరం తమ మిల్లుల ద్వారానే హైదరాబాద్‌లోని ప్రముఖ హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలకు బియ్యం పంపిస్తున్నామని చెప్పారు. తెలంగాణలోని తమ రైస్ మిల్లులకు కర్ణాటకలోని ధాన్యాన్ని అన్ని అనుమతులతో తీసుకెళ్తుంటే తెలంగాణ ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆరోపించారు. తెలంగాణలోని రైతులు కూడా ధాన్యాన్ని కర్ణాటకకు తీసుకెళుతున్నారు. వీరంతా రాయచూర్ మార్కెట్‌పై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. వరినే కాకుండా.. పత్తి, కంది, ఆముదం తదితర అన్ని పంటలు రాయచూర్ మార్కెట్‌కు తరలిస్తామని, తమ పంటలకు అవసరమైన పెట్టుబడులు సైతం అక్కడి కమీషన్ ఏజెంట్ల వద్దే తీసుకుంటున్నామని చెప్పారు. ఇరు రాష్ట్రాల అధికారులు, ప్రభుత్వాలు స్పందించి ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గౌరారం అడవిలో కాలి నడకన వెళ్తున్న మండల వైద్య బృందం

14 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి..

- గొత్తికోయలకు వైద్య పరీక్షలు

గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో వైద్య సిబ్బంది వాగులు, గుట్టలు దాటుకుంటూ 14 కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి ఆదివాసీ గూడేల్లో గొత్తికోయలకు వైద్యం అందించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్‌రావు, మండల వైద్యాధికారి డాక్టర్ చంద్రకాంత్ ఆదేశాల మేరకు గురువారం మండల హెల్త్ విజిటర్ శ్యామల, హెల్త్ అసిస్టెంట్ జంపయ్య దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న మామిడి తోట, జారుడు బండ గూడేలకు వెళ్లి ప్రతీ ఇల్లు తిరిగి జ్వర సర్వే నిర్వహించడంతోపాటు, సికిల్‌సెల్ ఎనీమియా, లెప్రసీ సర్వేలు చేశారు. అనంతరం ఆదివాసీలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం కాళిక, ఆశ వర్కర్లు సమత, భారతి పాల్గొన్నారు.

అక్రమ నిర్బంధాలతో బీఆర్‌ఎస్‌ను ఆపలేరు

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



చర్లపల్లి జైలు వద్ద నరేందర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నేతలు

కుషాయిగూడ(హైదరాబాద్): అక్రమ నిర్బంధాలతో బీఆర్‌ఎస్‌ను ఆపలేరని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. నరేందర్‌రెడ్డితో పాటుగా మిగతా వారికి కూడా కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే బెయిల్ పేపర్లు అందజేయడంలో ఆలస్యం కావడంతో గురువారం విడుదలయ్యారు. నరేందర్‌రెడ్డి విడుదల నేపథ్యంలో కొడంగల్, ఉప్పల్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున చర్లపల్లి జైలు వద్దకు చేరుకున్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, మహేశ్‌రెడ్డిలు ఆయనకు స్వాగతం పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు మానుకొని ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి సారించాలంటూ తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు.

గురుకులంలో మరో విద్యార్థికి పాముకాటు

- రెండు రోజుల్లో ఇద్దరు విద్యార్థులను కరిచిన పాము
- తల్లిదండ్రుల రాస్తారోకో..
- పెద్దాపూర్ గురుకులంలో పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న వైనం



చికిత్స పొందుతున్న యశ్విత్

కోరుట్ల: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో గురువారం మరో విద్యార్థికి పాము కాటు వేసిన సంఘటన కలకలం రేపింది. బుధవారం ఉదయమే ఓంకార్ అఖిల్(14) అనే విద్యార్థికి పాము కాటు వేయగా.. బాలుడిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా 8వ తరగతి విద్యార్థి యశ్విత్‌కు పాము కాటు గుర్తులు ఉండటంతో కోరుట్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇద్దరు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని కలెక్టర్ సత్యప్రసాద్ సమీక్షించారు. రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలురు పాముకాటుకు గురి కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారిపై మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రాస్తారోకో నిర్వహించారు. ఆరు నెలల వ్యవధిలోనే పెద్దాపూర్ గురుకులంలో ఆరుగురు విద్యార్థులు పాముకాటుకు గురికాగా.. వారిలో ఇద్దరు మృతి చెందారు. తాజాగా మరో విద్యార్థి పాముకాటుకు గురికావడంతో తల్లిదండ్రులు గురుకులం నుంచి తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్తున్నారు.



పార్లమెంట్ ప్రాంగణంలో తీవ్ర ఘర్షణ



హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలంటూ పార్లమెంట్ ప్రాంగణంలో ఇండియా కూటమి ఎంపీల నిరసన

ఎన్డీయే, ఇండియా ఎంపీల మధ్య తోపులాట ● రాహుల్ గాంధీపై కేసు నమోదు

బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్‌లకు గాయాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రాంగణంలో మునుపెన్నడూ లేనివిధంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు చివరకు ఘర్షణకు దారితీయడం గమనార్హం. ఇరుపక్షాల ఎంపీలు ఒకరినొకరు తోసేసుకోవడం, పరస్పరం గొడవ పడడం, ఇద్దరు బీజేపీ ఎంపీలు గాయపడి ఆసుపత్రిలో చేరడం, ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకోవడం, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు కావడం, రాహుల్ తనతో అభ్యంతరకరంగా ప్రవర్తించారని బీజేపీ మహిళా ఎంపీ కోన్యాక్ ఆరోపించడం వంటి పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగించాయి. మొత్తానికి పార్లమెంట్ సాక్షిగా గురువారం దిగ్భ్రాంతికర సన్నివేశాలు చోటుచేసుకున్నాయి.

నినాదాలు, అరుపులు, కేకలతో ఉద్రిక్తత

అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ ఉదయం ఉభయ సభలు ప్రారంభం కావడానికి కొన్ని నిమిషాల ముందు విపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. నీలం రంగు దుస్తులు ధరించి, అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ వాద్రాతోపాటు కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల సభ్యులు ఈ నిరసనలో పాల్గొన్నారు. తర్వాత వారంతా మకరద్వారం గుండా పార్లమెంట్ లోపలికి ప్రవేశించేందుకు ముందుకు కదిలారు. అప్పటికే అక్కడ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఎంపీలు బైఠాయించారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ కించపర్చిందని ఆరోపిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బిగ్గరగా నినాదాలు ప్రారంభించారు. మకరద్వారం మెట్లపై ఇరువర్గాలు పరస్పరం ఎదురుపడ్డాయి. తాము ముందుకెళ్లడానికి దారి ఇవ్వడం లేదని ఇండియా కూటమి ఎంపీలు మండిపడ్డారు. దాంతో



గాయపడిన ఎంపీ సారంగి వద్ద రాహుల్ గాంధీ

ఎన్డీయే ఎంపీలు మరింత బిగ్గరగా నినాదాలు చేశారు. ఇండియా కూటమి సభ్యులు సైతం స్వరం పెంచారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. తోపులాటలు, అరుపులు కేకలతో ఈ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. అసలేం జరుగుతోందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. తోపులాటలో కొందరు ఎంపీలు కిందపడ్డారు. మెట్ల మధ్యభాగంలో నిలబడిన తమను రాహుల్ గాంధీ బలంగా తోసివేశారని బీజేపీ ఎంపీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముందుకెళ్లడానికి పక్కనే తగినంత దారి ఉన్నప్పటికీ ఆయన తమపై ఉద్దేశపూర్వకంగా దురుసుగా ప్రవర్తించారని అన్నారు. రాహుల్ గాంధీ తోసివేయడంతో తమ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్ గాయపడ్డారని చెప్పారు. నడవలేని స్థితిలో ఉన్న సారంగిని చక్రాల కుర్చీలో అంబులెన్స్ దాకా తీసుకెళ్లారు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అయితే, బీజేపీ ఎంపీలే దారికి అడ్డంగా నిల్చొని, రాహుల్ గాంధీని ముందుకు వెళ్లనివ్వలేదని కాంగ్రెస్ సభ్యులు చెప్పారు. తమను రెచ్చగొట్టేలా ప్రవర్తించారని బీజేపీ సభ్యులపై విరుచుకుపడ్డారు.

మోదీ పరామర్శ

పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన ఘర్షణలో గాయపడిన ప్రతాప్ సారంగితోపాటు ముకేశ్ రాజ్‌పుత్ చికిత్స నిమిత్తం ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చేరారు. సారంగి కణతకు కుట్లు పడ్డాయి. ముకేశ్ రాజ్‌పుత్ తలకు గాయాలయ్యాయి. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ వారిద్దరినీ ఫోన్‌లో పరామర్శించారు. జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే ఎంపీలు సైతం ఆసుపత్రికి చేరుకొని ప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్‌లను పరామర్శించారు.

పరస్పరం ఫిర్యాదులు

మొత్తం గొడవకు రాహుల్ గాంధీ కేంద్ర బిందువుగా మారారు. ఆయనపై బీజేపీ నేతలు పార్లమెంట్ హౌస్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హత్యాయత్నం, భౌతిక దాడి, హింసకు ప్రేరేపించడం వంటి ఆరోపణలతో ఫిర్యాదు అందించారు. రాహుల్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాంగ్రెస్ నేతలు సైతం బీజేపీ ఎంపీలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కూడా కలిశారు. రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీలు దారుణంగా ప్రవర్తించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఓం బిర్లాకు ఫిర్యాదు అందజేశారు. మల్లికార్జున ఖర్గే సైతం ఓం బిర్లాకు లేఖ రాశారు. బీజేపీ ఎంపీల దాడిలో తన మోకాలికి గాయమైందని పేర్కొన్నారు. ఈ దాడిపై దర్యాప్తు జరపాలని కోరారు. రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు కూడా కాంగ్రెస్ ఎంపీలు ఫిర్యాదు చేశారు. బీజేపీ నేతలు సైతం కాంగ్రెస్ ఎంపీలపై లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు.

నా ఆత్మగౌరవం దెబ్బతీశారు

రాహుల్ గాంధీపై నాగాలాండ్‌కు చెందిన బీజేపీ మహిళా ఎంపీ ఫాంగ్‌నన్ కోన్యాక్ ఆరోపణలు చేయడం సంచలనాత్మకంగా మారింది. ఆమె గురువారం రాజ్యసభలో మాట్లాడారు. ''మకర ద్వారం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుండగా రాహుల్ గాంధీ నాకు చాలా సమీపంలోకి వచ్చారు. కోపంగా చూస్తూ నాపై గట్టిగా అరిచారు. నాకు చాలా అసౌకర్యంగా అనిపించింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ ప్రవర్తన ఇదేనా?'' అని ప్రశ్నించారు. రాహుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు లేఖ అందజేశారు. ''నేను గిరిజన మహిళను. రాహుల్ నా పట్ల అనుచితంగా ప్రవర్తించారు. నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. నాకు రక్షణ కల్పించాలి'' అని లేఖలో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదును పరిశీలిస్తున్నానని ధన్‌ఖడ్ చెప్పారు.

బీజేపీ ఎంపీలు కర్రలతో బెదిరించారు: రాహుల్

బీజేపీ ఎంపీలు తనపై బల ప్రయోగం చేశారని, దురుసుగా తోసివేశారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. కింద పడిపోయానని, తనకు గాయాలయ్యాయని చెప్పారు. బీజేపీ ఎంపీలే తమపై దౌర్జన్యానికి పాల్పడి, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ ప్రాంగణంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమపై బీజేపీ ఎంపీలు అనుచితంగా ప్రవర్తించారని ప్రియాంక గాంధీ మండిపడ్డారు. బీజేపీ ఎంపీలే తమపై భౌతిక దాడులు చేశారని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. కర్రలు చేతపట్టుకొని తమను అడ్డుకున్నారని, బెదిరించారని, పార్లమెంట్ లోపలికి వెళ్లనివ్వలేదని చెప్పారు.

పార్లమెంట్ రెజ్లింగ్ రింగ్ కాదు: రిజిజు

తమ ఎంపీ సారంగిని రాహుల్ గాంధీ నెట్టివేశారని, రౌడీలా ప్రవర్తించారని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే దుయ్యబట్టారు. ఒక వృద్ధుడిని నెట్టివేసినందుకు రాహుల్ సిగ్గుపడాలని అన్నారు. తాను నాలుగుసార్లు ఎంపీగా గెలిచానని, తన రాజకీయ జీవితంలో ఇలాంటి దారుణమైన ఘటన ఏనాడూ చూడలేదని స్పష్టంచేశారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. పార్లమెంట్ అనేది బల ప్రదర్శనకు వేదిక కాదని, కుస్తీలు పట్టడానికి రెజ్లింగ్ రింగ్ కాదని సూచించారు. గురువారం నాటి ఘర్షణపై తగిన చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు.

అమిత్ షాపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

అంబేడ్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కేంద్ర మంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం రాజ్యసభలో సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు ఈ నోటీసు అందజేశారు. రాజ్యసభ సాక్షిగా రాజ్యాంగ నిర్మాతను అమిత్ షా అవమానించారని ఖర్గే ఆరోపించారు.

పార్లమెంట్‌లోకి వెళ్తుంటే ఎగతాళి చేశారు

తాము పార్లమెంట్‌లోకి వెళ్తుండగా బీజేపీ ఎంపీలు ఎగతాళి చేశారని, లోపలకి వెళ్లకుండా అడ్డుకున్నారని కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఆరోపించారు. అంబేడ్కర్‌ను అవమానించినందుకు హోంమంత్రి పదవికి అమిత్ షా రాజీనామా చేయాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వారు గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అమిత్ షాను కాపాడేందుకు బీజేపీ ముందస్తుగానే కుట్ర పన్నిందని విమర్శించారు.



రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ ఎంపీలు



బీజేపీ ఎంపీలపై ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ ఎంపీలు



చికిత్స పొందుతున్న ఎంపీ రాజ్‌పుత్‌తో రాజ్‌నాథ్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీ ప్రతాప్ సారంగి

పార్లమెంట్‌లో హోరెత్తిన 'జై భీమ్'

అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యల పట్ల విపక్షాల ఆగ్రహం

- హోంమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్
- రాహుల్ తీరుపై రాజ్యసభలో బీజేపీ మండిపాటు
- ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టు
- నిరసనలు, నినాదాలతో అట్టుడికిన ఉభయ సభలు

న్యూఢిల్లీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్ ఉభయ సభలు గురువారం దద్దరిల్లాయి. రాజ్యాంగ నిర్మాతను అవమానించినందుకు అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు అలజడి సృష్టించాయి. నిరసనలు, నినాదాలతో ఉభయ సభలు పలుమార్లు వాయిదాపడ్డాయి. లోక్‌సభ ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే విపక్ష ఎంపీలు తమ స్థానాల్లో నిల్చొని నినాదాలు ప్రారంభించారు. అమిత్ షా క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. శాంతించాలని స్పీకర్ ఓం బిర్లా కోరారు. తమిళనాడుకు చెందిన ఎంపీ ఇళంగోవన్ మృతిపట్ల సంతాపం ప్రకటించారు. దివంగత సభ్యుడి ఆత్మశాంతి కోసం ఎంపీలంతా కొంతసేపు మౌనం పాటించారు. అనంతరం విపక్ష సభ్యులు మళ్లీ నినాదాలు చేశారు. దీంతో సభను స్పీకర్ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ప్రియాంకగాంధీ వాద్రా సహా విపక్ష ఎంపీలు జైభీమ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. సభలో అంబేడ్కర్ చిత్రపటాలు ప్రదర్శించారు. 2 గంటలకు సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. అమిత్ షా క్షమాపణ చెప్పేదాకా ఆందోళన కొనసాగిస్తామని ప్రతిపక్ష ఎంపీలు తేల్చిచెప్పారు. నినాదాల హోరుతో సభ మార్మోగిపోయింది. సభకు సహకరించాలంటూ స్పీకర్ స్థానంలో ఉన్న దిలీప్ సైకియా పదేపదే కోరిన విపక్ష ఎంపీలు పట్టించుకోలేదు. దీంతో సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు దిలీప్ సైకియా ప్రకటించారు. స్పీకర్‌స్థానాన్ని చుట్టుముట్టేందుకు కాంగ్రెస్ ఎంపీలు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు. సభ వాయిదా పడిన తర్వాత కూడా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించారు. జమిలి ఎన్నికలపై రెండు బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి సిఫార్సు చేయడానికి లోక్‌సభలో గురువారం తీర్మానం ఆమోదించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, సభలో గందరగోళం కారణంగా తీర్మానంపై చర్చ జరగలేదు.

రాహుల్ అనుచితంగా ప్రవర్తించారు

అమిత్ షా వ్యాఖ్యలు పార్లమెంట్ ఎగువ సభలోనూ అలజడి రేపాయి. అంబేడ్కర్‌ను అమిత్ షా ఘోరంగా అవమానించారని, ఈ అంశంపై తక్షణమే చర్చించాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. జైభీమ్ అంటూ నినదించారు. పార్లమెంట్ ప్రాంగణంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అనుచితంగా ప్రవర్తించారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎంపీలు పట్టుబట్టారు. బీజేపీ మహిళా ఎంపీ కోన్యాక్‌ను రాహుల్ గాంధీ నెట్టివేశారని, మరో ఇద్దరు ఎంపీలపై దాడి చేశారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. బీజేపీ సభ్యుల పట్ల అనుచిత ప్రవర్తనకు కాంగ్రెస్ ఎంపీలంతా సభకు, దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని కేంద్ర మంత్రి జేపీ నడ్డా మండిపడ్డారు. అనంతరం డీఎంకే సభ్యుడు తిరుచ్చి శివ మాట్లాడారు. విపక్ష సభ్యులపై రాహుల్ గాంధీ దాడి చేయలేదని పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యులను గౌరవిస్తామని అన్నారు. మహిళలపై తమకు ఎంతో గౌరవం ఉందని చెప్పారు. ఇరుపక్షాల ఆందోళనలు, నినాదాలతో ఎగువసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో సభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. చివరకు సభ శుక్రవారానికి వాయిదాపడింది.

ధన్‌ఖడ్‌పై అభిశంసన నోటీసు తిరస్కరణ

న్యూఢిల్లీ: అధికార పక్షం పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై విపక్షాల కూటమి పార్టీలు రాజ్యసభలో ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం నోటీసు గురువారం తిరస్కరణకు గురైంది. వాస్తవికత లోపించిందని, వ్యక్తిగత దాడిని ఈ నోటీసు ప్రతిబింబిస్తోందని రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ వ్యాఖ్యానించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. '' నోటీసు మొత్తం తప్పుల తడకగా ఉంది. ప్రామాణిక విధానంలో రూపొందించ లేదు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రతిష్టను దురుద్దేశపూర్వకంగా దెబ్బతీసేలా నోటీసును సిద్ధంచేశారు. కేవలం ప్రచార ఆర్భాటం కోసమే ప్రవేశపెట్టిన నోటీస్ ఇది'' అంటూ హరివంశ్ ఈ నోటీసును తిరస్కరించినట్లు తెలుస్తోంది. డిప్యూటీ చైర్మన్ తీసుకున్న ఈ నిర్ణయానికి సంబంధిత వివరాలున్న మూడు పేజీల రూలింగ్‌ను రాజ్యసభ ప్రధాన కార్యదర్శి పీసీ మోడీ గురువారం సభ ముందు ఉంచారు. పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్న ధన్‌ఖడ్‌పై తాము విశ్వాసం కోల్పోయామని, ఆయనను ఆ పదవిని తప్పించాలని కోరుతూ 60 మంది విపక్ష పార్టీల ఎంపీలు డిసెంబర్ పదో తేదీన సంతకాలుచేసి ఆ అభిశంసన తీర్మాన నోటీసును రాజ్యసభలో అందించిన విషయం విదితమే. ఉపరాష్ట్రపతిని అభిశంసించేందుకు వీలు కల్పించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(బీ) కింద విపక్షాలు ఈ నోటీసును ఇచ్చాయి. '' నోటీస్ ద్వారా విపక్ష సభ్యులు ఉపరాష్ట్రపతి అధికారాలను తక్కువ చేసి చూపించే అనవసర సాహసం చేశారు. పార్లమెంట్, పార్లమెంట్ సభ్యుల ప్రతిష్టకు భంగం కల్గించేలా ఉన్న ఈ నోటీసు డిప్యూటీ చైర్మన్ అభిప్రాయాలను కించపరిచేలా ఉంది. అయినా ఉపరాష్ట్రపతిని అభిశంసించేందుకు సంబంధించిన తీర్మానంపై ఓటింగ్ చేపట్టాలంటే కనీసం 14 రోజుల ముందు నోటీస్ ఇవ్వాలి. డిసెంబర్ 10న సభ ముందుకొచ్చిన ఈ నోటీస్‌పై తీర్మానం, అనుమతి అనేవి నిబంధనల ప్రకారం డిసెంబర్ 24వ తేదీ తర్వాతే సాధ్యం. మంత్రిమండలి నవంబర్ ఆరో తేదీన నోటిఫై చేసిన ప్రకారం ప్రస్తుత రాజ్యసభ 266వ సెషన్ నవంబర్ 25న మొదలై డిసెంబర్ 20న ముగుస్తుంది. ఈ లెక్కన తీర్మానం తేదీ(డిసెంబర్ 24)కంటే ముందుగానే రాజ్యసభ సెషన్ ముగుస్తోంది. ఇలాంటి సందర్భంలో తీర్మానాన్ని ఆ తేదీలోపే అనుమతించడం కుదరదు'' అని హరివంశ్ వ్యాఖ్యానించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.



రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్

ట్రంప్‌తో చర్చలకు సిద్ధం

ఉక్రెయిన్‌లో గెలుపు మాదే ● రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యలు

మాస్కో: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. గత నాలుగేళ్లలో ఒక్కసారి కూడా ట్రంప్‌తో మాట్లాడలేదని ఆయన చెప్పారు. ట్రంప్ హయాంలో అమెరికా విధానాల్లో భారీగా మార్పులు రావొచ్చని అంచనా వేస్తున్నామన్నారు. ఉక్రెయిన్‌లో విజయం సాధించబోతున్నామని, సిరియాలో ఆశించిన లక్ష్యం నెరవేరిందని చెప్పుకొచ్చారు. గురువారం దాదాపు నాలుగున్నర గంటలపాటు జరిగిన వార్షిక మీడియా సమావేశంలో ప్రజల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్‌కు కూడా పుతిన్ స్పందించారు. అనేక జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై మాట్లాడారు. ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టాక ఉక్రెయిన్‌లో యుద్ధానికి ముగింపు రావొచ్చునంటూ వార్తలు వస్తున్న వేళ పుతిన్ పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



నాలుగేళ్లుగా మేం మాట్లాడుకో లేదు

డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశం ఎప్పుడుంటుందన్న ఎన్‌బీసీ ప్రతినిధి కెయిర్ సిమ్మన్స్ ప్రశ్నకు..'మా సమావేశం ఎప్పుడు ఉండొచ్చో నాకు తెలియదు. ట్రంప్ కూడా ఈ విషయం ఎన్నడూ చెప్పలేదు. దాదాపు నాలుగేళ్లుగా మేం మాట్లాడుకున్నదీ లేదు. ట్రంప్ సానుకూలంగా ఉంటే చర్చలకు ఎప్పుడైనా నేను సిద్ధమే'అని అన్నారు. ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధం, సిరియా నుంచి రష్యా బలగాలు వైదొలగాల్సి రావడం వంటి పరిణామాలతో మీరు బలహీనపడినట్లుగా భావిస్తున్నారా అన్న ప్రశ్నకు..,గత రెండు, మూడేళ్లలో రష్యా మరింతగా బలం పుంజుకుంది. ఎందుకంటే మేం మరింత స్వతంత్రంగా మారాం. ఎవరిపైనా ఆధారపడకుండా ముందుకు సాగుతున్నాం'అన్నారు. ఉక్రెయిన్‌లో పరిస్థితులు అనూహ్యంగా మారిపోయాయి. యుద్ధక్షేత్రంలో రోజురోజుకూ చదరపు కిలోమీటర్ల కొద్దీ భూభాగాన్ని స్వాధీనం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం'అన్నారు. అయితే, సరిహద్దుల్లో కస్క్ ప్రాంతాన్ని ఉక్రెయిన్ దళాల నుంచి తిరిగి ఎప్పుడు స్వాధీనం చేసుకుంటారన్న ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానమివ్వలేదు. 'స్వాధీనం చేసుకుని తీరుతాం. ఫలానా సమయం కల్లా అది పూర్తవుతుందని మాత్రం చెప్పలేను'అని పేర్కొనడం గమనార్హం. తాజాగా ఆర్మీ అణు విభాగం చీఫ్ కిరిల్లోవ్ హత్యను ఆయన ఉగ్రవాద చర్యగా పేర్కొన్నారు. సిరియా పదవీచ్యుత అధ్యక్షుడు అసద్ మాస్కోలోనే ఉన్నట్లు పుతిన్ ప్రకటించడం గమనార్హం. ఇప్పటి వరకు ఆయనతో సమావేశం జరగలేదని, కచ్చితంగా మాట్లాడతానని చెప్పారు.

డొమినిక్ పెలికాట్‌కు 20 ఏళ్ల జైలు

మహిళపై 72 మంది రేప్ కేసులో మాజీ భర్తే దోషి అన్న కోర్టు

అవిగ్నోన్: తీవ్ర సంచలనం సృష్టించిన కేసులో ఫ్రాన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. భార్యకు మత్తు మందిచ్చి ఇతరులతో అత్యాచారం చేయించడంతోపాటు తీవ్ర లైంగిక వేధింపులకు పాల్పడిన మాజీ భర్త డొమినిక్ పెలికాట్(72)కు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. కేసులో మొత్తం 51 మందిని దోషులుగా ప్రకటించింది. మిగతా 50 మందిలో కొందరికి 3 నుంచి 15 ఏళ్ల వరకు జైలు శిక్షలను ఫ్రాన్స్‌లోని అవిగ్నోన్ నగర కోర్టు గురువారం ప్రకటించింది. ఇలాంటి నేరాలకు ఫ్రాన్స్‌లో గరిష్ట జైలు శిక్ష 20 ఏళ్లు కావడం గమనార్హం. రేప్‌పై దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చకు తెరలేపిన ఈ కేసు విచారణ మూడు నెలలపాటు సాగింది. ఓ డిపార్టుమెంట్ స్టోర్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే డొమినిక్ పెలికాట్ 2020లో మొదటిసారిగా మహిళలను డ్రెస్ కింది నుంచి ఫొటో తీస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అనంతరం అతడి ఇంట్లో సోదాలు చేసిన పోలీసులకు నివ్వెరపోయే విషయాలు తెలిశాయి. ఇతరులతో కలిసి భార్య గిసెలి పెలికాట్‌ను రేప్, ఇతర వేధింపులకు గురి చేస్తున్నట్లుగా ఉన్న ఫొటోలు, వీడియోలు 20 వేల వరకు అతడి కంప్యూటర్ డ్రైవ్‌లలో కనిపించాయి. వాటిలోని ఫోల్డర్లకు అబ్యూజ్, రేపిస్ట్స్, నైట్ ఎలోన్.. తదితర పేర్లు పెట్టాడు డొమినిక్. దశాబ్దకాలంపాటు ఈ ఘోరం కొనసాగింది. గిసెలిపై మొత్తం 72 మంది అత్యాచారం సహా వేర్వేరు నేరాలకు పాల్పడ్డట్లు గుర్తించారు. వీరిలో డొమినిక్ సహా 51 మందిని మాత్రం గుర్తించిన అధికారులు వివిధ నేరాభియోగాలను మోపారు.

పార్లమెంట్ ప్రవేశద్వారాల వద్ద ధర్నాలపై నిషేధం

ప్రకటించిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ: పార్లమెంట్ మకర ద్వారం వద్ద గురువారం అధికార, విపక్ష పార్టీల సభ్యుల మధ్య వాగ్వాదం, తోపులాట నేపథ్యంలో ఇలాంటివి పునరావృతంకాకుండా నివారించేందుకు లోక్‌సభ స్పీకర్ ఇకపై పార్లమెంట్ ప్రవేశద్వారాల వద్ద ధర్నాలపై నిషేధం విధించారు. ఎంపీలు, రాజకీయ నేతలు, విడివిడిగా, బృందంగా ఇకపై ఏవైపు గేట్ వద్ద కూడా ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు చేపట్టకూడదని స్పీకర్ ఓం బిర్లా గురువారం కఠిన నియమాలను సూచించారు.

మీరూ ఏదో ఒకరోజు సీఎం అవుతారు

డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌తో సీఎం ఫడ్నవిస్ వ్యాఖ్య



నాగ్‌పూర్: మీరు ఏదో ఒక రోజు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటారని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌నుద్దేశిస్తూ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ వ్యా ఖ్యానించారు. గురువారం నాగ్‌పూర్‌లో మహారాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమావేశాలనుద్దేశిస్తూ గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా సీఎం ఫడ్నవిస్ మాట్లాడారు. సభలో ఉన్న అజిత్ పవార్, మరో డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేలనుద్దేశిస్తూ ప్రసంగించారు. '' తెల్లవారుజామునే నిద్రలేచే అజిత్ పవార్ అప్పట్నుంచే ప్రజాసేవకు అంకితమవుతారు. ఫైళ్లు తిరగేస్తారు. నేను మాత్రం మధ్యాహ్నం 12 గంటల నుంచి పని మొదలుపెడతా. అయితే ఏక్‌నాథ్ షిండే మాత్రం అర్ధరాత్రిదాకా పనిచేస్తారు. చాన్నాళ్లుగా డిప్యూటీ సీఎం పదవిలో ఉంటూ అజిత్ పవార్‌కు 'శాశ్వత ఉపముఖ్యమంత్రి' పేరు స్థిరపడిపోయింది. కానీ నేను మాత్రం ఒక్కటే ఆశిస్తున్నా. అజిత్ ఏదో ఒక రోజు ముఖ్యమంత్రి పదవిలో కూర్చుంటారు'' అని ఫడ్నవిస్ అన్నారు. ఎన్సీపీ చీఫ్ అయిన అజిత్ పవార్ ఈనెల ఐదో తేదీన ఆరోసారి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించడం తెల్సిందే. ఎప్పట్నుంచో ముఖ్యమంత్రి కుర్చీపై కన్నేసిన అజిత్ ఆ లక్ష్యసాధనలో భాగంగా బాబాయి శరద్‌పవార్ సారథ్యంలోని ఎన్సీపీని చీల్చి బీజేపీతో చేతులు కలిపిన విషయం విదితమే. పార్టీని చీల్చినా సరే మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తనవైపే రావడంతో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయంతో ఎన్సీపీ పార్టీ గుర్తు, ఎన్నికల చిహ్నం రెండూ అజిత్‌కే దక్కాయి. ఇటీవల లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ అజిత్ వర్గమే అత్యధిక స్థానాల్లో గెలిచి తమదే అసలైన ఎన్సీపీ అని నిరూపించుకుంది.

ఐదుగురు ఉగ్రవాదులు హతం

ఇద్దరు జవాన్లకు గాయాలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో గురువారం భారీగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనలో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన టాప్ కమాండర్ సహా ఐదుగురు ముష్కరులు హతమయ్యారు. ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఉగ్రవాదల కదలికలపై నిఘా వర్గాల సమాచారం మేరకు బలగాలు బుధవారం రాత్రి బెహిబాగ్ ప్రాంతంలోని కద్దెర్‌లో కార్డన్ సెర్చ్ చేపట్టాయి. సోదాలు కొనసాగుతుండగానే గురువారం ఉదయం ఉగ్రవాదులు బలగాలపై కాల్పులకు దిగారు. బలగాలు దీటుగా స్పందించాయి. ఘటనలో హిజ్బుల్ ముజాహిదీన్ టాప్ కమాండర్ అహ్మద్ భట్ అలియాస్ నలి సహా ఐదుగురు చనిపోయారు. వీరందరూ స్థానికులేనని తేలింది. అహ్మద్ భట్‌కు దక్షిణ కశ్మీర్ ప్రాంతంలో చోటుచేసుకున్న పలు ఉగ్ర ఘటనలతో ప్రమేయం ఉందని అధికారులు తెలిపారు. సోదాలు కొనసాగుతున్నందున ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి సమీపంలోకి ఎవరూ రావద్దని ముందు జాగ్రత్త చర్యగా స్థానికులను కోరామని అధికారులు తెలిపారు. గాయపడిన ఇద్దరు జవాన్లను చికిత్స కోసం తరలించామన్నారు.



మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్‌లో గురువారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో 5 దుకాణాలు దగ్ధమయ్యాయి.

-8లో



మనసు దోచే.. సాగ'శారీ'

ఆధునిక కట్టుబాట్లు ఎలా ఉన్నా అప్పుడప్పుడూ సొగసిరి చీరకట్టి అన్న రీతిలో నగర మహిళలు తమ హుందాతనాన్ని ప్రదర్శిస్తున్నారు.

- సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
31.0/15.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం ఎక్కువ పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 31, కనిష్ఠంగా 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

దేశ ఆర్థికాభివృద్ధిలో విద్య పాత్ర కీలకం


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



రాంగోపాల్‌పేట్: దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ సెంటినరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఎంప్రెసా–24ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉన్నత విద్యాధికులతో పాటు మేధో శక్తి పెరిగితే ఆ దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. దేశంలో భిన్న మతాలు, ప్రాంతాలు, భాషలు ఉన్నా మనమంతా భారతదేశ పౌరులమేనన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్చ్ బిషప్, కార్డినల్ పూల ఆంథోని, కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఆంథోని వినయ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్, ఉస్మానియా యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ కళాశాల డీన్ ప్రొఫెసర్ శ్రీరాములు, విద్యాసాగర్, మిస్నీ మ్యాథ్యూ, చేతన్ శ్రీవాత్సవ్, కున్నుంకల్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పుస్తకం

హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రారంభం
- తొలిరోజే భారీ సంఖ్యలో సందర్శకులు



పుస్తక ప్రియుల సందడి





చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



'భారతీయతకు భాష్యం సీతారాం ఏచూరి' పుస్తకంతో కోయ చంద్రమోహన్ తదితరులు



స్టాల్‌లోని పుస్తకాన్ని కూతురుకు చూపిస్తున్న మహిళ

కవాడిగూడ: హైదరాబాద్ 37 వ జాతీయ పుస్తక ప్రదర్శన గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ నెల 29 వరకు కొనసాగనున్న పుస్తక ప్రదర్శనలో జాతీయ, అంతర్జాతీయ పుస్తక ప్రచురణ సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. మొత్తం 350 స్టాళ్లు కొలువుదీరాయి. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన కొనసాగనుంది. మొదటి రోజే పుస్తక ప్రియులతో సందడి నెలకొంది. తెలంగాణ పబ్లిషర్స్, విశాలాంధ్ర, నవోదయ, ఎమెస్కో, మంచి పుస్తకం, మిళింద్ పబ్లిషర్స్, అన్వీక్షికి, నవ తెలంగాణ, జైభారత్, రాయలసీమ ఆధ్యాత్మిక వేదిక, బుద్ధం, మానవహక్కుల వేదిక, వీక్షణం, అరుణతార, విరసం తదితర పుస్తక ప్రచురణ సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. బుక్‌ఫెయిర్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. తెలంగాణ బుక్ స్టాల్‌ను గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, టీ- శాట్ సీఈఓ బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా 'భారతీయతకు భాష్యం సీతారాం ఏచూరి' పుస్తకాన్ని పబ్లికేషన్స్ నిర్వాహకులు కోయ చంద్రమోహన్ వీరికి బహూకరించారు.

నయా వేడుకలపై నిఘా పెట్టండి

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: న్యూ ఇయర్ వేడుకల్లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, డ్రగ్స్, గంజాయిపై నిఘా పెట్టాలని సంబంధిత శాఖ అధికారులకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి సూచించారు. గురువారం అబ్కారీ భవన్‌లో రంగారెడ్డి, హైదరాబాద్ ఎక్సైజ్, ఎస్టీఎఫ్ బృందాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి మొదటి వారం వరకు ఆయా అధికారులకు సెలవులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అనివార్యమైతే తప్ప ఎవరూ సెలవులు పెట్టొద్దని సూచించారు. ఎన్‌డీపీఎల్ మద్యం రాకుండా చూడాలని, ఈవెంట్ మేనేజర్ల కదలికలపై దృష్టి పెట్టాలని, నానక్‌రాంగూడ, సింగరేణి కాలనీ, ఎల్బీనగర్, కర్మన్‌ఘాట్, గోల్కొండ, పుప్పాల్‌గూడ, మణికొండ, రామకృష్ణ కాలనీలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కమిషనర్లు ఖురేషీ, కేఏబీ శాస్త్రి, డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్, అడిషనల్ ఎస్పీ భాస్కర్, అసిస్టెంట్ కమిషనర్లు ఆర్.కిషన్, అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రణవి పాల్గొన్నారు.

మిల్లెట్ల వినియోగం, ప్రచారం మరింత పెరగాలి




కార్యక్రమంలో పాల్గొన్న గారెత్ విన్ ఓవెన్

రాయదుర్గం: మిల్లెట్ల వినియోగం, ప్రచారం మరింత పెరగాల్సిన అవసరం ఉందని హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పేర్కొన్నారు. నాలెడ్జి సిటీలోని ఐకియా ప్రాంగణంలో గురువారం తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, బైసీ(బీఐఎస్‌వై) గ్రూప్, ఐకియా ఆధ్వర్యంలో మిల్లెట్ల వినియోగం, అవగాహన, గిరిజన సంఘం ప్రతినిధులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మినుములను, ఇతర మిల్లెట్లను తప్పనిసరిగా తినాలని ఆయన సూచించారు. వీటి వినియోగం పెరిగేలా చేయడానికి విస్తృత స్థాయిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన గిరిజన క్యూరేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. కొన్ని వందల ఏళ్ల క్రితం గిరిజనులు మినుములు, జొన్నలు తినేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మిల్లెట్ మ్యాన్ రాంబాబు, బైసీ గ్రూప్ వ్యవస్థాపకుడు నవీన్ మేడిశెట్టి పాల్గొన్నారు.

'వినియోగం' మారినా కూల్చుడే!

అనేక అపార్ట్‌మెంట్లలో నిబంధనల ఉల్లంఘన



- గృహావసరాలకు వాడాల్సిన భవనాలు వాణిజ్యానికి..
- ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేస్తున్న హైడ్రా
- మణికొండ అల్కాపురిలో షటర్ల కూల్చివేత

సాక్షి, సిటీబ్యూరో/మణికొండ: 'హైడ్రా–2.0' తన పంథాను పూర్తిగా మార్చుకుంది. కూల్చివేతల విషయంలో సామాన్యులకు ఇబ్బందులు రాకుండా ఆచితూచి అడుగులు వేస్తోంది. కేవలం చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలే కాదు.. నిబంధనల విరుద్ధంగా గృహావసరాలకు అనుమతులు తీసుకుని, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న నిర్మాణాలపైనా చర్యలు తీసుకుంటోంది. మణికొండ పరిధిలోని అల్కాపురి టౌన్‌షిప్‌లో ఉన్న అనుహర్ మార్నింగ్ రాగా అపార్ట్‌మెంట్‌తో దీన్ని ప్రారంభించింది. ఓ ఫిర్యాదు ఆధారంగా ముందుకు వెళ్లిన హైడ్రా, స్థానిక అధికారులు దాని గ్రౌండ్ ఫ్లోర్‌లోని వ్యాపార సముదాయాలను గురువారం కూల్చేసింది.

ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతూ..

నగరంలోని ఎన్నో నిర్మాణాలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. పార్కింగ్‌తో పాటు ఇతర అవసరాల కోసం కేటాయిస్తూ అనుమతి తీసుకున్న, కేటాయించాల్సిన ప్రాంతాన్ని వాణిజ్య అవసరాలకు వాడేస్తున్నారు. దీంతో అటు నివాసితులకు, ఇటు ఆ మార్గంలో ప్రయాణించే వారికి ఇక్కట్లు తప్పట్లేదు. నివాసితుల వద్దకు వచ్చే విజిటర్స్‌తో పాటు ఆయా వాణిజ్య, వ్యాపార సంస్థలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రహదారిపై పార్క్ చేసుకుంటున్నారు. ఇది తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులకు కారణం అవుతోంది.

అపార్ట్‌మెంట్ వాసుల ఫిర్యాదులతో..

అనుహర్ మార్నింగ్ రాగా అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో రెసిడెన్షియల్‌కు అనుమతి తీసుకుని, వ్యాపార సముదాయాలుగా మారుస్తున్నారంటూ 38 ఫ్లాట్ల నివాసితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం నార్సింగి పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశామని చెప్పారు. దీని ఆధారంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్థానిక మున్సిపల్ అధికారులతో కలిసి రెండు వారాల క్రితం క్షేత్రస్థాయి పరిశీలించారు. వివిధ అభ్యంతరాల నేపథ్యంలో హైడ్రా కార్యాలయంలో ఇరుపక్షాల వారిని సమావేశపరచడంతో పాటు అపార్టుమెంట్ నిర్మాణ అనుమతులకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. దీంతో రెసిడెన్షియల్ అనుమతి పొందిన భవనంలో కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నట్లు తేలింది. ఎలివేషన్ కారిడార్లను మూసి ఓ బ్యాంక్‌నకు అవసరమైన స్ట్రాంగ్ రూం నిర్మాణం చేయడంతో అపార్ట్‌మెంట్‌కు పగుళ్లు కూడా వచ్చినట్లు గుర్తించారు. వాహనాల బ్యాటరీ చార్జింగ్ పాయింట్ల ప్రమాదాల నేపథ్యంలో నివాసితుల ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అనుహర్ మార్నింగ్ రాగా అపార్టుమెంట్ నిర్మాణ యజమాని హర్షవర్ధన్ రెడ్డికి సంబంధిత విభాగాలు నోటీసులు జారీ చేసినా స్పందించలేదు.



పోలీసుల బందోబస్తు

షోకాజ్ తర్వాత డిమాలిషన్ నోటీసులు..

మణికొండ మున్సిపల్ కమిషనర్ నోటీసులకు హర్షవర్ధన్‌రెడ్డి స్పందించకపోవడంతో అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆపై డిమాలిషన్ నోటీసులు ఇస్తూ అవసరమైన సమయం ఇచ్చినా స్పందన లేకపోవడంతో హైడ్రా సమక్షంలో స్థానిక అధికారులు గురువారం కూల్చివేతలు చేపట్టారు. జీహెచ్‌ఎంసీ మినహా ఔటర్ రింగురోడ్డు పరిధిలోని అన్ని మున్సిపాలిటీలలో తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ 2019 సెక్షన్ 178 (2) ప్రకారం హైడ్రాకు సమకూరిన అధికారాల ఆధారంగా కమిషనర్ కూల్చివేతలకు ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేని వ్యాపార సముదాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని తొలగిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంలో చిరు వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ట్రాఫిక్, స్థానికులకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.



అల్కాపురిలో కూల్చివేతలు

మిగతా వాటికీ వర్తింపజేయాలి..

అనుహర్ మార్నింగ్ రాగా అపార్ట్‌మెంట్ కింద ఉన్న 14 షటర్లను అధికారులు గురువారం తొలగించారు. మున్సిపాలిటీకి కమర్షియల్ పన్నులు చెల్లిస్తున్న షటర్‌లను తాము కొనుగోలు చేసి వ్యాపారాలు చేస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. అవి కూల్చేయడం ఎంత వరకు సబబు అంటూ కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇలాంటి నిర్మాణాలను మొదట్లోనే అడ్డుకోవాల్సిన అధికారులు కాలయాపన చేశారని, వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నివాసిత అనుమతులతో వందలాది భవనాలలో వ్యాపార సంస్థలు ఏర్పాటు చేశారని, వాటిపైనా హైడ్రా చర్యలు తీసుకోవాలంటున్నారు. తాము అప్పులు చేసి, ఆస్తులు అమ్మి వ్యాపారాలు పెట్టుకున్నామని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

బల్దియా బడ్జెట్ పెంపు!

23న స్టాండింగ్ కమిటీ సమావేశం



సాక్షి, సిటీబ్యూరో: గత నెల 30న జరిగిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించి ప్రవేశపెట్టిన రూ.8,340 కోట్ల ముసాయిదా బడ్జెట్‌పై సభ్యులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేయడంతో దాన్ని సవరించారు. సవరించిన బడ్జెట్‌ను ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న ప్రత్యేక స్టాండింగ్ కమిటీ సమావేశం ముందుంచనున్నారు. గత సమావేశం ముందుంచిన బడ్జెట్‌లో ఆస్తిపన్ను, టౌన్‌ప్లానింగ్, ట్రేడ్‌లైసెన్స్, అడ్వర్టయిజ్‌మెంట్ ఫీజులు, తదితరాలను తక్కువగా చూపారని సభ్యులు మండిపడటంతో వాటిని సవరించడంతో పాటు ఇతరత్రా మార్పుచేర్పులతో బడ్జెట్‌ను సవరించారు. పరిశీలించేందుకు తమకు తగిన సమయమివ్వలేదని సభ్యులు మండిపడటంతో గురువారమే సమాచారం నిమిత్తం సదరు బడ్జెట్ ప్రతులను స్టాండింగ్ కమిటీ సభ్యులకు పంపించారు. అనంతరం అజెండాలో మార్పులున్నట్లు సంబంధిత యంత్రాంగం సమాచారం పంపినట్లు తెలిసింది.

విశ్వసనీయ సమాచారం మేరకు సవరించిన ముసాయిదా బడ్జెట్‌లోని మార్పుల్లో ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.


అంశాల వారీగా పెంచిన నిధులు .. (రూ.కోట్లలో)

అంశం	ముసాయిదా	సవరణ
ఆస్తిపన్ను	2005.81	2029.81
టౌన్‌ప్లానింగ్	1037.41	1201.15
ట్రేడ్ లైసెన్స్	92.00	112.00
ప్రకటనల ఫీజులు	20.45	60.70

- ఇవిలా ఉండగా, ముసాయిదాలోని రెవెన్యూ ఆదాయాన్ని రూ.4,205 కోట్ల నుంచి రూ.4,445 కోట్లకు పెంచుతూ సవరించారు.

తరలి వెళ్తుంది.. తరచి చూస్తుంది!

అందుబాటులోకి పిల్‌బోట్ రోబో
- ఏఐజీ ఆస్పత్రిలో ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: సృజనాత్మకత కొత్త పుంతలు తొక్కుతుండటంతో సరికొత్త ఆవిష్కరణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ కోవలోకి వచ్చేదే రోబోటిక్ క్యాప్సుల్ ఎండోస్కోపీ టెక్నాలజీ. జీర్ణకోశ సమస్యలతో బాధపడే వారికి సులువుగా వ్యాధి నిర్ధారించేందుకు ఈ సరికొత్త సాంకేతికత మన భాగ్యనగరంలో అందుబాటులోకి వచ్చింది. దీని పేరే పిల్‌బోట్ రోబో.. దీన్ని గురువారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో ఆవిష్కరించారు. కృత్రిమ మేధ సాంకేతికత సాయంతో పని చేసే ఈ పిల్‌బోట్.. సంప్రదాయ ఎండోస్కోపీలతో పోలిస్తే ఎన్నో రెట్లు కచ్చితత్వంతో పని చేస్తుందని వైద్యులు తెలిపారు. ఈ సాంకేతికతను ఏఐజీ ఆస్పత్రి భారత్‌లోనే తొలిసారిగా అందుబాటులోకి తెచ్చింది.

అలా మింగేస్తే చాలు..

చిన్నపాటి ట్యాబ్లెట్ పరిమాణంలో ఉండే ఈ పిల్‌బోట్‌ను నోటి ద్వారా మింగితే చాలు అది కడుపులోకి వెళ్లి.. జీర్ణవ్యవస్థను పూర్తిగా పరిశీలిస్తుంది. ఇందులోని కెమెరా వ్యవస్థ హై రిజల్యూషనల్ చిత్రాలను మనకు పంపిస్తుంది. వైద్యులకు జీర్ణాశయంలోని పరిస్థితి క్షుణ్నంగా అర్థం చేసుకునేందుకు దోహదపడుతుంది. వ్యాధి నిర్ధారణ చేసేందుకు ఇది సమర్థంగా పని చేస్తుంది. అయితే.. పిల్‌బోట్ ఇంకా క్లినికల్ ట్రయల్స్ దశలోనే ఉందని, ఇంకా ఎఫ్‌డీఏ ఆమోదం పొందలేదని ఎండియాక్స్ ప్రతినిధి వెల్లడించారు. కార్యక్రమంలో మయో క్లినిక్‌కు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వివేక్ కుంభారి, ఎండియాక్స్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ అలెక్స్ ల్యూబ్కే, ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్.. అభివృద్ధి అదుర్స్!

రూ.1,678 కోట్ల వ్యయంతో విస్తరణ
- చురుగ్గా కొనసాగుతున్న పనులు
- 32.16 ఎకరాల్లో 4 బ్లాక్‌ల నిర్మాణం
- 2,000 పడకలు.. 500 ఐసీయూ బెడ్లు
- 300 పేయింగ్ గదులు
- 38 మాడ్యులర్ థియేటర్లు
- రోగులకు మరింత మెరుగైన వైద్యం





లక్డీకాపూల్: నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) విస్తరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఆర్ అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.1,678 కోట్ల వ్యయంతో 32.16 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం నిమ్స్‌లో అకడమిక్స్, ఇన్వెస్టిగేషన్, రీసెర్చ్‌తో పాటు 30కి పైగా విభాగాలు ఉన్నాయి. గుండె, మూత్రపిండాలు, మెదడు, కాలేయం, కేన్సర్, అత్యవసర విభాగం, ట్రామా, ఆర్థోపెడిక్ తదితర 42 విభాగాలకు సంబంధించి నూతన భవనాలు సమకూర్చనున్నారు. నూతన భవనాలు అందుబాటులోకి వస్తే స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో పీజీ సీట్లు పెరుగుతాయి. ఆయా స్పెషాలిటీ విభాగాల్లో నర్సింగ్ సేవల్లోనూ ప్రత్యేక శిక్షణ పొందుతారు. ఇప్పటికే నిమ్స్‌లో కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ, వాస్కులర్ సర్జరీ, యూరాలజీ, రుమటాలజీ, క్రిటికల్ కేర్, డయాగ్నొస్టిక్ వంటి విభాగాలు ఉన్నాయి. ఆంకాలజీ విభాగంలో మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీ, క్యాథ్ ల్యాబ్, డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇక వైద్య విద్య విషయానికి వస్తే.. 14 స్పెషాలిటీ విభాగాలతో పాటు 23 సూపర్ స్పెషాలిటీల్లో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీలలో నర్సింగ్, పారా మెడికల్, అల్లైడ్ హెల్త్ సైన్సెస్‌కు సంబంధించిన సంస్థలు కొనసాగుతున్నాయి.

4 బ్లాక్‌ల్లో కొత్త భవనాలు..

బిల్టప్ ఏరియా 23,96,542.34 చ.అ. విస్తీరణంలో 4 బ్లాక్‌లను నిర్మించనున్నారు. 8 అంతస్తుల బ్లాక్‌-ఏలో అవుట్ పేషెంట్ విభాగం (ఓపీడీ), 13 అంతస్తుల బీ-బ్లాక్‌లో ఇన్‌పేషెంట్ విభాగం, 8 అంతస్తుల సీ-బ్లాక్‌లో ఎమర్జెన్సీ విభాగం, 14 అంతస్తుల బ్లాక్‌-డీలో ఐపీడీ విభాగాలు ఏర్పాటు కానున్నాయి. మొత్తంగా 2 వేల ఆక్సిజన్ పడకలతో పాటు 120 ఓపీడీ చాంబర్లు, 500 ఐసీయూ పడకలు, 300 పేయింగ్ రూమ్‌లతో పాటు 38 మాడ్యులర్ థియేటర్లు అందుబాటులోకి రానున్నాయి. ఏ బ్లాక్, బీ బ్లాక్ భవన సదుపాయాలు మొదటి అంతస్తుల స్లాబ్ నిర్మాణం పురోగతిలో ఉంది. సీ బ్లాక్ భవనం నిర్మాణ పనులలో తవ్వకం పనులు పూర్తయ్యాయి. భూగర్భ డ్రైనేజీ, నీటి లైన్లను నిర్మించారు. బ్లాక్ డిలో నాలుగు అంతస్తుల స్లాబ్ నిర్మాణం పూర్తయింది. సర్వీస్ బ్లాక్‌కు సంబంధించి కూడా తవ్వకం పనులు పురోగతిలో ఉన్నాయి. సెక్టార్- 3లో టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌ఎం నిధుల కింద 200 పడకల ఎంసీహెచ్ ఆస్పత్రి భవన సదుపాయా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సెక్టార్-4లో ఆలయం, మసీదు, పాఠశాలలు వంటి నిర్మాణాల పునరావాస చర్యలు సాగుతున్నాయి. ఇందులో ఆలయ నిర్మాణం ఇప్పటికే 50 శాతం మేరకు పూర్తయింది. పాఠశాల భవన నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి. సెక్టార్-5లో నిమ్స్ కోసం ఆడిటోరియాన్ని నిర్మించనున్నారు.

కొత్త భవనాలతో మరింత బాధ్యత

"సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నూతన భవనాలు, అత్యాధునిక వసతుల కల్పనతో రోగుల్లో నమ్మకం పెరిగింది. ప్రస్తుత పడకలకు అదనంగా మరో 2 వేల పడకల భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో నిమ్స్‌లో పడకల సంఖ్య సుమారు 4 వేలకు చేరనుంది. కొత్త భవనాలతో మాపై బాధ్యత మరింత పెరుగుతుంది. పేదలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తాం. 4 వేల పడకలతో దేశంలోనే అతిపెద్ద హాస్పిటళ్ల జాబితాలో నిమ్స్ చేరనుంది. - ప్రొ.నగరి బీరప్ప, నిమ్స్ డైరెక్టర్

మోండా మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

- 5 దుకాణాలు దగ్ధం
- రూ.20 లక్షల ఆస్తినష్టం



దుకాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్‌లో గురువారం తెల్లవారు జామున జరిగిన అగ్నిప్రమాదంలో 5 దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో దాదాపు రూ.20 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. మార్కెట్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం తెల్లవారు జామున మార్కెట్‌లోని కొబ్బరికాయలు, కిరాణా దుకాణాల్లో మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, మార్కెట్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో మంటను అదుపులోకి తెచ్చారు. కాగా అప్పటికే రెండు కొబ్బరికాయల దుకాణాలు, ఒక పూజా సామగ్రి, ప్లాస్టిక్ దుకాణం, కిరాణా షాప్ కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.20 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. చలిమంట కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

అగ్ని ప్రమాదం విషయం తెలియడంతో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటూ ప్రభుత్వం తరపున సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్లో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

దారి దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ ఏసీపీ హనుమంతరావు

బాలానగర్: సులభంగా డబ్బు సంపాదించేందుకు దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరు యువకులను బాలానగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. బాలానగర్ ఏసీపీ హనుమంతరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన షేక్ సమీర్ ప్లంబర్‌గా పని చేసేవాడు. నగరంలోని గోల్కొండ ప్రాంతానికి చెందిన మహమ్మద్ హుస్సేన్ అతడి స్నేహితుడు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు సులువుగా డబ్బులు సంపాదించేందుకు దారి దోపిడీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న చింతల్ ప్రాంతానికి చెందిన సతీష్ డ్యూటీ నుంచి ఇంటికి తిరిగివెళుతుండగా ఉషా ఫ్యాన్ కంపెనీ సమీపంలో సమీర్, మహమ్మద్ హుస్సేన్ పథకం ప్రకారం సతీష్ బైక్‌ను ఢీకొన్నారు. అతను కింద పడిపోవడంతో అతడికి సహాయం చేస్తున్నట్లు దగ్గరికి వెళ్లి అతని మెడలోని 26.3 గ్రాముల గోల్డ్ చైన్, రెండు సెల్ ఫోన్లు లాక్కున్నారు. సతీష్ వారిని అడ్డుకునేందుకు యత్నించగా అతడిపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి బంగారు గొలుసు, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

లారీ ఢీ కొని మహిళ దుర్మరణం



ప్రియాంక గాథే మృతదేహం



ప్రియాంక గాథే(ఫైల్)

నాగోలు: బైక్‌పై రామోజీ ఫిల్మ్ సిటీకి వెళుతున్న జంటను వెనుక నుంచి లారీ ఢీ కొనడంతో ఓ యువతి మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రోహిత్‌కుమార్ పాట్లే మీర్‌పేట్, అన్నపూర్ణ కాలనీలో ఉంటూ నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాకు చెందిన అతడి స్నేహితురాలు ప్రియాంక గాథే బుధవారం రోహిత్‌కుమార్ ఇంటికి వచ్చింది. ఇద్దరూ కలిసి గురువారం ఉదయం బైక్‌పై రామోజీ ఫిల్మ్ సిటీకి వెళుతుండగా ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీ వారిని ఢీకొనడంతో ఇద్దరూ కింద పడ్డారు. లారీ చక్రాలు ప్రియాంక గాథే తల మీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఎల్‌బీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. రోహిత్‌కుమార్ పాట్లే ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేలుడు పదార్థం ఇచ్చింది అతడే..

- మంగుళూరులో అందుకున్న ఉగ్రవాది అసదుల్లా అక్తర్
- 2015లో అరెస్టు చేసిన బెంగళూరు సీసీబీ అధికారులు
- బుధవారం తీర్పు ఇచ్చిన అక్కడి స్పెషల్ కోర్టు
- అతడితో సహా ముగ్గురికి త్వరలో శిక్ష ఖరారు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో 2013 ఫిబ్రవరి 21న జరిగిన జంట పేలుళ్లు సహా అనేక విధ్వంసాలకు అవసరమైన పేలుడు పదార్థాలను సరఫరా చేసిన ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) ఉగ్రవాది సయ్యద్ ఇస్మాయిల్ అఫాఖీ దోషిగా తేలాడు. ఇతడిపై బెంగళూరు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) నమోదు చేసిన ప్రధాన కేసుకు సంబంధించి అక్కడి న్యాయస్థానం బుధవారం తీర్పు ఇచ్చింది. అతడితో పాటు సహకరించిన మరో ఇద్దరు ఉగ్రవాదులకు వచ్చే సోమవారం శిక్ష ఖరారు చేయనుంది. 2015లో భారత్‌లో పర్యటించిన అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాను టార్గెట్ చేశారన్నది అఫాఖీ మాడ్యుల్‌పై ఉన్న కీలక ఆరోపణ.

పాక్ నుంచి ప్లాన్ చేసిన రియాజ్ భత్కల్..

ఉత్తర కన్నడ జిల్లాలోని భత్కల్ ప్రాంతానికి చెందిన అఫాఖీ అలియాస్ డాక్టర్ సాబ్ వృత్తిరీత్యా హోమియోపతి వైద్యుడు. పాకిస్థాన్, కరాచీలోని డిఫెన్స్ ఏరియాలో తలదాచుకున్న ఐఎం మాస్టర్‌మైండ్ రియాజ్ భత్కల్ (2007 నాటి గోకుల్‌చాట్, లుంబినీ పార్క్ పేలుళ్ల నిందితుడు) ఆదేశాల మేరకు ఈ పని చేశాడు. భత్కల్ ప్రాంతానికే చెందిన సద్దాం హుస్సేన్, అబ్దుల్ సుబూర్‌లతో ముఠా ఏర్పాటు చేసుకున్నాడు. రియాజ్ భత్కల్ 2012లో హైదరాబాద్‌ను మరోసారి టార్గెట్‌గా చేసుకున్నాడు. ఆ ఏడాది సెప్టెంబర్‌లోనే ఉత్తరప్రదేశ్‌లోని ఆజామ్‌ఘడ్‌కు చెందిన అసదుల్లా అక్తర్ అలియాస్ హడ్డీ, పాకిస్థానీ జియా ఉర్ రెహ్మాన్ అలియాస్ వఖాస్‌లను కర్ణాటకలోని మంగుళూరుకు పంపి అక్కడ షెల్టర్ ఏర్పాటు చేయించాడు. వీరు రియాజ్‌తో నెట్ కేఫ్‌ల నుంచి చాటింగ్ చేయడం ద్వారా సంప్రదింపులు జరిపేవారు.

ఎజాజ్ షేక్‌తో నగదు... అఫాఖీతో ఎక్స్‌ప్లోజివ్స్...

రియాజ్ భత్కల్ 2013 ఫిబ్రవరి మొదటి వారంలో చాటింగ్ ద్వారా హడ్డీకి కీలక ఆదేశాలు జారీ చేశాడు. ఈసారి హైదరాబాద్‌ను టార్గెట్ చేశామని చెప్పి వఖాస్, బీహార్‌లోని దర్భంగా వాసి తెహసీన్ అక్తర్ అలియాస్ మోనుతో కలిసి ఈ ఆపరేషన్ పూర్తి చేయాలని నిర్దేశించాడు. ఈ ఆపరేషన్‌తో పాటు ఇతర అవసరాల కోసం రూ.6.8 లక్షలు హడ్డీకి అందించే బాధ్యతల్ని మహారాష్ట్రలోని పుణేలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న ఎజాజ్ షేక్‌కు, పేలుడు పదార్థాలను ఇచ్చే బాధ్యతల్ని బెంగళూరులో ఉంటున్న సయ్యద్ ఇస్మాయిల్ అఫాఖీకి అప్పగించాడు. మోను, వఖాస్ హైదరాబాద్ చేరుకుని, అబ్దుల్లాపూర్‌మెట్‌లో గదిని అద్దెకు తీసుకున్నారు.

'దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో దోషిగా తేలిన ఉగ్రవాది అఫాఖీ



అఫాఖీ



యాసిన్, అసదుల్లా అక్తర్

పేలుడు పదార్థాల కోసం మంగుళూరులోనే వేచి ఉన్న హడ్డీకి రియాజ్ భత్కల్ నుంచి ఆ ఏడాది ఫిబ్రవరి 4న కీలక ఆదేశాలు వచ్చాయి. మంగుళూరులోని యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద ఓ వ్యక్తి వాటిని అందిస్తాడని చెప్పడంతో అక్కడికి వెళ్లాడు. రియాజ్ సూచించిన ప్రకారం అఫాఖీ 25 కేజీల పేలుడు పదార్థం (అమ్మోనియం నైట్రేట్), 30 డిటోనేటర్లు సమీకరించి వాటిని బంగారు రంగులో ఉన్న ట్రాలీ బ్యాగ్‌లో పెట్టి సద్దాం హుస్సేన్ ద్వారా యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద హడ్డీకి అప్పగించాడు.

ఒకరికొకరు తెలియకుండా మరొకరితో..

దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లలో పాలు పంచుకున్న యాసీన్ భత్కల్ (నేపాల్ నుంచి సహకరించాడు), తెహసీన్ అక్తర్ (ఏ-1 మిర్చి సెంటర్ దగ్గర బాంబు పెట్టాడు), వఖాస్ (107 బస్టాప్ దగ్గర బాంబు పెట్టాడు), హడ్డీ (నగదు, పేలుడు పదార్థాలు చేరవేశాడు)లకు ఎజాజ్ షేక్ (నిధులు అందించాడు), అఫాఖీలు తెలియకుండా రియాజ్ భత్కల్ జాగ్రత్తలు తీసుకున్నాడు. వీరిలో ఎవరు చిక్కినా మిగిలిన వారి విషయం బయటపడకుండా కుట్ర పన్నాడు. అఫాఖీ, ఎజాజ్ షేక్‌లకూ ఎలాంటి పరిచయం లేదని, హడ్డీకి పేలుడు పదార్థాలు ఇచ్చినప్పుడు అతడు ఎవరనేది అఫాఖీకి తెలియదని సీసీబీ తేల్చింది. 2015 జనవరి 8న ఈ త్రయం అరెస్టు కాగా... బుధవారం దోషులుగా తేల్చారు. వీరికి వచ్చే సోమవారం శిక్ష ఖరారు చేయనున్నట్లు బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం పేర్కొంది.

సాంకేతిక విద్యతో ప్రయోగాలు చేయాలి

వెంగళరావునగర్ : మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యను జోడిస్తూ యునానీ ఔషధాల తయారీలో ప్రయోగాలు చేపట్టాలని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ యునానీ మెడిసిన్ డైరెక్టర్ జనరల్ (న్యూఢిల్లీ) డాక్టర్ ఎన్.జహీర్ అహ్మద్ అన్నారు. ఎర్రగడ్డ యునానీ కేంద్రీయ విద్యాలయంలో పరిశోధనలపై మూడురోజుల వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్కిన్ డిజాస్టర్ రోగులకు అందించే మందులను ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు, మారుతున్న వైద్య విధానాలకు అనుగుణంగా రూపొందించాలన్నారు. రీసెర్చ్ మెథడాలజీతో సహా ఆయుర్వేదం, యునానీ, హోమియోపతి, సిద్ధకు చెందిన పీజీ విద్యార్థులకు ఉత్తమ బోధనా పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక యునానీ కేంద్రీయ వైద్య కళాశాల ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ యూనిస్ ఇఫ్తికార్, మున్షీ, డాక్టర్ వసీం అహ్మద్ (యుపీ), పహ్మిదా జీనత్, డాక్టర్ ఐషా అంజుమ్ తదితర సీనియర్ వైద్యులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యునానీ పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ జహీర్ అహ్మద్

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్లు

అమీర్‌పేట: ప్రైవేట్ హాస్టళ్లను టార్గెట్ చేసుకుని సెల్ ఫోన్ చోరీలకు పాల్పడుతున్న బావ, బామ్మర్దులను అరెస్ట్ చేసిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు వారి నుంచి రూ.10 లక్షల విలువైన 51 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డీఐ గోపాల్‌తో కలిసి గురువారం వివరాలు వెల్లడించారు. నేపాల్‌కు చెందిన గోవింద్ బండారి, హిక్‌మత్ రావల్ గత కొన్నేళ్లుగా నగరంలో నివాసముంటున్నారు. గోవింద్ హైటెక్ సిటీ ప్రాంతంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తుండగా, రావల్ రాణీగంజ్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. బావ,బామ్మర్దులైన వీరు కష్టపడకుండా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో సెల్‌ఫోన్ చోరీలను ఎంచుకున్నారు. తెల్లవారుజామున ప్రైవేట్ హాస్టళ్లలోకి ప్రవేశించి సెల్ ఫోన్లు ఎత్తుకెళ్లేవారు. వాటిని నేపాల్ తీసుకెళ్లి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వీరిపై 22 కేసులు నమోదయ్యాయి. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల, కూకట్‌పల్లి స్టేషన్ల పరిధిలోనూ చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. వారి నుంచి 51 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన క్రైం సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. వెంకటాపురం ప్రాంతానికి చెందిన పల్లూరి జనార్దన్ (34) భవన నిర్మాణ మేస్త్రీగా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న జనార్దన్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడని..దీంతో మనస్తాపానికి లోనై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో పోలీసు వాహనంపై మహిళ దాడి



పగిలిపోయిన అద్దం

రాంగోపాల్‌పేట్: మద్యం మత్తులో ఓ మహిళ పోలీస్ స్టేషన్‌కు వచ్చి హంగామా చేయడమేగాక పోలీసు వాహనంపై రాయితో దాడి చేసిన సంఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం మద్యం మత్తులో స్టేషన్‌కు వచ్చిన ఓ జంట ఫిర్యాదు తీసుకోవాలని పోలీసులను కోరారు. అయితే వారు మద్యం మత్తులో దురుసుగా మాట్లాడుతుండటంతో పోలీసులు వారిని బయటికి పంపారు. దీంతో సదరు మహిళ మా ఫిర్యాదునే తీసుకోవా.? అంటూ పోలీసులపై తిరగబడింది. అంతటితో ఆగకుండా స్టేషన్ ప్రాంగణంలో ఉన్న పోలీసు వాహనంపై రాయితో దాడి చేసి అద్దాలు పగులగొట్టింది. స్టేషన్ లోపలికి వెళ్లి ఉన్నతాధికారులపై కూడా దాడికి యత్నించడంతో ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బాలానగర్: కిరాణా షాప్‌లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి నుంచి 13.75 కేజీల చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ ఏసీపీ హనుమంతరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన సునీల్ కుమార్ జగదిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని రింగు బస్తీలో నివాసం ఉంటూ అదే ప్రాంతంలో కిరాణాదుకాణం నిర్వహిస్తున్నాడు. షాప్‌లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు అతడి దుకాణంపై దాడి చేశారు. ఈ సందర్భంగా 13.75కేజీల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. బీహార్‌కు చెందిన వ్యక్తి నుంచి సునీల్ వాటిని కొనుగోలు చేస్తున్నట్లుగా గుర్తించిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ధ్యాన మహా యాగానికి భారీ ఏర్పాట్లు

- 21న ప్రారంభం కానున్న ధ్యాన మహా సభలు
- 12 ఏళ్లుగా 11 రోజుల పాటు నిర్వహణ
- తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి ధ్యానుల రాక

కడ్తాల్: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ చేపట్టే పత్రీజీ ధ్యాన మహాయాగ వేడుకలకు మహేశ్వర మహా పిరమిడ్ ముస్తాబయ్యింది. ఈ నెల 21న ప్రారంభమయ్యే ఈ వేడుకలు డిసెంబర్ 31 వరకు 11 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ ధ్యాన మహాయాగానికి ది హైదరాబాద్ స్పిరుచ్యువల్ సొసైటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ధ్యానులకు వసతి గృహాలు, కుటీరాలు

12 ఏళ్లుగా డిసెంబర్ నెలలో వివిధ ప్రాంతాల నుంచి ధ్యానులు అంతా ఇక్కడికి తరలి వచ్చి ధ్యాన మహాచక్రాలు, ధ్యాన మహాయాగంలో పాల్గొంటారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి వచ్చే వేలాది మంది ధ్యానుల మధ్య పత్రీజీ ధ్యాన మహాయాగాలను వైభవంగా నిర్వహించేందుకు ది పిరమిడ్ ట్రస్ట్ స్పిరుచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టింది. ధ్యానులకు ప్రత్యేక వసతి, ఉచిత భోజన సదుపాయాలు కల్పించనున్నా రు. ఉచిత అన్నదాన కేంద్రం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం శాశ్వత గదులతో పాటు, తాత్కాలిక వసతి గృహాలు, కుటీరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి రోజు ధ్యానం చేసేందుకు వీలుగా భారీ సభా ప్రాంగణం, ప్రత్యేక అలంకరణతో పెద్ద వేదిక ఏర్పాటు చేశారు. పత్రీజీ ధ్యాన మహాయాగంలో భాగంగా ప్రతి రోజు పత్రీజీ వీడియో సందేశం, ప్రముఖ ధ్యాన గురువులు, ఆధ్యాత్మిక వేత్తల, పిరమిడ్ మాస్టర్ల ఆధ్యాత్మిక సందేశాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



మహేశ్వర మహాపిరమిడ్



ధ్యాన సభా వేదిక ప్రాంగణం



కార్యక్రమ వివరాలు

- ఉదయం 5గంటల నుంచి 8.30గంటల వరకు పత్రీజీ వీడియో సందేశాలు, సామూహిక వేణుగాణ ధ్యానం, అఖండ ధ్యానం
- ఉదయం 10గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ధ్యాన గురువుల సందేశాలు, గురుసమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, సంగీత ధ్యానం

అడ్రస్‌లేని ఆస్పత్రికి శంకుస్థాపన!

భూమి కేటాయించకుండానే శిలాఫలకాలు

- తుక్కుగూడ, ఆర్సీఐ, బడంగ్‌పేట్‌లలో వింత పరిస్థితి
- ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఏదైన భవనం నిర్మించాలంటే ముందు నిర్దేశిత ప్రాంతంలో అవసరమైన విస్తీర్ణంలో భూమిని ఎంపిక చేస్తాం. ఆ తర్వాత ఓ శుభముహూర్తం చూసుకుని శంకుస్థాపన చేస్తాం. కానీ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు భూమిని ఎంపిక చేసి, కేటాయింపులు జరపకుండానే సాక్షాత్తు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలకు తోడు.. ప్రజాప్రతినిధుల తొందర పాటు చర్యల వల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తలపట్టుకోవాల్సిన దుస్థితి తలెత్తింది.

అన్నింటికీ ఒకే చోట శిలాఫలకాలు

మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌సీఐ రోడ్డు సహా బడంగ్‌పేట్, తుక్కుగూడలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో భవనానికి రూ.1.43 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. ఆయా ఆస్పత్రి భవనాలకు అవసరమైన భూమిని మాత్రం నేటికీ ఎంపిక చేయలేదు. ప్రజాపాలన ఏడాది ఉత్సవాల్లో భాగంగా నవంబర్ 30న ఆయా భవనాలకు ఏకంగా శంకుస్థాపనలు చేయడం విశేషం. తుక్కుగూడలో ఓ రోడ్డుకు శంకుస్థాపన చేసిన చోటే.. ఆయా ఆస్పత్రి భవనాలకు సంబంధించిన శిలాఫలకాలను ఏర్పాటు శంకుస్థాపనలు చేయడం చర్చనీయాంశంగా మారింది. నిజానికి ఆరోగ్య కేంద్రం మంజూరు చేసిన వెంటనే అనువైన భూమిని ఎంపిక చేయాలి. కానీ ఇవేవీ చేయకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఏకంగా శిలాఫలకాలు ఏర్పాటు చేసి, వాటికి శంకుస్థాపనలు చేయడం వివాదాస్పదంగా మారింది.



ప్రజాపాలన ఉత్సవాల్లో ఆవిష్కరించిన శిలాఫలకం(ఫైల్)

ఆ ఆంతర్యం ఏమిటో..?

భూమిని కేటాయించకుండా ఆగమేఘాల మీద శిలాఫలకాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే విమర్శలు లేకపోలేదు. ఆ తర్వాత ఆయా శిలఫలకాలను అక్కడి నుంచి మున్సిపల్ ఆఫీసులకు తరలించడం విశేషం. ఇప్పటికే శంకుస్థాపనలు చేసిన భవనాలకు, రోడ్లకే దిక్కు లేదు. నిధుల లేమి సహా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఆయా నిర్మాణాలు నేటికీ ప్రారంభం కాలేదు. దీనికి తోడు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు అటు వైపు వెళ్లేవారిని వెక్కిరిస్తున్నట్లుగా ఉన్నాయి. కేవలం నియోజకవర్గంలోని ఒకరిద్దరి రాజకీయ ఆధిపత్యం, లబ్ధి కోసమే ఇలాంటి అవగాహన లేని చర్యలు చేపడుతున్నట్లు స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఇలాంటి చర్యలను నియంత్రించాల్సిన జిల్లా అధికారులు సైతం ఏమీ చేయలేక మిన్నకుండిపోతున్నారు. ప్రజాప్రతినిధుల తొందరపాటు చర్యల వల్ల ప్రజల్లో తాము అభాసుపాలు కావాల్సి వస్తుందని ఆయా విభాగాల అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న 'స్వచ్ఛ భారత్' థీమ్




స్వచ్ఛ భారత్ థీమ్‌పై అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునంబర్–45లోని భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో గురువారం నిర్వహించిన 'నో బ్యాగ్ డే'లో భాగంగా 'స్వచ్ఛ భారత్' థీమ్‌పై విద్యార్థులు విలువైన సందేశాన్ని అందించారు. 'సేవ్ వాటర్' అంశంపై తమ సృజనకు పదునుపెట్టి పోస్టర్లు రూపొందించి ప్రదర్శించారు. అలాగే పరిశుభ్రతపై పాఠశాల ప్రాంగణంలో ర్యాలీలు తీసి అవగాహన కల్పించారు. టాటా కంపెనీకి చెందిన ఊర్మిళ హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. అలాగే 'టాటా సోల్‌ఫుట్ రాగి బైట్స్' పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా చందన, సుమ మార్గదర్శకత్వంలో విద్యార్థులు తయారు చేసిన బ్యాగులు ఆకట్టుకున్నాయి.

అక్రమ పార్కింగ్‌లపై ట్రాఫిక్ పోలీసుల కొరడా



డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ హరిప్రసాద్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునంబర్–12లోని కమాన్ నుంచి మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఇంటి మీదుగా ఎన్‌బీటీనగర్ పోచమ్మ గుడి, సర్కార్ బడి, హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్ వరకు రోడ్డుకిరువైపులా అక్రమ పార్కింగ్‌లపై గురువారం ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ పర్యవేక్షణలో బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ సాయిప్రసాద్ గౌడ్, సిబ్బంది క్రేన్లతో వాహనాలను తొలగించి యజమానులకు జరిమానా విధించారు. 2 గంటల పాటు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో అక్రమ పార్కింగ్ దారులకు కౌన్సెలింగ్ ఇవ్వడమే కాకుండా జరిమానాలు విధించి చాలా ఏళ్లుగా పార్క్ చేసిన వాహనాలను వారు తీసుకెళ్లారు.

ఐటీఎంలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

పంజగుట్ట: ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఐటీఎం) యూనివర్సిటీలో 2025–26 సంవత్సరానికి గాను అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఎం సౌత్ ఇండియా అడ్మిషన్స్ డైరెక్టర్ రవిశర్మ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అడ్మిషన్ల కరపత్రాన్ని ప్రతినిధులు జ్యోతి కృష్ణమూర్తి, ఆశిష్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఉన్న తమ విశాలమైన యూనివర్సిటీలో ఇంజినీరింగ్, నర్సింగ్, అగ్రికల్చర్, ఫాం బీ, ఫాంసీ, హార్టికల్చర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంజినీరింగ్‌కు ఇంటర్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులు అయిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9988816777 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సౌత్ ఇండియాలో తమ యూనివర్సిటీ స్మార్ట్ చాయిస్ ఎడ్యుకేషన్ సర్వీసెస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.



అడ్మిషన్ల కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మత్స్య సహకార సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించాలి

పంజగుట్ట: మత్స్య సహకార సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ఆ సంఘం నాయకులు కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు బూస మల్లేశం, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మన్నె రాజు మాట్లాడారు. ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 33 జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీలు ఉండగా అందులో 12 జిల్లాల్లో మాత్రమే ఎన్నికలు నిర్వహించారన్నారు. దీంతో హైకోర్టును ఆశ్రయించడంతో 4 వారాల్లో మిగితా వాటికి కూడా ఎన్నికలు నిర్వహించాలని ఈ నెల 11న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చి వారం గడుస్తున్నా సంబంధిత అధికారుల నుంచి మాత్రం స్పందన లేకపోవడం బాధకరమన్నారు. అలాగే చేప పిల్లల పంపిణీలో ఎన్నో లొసుగులు ఉన్నాయని రైతు బంధు మాదిరిగానే మత్స్యబంధు పేరిట నగదు ఇస్తే తామే చేపపిల్లలు కొనుగోలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 400 మంది మత్స్యకారులు ప్రమాదవశాత్తు మృతి చెందారని వారి కుటుంబాలకు రూ. 16 కోట్ల పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపా ల్, పుట్ట బాలరాజ్, సోమయ్య, రమేశ్, నరసయ్య, రఘు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



బంజారాహిల్స్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నమోదు చేయడాన్ని నిరసిస్తూ బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు గురువారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యుత్ శాఖ ఇంజినీర్లు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని దుర్గా భవానీ నగర్ బస్తీలో గల బాప్టిస్ట్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పాస్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు డాక్టర్ రెవరెండ్ జఫన్య ముఖ్య అతిథిగా హాజరై క్రీస్తు సందేశం ఇచ్చారు. అనంతరం నిర్వహించిన నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాస్టర్లు జీవన్, రాయల్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్–11లోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. క్రిస్మస్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు క్రీస్తు నాటిక వేయడంతో పాటు శాంతా క్లాజ్ రూపంలో ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ మాచుపల్లి శేఖర్, ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ జెన్‌కో జీటీఎస్ కాలనీ గ్రౌండ్‌లో..

వెంగళరావునగర్: డివిజన్ పరిధిలోని టీఎస్ జెన్‌కో జీటీఎస్ కాలనీ గ్రౌండ్‌లో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏడీఈ అమృత, డీఈ హనుమంతరావు, ఏడీఈ హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ప్రముఖ దైవ సేవకుడు పాస్టర్ ఉపేందర్ హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు పవర్ ప్రేయర్ క్వయర్ బృందం ఆలపించిన ప్రత్యేక గీతాలు ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ మెట్రో జోన్ చీఫ్ ఇంజినీర్ చిరంజీవులు, రూరల్ జోన్ చీఫ్ ఇంజినీర్ లతా వినోద్, సీటీఐ చీఫ్ ఇంజినీర్ మురళీసాగర్, డీఈ మధుకర్, శ్రీనివాస్, జాన్ తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ జోసెఫ్ స్కూల్లో విద్యార్థులు..

సర్కార్ బడికి మహర్దశ!

- జీజేఆర్‌నగర్ బస్తీలో భవనం నిర్మాణం
- రూ.31 లక్షల నిధులు మంజూరు
- మూడు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం
- తీరనున్న ఏళ్లనాటి సమస్య



భూమిలోకి కుంగిన బీజేఆర్‌నగర్ స్కూల్ భవనం



కొత్తగా నిర్మించనున్న భవన నిర్మాణ ప్రాంతం

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీ ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ పట్టనున్నది. శిథిలావస్థకు చేరిన పాఠశాలపై కొన్ని నెలలుగా పత్రికలో పలు కథనాలు 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి కూతవేటు దూరంలోనే భూమిలోకి కుంగిన సర్కార్ బడి' శీర్షికన 'సాక్షి' పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో విద్యాశాఖ అధికారులు స్పందించారు. నూతన పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడమే కాకుండా టెండర్ ప్రక్రియను సైతం పూర్తి చేశారు. 2002 లో ఈ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం నిర్మాణమైంది. బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. కాగా భవనం రోజురోజుకు శిథిలమై భూమిలోకి కుంగిపోయింది. వర్షం వస్తే తరగతి గది వరదతో నిండిపోయేది. 2021లో వచ్చిన భారీ వరదలకు భవనం మొత్తం భూమిలోకి కుంగిపోయింది. దీంతో విద్యార్థుల చదువులు ఆగమయ్యాయి. కొందరు పక్కనే ఉన్న మహాత్మాగాంధీ బస్తీ పాఠశాలకు వెళ్లారు. మరికొంతమంది ప్రైవేట్‌లో చేరగా ఇంకొంతమంది చదువులకే దూరమయ్యాయి. ఈ వైనాన్ని పత్రికలు సైతం వెలుగులోకి తీసుకువచ్చాయి. దీంతో అధికారులు ఎట్టకేలకు శిథిలావస్థకు చేరిన భవనాన్ని మూడు రోజుల క్రితం నేలమట్టం చేశారు. 250 గజాల విస్తీర్ణంలో నూతన పాఠశాల భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మూడు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భూమికి నాలుగడుగుల ఎత్తులో భవన నిర్మాణం చేపట్టనున్నారు. ఒకే అంతస్తులో ఆరు తరగతి గదులు ఉండేలా ప్రతిపాదనలు రూపొందించారు. ఇది అందుబాటులోకి వస్తే స్థానిక విద్యార్థులు చదువులకు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుంది.

వ్యక్తి అదృశ్యం

వెంగళరావునగర్ : ఆర్థిక సమస్యలు తాళలేక వ్యక్తి అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌నగర్‌కు చెందిన ఎస్.రాజ్‌కుమార్ ఎస్ఏపీ కన్సల్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 17న ఓ వ్యక్తిని కలిసేందుకు వెళ్తున్నానని తల్లికి చెప్పి బయలుదేరాడు. మధ్యాహ్నం వరకు భార్యతో ఫోన్లో మాట్లాడాడు. సాయంత్రం పిల్లలు, తల్లిని జాగ్రత్తగా చూసుకోవాలని భార్యకు మెసేజ్ పంపాడు. దీంతో భార్య వెంటనే ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. 6 నెలలుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని నెలరోజులుగా ఇంటి అద్దె కూడా చెల్లించకపోవడంతో ఇంటి యజమాని బెదిరిస్తున్నాడని, అది భరించలేకే తన భర్త కనిపించకుండా పోయాడని రాజ్‌కుమార్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో పోలీసు వాహనానికి ఢీ

బంజారాహిల్స్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆగి ఉన్న పోలీసు వాహనాన్ని కారుతో ఢీకొట్టిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ కే వెంకటేశ్వర రెడ్డి, కానిస్టేబుల్ వీ ప్రవీణ్‌కుమార్, హోంగార్డు కే చాణక్యతో కలిసి బుధవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఓ కేసు విచారణ కోసం జూబ్లీహిల్స్ రోడ్డునంబర్–10లోని వెంకటగిరి హైలాంకాలనీ వద్ద షాలా కిచెన్ వద్ద తమ వెహికల్‌ను ఆపారు. అదే సమయంలో టీఎస్ 09 ఎఫ్‌జే 1134 కారులో చావా శ్రీధర్‌రెడ్డి మద్యం మత్తులో వచ్చి పోలీసు వాహనాన్ని ఢీకొట్టాడు. అయితే ఆ సమయంలో పోలీసులంతా అప్పటికే దిగిపోగా వాహనం ముందుభాగం దెబ్బతిన్నది. కారు నడుపుతున్న శ్రీధర్‌రెడ్డికి డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేయగా బీఏసీ 220 గా తేలింది. దీంతో పోలీసులు శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

జాతీయ రిపబ్లిక్ డే వేడుకలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

పంజగుట్ట: ఢిల్లీలో జరగనున్న జాతీయ రిపబ్లిక్ డే వేడుకల పరేడ్‌కు ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి ఇద్దరు ఎన్‌సీసీ విద్యార్థులు ఎంపికయ్యారు. డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న హెచ్.విష్ణువర్ధన్, ఎస్.మహేశ్ ఎంపిక కాగా గురువారం కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్ర కుమార్, సిబ్బంది వారిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ రెడ్డి, కాలేజీ ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస్, వాణిజ్య విభాగాధిపతి డాక్టర్ ప్రభాకర్, గజేంద్ర బాబు, శ్రీనివాస్, విద్యాసాగర్, మల్లేశ్ పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై నిరసన చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులు

రహమత్‌నగర్ : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం ట్యాంక్ బండ్ వద్ద కాంగ్రెస్ చేపట్టిన నిరసన కార్యక్రమంలో రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షాకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నాయకులు వీహెచ్. నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఫెరోజ్ ఖాన్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు



శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..



శ్రీవేణుగోపాలస్వామికి అలంకరణ..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునంబర్–14లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం శ్రీ గోదా రంగనాథ స్వామిగా ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం ధనుర్మాస వ్రత దీక్షలు జరిగాయి. తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు అద్దంకి శశికాంతాచార్యులు నేతృత్వంలో ధనుర్మాస పూజలు నిర్వహించారు.

విశ్వసాయి మందిరంలో..

బంజారాహిల్స్ రోడ్డునంబర్–12లోని విశ్వసాయి మందిరంలోని శ్రీవేణుగోపాలస్వామి సన్నిధిలో ఉదయం తిరుమంజన సేవ, చామంతి తులసీ పుష్పార్చనను నిర్వహించారు. ప్రధాన అర్చకుడు యలమంచిలి దేవేశ్ పవన్‌తేజ నేతృత్వంలో పూజలు జరిగాయి.

సిగరెట్ ప్యాకెట్లు స్వాధీనం

వెంగళరావునగర్ : నిబంధనలకు విరుద్ధంగా బంక్‌లో సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. వెంగళరావునగర్ నివాసి బి. వినోద్‌కుమార్ కొంతకాలంగా వెంగళరావునగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో బంక్ నడిపిస్తున్నాడు. స్కూల్‌కు అతి సమీపంలో ఉన్న ఈ బంక్‌లో నిబంధనలకు విరుద్ధంగా సిగరెట్లు విక్రయిస్తున్నాడు. ఈ విషయమై పలువురు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు గురువారం బంక్‌కు వెళ్లి తనిఖీలు చేసి పెద్ద సంఖ్యలో సిగరెట్లను స్వాధీనం చేసుకుని వినోద్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలి'



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపడుతున్న బీఎస్పీ శ్రేణులు

బంజారాహిల్స్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కార్యాలయం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు గురువారం భారీ ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, రాష్ట్ర కో–ఆర్డినేటర్లు ఇబ్రమ్, శేఖర్, ఈశ్వర్, ఉపాధ్యక్షుడు శ్రీరామ్‌కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి శేఖర్, సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జి దొరపల్లి రమేశ్, జిల్లా అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి మాల మహానాడు నాయకులు

రహమత్‌నగర్ : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ గురువారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడికి రహమత్‌నగర్ డివిజన్ నుంచి మాల మహానాడు నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొనెల రమేశ్ మాల సంఘం నాయకులతో కలిసి పాల్గొన్నారు. వీరిని అఫ్జల్‌గంజ్ పోలీసులు అదుపులోకి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీరణ పేరుతో ప్రభుత్వాలు మాల కులస్తులకు తీరని అన్యాయం చేస్తున్నాయని వాపోయారు. రాష్ట నాయకులు దుబ్బాక నవీన్, సదానంద్, వల్లమల్ల శ్రీనివాస్, అగ్గి రవీందర్, మారుతి, రమేశ్ బాబు, అంజలి, ధన్‌రాజ్, బాలరాజ్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం

వెంగళరావునగర్ : యువతిని నమ్మించి నగదు తీసుకుని మోసం చేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు ప్రాంతానికి చెందిన పీ మణిదీప స్థానిక మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. 6 నెలల కిందట ఇన్‌స్టాగ్రాంలో సాయి అనే యువకుడు పరిచయం అయ్యాడు. స్నేహితుడిగా నమ్మించాడు. ఈనెల 4న తన ఫోన్ పాడైందని, మొబైల్ కొనేందుకు క్రెడిట్‌కార్డు వివరాలు అడిగాడు. దాంతో ఆమె ఈ నెల 6న మరొక స్నేహితుడైన సందీప్ క్రెడిట్‌కార్డు వివరాలు పంపింది. సాయి అదేరోజు ఫోన్ కొనుగోలు చేసి బిల్లును ఆమెకు పంపి, ఈనెల 11వ తేదీన డబ్బు తిరిగి చెల్లిస్తానని నమ్మించాడు. అయితే డబ్బు ఇవ్వకపోగా ఇన్‌స్టాగాం, ఫోన్ నంబర్లను బ్లాక్ చేశాడు. దీంతో ఆమె గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నగదు చోరీ

వెంగళరావునగర్ : ఆన్‌లైన్‌లో మహిళను మోసగించి నగదు కాజేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన ఎల్‌కే శ్రీదేవి ఈనెల 14న ఆన్‌లైన్‌లో గద్వాల్ కోర్టులో సొంత పని ఉండి వివరాల కోసం గూగుల్‌లో వెతికింది. రూ.25 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించింది. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు అడిగి రూ.80,088 తీసుకున్నాడు. అయితే ఫీజు కోసం రూ.1998 మాత్రమే తీసుకున్నట్లు చెప్పాడు. మరోసారి ఫోన్ చేసి ప్రాసెస్ ఫీజు చెల్లించమని అడిగాడు. దాంతో ఆమె కుమార్తె ముందుగా తీసుకున్న నగదు తిరిగి ఇవ్వాలని అడగ్గా వెంటనే నంబర్ బ్లాక్ చేశాడు. బాధితురాలు గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా మహా పడిపూజ



మహాపడి పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

ఫిలింనగర్: జ్ఞానిజైల్‌సింగ్‌నగర్ బస్తీ గురు రాఘవేంద్ర సన్నిధానంలో గురువారం అయ్యప్పమహాపడి పూజను కనుల పండువగా నిర్వహించారు. కేశవ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజలో దీక్షాపరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భజనలు, కీర్తనలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. కార్యక్రమంలో గుబ్బల అశోక్, రత్నారెడ్డి, ప్రసాద్ సాగర్, పాల నర్సింహ, కురువ శ్రీను, బీరప్ప పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



ట్రైసైకిల్‌ను అందజేస్తున్న హబీబా సుల్తానా

రహమత్‌నగర్ : నగర కాంగ్రెస్ నాయకురాలు బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబీ సుల్తానా ఓ దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందించి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బోరబండ డివిజన్ మధురానగర్ బస్తీకి చెందిన మిర్చిల రాజు కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ నడవలేకపోతున్నాడు. బస్తీవాసుల ద్వారా సమాచారం అందుకున్న హబీబా సుల్తానా బాధితుడిని గురువారం కార్పొరేటర్ కార్యాలయానికి పిలిచి ట్రైసైకిల్‌ను అందజేశారు. డివిజన్ కాంగ్రెస్ నాయకుడు కాసుల మహేశ్ కుమార్ గౌడ్, బస్తీ అధ్యక్షుడు చెట్టి దేవేందర్, ముత్యాల మహేశ్, వాజీద్, జావిద్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

వెంగళరావునగర్ : ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతికి చెందిన పీ ఆదినారాయణ స్థానిక ఎల్లారెడ్డిగూడలో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. గత నెల 20న ఎల్లారెడ్డిగూడలోని బంధువుల ఇంటి ఎదుట తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి ఇంటి యజమాని నిఖిల్‌కు చెప్పి తిరుపతి వెళ్లాడు. ఈనెల 12న నిఖిల్ అతనికి ఫోన్ చేసి ద్విచక్ర వాహనం కనిపించడం లేదని చెప్పాడు. తిరిగి నగరానికి వచ్చిన ఆదినారాయణ చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. దీంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు (1) శ్రీ రితమ్ అగర్వాల్ తండ్రి శ్రీ రాజేష్ కుమార్ అగర్వాల్ మరియు (2) శ్రీమతి సాక్షి అగర్వాల్ భర్త శ్రీ అక్షయ్ అగర్వాల్, ఇరువురు హైదరాబాద్ నివాసులు రంగారెడ్డి జిల్లా, గోల్కొండ రెవెన్యూ మండలం, హైదరాబాద్, షేక్‌పేట్ గ్రామంలోని సర్వే నం.లు118 మరియు 119, బంజారాహిల్స్, రోడ్ నం.10లో గల మొత్తం 408 చ.గజాల విస్తీర్ణం భూమిపై గ్రౌండ్+2 అప్పర్ ఫ్లోర్స్ ఇంటి నం.8-2-596/6 ఇంటిగల నివాస భవనాన్ని లేటు శ్రీమతి ఖాదరున్నీసా బేగం భర్త శ్రీ ఒమర్ బిన్ అబ్దుల్ అజీజ్ యొక్క న్యాయ వారసులు మరియు ప్రస్తుత చట్టబద్ధ యజమానులు-(1) శ్రీమతి మరియం బేగం, (2) శ్రీమతి మైమూనా బేగం, (3) శ్రీమతి మునీరా బేగం, (4) శ్రీ మసద్ ఫరూఖ్ మరియు (5) శ్రీ అబ్దుల్ అజీజ్ నుండి కొనుగోలు చేయుటకు ప్రతిపాదిస్తున్నారని ఇందు మూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. పై సదరు ఆస్తిపై ఎవరైనా వ్యక్తి/వ్యక్తులకు ఏదైనా హక్కు, టైటిల్, ప్రయోజనం, క్లెయిమ్ లేదా అభ్యంతరం ఉన్నట్లయితే ఈ నోటీసు ప్రచురణ నుండి 7 (ఏడు) రోజులలోగా దిగువ సంతకందారుకు తమ డాక్యుమెంట్ల కాపీలతోపాటు వాటి వివరాలు దాఖలు చేయవలసిందిగా ఇందుమూలంగా వారిని కోరడమైనది. ఏ విధమైన సపోర్టింగ్ డాక్యుమెంట్/ డాక్యుమెంట్లు లేకుండా పంపిన ఎట్టి క్లెయిమ్ లేదా అభ్యంతరం పరిశీలించబడదు. నిర్ణీత కాలంలో ఏదైనా క్లెయిమ్ లేదా అభ్యంతరం అందనట్లయితే, నా క్లయింట్లు సదరు వ్యవహారంతో ముందుకు సాగుతారు మరియు పై ఆస్తిపై ఎట్టి క్లెయిమ్‌లు లేనట్లు భావిస్తూ వ్యవహారాన్ని పూర్తి చేస్తారు. తరువాత తెలిపే అభ్యంతరాలు పరిశీలించబడవు.

T.R. కృష్ణ, అడ్వకేట్
ఇం.నం. 2-3-622, ఫ్లాట్ నం.73, రోడ్ నం.1, సాయినగర్ కాలనీ, నాగోల్, హైదరాబాద్ -500068, మొబైల్ నం. 7337750941
హైదరాబాద్
20-12-2024

నిలోఫర్‌లో 13 మల్టీ పారామీటర్ మానిటర్ల ప్రారంభం



మల్టీ పారామీటర్ మానిటర్లను ప్రారంభిస్తున్న డాక్టర్ రవికుమార్

నాంపల్లి: నవజాత శిశువులను పర్యవేక్షించడంలో సహాయపడటానికి నిలోఫర్ ఆసుపత్రిలో 13 మల్టీ పారామీటర్ మానిటర్లను సమకూర్చారు. ఈ మానిటర్లు యుఎస్‌ఏ–ఆధారిత సంస్థయైన స్పేస్ ల్యాబ్స్ అందజేసింది. వీటిని రాజీవ్ ఇంటెన్సివ్ కేర్ బ్లాక్ మూడో అంతస్తులోని ఐసీయూ బ్లాక్‌లో అమర్చారు. ఈ మేరకు గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.రవికుమార్ ప్రారంభించారు. రానున్న రెండు రోజుల్లో మరో ఏడు మానిటర్లను ఏర్పాటు చేయనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోనటాల్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ ఎల్.స్వప్న, డాక్టర్ సౌమ్య, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పావని తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించొద్దు

జేఏసీ చైర్మన్ సాయిబాబా



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే ఊరుకోబోమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) చైర్మన్ సాయిబాబా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జాతీయ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజినీర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం జేఏసీ ఆధ్వర్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఉత్తరప్రదేశ్, చండీగఢ్ రాష్ట్రాల విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించేందుకు కేంద్రం పావులు కదుపుతోందని, ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. లేదంటే దేశవ్యాప్తంగా పెద్దెత్తున ఆందోళనలు చేపట్టడానికి కూడా వెనుకాడబోమని జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వజీర్, ఈశ్వర్ గౌడ్, నెహ్రూ, నాగతుల సిరాజీ, సదానందం, శ్రీనివాసరెడ్డి, జనప్రియ, వేణు, వరప్రసాద్, బాలకృష్ణ విద్యాసాగర్, సుధీర్, కిరణ్, బుచ్చయ్య, కైలాస్, అశోక్, కిషోర్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వెటర్నరీ సింపోజియమ్

ఏజీవర్సిటీ: పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఇక్కడ సాగుతున్న 33వ నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ వెటర్నరీ పరసీటాలజీ సింపోజియమ్ బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జగదీశ్వర్ రావు, పౌల్ట్రీ పరిశోధనా కేంద్రం సంచాలకులు డాక్టర్ ఆర్ఎన్ చటర్జీ పలు అంశాలపై మాట్లాడారు. పరాన్నజీవులపై జరుగుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలతో విద్యార్థులు, శాస్త్రవేత్తల ఆలోచనా ధోరణి మెరుగుపడుతుందన్నారు. పరాన్నజీవుల నిర్మూలన ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందని పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన అధ్యాపకులకు, శాస్త్రవేత్తలకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హరికృష్ణ, ఎం కిషన్ కుమార్, ఉదయ్‌కుమార్, మాదురి డాక్టర్ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణుల నిరసన



రోడ్డుపై పడుకొని నిరసన వ్యక్తం చేస్తున్న హనుమంతరావు, కాంగ్రెస్ కార్యకర్తలు

కవాడిగూడ: పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశాయి. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, బేషరతుగా ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫిరోజ్‌ఖాన్ తదితరులతోపాటు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, అంబేద్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి దూసుకువచ్చి బైఠాయించారు. రోడ్డుపైనే పడుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమిత్ షాకు, బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చి మనువాద ఎజెండాను అమలు చేయాలని చూస్తోందని ఆరోపించారు.

చుక్క చుక్కకో లెక్క!

రిజర్వాయర్లకు నీటి మీటర్ల ఏర్పాటు

తరలింపు...

సరఫరాపై నిఘా

డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షణ



జలాశయాల నుంచి వచ్చే తాగునీటికి లెక్క కట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. నీటి తరలింపు, సరఫరాలో అక్రమాలకు అడ్డుకట్ట వేయనున్నారు. ప్రాంతాలవారీగా హెచ్చుతగ్గుల నీటి సరఫరాకు చెక్ పెట్టనున్నారు. డిస్ట్రిబ్యూషన్ రిజర్వాయర్ల వద్ద మీటర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. నాగార్జునసాగర్ నుంచి మూడుదశల్లో కృష్ణా జలాలు, శ్రీపాద ఎల్లంపలి ప్రాజెక్టు నుంచి గోదావరి–మొదటి దశ జలాలు, మరోవైపు సింగూరు, మంజీరాతోపాటు జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌ల నుంచి తాగునీటిని హైదరాబాద్ మహానగరానికి తరలిస్తున్న విషయం తెలిసిందే. నగరంలోని వివిధ ప్రాంతాలకు నీటి సరఫరాలో డిస్ట్రిబ్యూషన్ రిజర్వాయర్లు కీలకంగా మారాయి. చివరిదశలో రిజర్వాయర్లలో శుద్ధి అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాలకు నీరు సరఫరా అవుతోంది. –సాక్షి, సిటీబ్యూరో



నీటి సరఫరాపై మానిటరింగ్

“క్షేత్రస్థాయి తాగునీటి సరఫరా వ్యవస్థపై పూర్తిస్థాయి లెక్కల కోసం మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. రిజర్వాయర్ల నిల్వల తోపాటు లైన్లవారీగా సరఫరా వివరాలు తెలుసుకునేందుకు ఆన్‌లైన్ డాటాతో డ్యాష్‌బోర్డుకు అనుసంధానం చేస్తున్నాం. దీంతో ఎప్పటికప్పుడు నీటి సరఫరాను పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుంది.”
–అశోక్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, జలమండలి

రిజర్వాయర్ల నిల్వపై...

డిస్ట్రిబ్యూషన్ రిజర్వాయర్లలోని నీటినిల్వలు ఎప్పటికప్పుడు నమోదయ్యే విధంగా సరికొత్త మీటర్లను ఏర్పాటు చేసేందుకు జలమండలి అధికారులు చర్యలు చేపట్టారు. ప్రధాన జలాశయాల నుంచి డిస్ట్రిబ్యూషన్ రిజర్వాయర్‌లోకి వచ్చే నీటితోపాటు నిల్వల వివరాలన్నీ మీటర్లలో నమోదు కానున్నాయి. అక్కడి నుంచి నీటి సరఫరా చేసే క్రమంలో ఏ ప్రాంతాలకు ఎంత నీరు వెళుతుందనే వివరాలు కూడా నమోదయ్యే విధంగా చర్యల చేపట్టారు.

ఆన్‌లైన్‌లో నమోదు

ప్రధానంగా మహానగరంలో ఏ సమయానికి ఏ జలాశయంలో ఎన్ని నీళ్లున్నాయి? ఏ ప్రాంతాలకు ఎంత సరఫరా అవుతున్నాయనే వివరాలు కూడా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ అవుతుంటాయి. లైన్లవారీగా నీటి సరఫరా వివరాలు కూడా నమోదయ్యే విధంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి మీటర్లకు అనుసంధానం చేస్తున్నారు.

డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షణ

రిజర్వాయర్ల నుంచి ప్రాంతాలవారీగా సరఫరా అవుతున్న నీటి వివరాలను ఎప్పటికప్పుడు డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షించనున్నారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయం నుంచి మానిటరింగ్ చేసేవిధంగా ప్రత్యేక యాప్, అప్లికేషన్‌ను కూడా అధికారులు రూపొందిస్తున్నారు. ఇక నుంచి కొన్ని ప్రాంతాలకు తక్కువ నీటి సరఫరా, మరి కొన్ని ప్రాంతాలకు ఎక్కువ నీటి సరఫరా లేకుండా అన్నింటికీ సమానంగా సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది. లైన్‌మెన్లు వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా చేసే క్రమంలో ఏ ప్రాంతానికి ఎంత నీరు వదులుతున్నారనే వివరాలు కూడా ఆన్‌లైన్‌లో నమోదు కానున్నాయి. మొత్తం మీద ఐదు ప్రధాన రిజర్వాయర్ల ద్వారా సేకరించిన జలాలను శుద్ధి చేసి రోజువారీగా సుమారు 559.81 ఎంజీడీలను సరఫరా చేస్తున్నట్లు జలమండలి వర్గాలు పేర్కొంటున్నాయి.



నీటి సరఫరా ఇలా....

ఏరియా	ఎంజీడీలు
కోర్ సిటీ	231.14
శివారు ప్రాంతాలు	234.50
ఆర్ఆర్ఆర్	60.61
మిషన్ భగీరథ	32.56

నగరంలో నేడు

- హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంది. అక్కడే సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి.
- ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కేన్సర్ పరీక్ష వైద్య శిబిరం ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్ర ఫిష్ మార్కెట్ భవనంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళామేళా ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

'పది'లో శత శాతమే లక్ష్యం

– కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల–2ను సందర్శించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సనత్‌నగర్: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కష్టపడాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. 90 శాతం కంటే తక్కువ ఫలితాలు సాధించిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం సికింద్రాబాద్ మండలంలోని బేగంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల–2ను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని వాటర్ ట్యాంక్, పరిసరాలు, హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం మూడో తరగతి గదిని సందర్శించి పిల్లలతో పాఠాలను చదివించారు. పాఠాలు బాగా చదివిన వైష్ణవి, గౌతమ్, నవ్య అనే విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. మూడో తరగతి విద్యార్థులకు అనర్గళంగా చదవడం వచ్చేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసం, కృషి, పట్టుదల, సరైన ప్రణాళికతో పరీక్షలు రాసినప్పుడే మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. రాబోయే మూడు నెలలు పదో తరగతి విద్యార్థులకు కీలకమని, పండుగలు, పెళ్లిళ్లు, ఇతర కారణాలతో పాఠశాలకు గైర్హాజర్ కావద్దన్నారు. కార్యక్రమంలో డీఈఓ రోహిణి, ఈఈ షఫీమియా, డిప్యూటీ ఈఓ శ్రీధర్, డిప్యూటీ ఈఈ సంజీవ్, ప్రధానోపాధ్యాయులు యాదగిరి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ బిల్లు ఆమోదంపై సంబరాలు




చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో సంబరాలు నిర్వహిస్తున్న వీసీ సూర్యధనుంజయ్, అధ్యాపకులు, విద్యార్థులు

సుల్తాన్‌బజార్: తెలంగాణలో మహిళావిద్యను ప్రోత్సహించే విధంగా వీరనారి చాకలి ఐలమ్మ పేరిట మహిళా విశ్వవిద్యాలయం బిల్లును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టడం సంతోషకరమని వైస్ చాన్స్‌లర్ సూర్యధనుంజయ్ అన్నారు. అసెంబ్లీలో యూనివర్సిటీ బిల్లు ఆమోదం పొందడంపట్ల గురువారం కోఠిలోని మహిళా యూనివర్సిటీలో అధ్యాపకులు, విద్యార్థులు సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ప్రదర్శిస్తూ అభివాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ యూనివర్సిటీ బిల్లు ఆమోదం పొందడంతో తెలంగాణ విద్యార్థినులు, ఆడబిడ్డలు, తెలంగాణ సమాజం ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నారని పేర్కొన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి, కోర్సుల నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం విషయమై తనదైన శైలిలో ముందుకు నడిచే అవకాశం లభించిందని అన్నారు. 107 సంవత్సరాల ఈ విద్యాసంస్థ ప్రస్తుతం సంపూర్ణమైన విశ్వవిద్యాలయంగా మారిందని, దానిని అన్ని వర్సిటీల సరసన నిలిపే విధంగా కృషి చేస్తామన్నారు. యూనివర్సిటీకి మౌలిక సౌకర్యాలు, బడ్జెట్ కేటాయించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రత్యేక అధికారి సరస్వతమ్మ, ప్రొఫెసర్ సునీల, కృష్ణతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు ఆటోడ్రైవర్ల 'చలో అసెంబ్లీ'

తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ



సమావేశంలో ఐక్యతను చాటుతున్న తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ నేతలు

కాచిగూడ: ఆటోడ్రైవర్ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ శుక్రవారం(నేడు) వేలాదిమంది ఆటో కార్మికులతో అసెంబ్లీని ముట్టడిస్తున్నట్లు తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం (ఏఐటీయూసీ), జేఏసీ నేతలు వి.మారయ్య (బీఆర్‌టీయూ), ఎ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), ఎంఏ సలీం (యూటీఏడబ్ల్యూ), వి.ప్రవీణ్(టీయూసీఐ), సీహెచ్.జంగయ్య (ఏఐటీయూసీ), లక్ష్మణ్ (సీఐటీయూ) వెల్లడించారు. గురువారం నారాయణగూడలోని ఏఐటీయూసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరు నెలలుగా చర్చల పేరిట కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఆటో డ్రైవర్లకు ఇది జీవన్మరణ పోరాటమని, లాఠీలు, తూటాలు తగిలినా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి భారీ ప్రదర్శన నిర్వహించి అసెంబ్లీని ముట్టడిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు దానిని విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీతేజను పరామర్శించిన డైరెక్టర్ సుకుమార్

రాంగోపాల్‌పేట్: సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను సినీ డైరెక్టర్ సుకుమార్ గురువారం పరామర్శించారు. మధ్యాహ్నం ఆస్పత్రికి వచ్చిన ఆయన శ్రీతేజ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

బ్రాహ్మణ విద్యార్థుల స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న జగన్మోహన్‌శర్మ తదితరులు

నాగోలు: విదేశాల్లో విద్యను అభ్యసిస్తున్న బ్రాహ్మణ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు ఏడాదిగా నిలిచిపోయాయని, వెంటనే వాటిని విడుదల చేయాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య(టీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ అన్నారు. గందరగోళంగా ఉన్న బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని నియమించి దానిని కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కొత్తపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా బ్రాహ్మణుల సంక్షేమం కోసం పాటుపడుతున్న రాష్ట్రస్థాయి సంఘాల నుంచి ఒక్కరి చొప్పున పరిషత్ సభ్యులుగా నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవ తీసుకొని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మునిపల్లె శ్రీనివాస్, భాస్కరమూర్తి, నమిలికొండ కిరణ్ కుమార్, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు

8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలి

మజ్దూర్ యూనియన్ విజయోత్సవ ర్యాలీలో శివగోపాల్ మిశ్రా



అడ్డగుట్ట: ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు చేసే వరకు ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్) పోరాడుతుందని ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా అన్నారు. దేశ వ్యాప్తంగా జరిగిన ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఏఐఆర్ఎఫ్ 13 జోన్‌లలో గెలిచిన సందర్భంగా గురువారం సికింద్రాబాద్‌లోని యూనియన్ కేంద్ర కార్యాలయం నుంచి లేఖ భవన్, హైదరాబాద్ భవన్, రైల్ నిర్మాణ్ భవన్, సంచలాన్ భవన్‌ల మీదుగా రైల్ నిలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా శివ గోపాల్ మిశ్రా, రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావులు హాజరయ్యారు. శివగోపాల్ మిశ్రా మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని, వారికి మెరుగైన పదోన్నతులు దక్కేలా కృషి చేస్తామన్నారు. యూనైటెడ్ పెన్షన్ స్కీం లో మార్పులు చేసేవిధంగా కేంద్రంపై ఒత్తిడి చేస్తామని, పాత పెన్షన్ స్కీం మాదిరి అవకాశాలు వచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ జోనల్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ఏజీఎస్‌లు ఉదయభాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, బరాటే, రామకృష్ణ, జోనల్ కోశాధికారి సరోజనీరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధర్, డివిజనల్ సెక్రటరీలు పి. రవీందర్, కృష్ణ, సంజీవయ్య, బుచ్చిరెడ్డి, డివిజనల్ అధ్యక్షులు వరప్రసాద్, ఖాజబాబ, మంజులత, చిలుకస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాంబాబుతో మేలు కంటే నష్టమే ఎక్కువ

వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ (2873) అధ్యక్షుడు రాజిరెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: జలమండలి గుర్తింపు ఎన్నికల్లో వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆఫ్ తెలంగాణ(బీఆర్‌టీయూ) అధ్యక్షుడు రాంబాబును రెండుసార్లు గెలిపిస్తే కార్మికులకు మేలు కంటే నష్టం, ద్రోహం ఎక్కువగా జరిగిందని వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్(2873) అధ్యక్షుడు కె.రాజిరెడ్డి ఆరోపించారు. ఆయన కార్మికుల సమస్యలను గాలికి వదిలేసి సొంతంగా ఏజెన్సీలు ఏర్పాటు చేసుకొని లక్షలాది రూపాయలు దండుకున్నారని దుయ్యబట్టారు. గురువారం జలమండలి ఎంప్లాయీస్ యూనియన్, వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో డివిజన్ 3 వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ జనరల్ సెక్రెటరీ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. రెండు పర్యాయాలు కార్మికులను పట్టించుకోకుండా రాంబాబు మళ్లీ ఏ మొఖం పట్టుకొని ఎన్నికల రంగంలో దిగుతున్నారని ప్రశ్నించారు. జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సతీష్ కుమార్ మాట్లాడుతూ మాజీ ఎంపీ మధుయాష్కి నాయకత్వంలోని తమ ప్యానల్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. డివిజన్ 3 మీటింగ్‌కు భారీగా తరలివచ్చిన కార్మికులే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ 3 నాయకులు అశోక్, ఆంజనేయులు గౌడ్, మేవా జనరల్ సెక్రటరీ అక్తర్, ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ శేఖర్, జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ రాఘవేంద్ర రాజు, శ్రవణ్ కుమార్, రాజా, హషం, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, గౌస్ పాషా, అజయ్‌నాథ్ విశ్వనాథ్, దేవేందర్, శంకర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నప్పుడే ఉన్నత లక్ష్యాలు పెట్టుకోవాలి

సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చారుసిన్హా



జవహర్‌నగర్: విద్యార్థులు తమ బాల్యం నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చారుసిన్హా అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలలో ప్రిన్సిపాల్ డి.అపర్ణ ఆధ్వర్యంలో గురువారం పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా చారుసిన్హా మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నతస్థాయి ఎదిగి దేశ పరిపాలన విభాగాల్లో ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఐజీ అనిల్ మింజ్, వైస్ ప్రిన్సిపాల్ హరిశంకర్, ఆశాజీ కుమార్, నవనీతారాణి, సబీనా, చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్, భాస్కర్‌రెడ్డి, ఓం ప్రకాష్, శ్రీనివాస్, కమాండెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం
20, డిసెంబర్, 2024

స్కిన్‌టైట్ జీన్సులు, ట్యునీక్సూ, కుర్తీస్, నీలెంగ్త్ స్కర్టులు, పొట్టి నిక్కర్లూ.. లాంటి మోడ్రన్ ట్యూన్స్‌తో ఓ వైపు మమేకమైన నగర మహిళలు మరోవైపు ఇంకా పాత రాగంలో 'శారీ'గమ పాడేస్తోందంటే.. చీర కట్టు మహిమ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.. ఆధునిక కట్టుబాట్లు ఎలా ఉన్నా అప్పుడప్పుడూ సొగసిరి చీరకట్టి అన్న రీతిలో నగర మహిళలు తమ హుందాతనాన్ని ప్రదర్శిస్తున్నారు. డిసెంబర్ 21న శారీ దినోత్సవం నేపథ్యంలో దీనిపైనే ఈ కథనం..

– సాక్షి, సిటీబ్యూరో



స్కూల్ డేస్ నుంచే కడుతున్నా..

శారీ కట్టడం స్కూల్ డేస్ నుంచే అలవాటు. అందుకే చీరకట్టు నాకు చాలా కంఫర్ట్‌బుల్ అనిపిస్తుంది. ఒక యాంకర్‌గా రకరకాల ప్రోగ్రామ్స్ కోసం రకరకాలుగా రెడీ అవుతుంటాను. అన్ని రకాల స్టైల్స్ ధరించడం అవసరం కూడా. అయితే నా మనసు ఎప్పటికీ చీరమీదే ఉంటుంది. రకరకాల బ్లౌజ్‌లు, జ్యువెలరీస్ జత చేసి వెరైటీ స్టైల్స్‌లో డ్రేప్ చేసుకోవచ్చు..

– మంజూష, యాంకర్



మనసుదోచే.. సొగశారీ

ఆధునికులనూ ఆకట్టుకునేలా చీరకట్టు

- అంతకంతకూ పెరుగుతున్న ఆదరణ
- ట్రెండ్స్ మారుతున్నా.. మారని ట్రెడిషన్
- ఆకర్షణతోపాటు హుందాతనానికీ ప్రతీక
- రేపు ప్రపంచ చీరకట్టు దినోత్సవం

'చీర కట్టుకుంటే ఆ డిగ్నిటీయే వేరు. నెల కోసారన్నా.. వార్డ్‌రోబ్‌లో నుంచి శారీ తీయాల్సిందే' అంటోంది ఓ పీఆర్ కంపెనీలో పనిచేసే వాణి. సిటీలో విభిన్న వృత్తి ఉద్యోగాలు చేసే మహిళలు, యువతులు వృత్తి, బాధ్యతల కారణంగా రోజువారీ వినియోగం అంత సులభం కాకపోవడంతో 'చీరకట్టు' వీరికి మరింత అపురూపంగా మారిపోయింది. దీంతో సెలవు దినాల్లో, కుటుంబ వేడుకల్లో ఇలా వీలైనన్ని సందర్భాల్లో తప్పనిసరిగా ఎంచుకునే వస్త్రధారణగా మారింది. ప్రత్యేక సందర్భం వస్తే చీర కట్టాలి అనే రోజుల నుంచి చీరకట్టు కోసం సందర్భాన్ని సృష్టించుకునేంత ఆసక్తి నగరమహిళల్లో పెరిగిపోతోంది.

'కట్టు'తప్పుతోంది..

రోజుల తరబడి టాప్‌లూ, ట్రౌజర్లతో కాలక్షేపం చేస్తూ వచ్చి ఒక్కసారిగా చీర కట్టుకోవాలంటే ఇబ్బందే కదా. అందుకే చీరకట్టడంలో నేర్పరితనం ఉన్నవారి సేవల మీద నగర మహిళలు ఆధారపడుతున్నారు. 'ఫంక్షన్స్‌కి శారీ కాకుండా డ్రెస్సులతో వెళితే గిల్టీ ఫీలింగ్ వస్తోంది. అలాగని చీరకట్టాలని ప్రయత్నిస్తే సరిగా కుదరడం లేదు. అందుకే నేను అవసరమైనప్పుడల్లా చీరకట్టే వారిని పిలిపించుకుంటాను' అని జూబ్లీహిల్స్‌లో నివసించే ఉమ చెబుతున్నారు. ఈ 'కట్టు' ఇబ్బందుల నుంచి తప్పించుకోడానికి నిపుణులకు రూ.500 వరకూ చెల్లించడానికి పెద్దగా ఇబ్బంది పడడంలేదంటున్నారు ఆధునిక మహిళలు. 'ఇటీవల చీర కట్టుకోవాలని ఆసక్తి బాగా పెరిగింది. అయితే మోడ్రన్ డ్రెస్సుల్లా నిమిషాల మీద వేసుకుని వెళ్లిపోడానికి కుదిరేది కాదు కదా. అందుకే అమ్మాయిలు మాత్రమే కాదు పెద్ద వయసు మహిళలు కూడా చీర కట్టుకోవడానికి మా సహకారం కోరుతున్నారు. అవసరమైన వారికి మేం ఇంటికే వెళ్లి సేవలు అందిస్తున్నాం' అని చెబుతున్నారు శారీ డ్రేపర్‌గా రాణిస్తున్న సునీల.

విభిన్న శైలిలో..

చీరకట్టు విభిన్నరకాల శైలులు నగరంలో రాజ్యం ఏలుతున్నాయి. 'జయప్రద స్టైల్, నూపుర్ స్టైల్, తానిదార్ స్టైల్.. ఇలా దాదాపు 35 రకాల శారీడ్రేపింగ్ స్టైల్స్ అందుబాటులో ఉన్నాయి. నా దగ్గరకు వచ్చే వారిలో అత్యధికులు నూపుర్‌స్టైల్ అడుగుతారు' అని చెప్పారు శారీడ్రేపింగ్‌కు పేరొందిన సికింద్రాబాద్ వాసి జానీనులియా. నగరం విభిన్న సంస్కృతుల నిలయం కావడం, విభిన్న ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి వచ్చి నివసిస్తుండడం, ఈ కుటుంబాల మధ్య రాకపోకలు పెరగడంతో.. ఇతర ప్రాంతాల కట్టు బొట్టూ నేర్చుకోవాల్సి రావడం తప్పడం లేదు. ఆ క్రమంలోనే మార్వాడి, గుజరాతీ, బెంగాలీ.. తదితర చీరకట్టు శైలిని స్థానిక మహిళలు అనుసరిస్తుండడం సాధారణంగా మారింది. విభిన్న శైలులను అనుసరించాలనుకునేవారికి స్టైల్‌ను బట్టి రూ.500 నుంచి రూ.2000 వరకూ రుసుముతో సేవలు అందించే వారు సైతం పుట్టుకొచ్చేశారు.

హాఫ్‌శారీకే డిమాండ్..

ఎన్ని రకాలు వచ్చినా నగరంలో అత్యధికుల్ని ఆకర్షిస్తున్నది మాత్రం హాఫ్ 'శారీ'.. అంటే లంగా వోణి కాదు. లంగా వోణి లాంటి చీర అని అర్థం. అచ్చం హాఫ్‌శారీలా కనబడే శారీలు నగర మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వయసు తక్కువలా అనిపించేలా ఉండే వీటి పట్ల నగర మహిళలు ఆదరణ చూపుతున్నారని కలర్జ్ బ్యూటీ స్టూడియో నిర్వాహకురాలు శ్రావణీరెడ్డి చెప్పారు. అలాగే ధోతీ స్టైల్, గోచీ స్టైల్, లెహంగా స్టైల్.. ఇలా అనేక రకాల స్టైల్స్ నగరంలో సందడి చేస్తున్నాయి.



ప్రొఫెషనల్ స్టెప్స్.. స్టైల్ టిప్స్..

విభిన్న రంగాల్లో ఉంటున్నవారు అందుకు తగ్గట్టుగా ఉండేందుకు చీరకట్టు కూడా ప్రత్యేకంగా ఉండేలా డిజైనర్లు సూచిస్తున్నారు.

- చీర మీద కొంగును సింగిల్‌స్టెప్ వేసే స్టైల్‌ని టీచర్ వృత్తిలో ఉన్నవారు ఎంచుకోవచ్చు. ఇదే స్టైల్‌లో పల్లు కొసని కుడి చేత్తో పట్టుకోవడం వల్ల డిజైన్ కొట్టొచ్చినట్టు కనబడుతుంది.
- హుందాగా కనిపించాలనుకున్నవారు డబుల్‌స్టెప్‌ను అనుసరించవచ్చు.
- ఇక అత్యధికులకు నప్పేది త్రీస్టెప్స్. పనులకు ఎలాంటి అడ్డంకీ రాకూడదనుకునే ఉద్యోగినులు, గృహిణులు.. అందరికీ ఇది ఓకే.
- కాస్త స్పైసీగా కనపడాలనుకుంటే మాత్రం ఫోర్‌స్టెప్స్, ఫైవ్‌స్టెప్స్.. ఇలా ఎంచుకోవాలి.
- పట్టు చీరలకు తప్పనిసరిగా ఆరు స్టెప్స్ ఉండాల్సిందే. అప్పుడే దానికి ఆకర్షణ.

బ్యూటీ..విత్ డిగ్నిటీ..

'రెగ్యులర్ డ్రెస్సులంటే మొహం మొత్తేస్తోంది. మా కంపెనీలో ఏ చిన్న వేడుకైనా అందరూ చీరలు కట్టుకునే వస్తాం. ప్రత్యేకంగా ట్రెడిషనల్ డే వంటివి క్రియేట్ చేసుకుని మరీ చీరలు కడుతున్నాం' అంటోంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని భవ్యశ్రీ. మోడ్రన్ డ్రెస్సుల దగ్గర ఆచితూచి ఖర్చుపెట్టే అమ్మాయిలు చీర విషయానికి వచ్చేసరికి ఎంతైనా ఖర్చు పెట్టడానికి సిద్ధమవుతున్నారని నగరానికి చెందిన డిజైనర్ అవని చెబుతున్నారు.



నగరంలో టీత్ జ్యువెలరీ సేవలు

ప్రారంభించిన బాలీవుడ్ స్టార్స్ దానీబోస్, స్నేహాషా

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో మొదటి సారి కాస్మోటిక్ డెంటిస్ట్రీ, టీత్ జ్యువెలరీ సేవలను ప్రారంభించినట్లు ఓషన్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ పి.ప్రసాద్ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాలీవుడ్ స్టార్స్ దానీబోస్, స్నేహాషాతో కలిసి ఆయన మాట్లాడారు. విదేశాల్లో లభ్యమయ్యే ఈ అరుదైన ట్రీట్‌మెంట్ మాదాపూర్‌లోని దుర్గంచెరువు రోడ్డులోని ఓషన్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పటల్‌లో నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలీవుడ్ స్టార్స్ దానీబోస్, స్నేహాషాలు డెంటిస్ట్రీ, టీత్ జ్యువెలరీ బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినీ తారలు, మోడల్స్‌కు ఈ ట్రీట్‌మెంట్ అందుబాటులోకి తీసుకురావడం ముదావహమని పేర్కొన్నారు. ఒకప్పుడు ఈ ట్రీట్‌మెంట్ కోసం ఎంతో వ్యయప్రయాసకోర్చి విదేశాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఈ పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీపీసీ అధ్యక్షుడు చైతన్య జంగా, కార్యదర్శి పీవీఎస్ వర్మ పాల్గొన్నారు.

కేరళ ఫిలిం ఫెస్టివల్లో.. తెలుగు చిత్ర ప్రదర్శన

సాక్షి, సిటీ బ్యూరో: కేరళ వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్లో తెలుగు నుంచి 'ఒక మంచి ప్రేమకథ' ప్రదర్శితమై అందరి మన్ననలూ పొందుతోంది. ఈ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్లో గురువారం మధూ అంబట్ రెట్రాస్పక్టివ్ విభాగంలో ఎంపికైన ఈ చిత్ర ప్రదర్శనకు నిర్మాత హిమాంశు పోపూరి, రచయిత ఓల్గా, సినిమాటోగ్రాఫర్ మధూ అంబట్‌లు హాజరై ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. అక్కినేని కుటుంబరావు దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 12న సెన్సార్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. అయితే విడుదలకు ముందే ఇంటర్ నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికై విశిష్టతను చాటుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినిమా రాణిస్తున్న తరుణంలో తమ చిత్రం ఎంపికవ్వడం సంతోషంగా ఉందని నిర్మాత హిమాంశు పోపూరి తెలిపారు.







అదరగొట్టిన డిజైర్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: ప్రతిష్టాత్మక లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ సంస్థ డిజైర్ డిజైనరీ ప్రదర్శన ఆకటుకుంది. బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ప్రముఖ మోడల్స్ ప్రారంభించి పలు ఉత్పత్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు అనితా అగర్వాల్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో సెలబ్రిటీ డిజైనర్లు రూపొందించిన వస్త్ర ఉత్పత్తులతో పాటు పలు యాక్ససరీస్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇక్కడ లభిస్తున్న వివిధ రకాల డిజైనరీ దుస్తులను మోడల్స్ ధరించి ఆకట్టుకున్నారు.

ఫలక్‌నుమాలో.. 'చేంజ్ మేకర్'

డెమోక్రటిక్ సంఘ అధ్వర్యంలో అవార్డుల ప్రదానం



సాక్షి, సిటీబ్యూరో: రేస్ 2 విన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డెమోక్రటిక్ సంఘ.. చేంజ్ మేకర్ అవార్డులను అందించింది. హైదరాబాద్‌లోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. మాజీ మంత్రి గీతారెడ్డి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, సింగర్స్ మంగ్లీ, రాహుల్ సిప్లిగంజ్, శిల్పారెడ్డి, ఐరా త్రివేది తదితరులు ఈ అవార్డులు అందుకున్నారు. దేశవ్యాప్తంగా సమాజంలో మార్పు కోసం పాటుపడిన వ్యక్తులు, సంస్థలను గుర్తించి వారికి ఈ అవార్డులను అందజేసింది. చేంజ్ మేకర్ అవార్డులను ప్రజా స్వావ్య సూత్రాలు, సామాజిక న్యాయం మరియు మానవ హక్కుల పురోగతి విషయంలో గణనీయమైన కృషి చేసిన గొప్ప వారిని ఏటా డెమోక్రటిక్ సంఘ సత్కరిస్తుంది. ఈ ఏడాది వేడుకలు, సంభాషణల స్ఫూర్తితో కూడిన ఉల్లాసమైన సాయంత్రాన ప్రభావశీలురు, పరిశ్రమ నాయకులను ఒకచోట చేర్చింది. ముఖ్యఅతిథిగా పార్లమెంటు సభ్యురాలు జి.రేణుకాచౌదరి హాజరయ్యారు. గౌరవ అతిథి మిస్ యూనివర్స్–1994 సుస్మితా సేన్, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ ఇందులో పాలుపంచుకున్నారు. నటి, సామాజిక కార్యకర్త భూమి ఫడ్నేకర్ ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేశారు. బాలల హక్కులు, కార్మికులు, మహిళలు, అట్టడుగు వర్గాలను ఏకం చేయడం వంటి అంశాలపై కృషి చేసిన ప్రముఖ సంఘ సంస్కర్త, సామాజికి కార్యకర్త స్వామి అగ్నివేష్‌కు నివాళులర్పిస్తూ ఈ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన పేరు పెట్టారు.





ఆసక్తికరంగా ఆర్ట్, కల్చర్

విల్లామేరీ కళాశాలలో భాషా నైపుణ్య ప్రదర్శన

పంజగుట్ట: నైపుణ్యాలు పెంచే విషయంలో స్థానిక భాషలతో పాటు తెలుగు, హిందీ, ఫ్రెంచ్ అరబ్బి, సంస్కృత భాషలు ఎంతో తోడ్పాటునందిస్తాయని విల్లామేరీ కళాశాల సెక్రటరీ చిన్నమ్మ అన్నారు. సోమాజిగూడలోని విల్లామేరీ కాలేజీలో సెకండ్ లాంగ్వేజ్‌పై ప్రత్యేక కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్రెంచ్, అరబ్, హిందీ, సంస్కృతం భాషలకు సంబంధించిన ఆర్ట్, కల్చర్ నమూనాలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.



క్లుప్తంగా...

అంబేడ్కర్ పేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

- రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ అంబేడ్కర్ పేరుతో కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలు చేస్తోందని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ నేతలు అంబేడ్కర్ వారసులమని చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గురువారం పార్లమెంట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెండుసార్లు అంబేడ్కర్‌ను ఓడించిందని గుర్తుచేశారు. అంబేడ్కర్‌కు కాంగ్రెస్ పార్టీ ఎందుకు భారతరత్న పురస్కారం ఇవ్వలేదని ప్రశ్నించారు. అంబేడ్కర్ నడయాడిన ప్రాంతాలను పంచ తీర్థ్‌గా బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని తెలిపారు. గురువారం పార్లమెంట్‌లో జరిగిన దాడికి తాను ప్రత్యక్ష సాక్షిని అని.. మహిళల ఛాతీపై చేతులు వేసి దాడి చేశారని ఆరోపించారు. దాడికి కారణమైన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ సేవలను కొనియాడటం మంచి పరిణామం

స్పష్టం చేసిన వైఎస్సార్‌సీపీ

సాక్షి, అమరావతి: పార్లమెంటు సమావేశాల్లో భాగంగా జరిగిన చర్చల్లో 'వాళ్లు అంబేడ్కర్ పేరును వందసార్లు అంటారు.. అన్నిసార్లు దేవుడి పేరు తలుచుకుంటే పుణ్యం వస్తుంది..' అన్నట్టుగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడిన మాటలు అపోహలకు దారితీశాయని వైఎస్సార్‌సీపీ స్పష్టం చేసింది. కానీ.. ఆ తర్వాత అంబేడ్కర్ గురించి ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాతో పాటు బీజేపీ సభ్యులు మాట్లాడిన మాటలు గమనిస్తే అందరూ అంబేడ్కర్‌ను గౌరవిస్తూ కొనియాడడం మంచి పరిణామమని సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వైఎస్సార్‌సీపీ తెలిపింది. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కించపరిచినా, పల్లెత్తుమాట అన్నా అది ముమ్మాటికి తప్పేనని స్పష్టం చేసింది. పేదవాడికి సమాన హక్కులు, గౌరవం ఉండాలనే అంబేడ్కర్ భావజాలం తమకు స్ఫూర్తిదాయకమని పేర్కొంది. ఆ స్ఫూర్తి పరిఢవిల్లేలా విజయవాడ నగర నడిబొడ్డున ప్రపంచంలోనే అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని నిలబెట్టి అద్భుత స్మృతివనాన్ని నిర్మించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపింది. అంబేడ్కర్ తమకే కాదు.. యావత్ భారతదేశానికే ఆదర్శంగా చిరకాలం ఉంటారని వైఎస్సార్‌సీపీ పేర్కొంది.

అమిత్ షా వ్యాఖ్యలు అర్థరహితం: జాజుల

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ సమావేశాల్లో బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై.. కేంద్ర మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా అత్యున్నత పదవిలో ఉంటూ.. ఆయనను అవమానించే విధంగా అర్థరహిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని హితవు పలికారు.



వ్యవ'సాయ' వర్సిటీ.. వజ్రోత్సవ శోభ

అరవై ఏళ్లుగా రైతులకు సేవలందిస్తూ...

- అధిక దిగుబడి ఇచ్చే కొత్త వంగడాల సృష్టి
- కళాశాల నుంచి వ్యవసాయ పరిశోధనల వరకూ..
- నేడు, రేపు కార్యక్రమాలు.. హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ఏజీవర్సిటీ: వ్యవసాయంలో నిత్య పరిశోధనలు..వివిధ పంటలకు సంబంధించి కొత్త వంగడాల సృష్టి, సూక్ష్మనీటి సేద్యం, వ్యవసాయంలో యాంత్రీకరణ, పశువైద్య శాస్త్రం దిశగా పురోగమనం, వ్యవసాయ విద్య ద్వారా రైతులకు మేలు చేస్తూ, శాస్త్రవేత్తలను అందించడం.. ఇలా అనేక రకాలుగా వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం విశేష కృషి చేస్తోంది. యూనివర్సిటీ ఏర్పాటై 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 20, 21 తేదీల్లో వజ్రోత్సవాలు జరగనున్నాయి.

వ్యవసాయ కళాశాల నుంచి జయశంకర్ వర్సిటీ దాకా..

దేశ తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మార్గదర్శకంలో వ్యవసాయ విద్య ఆలోచనలకు తొలిబీజం పడింది. 1955 జనవరి 6న అప్పటి భారత ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ రాజేంద్రనగర్‌లో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. 1964 జూన్ 12న వ్యవసాయ కళాశాల ప్రారంభం కాగా, 1965 మార్చి 20న అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చేతుల మీదుగా వర్సిటీని రైతులకు అంకితం చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా ప్రారంభమై..1996లో ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీగా పేరు మార్చుకుంది. రాష్ట్ర విభజన తర్వాత 2014 సెప్టెంబర్ 3 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా అవతరించింది.

- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం 11 కళాశాలలు, 12 వ్యవసాయ పాలిటెక్నిక్, మూడు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలు, 12 వ్యవసాయ పరిశోధన స్థానాలు, 8 కృషి విజ్ఞాన కేంద్రాలు , 9 ఏరువాక కేంద్రాలు కొనసాగుతున్నాయి.
- అరవై ఏళ్ల వర్సిటీ ప్రస్థానంలో వ్యవసాయవిద్యలో సుమారు 32,300 మంది విద్యార్థులు డిగ్రీలు, 12,300 మంది పాలిటెక్నిక్ పట్టాలు సాధించారు. ఇంకా 9,500 మంది విద్యార్థులు వ్యవసాయశాస్త్రంలో పీజీ, 1500 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేశారు.

నూతన వంగడాల సృష్టి.. పరిశోధనలు

వరి, మొక్కజొన్నతోపాటు 50కిపైగా పంటల్లో దాదాపు 500 నూతన రకాలను వర్సిటీ అభివృద్ధి చేసింది. 1968లో వర్సిటీ భాగస్వామ్యంతో అఖిల భారత వరి సమన్వయ పరిశోధన సంస్థ ద్వారా తొలిసారిగా వరిలో అధిక దిగుబడి ఇచ్చే 'జయ' అనే సంకర జాతి తొలి వంగడాన్ని అందుబాటులోకి తెచ్చారు. నాటి నుంచి స్వర్ణ, బీపీటీ–5204, ఎంటీయూ–1010, ఎంటీయూ–1001, తెలంగాణ సోనా ఇలా వరి ఎన్నో రకాలను వర్సిటీ అభివృద్ధి చేసింది. ఈ ఏడాది అధిక దిగుబడి ఇచ్చే ఎక్స్‌ట్రా ఎర్లీ రకం కంపసాగర్ వరి 6251 (కేపీఎస్ 6251)ని విడుదల చేసింది.

- దేశవ్యాప్తంగా వరిసాగులో ఈ వర్సిటీ అభివృద్ధి చేసిన వరి రకాలు 25 శాతం దాకా ఉన్నాయి. 12 రాష్ట్రాలలో 12 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో ఇక్కడి వరి వంగడాలే సాగవుతున్నాయి.
- దేశవ్యాప్తంగా మొక్కజొన్న విస్తీర్ణంలో 10–12శాతం వరకూ ఇక్కడి సంకర రకాలే సాగవుతున్నాయి. వర్సిటీ అభివృద్ధి చేసిన దాంట్లో హైబ్రిడ్ రకాలైన డీహెచ్‌ఎం–115, 117, 121 ఉన్నాయి.
- వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో చేసిన 23 ఆవిష్కరణలకు పేటెంట్లు సైతం సొంతం చేసుకుంది.

వజ్రోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రైతులకు సేవలందిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం తెలంగాణకే గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వజ్రోత్సవాల ఏర్పాట్లలోగురువారం రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీ రైతుమేళా ఏర్పాటు చేసే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తోపాటు ఆడిటోరియంను తుమ్మల పరిశీలించారు. శుక్రవారం జరిగే కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి తుమ్మల

చంద్రబాబుది 420 విజన్

అది మేనిఫెస్టోను ఎగ్గొట్టే రంగు రంగుల కథల పుస్తకం ● వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు

- చంద్రబాబు ఏడు నెలల క్రితం ఇచ్చిన హామీలకే దిక్కు లేదు
- ఇప్పుడు 2047 విజన్ అంటుండటం ఆశ్చర్యం
- చంద్రబాబును నమ్మడమంటే చంద్రముఖిని నిద్ర లేపడమేనని చెప్పాను
- ఇప్పుడది ఆరు నెలలు తిరక్క ముందే ప్రతి ఇంటా కన్పిస్తోంది



సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్‌సహా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఎగ్గొట్టేందుకే సీఎం చంద్రబాబు రంగు రంగుల కథలు చెబుతూ.. దానికి విజన్ 2047 అని పేరు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. అందుకే దాన్ని 420 విజన్ అంటారని మండిపడ్డారు. 'మనిషిని అభివృద్ధి బాటలోకి తీసుకుని పోవాలంటే.. ఆ అభివృద్ధి బాట ఏమిటని చెప్పేదే విజన్ డాక్యుమెంట్. ఇవాళ చిన్న పిల్లాడు 20 ఏళ్ల తర్వాత ఎలా ఉంటాడు? అప్పుడు అతడి భవిష్యత్ ఏంటి? ఆ భవిష్యత్ కోసం ఇవాళ సరైన అడుగులు వేస్తున్నామా? లేదా? అన్నదే విజన్. అందులో భాగంగా ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాలా వాటిని చేసి చూపింది'అని గుర్తు చేశారు. చంద్రబాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్ర లేపడమే అని, పులి నోట్లో తలపెట్టడమే అని.. నేను ఎన్నికల ప్రచారంలో చెప్పాను. ఇవాళ ఆరు నెలల తిరక్క ముందే అదే కనిపిస్తోంది'అని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాలో పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. చంద్రబాబు ప్రభుత్వం దగా చేయడంతో ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు అండగా గొంతు విప్పాలని, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని మార్గ నిర్దేశం చేశారు. 'పగలు తర్వాత రాత్రి వస్తుంది. మళ్లీ మన టైం వస్తుంది. దేనికైనా మనం సిద్ధమే. ఎవ్వరూ, ఎక్కడా భయపడొద్దు. దేన్నైనా ఢీకొందాం. మీ అందరికీ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పార్టీ అండగా ఉంటుంది'అంటూ నేతలకు భరోసా ఇచ్చారు. పార్టీని మరింతగా బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై నేతలకు మార్గ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

6 నెలలకే ఇంత వ్యతిరేకత ఎప్పుడూ లేదు

ఆరు నెలలకే చంద్రబాబునాయుడు ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో వ్యతిరేకత కనిపిస్తోంది. ఇంతటి వ్యతిరేకత గతంలో ఏ ప్రభుత్వం మీదా లేదు. ఒకవైపు మనం ఇస్తున్న పథకాలు పూర్తిగా నిలిపివేశాడు. మరోవైపు ఆయన ఇస్తానన్న సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ గాలికెగిరిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యమబాట పట్టడానికి మనం ఇవాళ కలిసి అడుగులు వేస్తున్నాం. పట్టుకుంటే షాక్ కొట్టేలా ఉన్న విద్యుత్ బిల్లుల మీద ఈనెల 27న ఆందోళనకు పిలుపునిచ్చాం.

ఫీజులు రాని పిల్లలకు అండగా నిలుద్దాం

మన ప్రభుత్వ హయాంలో ప్రతి 3 నెలలకొకసారి, త్రైమాసికం అయిన వెంటనే పిల్లల తల్లులకు డబ్బులిచ్చి వారి చదువులకు తోడుగా ఉండేవాళ్లం. ఈరోజు పిల్లలు విద్యా దీవెన, వసతి దీవెన రాక ఇబ్బంది పడుతున్నారు. మనం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏప్రిల్‌లో వెరిఫై చేసి మే నెలలో ఇచ్చే వాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చాక నాలుగు త్రైమాసికాలు గడిచిపోయాయి. ఏప్రిల్‌లో వసతి దీవెన కింద డబ్బులిచ్చే వాళ్లం. ఇప్పుడు అది కూడా ఎగిరిపోయింది. మొత్తంగా ఫీజులకు సంబంధించి నాలుగు దఫాలు విద్యా దీవెన రూ.2,800 కోట్లు, వసతి దీవెన రూ.1100 కోట్లు మొత్తం రూ.3,900 కోట్లు పిల్లలకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోవడం వల్ల.. పిల్లలు డబ్బులు కట్టలేక చదువులు మానేస్తున్నారు. పనులకు వెళ్తున్నారు. ఈ పిల్లలకు అండగా, వారికి తోడుగా ఉండే కార్యక్రమం జిల్లా యూనిట్‌గా జనవరి 3న చేయబోతున్నాం.

జనవరి నుంచి జిల్లాల పర్యటన

జనవరి చివరి వారం నుంచి నేను పార్లమెంటు జిల్లాల్లో పర్యటిస్తాను. వారంలో ప్రతి బుధ, గురువారం రాత్రి అక్కడే బస చేసి కార్యకర్తలతో మమేకమవుతాను. 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశ నిర్దేశం'పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాను. ఈ కార్యక్రమం మొదలయ్యే లోగా మండల స్థాయి నుంచి మొదలై నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు పార్టీ అనుబంధ విభాగాల కమిటీల నియామకాలన్నీ పూర్తి చేయాలి.

సోషల్ మీడియాలో చురుగ్గా ఉందాం


ఇవాళ మనం చంద్రబాబుతో యుద్ధం చేయడం లేదు.. చంద్రబాబు వేసుకున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 లాంటి ముసుగుతో యుద్ధం చేస్తున్నాం. ఇలాంటి వాళ్లను ఎదుర్కోవాలంటే మనం సోషల్ మీడియాలో చాలా చురుగ్గా ఉండాలి. ప్రతి కార్యకర్తకు ఫేస్‌బుక్, యూట్యూబ్, ట్విటర్ వంటి అన్ని సోషల్ మీడియా అకౌంట్లు ఉండాలి. గ్రామ స్థాయిలో ఎక్కడ ఏ అన్యాయం జరిగినా ప్రశ్నించాలి. ఈసారి మన టార్గెట్.. బాబుకు సింగిల్ డిజిట్ దాటకూడదు. అది కచ్చితంగా జరుగుతుంది.

మనకూ కచ్చితంగా గుడ్ టైమ్ వస్తుంది

ప్రతిపక్షంలో కష్టాలు, కేసులు సహజం. జైల్లో కూడా పెడతారు. నేను మీ అందరికీ చెబుతున్నాను. కష్టాలు ఎల్లకాలం ఉండవు. కష్టం తర్వాత సుఖం ఉంటుంది. ఏ కష్టం ఎవరికి వచ్చినా నా వైపు చూడండి. ప్రతిపక్షం ఉండదు.. అడిగేవాడు ఉండడని నన్ను 16 నెలలు జైల్లో పెట్టారు. అప్పుడు రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. కాంగ్రెస్, టీడీపీ కలిసి నామీద కేసులు పెట్టాయి. ఏమైంది? ప్రజల అభిమానంతో ముఖ్యమంత్రి అయ్యాను. పగలు తర్వాత రాత్రి వస్తుంది. మళ్లీ మన టైం వస్తుంది. జమిలి వస్తుందంటున్నారు. దేనికైనా మనం సిద్ధంగా ఉందాం. మనకూ తప్పనిసరిగా గుడ్ టైమ్ వస్తుంది.

పదేళ్లలో 2,526 కి.మీ రహదారులను ఎన్‌హెచ్‌లుగా విస్తరించాం

లోక్‌సభలో కేంద్ర మంత్రి గడ్కరీ



సాక్షి, న్యూఢిల్లీ: గడిచిన పదేళ్లలో పీఎం గతిశక్తి మాస్టర్ ప్లాన్ కింద రాష్ట్రంలోని 2,526 కి.మీ రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేశామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 30 జాతీయ రహదారులు రాష్ట్రంలో 4,926 కి.మీలు విస్తరించి ఉన్నాయని స్పష్టం చేసింది. 2014 నుంచి మొత్తం 2,722కి.మీ జాతీయ రహదారులను నిర్మించామని పేర్కొంది. గురువారం లోక్‌సభలో మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. అలాగే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రూ.6,249.03 కోట్లతో 162.243 కి.మీ పొడవైన మొత్తం 12 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన



అంబేడ్కర్ చిత్రపటాలు పట్టుకుని ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించే విధంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. అమిత్‌షా వైఖరిని నిరసిస్తూ అసెంబ్లీ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటాలను పట్టుకుని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, మట్టా రాగమయి, యశస్వినిరెడ్డి, విజయరమణారావు, వేముల వీరేశం, బాలునాయక్, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బత్తుల లక్ష్మారెడ్డి, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, కోరం కనకయ్య, వాకిటి శ్రీహరి, కవ్వంపల్లి సత్యనారాయణ, వివేక్, వినోద్, యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, మేడిపల్లి సత్యం, వెడ్మ బొజ్జు, గండ్ర సత్యనారాయణ, టి. రామ్మోహన్‌రెడ్డి, జారె ఆదినారాయణ, నాయిని రాజేందర్‌రెడ్డి, మేఘారెడ్డి, మురళీ నాయక్, శ్రీగణేశ్, జి. మధుసూదన్‌రెడ్డి, కె.ఆర్. నాగరాజు, ఈర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్

- పదేళ్లలో బీఆర్‌ఎస్ సర్కారు చేసిన అప్పు రూ.6.71 లక్షల కోట్లు
- ఏడాదిలోనే కాంగ్రెస్ సర్కారు చేసిన అప్పు రూ.1.27 లక్షల కోట్లు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలకులు చేసిన అప్పులతో రాష్ట్రం ఎలా దివాలా తీసిందో అసెంబ్లీ సాక్షిగా బయటపడిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ రెండు పార్టీలకు అధికారాన్ని కట్టబెట్టిన పాపానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజల చేతికి చిప్ప ఇచ్చారని గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రూ.6.71 లక్షల కోట్ల అప్పు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటిస్తే.. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.27 లక్ష కోట్ల అప్పు చేసిన విషయం అసెంబ్లీ సాక్షిగా వెల్లడైందని తెలిపారు. ఆవిర్భావ సమయంలో తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఉండగా.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు చేసిన అప్పులకు ఇప్పుడు వడ్డీలు కట్టడానికి కొత్తగా అప్పులు తీసుకునే దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎగ్గొట్టేందుకు సిద్ధమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ.1.27 లక్షల కోట్ల అప్పులు తీసుకుందంటే.. మిగిలిన నాలుగేళ్లలో రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసేలా కనిపిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రం దివాలా తీయకుండా కాపాడాలంటే తెలంగాణ శ్రేయస్సును కాంక్షించే ప్రతి ఒక్కరూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల తీరును ఎండగట్టాలని కోరారు. ప్రజలను చైతన్యవంతం చేసేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ తరువాత ఉద్యమం చేపడతామని ప్రకటించారు.



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌ను కలిసి సన్మానిస్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి

రేవంత్, ఉత్తమ్‌ను కలసిన నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలసి కృతజ్ఞతలు తెలిపారు. పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని కాల్వ ప్రాజెక్టులకోసం రూ.300 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన ప్రకటనపై వారు ధన్యవాదాలు తెలిపారు. గురువారం అసెంబ్లీలోని సీఎం, ఉత్తమ్ చాంబర్‌లలో మంత్రి కోమటిరెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, బత్తుల లక్ష్మారెడ్డి, మందుల శామేల్, అనిల్‌కుమార్‌రెడ్డిలు ఆ ఇద్దరిని కలసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు కూడా కలిశారు.

కోర్టులు ఆదేశిస్తే తప్ప పని చేయరా?

జీహెచ్‌ఎంసీ అధికారుల తీరుపై హైకోర్టు అగ్రహం

- అక్రమ నిర్మాణాలు జరుగుతోంటే ఏం చేస్తున్నారు?
- ప్రజలు ఫిర్యాదు చేస్తే స్పందించకుంటే ఎలా?
- మీపై ప్రజలకు కనీస విశ్వాసం లేకుండాపోతోంది
- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు పలు సూచనలు చేసిన జస్టిస్ కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) అధికారుల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులు ఆదేశిస్తే తప్ప అధికారులు పని చేయడం లేదని, మీ విధులు కూడా న్యాయస్థానాలే నిర్వహించాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేసింది. అధికారుల వద్దకు వచ్చే ప్రజల ఫిర్యాదులను పరిష్కరించకపోవడంతో వారు విధిలేక కోర్టులను ఆశ్రయిస్తున్నారని వ్యాఖ్యానించింది. కోర్టు ఇచ్చిన ఆదేశాలు పాటించడంలోనూ అదే నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడింది. ఈ ఒక్క కోర్టు(15వ కోర్టు)లోనే ధిక్కరణ కేసులు 110 ఉన్నాయని చెప్పింది. కోర్టుల ఆదేశాలు, రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులు చదువుతూ.. ఆ మేరకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సూచించింది. ఇతర ఉన్నతాధికారులతో రివ్యూ మీటింగ్‌లు పెడుతూ వారికి తగిన సూచనలు అందించాలని కమిషనర్‌ను ఆదేశించింది. హైదరాబాద్ టోలిచౌకిలోని కాశీష్ దుకాణం ముందు అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం మరోసారి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తమ ముందు హాజరైన జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను పలు ప్రశ్నలు అడగడంతోపాటు అక్రమ నిర్మాణాలపై అనుసరించాల్సిన విధానంపై సూచనలు చేశారు.

ఆస్తి పన్ను వసూలుకే పరిమితమా?

'కేవలం ఆస్తి పన్ను వసూలుకే జీహెచ్‌ఎంసీ అధికారులు ఉన్నారనే భావన ప్రజల్లో రానివ్వొద్దు. రోజురోజుకు మీపై వారిలో విశ్వాసం లేకుండాపోతోంది. కోర్టు మెట్లెక్కాల్సిన పరిస్థితి వస్తోంది. చాలాచోట్ల స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చి ఆ తర్వాత విధానాన్ని పాటించకుండా నిద్రపోతున్నారు. సీజ్ చేసినా చాలా ప్రాంతాల్లో నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. కూల్చివేత అంటూ రెండు రంధ్రాలు చేస్తే సరిపోతుందా? దానికి ఓ నిర్దిష్ట ప్రక్రియను అనుసరించకుంటే ఎలా? మీరు పెట్టిన రంధ్రాలను పూడ్చివేసి మళ్లీ నివాసం ఉంటున్నారు. అలా అని బుల్డోజర్ సిద్ధాంతాన్ని సమర్థించం. కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా అర్ధరాత్రి పూటనో లేదా వేకువజామున నాలుగు గంటలకో నిర్మాణం చేస్తున్నారు. నేను నివాసం ఉంటున్న కుందన్‌బాగ్ ప్రాంతంలో కూడా నిద్ర లేకుండా చేస్తున్నారు. న్యాయమూర్తి పరిస్థితే ఇలా ఉంటే.. సామాన్యుడి పరిస్థితి ఏంటి? విద్యా సంవత్సరం కొనసాగుతున్నందున ఒక్క విద్యా సంస్థలకు తప్ప ఇతర అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం అధికారులు చర్యలు చేపట్టవచ్చు'అని పేర్కొన్నారు.

సివిల్ కోర్టుల నోటీసులపై స్పందనేది?

'సివిల్ కోర్టుల్లో దాఖలైన పిటిషన్లలో నోటీసులు జారీ చేసినప్పుడు స్పందించకుంటే ఎలా? కొన్నిసార్లు స్టాండింగ్ కౌన్సిల్స్ కూడా హాజరుకావడం లేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో సివిల్ కోర్టు ఎక్స్‌పార్టీ అని పేర్కొంటూ, ఇతర పార్టీలకు అనుకూలంగా ఆదేశాలు ఇవ్వాల్సి వస్తోంది. మీ నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణదారులు లబ్ధిపొందుతున్నారు. కొందరు అధికారులు, కౌన్సిల్స్ చట్టం, సెక్షన్లు తెలియకుండా కౌంటర్లు వేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ అధికారుల నుంచి స్పందన లేక కోర్టులకు వస్తున్న కేసులు 70 నుంచి 80 శాతమున్నాయి. మీరే అన్ని నిర్ణయాలు తీసుకోలేరు. ఆ మేరకు చట్టంలో మార్పులు చేసేలా ప్రిన్సిపల్ సెక్రెటరీని కోరండి. సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, డిప్యూటీ కమిషనర్లు.. అంతా కూర్చొని మాట్లాడండి. అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు ఏ చర్యలు తీసుకోవాలో ప్రణాళిక రూపొందించుకోండి. అలాగే వివాదాస్పదమైన టోలీచౌకి నిర్మాణంపై జనవరి 22లోగా నివేదిక ఇవ్వండి'అని కమిషనర్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. అయితే, రాజీ కుదిరిందని పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని పిటిషనర్ కోరగా, న్యాయమూర్తి నిరాకరించారు. అక్రమ నిర్మాణంపై రాజీనా అని ప్రశ్నిస్తూ.. విచారణ వాయిదా వేశారు.

పోరాటం మాకు కొత్త కాదు

అక్రమ కేసులతో మా గొంతు నొక్కలేరు: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: 'మీ చిల్లర వ్యూహాలు మమ్మల్ని భయపెట్టలేవు. అవి మా సంకల్పానికి మరింత బలం చేకూరుస్తాయి. పోరాటం మాకు కొత్త కాదు. అక్రమ కేసులతో మా గొంతును నొక్కలేరు'అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేయటంపై ఆమె గురువారం స్పందించారు. 'రాజకీయంగా ఎదుర్కోలేక బీఆర్‌ఎస్ పార్టీని, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని.. కాంగ్రెస్ ప్రభుత్వం మా పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి ఆడుతున్న డ్రామాను ప్రజలు గమనిస్తున్నారు. అసెంబ్లీలో చర్చించేందుకు ధైర్యం లేని సీఎం రేవంత్.. కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి భయపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నం ఆయన రాజకీయ అమాయకత్వానికి నిదర్శనం. మేము కేసీఆర్ సైనికులం, తెలంగాణ ఉద్యమ పోరాటం నుంచి పుట్టిన నాయకులం'అని కవిత పేర్కొన్నారు.

కాంగ్రెస్ అరాచకానికి పరాకాష్ట

కేటీఆర్ మీద ఏసీబీ కేసు నమోదు చేయడం కాంగ్రెస్ అరాచకానికి పరాకాష్ట అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కేటీఆర్‌పై కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తూ పలువురు బీఆర్‌ఎస్ నేతలు గురువారం రాత్రి వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. పాలన చేతగాక ప్రతిపక్ష నేతల మీద కుట్రలు చేస్తున్నారని నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. కేటీఆర్‌ను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం చిల్లరగా వ్యవహరిస్తోందని దాసోజు శ్రవణ్ విమర్శించారు.

ట్రిబ్యునల్ తీర్పు తర్వాతే అనుసంధానం!

- సమ్మక్క బరాజ్ నుంచి గోదావరి–కావేరీ అనుసంధానం చేయాలి.. ఎన్‌డబ్ల్యూడీఏ భేటీలో తెలంగాణ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలవివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–2 తీర్పు వెలువడ్డాకే గోదావరి – కావేరీ నదుల అనుసంధానం చేపట్టాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) జీ అనిల్‌కుమార్ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. సమ్మక్క బరాజ్ దిగువన 152 టీఎంసీల నీటి వినియోగానికి రక్షణ కల్పించి.. ఆ బరాజ్ నుంచే గోదావరి– కావేరీ అనుసంధానం చేపట్టాలని స్పష్టం చేశారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఢిల్లీలో గురువారం జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) వార్షిక సాధారణ నదుల అనుసంధానంపై టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. అనుసంధాన ప్రాజెక్టు ద్వారా తరలించే జలాల్లో 74 టీఎంసీలు (50%) తెలంగాణకు కేటాయించాలని కోరారు. బెడ్తి–వార్దా నదుల అనుసంధానం ద్వారా తరలించే జలాల్లో 50% తెలంగాణకు (9 టీఎంసీలు) కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆల్మట్టి నుంచి కర్ణాటకకు 16 టీఎంసీల తరలింపు ప్రతిపాదనలను విరమించుకోవాలన్నారు. దీంతో దిగువన ఉన్న జూరాల ప్రాజెక్టుకు నష్టం వస్తుందన్నారు. ఈ సమావేశంలో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ బలేశ్వర్ ఠాకూర్, రాష్ట్ర నీటిపారుదల శాఖలోని గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

● ట్రాన్స్‌'జెమ్'డర్స్


ట్రాఫిక్ అసిస్టెంట్లుగా శిక్షణలో భాగంగా ట్రాన్స్‌జెండర్లు

వీధుల్లో కాదు విధుల్లోకి...


రిక్రూట్‌మెంట్ సమయంలో ట్రాన్స్‌జెండర్లతో మాట్లాడుతున్న హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

కొన్ని సంవత్సరాల క్రితం...'పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేయాలని ఉంది' అన్నది శ్రీకళ.

అక్కడ ఉన్న వాళ్లు పెద్దగా నవ్వారు. 'నేను జోక్ చేయడం లేదు. నిజమే చెబుతున్నాను' అన్నది ఆమె.

మరోసారి బిగ్గరగా నవ్వారు వాళ్లు. ఆ నవ్వులలో వెటకారాల వేటకొడవళ్లు దాగి ఉన్నాయి. ఆ పదునుకు గాయపడ్డ హృదయంతో శ్రీకళ కళ్లలో నీళ్లు. 'ఇక నా బతుకు ఇంతేనా' అనే బాధతో తల్లడిల్లి పోయింది.

కట్ చేస్తే...

ట్రాన్స్‌జెండర్‌లకు ఆర్థిక భరోసా ఇవ్వడానికి, సమాజంలో గౌరవం కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఆదేశాలతో హైదరాబాద్ పోలీసు విభాగం ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ఎంపిక చేసుకుంది. తుది దశ శిక్షణలో ఉన్న 39 మంది విధుల్లోకి రానున్నారు. బహుశా ఈ వార్త ట్రాన్స్‌జెండర్ శ్రీకళకు చేరి ఉంటుంది. ఆమెలాంటి ఎంతోమంది ట్రాన్స్‌జెండర్‌లకు ఆత్మవిశ్వాసాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చి ఉంటుంది.

'నా బిడ్డ భవిష్యత్తు గురించి భయంగా ఉంది' అని తెలిసిన వాళ్ల దగ్గర కళ్ల నీళ్లు పెట్టుకునే శ్రీవల్లి తల్లి బాలమణి ఇప్పుడు 'దేవుడు నా బిడ్డను సల్లగా సూసిండు. ఇంక నా బిడ్డకు ఢోకాలేదు' అని సంబరపడిపోతోంది.

భానుప్రియను చూసి చుట్టాలు, పక్కాలు పక్కకు తప్పుకునేవాళ్లు.'నేను చేసిన తప్పేమిటీ!' అంటూ తనలో తాను కుమిలిపోయేది భానుప్రియ. 'నువ్వేమీ తప్పు చేయలేదమ్మా... ధైర్యంగా ఉండు... తలెత్తుకు తిరుగు' అంటూ పోలీస్ ఉద్యోగం ఆమెను వెదుక్కుంటూ వచ్చింది. ఎం.ఎ. చదువుతున్నప్పటికీ భిక్షాటన చేయక తప్పని పరిస్థితుల్లో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడింది లచ్చిగూడెం బిడ్డ జెస్సీ. 'మేమున్నాం' అంటూ ఎవరూ ముందుకు రాలేదు. 'నాకు నేనే ఒక సైన్యం' అని ధైర్యం చెప్పుకున్న జెస్సీ ట్రాఫిక్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించనుంది.

'పోలీసు ఉద్యోగం చేయాలి' అనేది కారం సన చిన్నప్పటి కల. ఆ తరువాతగానీ తనకు తెలియదు... అదెంత కష్టమో! తన కల గురించి ఇతరులతో చెప్పుకోవడానికి కూడా భయపడే సన ఇప్పుడు... 'నా కలను నిజం చేసుకున్నాను' అంటుంది గర్వంగా.

కందుల భానుప్రియ నుంచి కారం సన వరకు ఎంతోమంది ట్రాన్స్‌జెండర్‌లు పడని మాట లేదు. పడని కష్టం లేదు. ఆ కష్టాలకు ముగింపు వాక్యంలా వారికి ఉద్యోగాలు వచ్చాయి. అయితే అవి కేవలం ఉద్యోగాలు మాత్రమే కాదు... వారి ఆత్మస్థైర్యాన్ని మరో స్థాయికి తీసుకువెళ్లిన ఆత్మగౌరవ సంకేతాలు.

– శ్రీరంగం కామేష్, సాక్షి, హైదరాబాద్

ఎవరూ పని ఇవ్వలేదు



ఖమ్మంలోని పందిళ్లపల్లి కాలనీ నా స్వస్థలం. పదో తరగతి పూర్తి చేసినా ఇప్పటివరకు ఎవరూ పని చేయడానికి అవకాశం ఇవ్వలేదు. దీంతో రోడ్లపై భిక్షాటన చేసుకుంటూ బతికా. నా తల్లి బాలమణి, కుటుంబ సభ్యులు అంతా నా భవిష్యత్తుపై ఆందోళనతో ఉండేవాళ్లు. హైదరాబాద్ పోలీసులు ఇచ్చిన ఈ అవకాశం నన్ను నేను నిరూపించుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ 20 రోజుల శిక్షణ కాలం ఎన్నో విషయాలు నేర్పింది. జీవితానికి ఉన్న విలువని తెలిపింది.

– కె.శ్రీవల్లి

బాబాయి పెళ్లికి రావద్దన్నారు!



సూర్యాపేట జిల్లా కందిబండలో పుట్టా. ఇంటర్ వరకు చదివా. కుటుంబీకులు కూడా దూరం పెట్టారు. సొంత బాబాయి పెళ్లికి కూడా నన్ను రావద్దని, వస్తే తమ పరువు పోతుందని చెప్పారు. ఇప్పుడు పోలీసు విభాగంలో ఉద్యోగం వచ్చిందని తెలిసి అంతా ఫోన్లు చేస్తున్నారు. నా భర్త, అత్తమామలు కూడా సంతోషించారు. కేవలం పోలీసు విభాగమే కాదు అన్నింటిలోనూ మాకు సమాన అవకాశాలు ఇవ్వాలి. టాన్స్‌జెండర్‌లకు వివిధ రంగాల్లో ఆసక్తి ఉన్నా అవకాశం దొరకట్లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వీధుల్లో భిక్షాటన చేసుకుని బతుకుతున్నారు.

– కందుల భానుప్రియ

అపూర్వ అవకాశం

తెలంగాణ పోలీసు విభాగంతో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా ఈ ట్రాఫిక్ అసిస్టెంట్ల ఎంపిక విధివిధానాలను ఖరారు చేసింది. మహిళా శిశుసంక్షేమ శాఖ సెక్రటరీ అనిత రాంచంద్రన్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవి గుప్త, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ నిబంధనలు ఖరారు చేశారు. సాంఘిక సంక్షేమశాఖ నుంచి అర్హులైన ట్రాన్స్‌జెండర్ల జాబితాను సేకరించారు. దీని ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టారు. దీనికి 58 మంది ట్రాన్స్‌జెండర్లు హాజరు కాగా. 44 మంది ఎంపికయ్యారు. అనివార్య కారణాలతో ఐదుగురు శిక్షణ మధ్యలోనే వెళ్లిపోగా. మిగిలిన 39 మంది దాదాపు 20 రోజులపాటు వివిధ అంశాల్లో శిక్షణ తీసుకున్నారు. వీరికి ఇటీవల ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందించారు. ఒకటి రెండు రోజుల్లో వీరు యూనిఫాంతో విధుల్లోకి రానున్నారు. వీరికి హోంగార్డుల మాదిరిగా రోజుకు రూ.921 చొప్పున వేతనం ఇవ్వనున్నారు.

చిన్నప్పటి కల నెరవేరింది



భద్రాచలం సమీపంలోని రామచంద్రునిపేట నా స్వస్థలం. జీపీ కంప్యూటర్స్ పూర్తి చేసిన తర్వాత సొంతంగా వ్యాపారం పెట్టాలనుకున్నాను. బ్యాంకు రుణాలు రావని కొందరు చెప్పడంతో మిన్నకుండిపోయా. ఏ ఉద్యోగాలూ దొరకలేదు. చిన్నప్పటి నుంచి పోలీసు అవాలనే కోరిక ఉంది. అయితే సర్టిఫికెట్ల ప్రకారం పురుముడిగా. రూపం, హావభావాలు స్త్రీ మాదిరిగా ఉండటంతో అది సాధ్యం కాలేదు. ఇప్పుడు ట్రాఫిక్ అసిస్టెంట్ ఉద్యోగం ద్వారా పోలీసు డిపార్ట్‌మెంట్‌లోకి అడుగుపెడుతున్నా. ఈ శిక్షణలో నేర్చిన అనేక అంశాలను సద్వినియోగం చేసుకుంటూ సమాజంలో నన్ను నేను నిరూపించుకోవాలనుకుంటున్నాను.

– కారం సన

ఎక్కువ జీతం కాదనుకొని...



భద్రాచలం సమీపంలోని గిరిజన ప్రాంతమైన లచ్చిగూడెం నా స్వస్థలం. నర్సింగ్ పూర్తి చేసి ప్రస్తుతం ఎం.ఏ. సోషియాలజీ చేస్తున్నాను. గతంలో ఎనిమిదేళ్ల పాటు భద్రాచలంలోని ఓ ఎన్‌జీవోలో పని చేశా. మూడేళ్లక్రితం హైదరాబాద్‌కు వచ్చి ఓ ఎన్‌జీవోలో కౌన్సిలర్‌గా చేరా. రెండేళ్లకు వారి ఒప్పందం పూర్తికావడంతో అప్పటి నుంచి భిక్షాటన చేసుకుంటూ బతుకుతున్నా. ఈమధ్య మరో ఎన్‌జీవోలో ఎక్కువ జీతానికి ఆఫర్ వచ్చింది. అది వదులుకుని దానికంటే తక్కువ జీతం వస్తుందని తెలిసినా ట్రాఫిక్ అసిస్టెంట్‌గా చేరుతున్నా. ఎందుకంటే ఎన్‌జీవోలో పని చేస్తే నేను ఏం చేస్తున్నాననేది నా వాళ్లకు తెలియదు. భిక్షాటన చేస్తూనో, మరోరకంగానో బతుకుతున్నా అనుకుంటారు. ఈ ఉద్యోగం చేస్తుంటే యూనిఫాంతో నా పని అందరికీ తెలుస్తుంది. మాపై ఉన్న దురభిప్రాయం పోతుంది.

– జెస్సీ

స్ఫూర్తి

ఆమె నెగ్గింది అమ్మ గెలిచింది

'మా అమ్మాయి దీక్ష అస్సాం సివిల్ సర్వీసెస్‌కు సెలెక్ట్ అయింది తెలుసా!' అంటూ ఎంతోమందికి సంతోషంగా చెప్పకుంటోంది బేబీ సర్కార్. దీక్ష పసిగుడ్డుగా ఉన్నప్పుడు బేబీ సర్కార్‌ను అత్త నిర్దాక్షిణ్యంగా ఇంటి నుంచి వెళ్లగొట్టింది. అత్త దృష్టిలో బేబీ సర్కార్ చేసిన నేరం... ఆడపిల్లను కనడం!


దీక్ష

'ఆడపిల్ల పుట్టింది' అనే మాట చెవిన పడగానే ఆ అత్త అగ్గి మీద గుగ్గిలం అయ్యింది. కోడలు బేబీ సర్కార్‌ను తిట్టడం మొదలుపెట్టింది. ఆ అత్త నలుగురు కొడుకులకూ ఆడపిల్లలు జన్మించారు.

'ఎవరైతే ఏమిటి!' అనుకోలేదు ఆమె.

చిన్న కొడుకుకు ఎలాగైనా మగబిడ్డ పుడుతుందని ఆశించింది. అంతేనా...'నువ్వు కూడా ఆడపిల్లనే కంటే ఇంటి నుంచి గెంటేస్తాను' అని కోడలిని హెచ్చరించింది. అయితే ఆమె కోరుకున్నట్లు జరగలేదు. బేబీ సర్కార్ కూడా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కోపం తట్టుకోలేని అత్త కోడలిని ఇంటి నుంచి గెంటేసింది. ఇంత జరిగినా....'అలా మాట్లాడడం తప్పమ్మా...ఇలా చేయడం తప్పమ్మా' అంటూ బేబీ సర్కార్ భర్త నుంచి చిన్న పదం కూడా బయటికి రాలేదు.

''నా భర్త మా అత్తను వ్యతిరేకించలేదు. 'మా అమ్మ ఏం చెప్పిందో అదే చేసింది. ఆమె చేసినదాంట్లో తప్పేం ఉంది' అన్నట్లుగా మాట్లాడేవాడు'' అని భర్త గురించి చెప్పింది అస్సాంలోని శ్రీభూమి జిల్లాకు చెందిన బేబీ సర్కార్. అత్త ఇంటి నుంచి గెంటేయడంతో తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. కొంత కాలం తరువాత భర్త చనిపోయాడు. ఆ తరువాత అత్త చనిపోయింది. మరోవైపు చూస్తే తల్లిదండ్రుల ఇంట్లో ఉండడం కష్టంగా అనిపించింది. వారికే పూటగడవడం కష్టంగా ఉంది. దీంతో కూతురు దీక్షతో కలిసి అక్క బీజోయ ఇంట్లో ఉండేది. బీజోయ ఎల్‌ఐసీలో ఉద్యోగం చేసేది.

అక్క డిప్రెషన్‌తో బాధ పడుతుండడంతో ఆమె కుటుంబాన్ని కూడా తానే చూసుకునేది. దీక్ష పదవతరగతి పూర్తి చేసేవరకు అక్క ఇంట్లోనే ఉంది. ఆ తరువాత తల్లీకూతుళ్లు ఒక అద్దె ఇంట్లోకి మారారు. కుమార్తె చదువు కోసం చిన్న చిన్న ఉద్యోగాలు చేయడం మొదలుపెట్టింది బేబీ సర్కార్.

దీక్ష చదువు కోసం సర్కార్ అప్పు కూడా చేయాల్సి వచ్చేది. తల్లీకూతుళ్ల ఆచితూచి ఖర్చు చేస్తుండేవారు.

ఒకవైపు సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూనే మరోవైపు యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది దీక్ష. ఈ చానల్ ద్వారా వచ్చే ఆదాయం ఖర్చులకు ఉపయోగపడేది.

అస్సాం సివిల్ సర్వీసెస్ పరీక్షలో దీక్ష విజయం సాధించడంతో తల్లీకూతుళ్ల కష్టాలకు తెరపడ్డట్లయింది.

'విజయాలు సాధించడం అనేది అబ్బాయిలకు మాత్రమే పరిమితం కాదని నా కుమార్తె విజయం నిరూపించింది' అంటుంది బేబీ సర్కార్.

'మా అమ్మ, పెద్దమ్మ కష్టాలు, త్యాగాల పునాదిపై సాధించిన విజయం ఇది. అమ్మ నా కోసం చాలా కష్టపడింది. ఎప్పుడూ నాతోనే ఉంటుంది. ఆమెకు ఎలాంటి కష్టాలు లేకుండా చూసుకుంటాను' అంటుంది ట్రైనీ ఏసీఎస్ (అస్సాం సివిల్ సర్వీస్) ఆఫీసర్ అయిన దీక్ష.

హెల్దీ డైట్

చుకౌనీ



కావలసినవి: పెరుగు – 2 కప్పులు (చిలకాలి); బంగాళదుంప– 2; ఉల్లిపాయ – 1 (తరగాలి); పచ్చిమిర్చి– 2 (తరగాలి); మిరప్పొడి– అర టీ స్పూన్; ఆమ్‌చూర్ పొడర్– టీ స్పూన్; పసుపు – టీ స్పూన్; ఆవ నూనె లేదా ఇతర వంట నూనె– 2 టేబుల్ స్పూన్‌లు; కసూరి మేథీ– టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు– కప్పు; నిమ్మరసం– టీ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

తయారీ:


● బంగాళదుంపలను ఉడికించి తొక్క వలిచి, ముక్కలుగా కట్ చేయాలి ● ఒక పాత్రలో పెరుగు, మిరప్పొడి (కొద్దిగా), ఉప్పు, ఆమ్‌చూర్ పొడి వేసి కలపాలి ● ఆ తర్వాత అందులో బంగాళదుంప ముక్కలు, ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కొత్తిమీర వేయాలి ● పాత్రలో నూనె వేడి చేసి కసూరిమేథీ, మిరప్పొడి, పసుపు వేసి స్టవ్ ఆపేయాలి. అందులో బంగాళదుంప– పెరుగు మిశ్రమం, నిమ్మరసం కలపాలి. ఇది నేపాల్ వాళ్ల వంటకం. అన్నం, పరాఠాల్లోకి రుచిగా ఉంటుంది.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

పోషకాలు: పై కొలతలతో చేసింది రెండు సర్వింగ్స్‌కి వస్తుంది. ఒక్కో సర్వింగ్‌లో పోషకాలిలా... ● కేలరీలు – 220 ● ప్రొటీన్– 6 గ్రాములు ● కార్బొహైడ్రేట్‌లు– 25 గ్రాములు ● ఫ్యాట్ – 10 గ్రాములు ● ఫైబర్– 3 గ్రాముడు ● క్యాల్షియం– 120 మిల్లీ గ్రాములు.

ఫ్యాషన్ బ్యూటీ

ముత్యాలే డ్రెస్సులుగా!







ముత్యాల ఆభరణాలు మనసును ఆహ్లాదంగా మార్చేస్తాయి. ముత్యాల వరసలతో చేసిన డ్రెస్సులు వేసుకుంటే.. వేడుకలలో హైలైట్‌గా నిలుస్తున్న ఈ స్టైలిష్ డ్రెస్సులను సెలబ్రిటీలే కాదు నవతరమూ కోరుకుంటోంది. వెస్ట్రన్, ఇండియన్ పార్టీ ఏదైనా ముత్యాల డిజైనరీ డ్రెస్సులను ధరిస్తున్నారు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నారు.

● సాధారణంగా ఆభరణాలలో చూసే ముత్యాలను డ్రెస్ డిజైనింగ్‌లో విరివిగా ఉపయోగిస్తున్నారు. అందుకే, ముత్యాలు ఇటీవల ఫ్యాషన్‌లో కీలకమైన అంశంగా మారాయి.

● తెలుపు, సిల్వర్, వైట్ గోల్డ్ కాంబినేషన్‌లో ఉన్న మెటీరియల్‌పైన తెల్లని ముత్యాలను మరింత ఆకర్షణీయమైన ఎంపికగా డిజైనర్లు ఎంచుకుంటున్నారు. ఈ తరహా దుస్తులు స్వచ్ఛతకు, క్లాసీ లుక్‌కు ఉదాహరణగా నిలుస్తున్నాయి.

● శారీస్, స్కర్ట్స్ మీదకు టాప్స్‌గా ఉపయోగించే వాటిలో కోర్ జాకెట్స్, ఫ్రాగ్స్, బ్లౌజ్ బ్యాక్ డిజైన్‌కి ఎక్కువ శాతం ముత్యాల వరసలను ఎంచుకుంటున్నారు.

● లెహంగా, శారీ ఎంబ్రాయిడరీలోనూ జర్దోసీ, సీక్వెన్స్‌తో పాటు కాంబినేషన్‌గా ముత్యాల వరసలు విరివిగా కనిపిస్తున్నాయి.

● వింటర్–సమ్మర్ పార్టీవేర్‌కి, ఇండోవెస్ట్రన్ స్టైల్స్‌కి చిన్న, పెద్ద ముత్యాలను ఉపయోగిస్తూ చేసే డ్రెస్ డిజైన్స్ ఆకర్షణీయమైన ఎంపికగా మారింది.

● ముత్యాలతో చేసే డిజైన్స్ ఖరీదులో ఘనంగా ఉంటే వాటి స్థానంలో ఉపయోగించే వైట్ బీడ్స్‌తో రెప్లికా డిజైన్లు యువతను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. దీనితో తక్కువ ఖరీదులోనూ ఈ తరహా డిజైన్స్ లభిస్తున్నాయి.

● ఈ డిజైనరీ డ్రెస్సులే ఓ పెద్ద అట్రాక్షన్ కావడంతో మరే ఇతర ఆభరణాలు, హంగుల అవసరం ఉండదు.

నచ్చే మేకప్ నప్పాలి

మేకప్ అందంగా కనిపించడానికే కాదు ఆత్మవిశ్వాసాన్నీ కలిగిస్తుంది. అయితే, మేకప్ ఉత్పత్తుల ఎంపికలోనూ, వాడకంలోనూ సాధారణంగా కొన్ని పొరపాట్లు చేస్తుంటారు. వాటిని నివారించడానికి సరైన అవగాహన ఉండాలి.

వాతావరణానికి తగిన విధంగా

మేకప్ ఉత్పత్తులు సీజన్‌ని బట్టి వాడేవి ఉంటాయి. అందుకని, బ్రాండ్ అని కాకుండా ప్రొడక్ట్ గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలి. వేడి, చలి వాతావరణానికి తగిన నాణ్యమైన ఉత్పత్తులను ఎంచుకోవాలి. దీంతో పాటు అవి తమ చర్మ తత్త్వానికి ఎలా ఉపయోగపడతాయో చెక్ చేసుకోవాలి. అందుకు ప్రొడక్ట్స్ అమ్మేవారే స్కిన్ టెస్ట్‌కి అవకాశం ఇస్తారు.



శుభ్రత ముఖ్యం

మేకప్ వేసుకోవడానికి ముందు ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. చాలా మంది ఈ విషయాన్ని అంతగా పట్టించుకోరు. కానీ, అప్పటికే చర్మంపై పేరుకుపోయిన జిడ్డు, దుమ్ము కణాలు చేరుతాయి. ముఖం శుభ్రం చేయకుండా మేకప్ వేసుకుంటే బ్యాక్టీరియా ఎక్కువ వృద్ధి చెందుతుంది. దీనివల్ల కూడా ముఖ చర్మం త్వరగా పాడవుతుంది.

సాధారణ అవగాహన

లైనర్, ఫౌండేషన్, కాజల్.. ఇలా ఏ మేకప్ ప్రొడక్ట్ ఉపయోగించినా కొన్ని మిస్టేక్స్ సహజంగా జరుగుతుంటాయి. ఇలాంటప్పుడు మేకప్ పూర్తిగా తీసేయాల్సిన అవసరం లేదు. సాధారణంగా ఫౌండేషన్ అయితే బ్లెండింగ్ బాగా చేయాలి. ఎంత బాగా బ్లెండ్ చేస్తే లుక్ అంత బాగా వస్తుంది. బ్యూటీ ప్రొడక్ట్ ఎంత అవసరమో అంతే వాడాలి. లేదంటే ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. మేకప్‌లో ఫేస్ షేప్, స్కిన్ టోన్, బాడీకి తగినట్టు కూడా మేకప్ ఉంటుంది. ఇందుకు ముందుగా నిపుణుల సూచనలు తీసుకోవచ్చు.

మరికొన్ని...

● నాణ్యమైనవి, ఖరీదైనవి అని కాకుండా తమ స్కిన్ టోన్‌కి తగిన మేకప్ ప్రొడక్ట్స్ ఎంపిక చేసుకోవాలి. ● మేకప్‌కి ఒకరు వాడిన టవల్, బ్రష్, స్పాంజ్ వంటివి మరొకరు ఉపయోగించకూడదు. వాటిని పూర్తిగా శుభ్రం చేసిన తర్వాతనే తిరిగి వాడాలి. ● రాత్రి పడుకునే ముందు తప్పనిసరిగా మేకప్ తొలగించాలి. లేకపోతే స్వేదరంధ్రాలు మూసుకుపోయి, మచ్చలు ఏర్పడే అవకాశం ఉంది. ● ఫౌండేషన్‌ని ఒకసారి ఎక్కువ మొత్తంలో ఉపయోగిస్తే హెవీగా కనిపిస్తుంది. తక్కువ మొత్తాన్ని అప్లై చేసి, పూర్తిగా బ్లెండ్ చేయాలి.● మేకప్ ట్రెండ్స్‌ని అనుసరించడం కన్నా, తమ ముఖానికి నప్పే అలంకరణను ఎంచుకోవడం మేలు.

● రోజంతా ఉన్న మేకప్ పైన మరొకసారి టచప్ చేయకపోవడమే మంచిది. మస్కారా వంటివి మరొక కోట్ వేయకుండా బ్రష్‌ను తడిపి, కనురెప్పలపై అద్దవచ్చు.

● లిప్‌స్టిక్‌ను ఉపయోగించే ముందు లిప్ బ్రష్‌ను వాడితే, అలంకరణ నీటుగా వస్తుంది.



– శ్రీలేఖ, మేకప్ ఆర్టిస్ట్

● ముగ్గు ముచ్చట




దీప
తాడిపత్రి,
అనంతపూర్ జిల్లా

15 చుక్కలు,
8 వచ్చే వరకు.




భావన సర్వా
కె.ఆర్.ఆర్.హిల్స్,
హైదరాబాద్

21 చుక్కలు,
5 వరసలు,
5 వచ్చే వరకు,
చుక్క వదిలి చుక్క

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

యువర్స్

● టెక్.. టాక్

గ్రోక్ ఉచితంగా..

ఎక్స్(ట్విట్టర్) తన ఏఐ ఆధారిత చాట్‌బాట్ 'గ్రోక్'ను యూజర్‌లకు ఉచితంగా అందుబాటులోకి తేనుంది. గత సంవత్సరం 'హ్యూమర్ ఏఐ అసిస్టెంట్'గా మొదలుపెట్టిన 'గ్రోక్' గతంలో ప్రీమియం సబ్‌స్క్రైబర్‌లకు మాత్రమే అందుబాటులో ఉంది. ఇప్పుడు ఫ్రీ యూజర్‌లు ప్రతి రెండు గంటలకు పది మెసేజ్‌లు పంపవచ్చు. ప్రతిరోజూ మూడు చిత్రాలను మాత్రమే 'గ్రోక్' విశ్లేషించగలదు. గ్రోక్-2 బీటా లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌తో పనిచేస్తుంది.

వాట్సాప్‌లో త్రీ డాట్ ఇండికేటర్



చాట్ అవతలి చివర ఎవరైనా టైప్ చేస్తున్నప్పుడు యూజర్‌లకు కనిపించే 'త్రీ డాట్' ఇండికేటర్‌ను వాట్సాప్ పరిచయం చేస్తోంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్‌ల కోసం కొత్త టైపింగ్ ఇండికేటర్‌ను అందుబాటులోకి తెచ్చింది వాట్సాప్. 'ఎవరైనా గ్రూప్ లేదా 1:1 చాట్‌లో టైప్ చేయడం మొదలుపెట్టినప్పుడు మీరు ఒక విజువల్ '....' చూస్తారు. చాట్ స్క్రీన్ దిగువన, వారి ప్రొఫైల్ పిక్చర్‌తో పాటు, సంభాషణలలో ఎవరు యాక్టివ్‌గా పాల్గొంటున్నారో చూడడం సులభం అవుతుంది' అని వాట్సాప్ ప్రకటించింది. ఈ త్రీడాట్ ఇండికేటర్ ప్లాట్‌ఫామ్ గ్రూప్‌తో పాటు ఇండివిడ్యువల్ చాట్స్‌లో కనిపిస్తుంది.

నుబియా రెడ్ మ్యాజిక్ 10 ప్రో



డిస్‌ప్లే: 6.85 అంగుళాలు
రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జెడ్
రిజల్యూషన్: 1216×2688 పిక్సెల్స్
ఓఎస్: ఆండ్రాయిడ్ 15
ఫ్రంట్ కెమెరా: 16ఎంపీ
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 16జీబి ర్యామ్

టెక్నో మెగాప్యాడ్ 11



డిస్‌ప్లే: 11 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జెడ్ రిజల్యూషన్: 1200×1920 పిక్సెల్స్ మెమోరీ: 8జీబి/12జీబి 8జీబి/256జీబి
బ్యాటరీ: 8,000 ఎంఏహెచ్

● యంగ్ టాలెంట్



● గురువు థామస్‌తో సందడి

పెద్దల కోసం పిల్లలు రచయితలుగా మారి కథలు రాస్తున్నారు. 'ఆహా' అనిపించేలా వినసొంపుగా వినిపిస్తున్నారు. పేదింట్లో పుట్టిన చెన్నై శివారులోని కన్నగినగర్ విద్యార్థులు రచయితలుగా, వెంట్రిలాక్విస్ట్‌లుగా మారి పెద్దలకు కథలు చెబుతున్నారు. వినోదాన్ని పంచుతున్నారు. యూట్యూబ్ నుంచి ఎఫ్ఎం రేడియో వరకు రకరకాల వేదికలపై తమ ప్రతిభను చాటుకుంటున్నారు...

సీతాకోకచిలుకలై...

'ఈ ఘనతకు కారణం ఎవరు?' అనే ప్రశ్నకు జవాబు....చెన్నైకి చెందిన వెంట్రిలాక్విస్ట్ ఎల్ థామస్. 'క్యారీ విత్ లవ్' ట్రస్ట్ నిర్వాహకుడైన థామస్ వన్నత్తు పూచ్చిగల్ (సీతాకోక చిలుకలు) పేరుతో పిల్లలలోని సృజనాత్మక ప్రతిభకు మెరుగులు దిద్దుతున్నాడు.

కన్నగిరినగర్‌లో ఉండే శ్రీ అనే బాలుడు లాస్ట్ బెంచ్ స్టూడెంట్. అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. ఇక చదవడం తన వల్ల కాదు అనుకుంటున్న సమయంలో 'వన్నత్తు పూచ్చిగల్' వాట్సాప్ గ్రూప్ తన నిర్ణయాన్ని మార్చేలా చేయడమేకాదు రచయితగా మార్చింది. జంతువులు ప్రధాన పాత్రలుగా 'బొమ్మలాటం' అనే నాటకం రాశాడు. స్వీయ ఆలోచన అవసరం గురించి ఈ కథలో చెప్పాడు.

ఇదే ప్రాంతానికి చెందిన సంజన స్టోరీ క్రియేటర్‌గా ప్రశంసలు అందుకుంటుంది. పొట్టలం(గంజాయి) అనర్థాలను కళ్లకు కడుతూ రాసిన కథ అందరినీ ఆకట్టుకుంది. జ్యోతిశ్రీ అనే అమ్మాయి రాస్తే... ఎన్నో అక్షర దోషాలు కనిపించేవి. ఇప్పుడు అలా కాదు. చక్కని భాషలో రాస్తుంది. కథలతో మెప్పిస్తోంది. జ్యోతిశ్రీ చిన్న అక్క దివ్యదర్శిని కూడా రచనలు చేస్తోంది. ఆటో డ్రైవర్‌గా తండ్రి పడుతున్న కష్టాలు, గృహిణిగా తల్లి వేదనకు కథా రూపం ఇచ్చింది. ఈ కథలకు జ్యోతిశ్రీ పెద్ద అక్క నర్మద బొమ్మలు వేసింది. వీరు మచ్చుకు కొద్దిమంది మాత్రమే. ఇంకా ఎంతోమంది ఉన్నారు.



కళల వెలుగులో...
కళ అనేది కేవలం వినోదం కాదని భవిష్యత్ తరాలకు దిక్సూచి అని నిరూపిస్తున్నాడు ఎల్ థామస్. 'వన్నత్తు పూచ్చిగల్' ప్రభావంతో చదువులో వెనకబడిన పిల్లల్లో 'బాగా చదువుకోవాలి' అనే పట్టుదల పెరిగింది. తమకు ఇష్టమైన కళలో అక్షరాభ్యాసం చేసి ప్రతిభ చాటుకుంటున్నారు.

కథలు రాయడమే కాదు తమ వాక్చాతుర్యంతో 'వన్నత్తు పూచ్చిగల్' పేరుతో డిజిటల్ వేదికలపై కూడా సందడి చేస్తున్నారు. తమ అనుభవాలు, స్నేహితుల అనుభవాలు, ఎక్కడెక్కడో విన్న కథలను వినసొంపుగా చెబుతున్నారు. వారి మాటల్లో వినోదమే కాదు విజ్ఞానం, సామాజిక స్పృహ కూడా ఉంటాయి.

– అస్మతీన్ మైదీన్, సాక్షి, చెన్నై

● ఇన్నోవేషన్

సమస్యల గురించి వినడమే తప్ప పరిష్కారాల గురించి అవగాహన లేని వయసులో సైన్స్‌పై అమిత ఆసక్తి పెంచుకున్నాడు తమిళనాడుకు చెందిన శివసంతోష్. ఆ ఆసక్తే ఆవిష్కరణకు బీజం వేసింది. 21 ఏళ్ల వయసులో రోబోటిక్స్ స్టార్టప్‌ను ప్రారంభించేలా చేసింది...

అభయ హస్తమై...



● శివ సంతోష్

హెల్త్‌కేర్, ఎనర్జీ ప్రొడక్షన్, ఏరోస్పేస్ రంగాలకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించడానికి 21 ఏళ్ల శివసంతోష్ రోబోటిక్స్ స్టార్టప్ 'మైక్రోమోటిక్'ను ప్రారంభించాడు.

'లింబ్ మొబిలిటీ'ని పునరుద్ధరించడానికి డిజైన్ చేసిన ఈ తేలికపాటి వేరబుల్ మోటర్ సిస్టమ్ స్ట్రోక్, స్పైనల్ కార్డ్ ఇంజురీస్, సెరిబ్రల్ పాల్సీ, పార్కిన్సన్స్ డిసీజ్...మొదలైన బాధితులకు ఉపయోగపడుతుంది. ఈ లింబ్ అసిస్ట్‌ను ఉపయోగించి కప్పులు, ప్లేట్లు, బ్యాగులు... మొదలైన వాటిని పట్టుకోవచ్చు. తీసుకెళ్లవచ్చు. రాయవచ్చు. టైపింగ్ చేయవచ్చు. ఫింగర్ మూమెంట్స్‌కు సంబంధించి ఎన్నో పనుల్లో లింబ్ అసిస్ట్ సహాయపడుతుంది.



● లింబ్ అసిస్ట్

పుదుకొట్టై జిల్లా కీరమంగళం అనే చిన్న పట్టణంలో ఈ స్టార్టప్‌ను ప్రారంభించడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. దీనికి శివ చెప్పే జవాబు...'స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడం. మా ప్రాంతంలోని యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం. ఇన్నోవేషన్ కోసం పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదని నిరూపించాలనుకున్నాను'

శివసంతోష్‌కు చిన్నప్పటి నుంచి సైన్స్ అంటే ఎంతో ఇష్టం. రకరకాల యంత్రాలు ఏ విధంగా పనిచేస్తాయో తెలుసుకోవాలనే ఆసక్తి ఉండేది. స్కూల్ ప్రాజెక్ట్‌లతో సైన్స్‌పై మరింత ఆసక్తి పెరిగింది. సైన్స్‌కు సంబంధించి రకరకాల పోటీలలో విజేతగా నిలిచేవాడు. ఈ నేపథ్యంలో తన ఆలోచనలు ఆవిష్కరణల చుట్టూ తిరిగేవి.

'కోవిడ్ మహమ్మారి టైమ్‌లో స్థానిక ఆసుపత్రుల కోసం ఆటోమేటిక్ శానిటైజర్ స్ప్రేయర్, యూవీ జెర్మిసైడ్‌ను డెవలప్ చేశాను. మరో వైపు శాటిలైట్ టెక్నాలజీ గురించి అధ్యయనం చేయడం మొదలు పెట్టాను' అంటున్నాడు శివ. ఆ ఆసక్తి, అధ్యయనం అతడిని మరింత ముందుకు తీసుకెళ్లింది.

మూడు పదాలను నమ్ముకుంటే చాలు మనం ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి. అవి... ఎందుకు? ఏమిటి? ఎలా? సైన్స్‌పై ఆసక్తితో ఫ్యాన్ ఎలా తిరుగుతుంది? నుంచి విమానం ఎలా ఎగురుతుంది? వరకు ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. శాస్త్రీయ విషయాలపై లోతైన అవగాహన సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుంది.
– శివ సంతోష్

మెకాట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేసిన శివసంతోష్ ప్రస్తుతం చెన్నైలోని అన్నా యూనివర్శిటీ-కేసీజీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో బీఈ చదువుతున్నాడు. తన స్టార్టప్ కోసం ఎక్కువ సమయం కేటాయించేందుకు శివసంతోష్‌కు కాలేజీ అనుమతి ఇచ్చింది.

ఇంటిగ్రేటెడ్ సోలార్ సెల్స్‌తో మల్టీ యాక్సిస్ విండ్ టర్బైన్‌ను డెవలప్ చేయడంపై కూడా ఈ స్టార్టప్ కృషి చేస్తోంది. 'డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు, ఎమర్జెన్సీ సమయాల్లో ఇళ్లు, వ్యాపారాలకు బ్యాకప్ పవర్‌కు సంబంధించి పవర్ జెనరేషన్‌కు ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది' అంటున్నాడు శివసంతోష్.

● గేమింగ్



యోధుడు వస్తున్నాడు

యోధుడు వచ్చే వేళ అవుతుంది.. దుర్మార్గ పిశాశాల్లారా దూరంగా జరగండి. యోధుడి ఖడ్గ కాంతులతో అసాంఘిక శక్తులు తోక ముడిచే సమయం వచ్చింది. ఇది ఒక యోధుడి కథ. చెడు వెన్ను విరిచే పిడిబాకు కథ. ఆ యోధుడికి మీరు దగ్గర కావాలనుకుంటున్నారా? అయితే మీకు ది స్పిరిట్ ఆఫ్ ది సమురాయ్ స్వాగతం పలుకుతుంది.

యాక్షన్ అడ్వెంచర్ వీడియో గేమ్... ది స్పిరిట్ ఆఫ్ ది సమురాయ్. అలనాటి ఫ్యూడల్ జపాన్‌కు సంబంధించిన కథాంశంతో, పురాణాలలోని అంశాలతో ఈ డార్క్ అడ్వెంచర్ 2డీ గేమ్‌ను రూపొందించారు.

డెవలపర్స్: డిజిటల్ మైండ్ గేమ్స్
జానర్: యాక్షన్-అడ్వెంచర్
ప్లాట్‌ఫామ్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/సిరీస్ ఎస్

● ఇంగ్లీష్ ఇడియమ్స్

జంప్ టు కన్‌క్లూజన్స్

సరియైన సమాచారం లేకుండా ఒక పరిణామాన్ని లేదా గెలుపు ఓటములను ఊహించే సందర్భంలో వాడే మాట: జంప్ టు కన్‌క్లూజన్స్

ఉదా: వెయిట్ టిల్ వుయ్ గెట్ ది రిపోర్ట్. డోన్ట్ జంప్ టు కన్‌క్లూజన్స్

కాంట్ హోల్డ్ ఏ క్యాండిల్ టు



వ్యక్తులు, సంస్థల మధ్య సామర్థ్యం, నాణ్యత, పనితీరులో వ్యత్యాసానికి సంబంధించి వాడే మాట...కాంట్ హోల్డ్ ఏ క్యాండిల్ టు.

ఉదా: 1. ది రెస్టారెంట్ ఇన్ టౌన్ కాన్ట్ హోల్డ్ ఏ క్యాండిల్ టు ది వన్ వుయ్ విజిటెడ్ ఇన్ పారిస్.
2. నళిని ఈజ్ యాన్ ఎక్సలెంట్ చెఫ్, బట్ హర్ కుకింగ్ కాంట్ హోల్డ్ ఏ క్యాండిల్ టు హర్ మదర్స్.

2024లో తెలుగు తెరపై కనిపించని కథానాయికలెవరో తెలుసుకోవాలని ఉందా? అయితే 'మిస్ 2024' ఆర్టికల్ కోసం 'సాక్షి ఫ్లస్' ఈ పేపర్‌లో చూడండి.

సినిమా

భూత్ బంగ్లాలో టబు

హీరో అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'భూత్ బంగ్లా'. వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్, అస్రానీ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం టబును సంప్రదించారు. కథ నచ్చడంతో టబు కూడా ఓకే అన్నారు. ఇక 2000లో విడుదలైన హిందీ చిత్రం 'హేరా ఫేరి' తర్వాత హీరో అక్షయ్ కుమార్, హీరోయిన్ టబు, దర్శకుడు ప్రియదర్శన్‌లు కలిసి చేస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. అంటే... పదమూడు సంవత్సరాల తర్వాత ఈ ముగ్గురి కాంబినేషన్‌లో సినిమా కుదిరిందన్న మాట. 'భూత్ బంగ్లా' సినిమాను 2026 ఏప్రిల్ 2న విడుదల చేయాలని అనుకుంటున్నారు.



● టబు

పెదవుల పైన మెరుపులు మెరిశాయే...

''నా లైఫ్‌లోనున్న ఆ ప్రేమ పేజీ తీయనా... పేజీలో రాసున్న అందాల ఆ పేరు మీనా..' అంటూ మొదలవుతుంది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలోని 'మీనూ...' పాట. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. ఇందులో మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. వెంకటేశ్ భార్యగా ఐశ్వర్యా రాజేశ్, ఆయన మాజీ ప్రేయసిగా మీనాక్షీ చౌదరి నటించారు. ఈ ట్రయాంగిల్ క్రైమ్ కామెడీ సినిమాను 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. ఈ చిత్రం జనవరి 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'మీనూ...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ''చిరు చిరు జల్లుల్లో పెదవులు తడిశాయే... తడిసిన ఇద్దరి పెదవుల పైన మెరుపులు మెరిశాయే... ఉరుముల చప్పుడులో ఉరకలు మొదలాయే...' అంటూ ఈ పాట సాగుతుంది. ఈ పాటకు భాను మాస్టర్ కొరియోగ్రఫీ వహించారు. అనంత శ్రీరామ్ లిరిక్స్ అందించిన ఈ పాటను ప్రణవీ ఆచార్యతో కలిసి ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో పాడారు.



● మీనాక్షీ చౌదరి, వెంకటేశ్

మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్ చూసి థ్రిల్ అయ్యాను

- వంశీ



● రవి పాడి, వంశీ, హరీష్ శంకర్, పులగం చిన్నారాయణ

''నేను 'అన్వేషణ' సినిమా తీయడానికి హిచ్‌కాక్‌గారు కూడా ఓ ప్రేరణ. ఆయన తీసిన మొత్తం 53 సినిమాలు చూశాను. హిచ్‌కాక్ మీద పులగం చిన్నారాయణ, రవి పాడి తీసుకొచ్చిన 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పుస్తకం తొలి ప్రతిని చూసి థ్రిల్ అయ్యాను'' అని డైరెక్టర్ వంశీ చెప్పారు. ప్రముఖ దర్శకుడు ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా, ఆయన తొలి సినిమా ('ది ప్లెజర్ గార్డెన్') విడుదలై వందేళ్లయిన సందర్భంగా హిచ్‌కాక్ సినీ జీవితంపై ఐఆర్ఎస్ అధికారి రవి పాడితో కలిసి సీనియర్ జర్నలిస్ట్, సినీ రచయిత పులగం చిన్నారాయణ 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పేరుతో పుస్తకం తీసుకొచ్చారు. 45 మంది దర్శకులు, ఏడుగురు రచయితలు, పది మంది జర్నలిస్టులు రాసిన 62 వ్యాసాలతో కూడిన ఈ పుస్తకాన్ని డైరెక్టర్ వంశీ ఆవిష్కరించి, డైరెక్టర్ హరీష్ శంకర్‌కు, నటుడు నాజర్‌కు అందజేశారు. తొలి ప్రతిని 'సంతోషం' పత్రిక అధినేత, నిర్మాత సురేష్ కొండేటి ఐదు వేల రూపాయలు ఇచ్చి తీసుకున్నారు. పబ్లిసిటీ డిజైనర్ ఈశ్వర్ డిజైన్ చేసిన ఈ బుక్ కవర్ పేజీని డైరెక్టర్ మోహనకృష్ణ ఇంద్రగంటి ఆవిష్కరించారు. పుస్తకాన్ని పబ్లిష్ చేసిన అక్షౌహిణి మీడియా లోగోని హరీష్ శంకర్ ఆవిష్కరించారు. దర్శకులు శివ నాగేశ్వరరావు, చంద్ర సిద్ధార్థ, కరుణ కుమార్, వర ముళ్ళపూడి, దేవీ ప్రసాద్, సునీల్ కుమార్ రెడ్డి, సాయి కిశోర్ మచ్చా, రమేశ్ సామల, శ్రీమన్ వేముల, రచయిత తోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో ప్రేమకథ షురూ

జాతీయ అవార్డు సాధించిన 'కలర్ ఫోటో'లాంటి ఎమోషనల్ మూవీకి దర్శకత్వం వహించిన సందీప్ రాజ్ మరో ఎమోషనల్ మూవీని ప్రేక్షకులకు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. 'మోగ్లీ 2025' టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రంలో రోషన్ కనకాల హీరో. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించనున్న ఈ చిత్రం గురువారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కెమెరా స్విచాన్ చేయగా, మరో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా క్లాప్ ఇచ్చారు. టీజీ విశ్వప్రసాద్ స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందజేశారు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ప్రేమకథతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. వచ్చే నెల రెగ్యులర్ షూట్‌ని ఆరంభిస్తామని మేకర్స్ తెలిపారు. సాక్షీ సాగర్ మదోల్కర్ హీరోయిన్‌గా పరిచయం కానున్న ఈ చిత్రానికి సంగీతం: కాల భైరవ, కెమెరా: రామ మారుతి .ఎమ్.



● సందీప్ వంగా, రోషన్ కనకాల, సాక్షీ సాగర్ మదోల్కర్

ఫిబ్రవరిలో దిల్ రుబా

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న లవ్ అండ్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'దిల్ రుబా'. ఈ చిత్రంలో రుక్సర్ ధిల్లాన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోష్, రాకేశ్ రెడ్డి, సారెగమ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఫిబ్రవరిలో రిలీజ్ చేయనున్నట్లు గురువారం వెల్లడించి, పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: డానియేల్ విశ్వాస్.



● కిరణ్ అబ్బవరం

ప్రతి పాత్ర ఆసక్తిగా...



● అనన్య, రవితేజ మహాదాస్యం

'వెన్నెల' కిశోర్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల, సీయా గౌతమ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. రైటర్ మోహన్ దర్శకత్వంలో లాస్యా రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. 'క, పొలిమేర 2, కమిటీ కుర్రోళ్లు' చిత్రాలతో విజయాలు అందుకున్న వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. గురువారం జరిగిన సమావేశంలో దర్శకుడు, రైటర్ మోహన్ మాట్లాడుతూ– ''ఉత్తరాంధ్ర నేపథ్యంలో జరిగే కథ ఇది. రాజీవ్ గాంధీ హత్యకు గురైన రోజు జరిగే కథే ఈ చిత్రం. ఆయన విశాఖ పర్యటనను ముగించుకుని, శ్రీ పెరంబుదూర్ వెళ్లి, అక్కడ హత్యకు గురయ్యారు. అలాంటి ఓ పెద్ద సంఘటన జరిగినప్పుడు చిన్న సంఘటనలను ఎవ్వరూ పటించుకోరు. ఆ రోజు జరిగిన ఘటనలకు కొన్ని కల్పితాలు జోడించి, అల్లుకున్న కథతో ఈ చిత్రం తీశాం'' అని అన్నారు. ''ఈ సినిమాలో నా క్యారెక్టర్ కొత్తగా ఉంటుంది'' అని పేర్కొన్నారు అనన్య నాగళ్ల. ''ప్రతి క్యారెక్టర్ ఆసక్తికరంగా ఉండేలా ఈ కథను మలిచారు మోహన్‌గారు'' అని చెప్పారు రవితేజ మహాదాస్యం. ''ఈ సినిమాకు కథే హీరో. ఇది సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ. స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు బలం. సినిమా చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది'' అని తెలిపారు వంశీ నందిపాటి. ''కథను నమ్మి ఈ సినిమా చేశాను'' అన్నారు రమణా రెడ్డి.

గాఢమైన ప్రేమకథ



● చంద్రహాస్, వీవీ వినాయక్

చంద్రహాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘనా ముఖర్జీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో అర్జున్ మహి విలన్‌గా నటిస్తున్నారు. సంపత్ రుద్ర దర్శకత్వంలో కాకర్ల సత్యనారాయణ సమర్పణలో గెడా చందు, గాయత్రి చిన్ని, ఏవీఆర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు వీవీ వినాయక్ రిలీజ్ చేశారు. గురువారం జరిగిన సమావేశంలో చంద్రహాస్ మాట్లాడుతూ– ''బరాబర్ ప్రేమిస్తా' టీజర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. ఈ సినిమాలో నేను హీరోగా నటించడానికి కారణమైన డీవోపీ శేఖర్ అన్నకు థ్యాంక్స్'' అన్నారు. ''ఇంటెన్స్ లవ్‌స్టోరీ ఫిల్మ్ ఇది'' అని తెలిపారు సంపత్ రుద్ర. ''సినిమా బాగా రావాలనుకున్నాను. అందుకే వర్కింగ్ డేస్, బడ్జెట్ పెరిగినా రాజీపడలేదు'' అని పేర్కొన్నారు చిన్ని గాయత్రి. మ్యూజిక్ డైరెక్టర్ ఆర్ఆర్ ధ్రువన్, రచయిత సురేష్ గంగుల, డైలాగ్ రైటర్ రమేష్ రాయ్ మాట్లాడారు.

బిగ్‌బాస్ విజేత నిఖిల్ ఇంటర్వ్యూ కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఓటీటీ ఇది చూడొచ్చు

ఇదో లవ్ క్రైమ్ థ్రిల్లర్

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం హిట్లర్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



నెవర్ జడ్జ్ ఎ బుక్ బై ఇట్స్ కవర్ అన్నట్లు... 'హిట్లర్' సినిమా పేరుకి, సినిమాకి అస్సలు సంబంధం ఉండదు. కానీ సినిమా మాత్రం ఓ అద్భుతమైన థ్రిల్లర్ అని చెప్పవచ్చు. 'హిట్లర్' ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతోంది. తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా లభ్యం. ధనశేఖరన్ ఈ సినిమాకి దర్శకుడు. ప్రముఖ తమిళ హీరో విజయ్ ఆంటోని, హీరోయిన్ రియా సుమన్ ప్రధాన పాత్రలలో నటించగా గౌతమ్ వాసుదేవ్ మీనన్ మరో ముఖ్య పాత్రలో నటించారు. చరణరాజ్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. ఇక 'హిట్లర్' కథ విషయానికొస్తే... ఇదో వినూత్నమైన కథ. హీరో సెల్వకు చెన్నైలోని ఓ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం వస్తుంది. దాని కోసం కరుక్కవేల్ అనే స్నేహితుడి రూమ్‌కి వస్తాడు సెల్వ. కరుక్కవేల్ తన కాలేజ్ స్నేహితుడని గుర్తు చేస్తాడు సెల్వ. కానీ కరుక్కవేల్ తాను సెల్వని ఇప్పుడే చూస్తున్నానని చెప్తాడు. ఇంతలో సెల్వకి ఓ రైల్వే స్టేషన్‌లో అనుకోకుండా సారా పరిచయమవుతుంది. ఆ పరిచయం ప్రేమగా మారుతుంది. మరో పక్క నగరంలో పేరు మోసిన రౌడీ షీటర్లను ఎవరో బైక్‌లో వచ్చి ఓ రేర్ పిస్టల్‌తో చంపుతుంటారు. దానిని శక్తి ఇన్వెస్టిగేట్ చేస్తుంటాడు. ఆ విచారణలో భాగంగా ఎన్నికలలో పోటీ చేయబోతున్న రాజకీయవేత్త రాజవేలు బ్లాక్ మనీ దాదాపు 500 కోట్లు పోయిందని తెలుస్తుంది. ఓ పక్క సెల్వ, సారా లవ్ ట్రాక్, మరో పక్క రౌడీ షీటర్ హత్యలు, ఆ పైన డబ్బు పోవడం... ఈ మూడూ పేరలల్‌గా నడుపుతూ కథను అనూహ్యమైన మలుపులతో ఈ సినిమా స్క్రీన్‌ప్లే చూసే ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. ఊహించని ట్విస్టులే ఈ సినిమాకి ప్రాణం. ఈ వీకెండ్ చూడదగ్గ సినిమా 'హిట్లర్'. కాకపోతే పిల్లలకు ఈ సినిమాని దూరంగా ఉంచాలి. పేరుకే ఈ సినిమా 'హిట్లర్' కానీ సినిమా మాత్రం సూపర్ హిట్టు.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▼	964	79,218
నిఫ్టీ ▼	247	23,952

విదేశీ సూచీలు (తాజా రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్‌	19,424	▲	30
డోజోన్స్‌	42,443	▲	116
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,105	▼	94
డాక్స్‌	19,969	▼	273
షాంఘై	3,370	▼	12
నికాయ్‌	38,814	▼	268

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,013	▼	645
బంగారం (99.5 స్వచ్ఛత)	75,709	▼	642
వెండి (కిలో)	87,,035	▲	2,025

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	84.62	85.64
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	106.60	109.41
€	యూరో	ఎస్‌బీఐ	87.06	89.66
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	54.14	55.51
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	50.94	55.37
S$	సింగపూర్‌ డాలర్‌	థామస్‌కుక్‌	60.55	65.23
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	21.80	23.33
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	22.28	24.04
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	12.60	10.78§ýl



‘ఫెడ్‌’ పంజా!

- 80,000 దిగువకు సెన్సెక్స్‌; 964 పాయింట్లు పతనం
- 24,000 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ; 247 పాయింట్లు నష్టం
- ఫెడ్‌ అవుట్‌లుక్‌ ఎఫెక్ట్‌

ముంబై: ఫెడరల్‌ రిజర్వ్‌ వచ్చే ఏడాది నుంచి ఆశించిన స్థాయిలో వడ్డీరేట్ల తగ్గింపు ఉండకపోవచ్చని సంకేతాలివ్వడంతో ఈక్విటీ మార్కెట్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా బాండ్లపై రాబడులు ఏడు నెలల గరిష్టానికి, డాలర్‌ ఇండెక్స్‌ రెండున్నర ఏళ్ల గరిష్టానికి చేరుకోవడమూ ప్రతికూల ప్రభావం చూపాయి. దేశీయ ఈక్విటీ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు కొనసాగాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్‌ 964 పాయింట్లు క్షీణించి 80 వేల స్థాయి దిగువన 79,218 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 247 పాయింట్లు నష్టపోయి 23,952 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది వరుసగా నాలుగో రోజూ నష్టాల ముగింపు. అమెరికా, ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే భారీ నష్టాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్‌ 1,153 పాయింట్లు పతనమై 79,029 వద్ద, నిఫ్టీ 322 పాయింట్లు పతనమై 23,877 వద్ద ట్రేడింగ్‌ ప్రారంభించాయి. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు కొనసాగడంతో సూచీలు ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. రోజంతా భారీ నష్టాలతో ట్రేడయ్యాయి. ముఖ్యంగా వడ్డీరేట్ల ఆధారిత బ్యాంకులు, రియల్టీ షేర్లతో పాటు ఐటీ షేర్లు భారీగా నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌ క్యాప్‌ సూచీలు 0.30%, 0.28 శాతం బలహీనపడ్డాయి.

ప్రపంచ మార్కెట్లపై ఫెడ్‌ ఎఫెక్ట్‌...

ఆశించినట్లే ఫెడ్‌ రిజర్వ్‌ కీలక వడ్డీరేట్లను పావు శాతం తగ్గించినప్పటికీ.. వచ్చే ఏడాది నుంచి రేట్ల తగ్గింపులో దూకుడు ఉండదంటూ సంకేతాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఆసియాలో అన్ని దేశాల స్టాక్‌ సూచీలు రెండుశాతం నష్టపోయాయి. బ్యాంక్‌ ఆఫ్‌ ఇంగ్లండ్‌లు కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించడంతో యూరప్‌ మార్కెట్లు ఒక శాతం పతనమయ్యాయి. ఫెడ్‌ రిజర్వ్‌ ప్రకటన రోజు (బుధవారం రాత్రి) 3% నష్టపోయిన అమెరికా మార్కెట్లు గురువారం ట్రేడింగ్‌లో రికవరీ బాటపట్టాయి. యూఎస్‌ స్టాక్‌ సూచీలు నాస్‌డాక్‌ 1%, డోజోన్స్‌ అరశాతం లాభంతో ట్రేడవుతున్నాయి.

- సెన్సెక్స్‌ సూచీలో 30 షేర్లలో సన్‌ఫార్మా(1%), హెచ్‌యూఎల్‌ (0.11%), పవర్‌గ్రిడ్‌(0.09%) మాత్రమే లాభపడ్డాయి. అత్యధికంగా బజాజ్‌ ఫిన్‌సర్వ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఏషియన్‌ సిమెంట్స్, బజాజ్‌ ఫైనాన్స్‌ ఐసీఐసీఐ బ్యాంక్‌ షేర్లు 2.50% - 2% నష్టపోయాయి. ఐటీ ఇండెక్స్‌ 1.20% అత్యధికంగా పడింది. ఆటో, కన్జూమర్‌ డ్యూరబుల్స్‌ సూచీలు 1.25%, బ్యాంకెక్స్, ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ సూచీలు 1% నష్టపోయాయి.
- రిలయన్స్‌ (-2%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ (-1%), టీసీఎస్‌(-2%), ఐసీఐసీఐ బ్యాంక్‌ (-2%), ఇన్ఫీ(1.50%), ఎల్‌అండ్‌టీ (1%) నష్టపోయి సూచీల పతనాన్ని శాసించాయి.

4 రోజుల్లో రూ.9.65 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్‌ మార్కెట్‌ వరుస నష్టాలతో ఇన్వెస్టర్లకు భారీ నష్టం వాటిల్లింది. నాలుగు రోజుల్లో సెన్సెక్స్‌ 2,915 పాయింట్ల (3.54%) పతనంతో రూ. 9.65 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని మొత్తం లిస్టెడ్‌ కంపెనీల మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ రూ.449.76 లక్షల కోట్ల (5.29 ట్రిలియన్‌ డాలర్లు)కు దిగివచ్చింది.

రూపాయి @ 85.13



అంతర్జాతీయంగా డాలర్‌ మారకంలో రూపాయి విలువ తొలిసారి 85.00 స్థాయి దిగువకు పతనమైంది. తాజాగా గురువారం 19 పైసలు బలహీనపడి జీవితకాల కనిష్టం 85.13 వద్ద ముగిసింది. వచ్చే ఏడాది నుంచి ఫెడ్‌ రిజర్వ్‌ ‘కఠిన ద్రవ్య విధాన వైఖరి అమలు యోచన’ వ్యాఖ్యలతో డాలర్‌ ఇండెక్స్‌ రెండున్నరేళ్ల గరిష్టానికి (108.15) చేరుకోవడం దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచింది. ఉదయం ఫారెక్స్‌ మార్కెట్లో బలహీనంగా మొదలైన రూపాయి ఇంట్రాడేలో 20 పైసలు క్షీణించి 85.14 వద్ద సరికొత్త కనిష్ట స్థాయిని తాకింది.

ఇన్వెంచర్స్‌ నాలెడ్జ్‌ సొల్యూషన్స్‌ లిస్టింగ్‌ హిట్‌



రేఖా ఝున్‌ఝున్‌వాలాకు చెందిన హెల్త్‌కేర్‌ టెక్నాలజీ కంపెనీ ఇన్వెంచర్స్‌ నాలెడ్జ్‌ సొల్యూషన్స్‌ లిస్టింగ్‌ విజయవంతమైంది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.1,329)తో పోలిస్తే 40% ప్రీమియంతో రూ.1,856 వద్ద లిస్టయ్యింది. నష్టాల మార్కెట్లోనూ మద్దతు లభించింది. ఇంట్రాడేలో 53% ఎగసి రూ.2,030 వద్ద గరిష్టాన్ని తాకి. చివరికి 47% లాభంతో రూ.1960 వద్ద క్లోజైంది.

కట్టాల్సిన దానికంటే ఎక్కువే తీసుకున్నారు..

ఈడీ, బ్యాంకులపై మాల్యా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: కింగ్‌ఫిషర్‌ ఎయిర్‌లైన్స్‌ (కేఎఫ్‌ఏ) రుణాలకు సంబంధించి గ్యారంటారుగా తాను కట్టాల్సిన దానికంటే ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్, బ్యాంకులు రెట్టింపు రాబట్టాయని పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్‌ మాల్యా వ్యాఖ్యానించారు. ఈడీ, బ్యాంకులు మొత్తం రూ. 14,131.6 కోట్లు వసూలు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ పార్లమెంటులో స్వయంగా ప్రకటించారని ఆయన చెప్పారు. డెట్‌ రికవరీ ట్రిబ్యునల్‌ ప్రకారం వడ్డీ రూ. 1,200 కోట్లతో కలిపి కేఎఫ్‌ఏ రుణ భారం రూ. 6,203 కోట్లేనని తెలిపారు. ఈ నేపథ్యంలో దీనిపై తాను ఉపశమనం పొందడానికి తగు చర్యలు తీసుకుంటానని మాల్యా వివరించారు. రుణానికి రెండు రెట్లు ఎందుకు వసూలు చేశాయో ఈడీ, బ్యాంకులు చట్టబద్ధంగా సహేతుకమైన కారణాలు చూపాల్సి ఉంటుందని చెప్పారు. పలు బ్యాంకులకు కేఎఫ్‌ఏ రూ. 9,000 కోట్లకు పైగా డిఫాల్ట్‌ అయిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాల్యా 2016లో బ్రిటన్‌కు పారిపోయిన సంగతి తెలిసిందే.



కియా కొత్త ఎస్‌యూవీ సిరోస్‌

- జనవరి 3 నుంచి బుకింగ్స్‌
- ఫిబ్రవరిలో డెలివరీలు షురూ
- ధర రూ.10-15 లక్షలు!



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: వాహన తయారీ సంస్థ కియా ఇండియా సరికొత్త సబ్‌ కాంపాక్ట్‌ ఎస్‌యూవీ సిరోస్‌ను భారత్‌ వేదికగా అంతర్జాతీయంగా ఆవిష్కరించింది. 2025 జనవరి 3 నుంచి బుకింగ్స్‌ ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి మొదటి వారం నుంచి డెలివరీలు మొదలవుతాయి. ధర ఎక్స్‌షోరూంలో రూ.10-15 లక్షల మధ్య ఉండే అవకాశం ఉంది. 118 బీహెచ్‌పీ, 172 ఎన్‌ఎం టార్క్‌తో పెట్రోల్‌ వేరియంట్‌ 1.0 లీటర్‌ త్రీ-సిలిండర్‌ టర్బోచార్జ్‌డ్‌ ఇంజిన్‌తో తయారైంది. 6 స్పీడ్‌ మాన్యువల్‌ లేదా 7 స్పీడ్‌ డ్యూయల్‌ క్లచ్‌ ఆటోమేటిక్‌ గేర్‌బాక్స్‌ను ఎంచుకోవచ్చు. లెవెల్‌-2 అడాస్, 6 ఎయిర్‌బ్యాగ్స్, ఎలక్ట్రానిక్‌ స్టెబిలిటీ కంట్రోల్, హిల్‌ స్టార్ట్‌ అసిస్ట్‌ వంటి భద్రతా ఫీచర్లు జోడించారు. 30 అంగుళాల పనోరమిక్‌ డ్యూయల్‌ స్క్రీన్‌ సెటప్, 360 డిగ్రీ పార్కింగ్‌ కెమెరా, పనోరమిక్‌ సన్‌రూఫ్‌ వంటి హంగులు జోడించారు.

‘సాక్షి ప్లస్‌’ ఈ-పేపర్‌లో ..
స్టోరేజ్‌ చిప్‌సెట్స్‌ తయారీలోకి మైక్రోమ్యాక్స్‌ | ఐవోసీ రూ.21 వేల కోట్ల పెట్టుబడి



మెరిసిన త్రిష... భారత్‌ ఘనవిజయం

కౌలాలంపూర్‌: ఆసియా కప్‌ అండర్‌-19 మహిళల టి20 క్రికెట్‌ టోర్నమెంట్‌ ‘సూపర్‌ ఫోర్‌’ దశలో భారత్‌ శుభారంభం చేసింది. బంగ్లాదేశ్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. 81 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు 12.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 86 పరుగులు సాధించి నెగ్గింది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (46 బంతుల్లో 58 నాటౌట్‌; 10 ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో అదరగొట్టింది. కమలిని (0), సనిక చాల్కె (1) వెంటవెంటనే అవుటైనా కెప్టెన్‌ నిక్కీ ప్రసాద్‌ (14 బంతుల్లో 22 నాటౌట్‌; 1 ఫోర్, 2 సిక్స్‌లు)తో కలిసి ‘ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌’ త్రిష టీమిండియాను విజయతీరాలకు చేర్చింది. అంతకుముందు బంగ్లాదేశ్‌ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 80 పరుగులు సాధించింది. భారత బౌలర్లలో ఆయుషి శుక్లా 3 వికెట్లు, సోనమ్‌ యాదవ్‌ 2 వికెట్లు పడగొట్టారు. నేడు జరిగే మరో ‘సూపర్‌ ఫోర్‌’ మ్యాచ్‌లో శ్రీలంకతో భారత్‌ తలపడుతుంది.



భారత మహిళల ‘రికార్డు’ విజయం

టి20ల్లో జట్టు అత్యధిక స్కోరు నమోదు

- 60 పరుగులతో ఓడిన వెస్టిండీస్‌
- చెలరేగిన స్మృతి, రిచా ఘోష్‌
- సిరీస్‌ 2-1తో సొంతం

ముంబై: భారత మహిళల క్రికెట్‌ జట్టు రికార్డు ప్రదర్శనతో వెస్టిండీస్‌తో జరిగిన టి20 సిరీస్‌ను సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్‌లో, ఆపై బౌలింగ్‌లో చెలరేగిన భారత్‌ 60 పరుగుల తేడాతో విండీస్‌ మహిళల జట్టుపై ఘన విజయం సాధించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో గెలుచుకుంది. టాస్‌ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్‌ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. తాత్కాలిక కెప్టెన్‌ స్మృతి మంధాన (47 బంతుల్లో 77; 13 ఫోర్లు, 1 సిక్స్‌), వికెట్‌ కీపర్‌ రిచా ఘోష్‌ (21 బంతుల్లో 54; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగగా... జెమీమా రోడ్రిగ్స్‌ (28 బంతుల్లో 39; 4 ఫోర్లు), రాఘ్వీ బిస్త్‌ (22 బంతుల్లో 31 నాటౌట్‌; 2 ఫోర్లు, 1 సిక్స్‌) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం వెస్టిండీస్‌ 20 ఓవర్లలో 9 వికెట్లకు 157 పరుగులు చేసింది. చినెల్‌ హెన్రీ (16 బంతుల్లో 43; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్‌ స్కోరర్‌గా నిలవగా, రాధ యాదవ్‌కు 4 వికెట్లు దక్కాయి. ఇరు జట్ల మధ్య ఆదివారం వడోదరలో తొలి వన్డే జరుగుతుంది.

మెరుపు బ్యాటింగ్‌...

తొలి ఓవర్‌లోనే ఉమా ఛెత్రి (0) అవుట్‌ కావడంతో భారత్‌ ఇన్నింగ్స్‌ పేలవంగా ఆరంభమైంది. అయితే ఆ తర్వాత స్మృతి, జెమీమా కలిసి విండీస్‌ బౌలర్లపై చెలరేగారు. హెన్రీ ఓవర్లో వరుసగా 3 ఫోర్లు కొట్టిన స్మృతి... డాటిన్‌ వేసిన తర్వాతి ఓవర్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌ బాదడంతో 20 పరుగులు వచ్చాయి. కరిష్మా ఓవర్లో జెమీమా 3 ఫోర్లు సాధించడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 61 పరుగులకు చేరింది. 27 బంతుల్లో ఆమె అర్ధ సెంచరీ పూర్తయింది. రెండో వికెట్‌కు జెమీమాతో 98 పరుగులు (55 బంతుల్లో), మూడో వికెట్‌కు రాఘ్వీతో 44 పరుగులు (27 బంతుల్లో) జోడించిన తర్వాత స్మృతి వెనుదిరిగింది. అయితే ఆ తర్వాత వచ్చిన రిచా విరుచుకుపడింది. తన తొలి మూడు బంతులనే 6, 4, 4గా మలచిన ఆమె హేలీ ఓవర్లో వరుసగా 2 సిక్స్‌లు బాదింది. అలీన్‌ బౌలింగ్‌లో మరో భారీ సిక్స్‌తో 18 బంతుల్లో రిచా రికార్డు హాఫ్‌ సెంచరీని అందుకుంది. ఛేదనలో విండీస్‌ బ్యాటర్లంతా తడబడ్డారు. అసాధారణ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఒత్తిడికి గురై వరుసగా వికెట్లు సమర్పించుకున్నారు. హెన్రీ కొద్దిగా పోరాడటం మినహా మిగతా వారంతా విఫలం కావడంతో విజయానికి జట్టు చాలా దూరంలో నిలిచిపోయింది.


ప్లేయర్‌ ఆఫ్‌ ద సిరీస్‌ ట్రోఫీతో స్మృతి

స్కోరు వివరాలు

భారత్‌ ఇన్నింగ్స్‌: స్మృతి (సి) హెన్రీ (బి) డాటిన్‌ 77; ఉమా ఛెత్రి (సి) జోసెఫ్‌ (బి) హెన్రీ 0; జెమీమా (ఎల్బీ) (బి) ఫ్లెచర్‌ 39; రాఘ్వీ బిస్త్‌ (నాటౌట్‌) 31; రిచా ఘోష్‌ (సి) హెన్రీ (బి) అలీన్‌ 54; సజన (నాటౌట్‌) 4; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 217. వికెట్ల పతనం: 1-1, 2-99, 3-143, 4-213. బౌలింగ్‌: చినెల్‌ హెన్రీ 2-0-14-1, డాటిన్‌ 4-0-54-1, హేలీ మాథ్యూస్‌ 4-0-34-0, కరిష్మా 3-0-44-0, అలీన్‌ 4-0-45-1, ఫ్లెచర్‌ 3-0-24-1.

వెస్టిండీస్‌ ఇన్నింగ్స్‌: హేలీ మాథ్యూస్‌ (సి) సజన (బి) రాధ 22; ఖియానా జోసెఫ్‌ (సి) టిటాస్‌ సాధు (బి) సజన 11; డాటిన్‌ (సి) రాధ (బి) టిటాస్‌ సాధు 25; క్యాంప్‌బెల్‌ (సి) స్మృతి (బి) దీప్తి 17; చినెల్‌ హెన్రీ (సి) రాఘ్వీ (బి) రేణుక 43; గ్రాఫ్టన్‌ (రనౌట్‌) 9; అలీన్‌ (బి) రాధ 6; షబిక (సి) సజన (బి) రాధ 3; జైదా (సి) రిచా (బి) రాధ 7; ఫ్లెచర్‌ (నాటౌట్‌) 5; కరిష్మా (నాటౌట్‌) 3; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 157. వికెట్ల పతనం: 1-20, 2-57, 3-62, 4-96, 5-129, 6-136, 7-137, 8-142, 9-147. బౌలింగ్‌: రేణుకా సింగ్‌ 3-0-16-1, సజీవన్‌ సజన 2-0-16-1, సైమా ఠాకూర్‌ 4-0-33-0, టిటాస్‌ సాధు 3-0-31-1, రాధ యాదవ్‌ 4-0-29-4, దీప్తి శర్మ 4-0-31-1.

217/4 అంతర్జాతీయ టి20ల్లో భారత మహిళల జట్టుకు ఇదే అత్యధిక స్కోరు. ఇదే ఏడాది యూఏఈపై సాధించిన 201/5 స్కోరును భారత్‌ అధిగమించింది.

18 హాఫ్‌ సెంచరీకి రిచా తీసుకున్న బంతులు. సోఫీ డివైన్, లిచ్‌ఫీల్డ్‌ పేరిట వేగవంతమైన అర్ధసెంచరీ రికార్డును రిచా సమం చేసింది.

30 స్మృతి మంధాన అర్ధ సెంచరీల సంఖ్య. సుజీ బేట్స్‌ (29)ను అధిగమించి అగ్ర స్థానానికి చేరింది.

763 ఈ ఏడాది అంతర్జాతీయ టి20ల్లో స్మృతి చేసిన పరుగులు. క్యాలెండర్‌ ఏడాదిలో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా చమరి అటపట్టు (720) రికార్డును స్మృతి సవరించింది.

హైబ్రిడ్‌ పద్ధతే ఖరారు

తటస్థ వేదికపై భారత్‌ ‘చాంపియన్స్‌’ పోరు

- అధికారికంగా వెల్లడించిన ఐసీసీ
- యూఏఈలో టీమిండియా మ్యాచ్‌లు?
- త్వరలోనే షెడ్యూల్‌ విడుదల



దుబాయ్‌: భారత్‌ను ఎలాగైనా ఈసారి తమ దేశంలో ఆడించాలన్న పాకిస్తాన్‌ క్రికెట్‌ బోర్డు (పీసీబీ) పంతం నెరవేరలేదు. హైబ్రిడ్‌ పద్ధతి కుదరదని మొండికేసిన పీసీబీకి అనుకున్నట్లే చుక్కెదురైంది. భారత క్రికెట్‌ నియంత్రణ మండలి (బీసీసీఐ) కోరినట్లే టీమిండియా ఆడాల్సిన మ్యాచ్‌ల్ని తటస్థ వేదికపై నిర్వహిస్తామని అంతర్జాతీయ క్రికెట్‌ మండలి (ఐసీసీ) గురువారం అధికారికంగా వెల్లడించింది. వేదిక ఫలానా అని స్పష్టంగా చెప్పకపోయినా యూఏఈలోని దుబాయ్‌నే ఖరారు చేయనున్నట్లు ఐసీసీ వర్గాలు వెల్లడించాయి. పైగా ముందు నుంచీ కూడా దుబాయ్‌లో అయితేనే చాంపియన్స్‌ ట్రోఫీ ఆడతామని లేదంటే లేదని బీసీసీఐ ఇది వరకే పలుమార్లు స్పష్టం చేసింది. దీంతో దుబాయ్‌ దాదాపు ఖాయం కానుంది! టీమిండియా లీగ్‌ మ్యాచ్‌లు సహా నాకౌట్‌ చేరినా కూడా అక్కడే ఇతర దేశాలు వచ్చి ఆడి వెళతాయి. ‘2024-2027 సైకిల్‌లో జరిగే ఐసీసీ టోర్నీల్లో భారత్, పాక్‌లు ఆడే అన్నీ మ్యాచ్‌లు తటస్థ వేదికల్లో నిర్వహించుకునేందుకు ఐసీసీ బోర్డు ఆమోదించింది’ అని ఐసీసీ ఒక ప్రకటన విడుదల చేసింది. మొత్తం మీద ఇన్నాళ్లు భారత్‌లో ఆడేందుకు వచ్చిన పాక్‌ ఇకపై అలా రాదు. ఈ విషయంలో పాక్‌కు తమ మాట నెగ్గించుకున్న తృప్తి మిగిలింది.

ఇక్కడితోనే అయిపోలేదు!

భారత బోర్డు అనుకున్నది అయితే సాధించింది. కానీ ఇక మీదట భారత్‌లో పాక్‌ కూడా ఆడదు. గతేడాది భారత్‌ ఆతిథ్యమిచ్చిన వన్డే ప్రపంచకప్‌లో పాల్గొన్న పాకిస్తాన్‌ జట్టు ఇకపై తమ మ్యాచ్‌ల్ని హైబ్రిడ్‌ పద్ధతిలోనే ఆడేందుకు ఐసీసీ వద్ద ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా 2027-2028 సీజన్‌ వరకు భారత్‌లో జరిగే పురుషుల, మహిళల ఐసీసీ మెగా ఈవెంట్లలో పోటీపడేందుకు పాక్‌ జట్లు రావు. పీసీబీ కోరిన తటస్థ వేదికలు... యూఏఈ లేదంటే శ్రీలంక దేశాల్లో పాకిస్తాన్‌ మ్యాచ్‌లు జరుగుతాయి. వచ్చే ఏడాది భారత్‌లో మహిళల వన్డే ప్రపంచకప్, 2026లో భారత్, శ్రీలంకలు సంయుక్తంగా నిర్వహించే పురుషుల టి20 ప్రపంచకప్‌ టోర్నీలకు సంబంధించిన మ్యాచ్‌లు తటస్థ వేదికలపై జరుగుతాయి. విశ్వసనీయ వర్గాల ప్రకారం పాక్‌లో భారత్‌ ఆడాల్సిన మ్యాచ్‌లు యూఏఈ (దుబాయ్‌)లో... భారత్‌లో పాక్‌ ఆడాల్సిన మ్యాచ్‌లు శ్రీలంకలో జరుగుతాయి.

‘రిటైర్మెంట్‌పై ఎలాంటి విచారం లేదు’

- ఇష్టప్రకారమే ఆట ముగించానన్న అశ్విన్‌
- స్వస్థలం చేరుకున్న ఆఫ్‌ స్పిన్నర్‌

సాక్షి, చెన్నై: అంతర్జాతీయ క్రికెట్‌ నుంచి తప్పుకున్నా, తనలో ఎంతో క్రికెట్‌ మిగిలి ఉందని ఆఫ్‌స్పిన్నర్‌ రవిచంద్రన్‌ అశ్విన్‌ వ్యాఖ్యానించాడు. భారత జట్టు తరఫున ఆడకుంటేనేమి...మరో వేదికపై క్రికెటర్‌గానే కనిపిస్తానని అతను అన్నాడు. బ్రిస్బేన్‌లో రిటైర్మెంట్‌ ప్రకటన చేసిన అనంతరం భారత్‌కు బయల్దేరిన అశ్విన్‌ గురువారం ఉదయం స్వస్థలం చెన్నైకి చేరుకున్నాడు. ‘రిటైర్మెంట్‌ ప్రకటన తర్వాత ఎంతో ప్రశాంతంగా, సంతృప్తిగా ఉన్నాను. కొంత కాలంగా దీని గురించి ఆలోచిస్తూనే ఉన్నా. అందుకే నా మనసుకు అనిపించింది చేశా. మూడో టెస్టు నాలుగో రోజే స్పష్టమైన నిర్ణయం తీసుకున్నా. జాతీయ జట్టుకు కెప్టెన్‌ కాలేకపోయాననే విషయంపై కూడా ఎలాంటి విచారం లేదు. నేను అలాంటివి ఆలోచించే వాడిని కాదు’ అని అతను పేర్కొన్నాడు. చెన్నై విమానాశ్రయంలో అతనికి అభిమానులు, కుటుంబ సభ్యులు, ఆప్తులు ఘన స్వాగతం పలికారు. పూల మాలలతో ముంచెత్తి మేళ తాళాల నడుమ ఆహ్వానం పలికారు. రవిచంద్రన్‌ అశ్విన్‌ రాకతో ఆయన కుటుంబ సభ్యులు ఉద్వేగానికి లోనయ్యారు. ఈ అభిమానం పట్ల అశ్విన్‌ సంతోషం వ్యక్తం చేశాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్‌ ఈ-పేపర్‌లో




పాట్లు మావే.. పాఠాలు మావే

ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష అభియాన్ ఉపాధ్యాయులు పది రోజులుగా విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. దీంతో కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో బోధన నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లో తమకు తామే పాఠాలు చెప్పకుంటూ.. చదువుకుంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని భీంపూర్ మండల కేజీబీవీలో కనిపించిన దృశ్యమిది. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్.

క్లుప్తంగా...

హైదరాబాద్‌కు సత్య నాదెళ్ల, శంతను..

24న హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరు


సత్య నాదెళ్ల


శంతను నారాయణ్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థ మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల మరోసారి హైదరాబాద్‌కు రానున్నారు. మల్టీ నేషనల్ సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబీ సీఈవో శంతను నారాయణ్ కూడా వస్తున్నారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వీరిద్దరూ పాల్గొంటారు. ఈ నెల 24న సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. వందేళ్ల హెచ్‌పీఎస్‌తోపాటు జాగీర్దార్ కాలేజీ చరిత్రను, ఇన్నేళ్లలో సాధించిన మైలురాళ్ల గురించి రూపొందించిన 'ఫ్లైట్ ఆఫ్ ది ఈగల్' పుస్తకాన్ని వారు ఆవిష్కరించనున్నారు. వీరిద్దరూ హెచ్‌పీఎస్‌లోనే విద్యాభ్యాసం చేసిన విషయం తెలిసిందే. 2023లో హైదరాబాద్ వచ్చిన నాదెళ్ల.. మరోసారి ఇక్కడికి రానున్నారు. హెచ్‌పీఎస్‌లో పాఠశాల విద్య తర్వాత శంతను బీటెక్ ఈసీఈ ఉస్మానియా యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీలో చదివారు.

హౌసింగ్ బోర్డు భూముల చుట్టూ ప్రహరీ నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గృహనిర్మాణ మండలి (హౌసింగ్‌బోర్డు) అధీనంలోని ఖాళీ భూముల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణం కొనసాగుతోంది. హౌసింగ్‌బోర్డు, దాని అధీనంలోని డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (దిల్)కు వందల ఎకరాల భూములున్న విషయం తెలిసిందే. హౌసింగ్ బోర్డుకు 703 ఎకరాలు, దిల్‌కు 1,821 ఎకరాలున్నాయి. వాటిల్లో అక్రమ నిర్మాణాలు వెలిసే ప్రమాదం ఉన్న నేపథ్యంలో గోడల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 25 కోట్లను కేటాయించింది. ఇటీవలే సర్వే పూర్తి చేసి గోడల నిర్మాణం ప్రారంభించినట్లు బోర్డు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. తొలుత 422 ఎకరాలకు గాను 16 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచామని, 28,500 మీటర్ల మేర నిర్మాణానికి గాను ఇప్పటికే 7,500 మీటర్ల నిర్మాణం పూర్తయిందని వివరించింది. దిల్‌కు సంబంధించి ఎలాంటి వివాదం లేని భూముల్లో తొలుత 620 ఎకరాల భూమికి గోడలు నిర్మించాలని నిర్ణయించినట్టు పేర్కొంది.

మంత్రివర్గ ఆమోదం లేకుండానే..
బరాజ్‌లకు అనుమతులా?

కేవలం నాటి సీఎం ఆదేశంతో ఎలా ఇచ్చేస్తారు?

- ప్రాణహిత ప్యాకేజీల్లో మార్పులకూ కేబినెట్ అప్రూవల్స్ లేవు
- స్మితా సబర్వాల్‌ను ప్రశ్నించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- తనకు ఆ విషయాలు తెలియవన్న సబర్వాల్
- తన జ్ఞాపకశక్తి మందగించిందన్న సోమేశ్‌కుమార్





కార్యాలయానికి వస్తున్న జస్టిస్ పీసీ ఘోష్.. విచారణకు హాజరవుతున్న ఐఏఎస్ స్మితా సబర్వాల్, మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: కేబినెట్ ఆమోదం లేకుండా కేవలం నాటి సీఎం కేసీఆర్ ఆదేశంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకి వరుసగా రూ.2,591 కోట్లు, రూ.1,785 కోట్లు, రూ.1,437 కోట్ల అంచనాలతో 2016 మార్చి 1న పరిపాలన అనుమతులు ఎలా జారీ చేస్తారు? ఆర్థిక అంశాలను సైతం కేబినెట్ ముందు ఉంచరా? అని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రశ్నించింది. తనకు ఈ విషయం తెలియదని మాజీ సీఎం కేసీఆర్ కార్యదర్శి స్మితా సబర్వాల్ బదులిచ్చారు. మంత్రి (హరీశ్‌రావు) ఫైల్స్‌ను సీఎం వద్దకు తీసుకెళ్లి ఉండొచ్చని, సీఎంకు వెళ్లే ప్రతీ ఫైల్ తన ద్వారానే వెళ్లదన్నారు. అప్పట్లో తాను ఇరిగేషన్ శాఖ బాధ్యతల్లో లేనందున ఈ ప్రశ్నకు బదులివ్వలేనని మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గురువారం ప్రస్తుత పర్యాటక శాఖ కార్యదర్శి స్మిత సబర్వాల్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు వేర్వేరుగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

మంత్రివర్గ ఆమోదం అక్కర్లేదా?

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు సంబంధించిన అంశాలన్నింటిని మంత్రివర్గం ముందు ఆమోదం కోసం పెట్టి ఉంటారా? అని కమిషన్ ప్రశ్నించగా, అవునని స్మితా సబర్వాల్ బదులిచ్చారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులోని 6,7,8,10, 11,12 ప్యాకేజీల్లో మార్పులు చేసి ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్‌కు నీళ్లను ఎత్తిపోసే పనులకు అనుమతిస్తూ.. మంత్రివర్గ ఆమోదం లేకుండా కేవలం సీఎం ఆదేశంతో 2015 అక్టోబర్ 27న జీవో 776 జారీ చేశారు కదా? అని కమిషన్ మళ్లీ ప్రశ్నించగా, తొలుత ఆమె అంగీకరించలేదు. తమ వద్ద రికార్డులన్నీ ఉన్నాయని, నాటి సీఎం ఆదేశాల మేరకు అప్పటి ఇరిగేషన్ మంత్రి (హరీశ్‌రావు) ఆమోదంతో జీవో ఇచ్చారని అని మళ్లీ ప్రశ్నించగా, ప్రతిపాదనలు సీఎంఓకు రాలేదంటూ తన సమాధానాన్ని సరిచేసుకున్నారు. మంత్రివర్గ ఆమోదం లేకుండా నాటి మంత్రి ఆమోదంతో మేడిగడ్డ బరాజ్ డీపీఆర్ తయారీకి ఆదేశిస్తూ 2016 జనవరి 18న జీవో 40 ఎలా జారీ చేశారన్న ప్రశ్నకు.. మంత్రి స్థాయిలో అనుమతిచ్చి ఉంటే కేబినెట్ ఆమోదం కోసం ఫైళ్లు సీఎంవోకు రాకపోవచ్చని స్మిత తెలియజేశారు. కేవలం సీఎం ఆమోదంతో ప్రాణహిత–చేవెళ్ల అదనపు ఆయకట్టుపై సర్వేను రూ.6.6 కోట్లతో వ్యాప్కోస్‌కి అప్పగించి, తర్వాత కేబినెట్ నుంచి ర్యాటిఫికేషన్ పొందారని కమిషన్ తప్పుబట్టగా, అత్యవసర నిర్ణయాలకు ఇలా కేబినెట్ ర్యాటిఫికేషన్ తీసుకుంటారని వివరణ ఇచ్చారు. తనకు సాంకేతిక విషయాలు తెలియదన్నారు.

నాకు గుర్తులేదు: సోమేశ్‌కుమార్

నీటిపారుదల శాఖ కార్యదర్శిగా 2019 మే 2 నుంచి ఆగస్టు 18 వరకు 3 నెలల 15 రోజులే అదనపు బాధ్యతల్లో ఉన్నానని సోమేశ్ తెలపగా, ఏవైనా జీవోలు, సర్క్యులర్లు జారీ చేశారా? అని కమిషన్ ప్రశ్నించింది. తన జ్ఞాపకశక్తి మందగించిందని, పెద్దగా గుర్తు లేదని సోమేశ్ బదులిచ్చారు. మేడిగడ్డ పంప్‌హౌస్ అదనపు పనులకు అనుమతిస్తూ 2019 ఆగస్టు 6న జీవో 329 ఇచ్చారు కదా? అని కమిషన్ ప్రశ్నించగా.. తనకు గుర్తులేదని, కచ్చితంగా ఇచ్చే ఉంటానని అంగీకరించారు. మంత్రి ఆదేశాలు, సీఎం ఆమోదంతో చేపట్టిన బరాజ్‌ల నిర్మాణానికి మంత్రివర్గం ఎప్పుడైనా ఆమోదించిందా? అన్న ప్రశ్నకు..., సమాధానమివ్వడానికి సోమేశ్ నిరాకరించారు. సీఎస్ ద్వారానే మంత్రివర్గానికి ప్రతిపాదనలు వెళ్తాయా అని అడగ్గా.. గుర్తు లేదన్నారు. బరాజ్‌లు ఆర్థిక భారంగా మారతాయని భావించలేదా? అన్న ప్రశ్నకు... ఆ అంశాలు ఆర్థిక శాఖ పరిధిలోకి వస్తాయన్నారు.

మిమ్మల్ని నీలమణే రక్షిస్తుంది..

'మిమ్మల్ని నీలమణే రక్షిస్తుంది'.. అని సోమేశ్‌కుమార్‌ను ఉద్దేశించి జస్టిస్ చంద్రఘోష్ సరదాగా అన్నారు. సోమేశ్ నీలమణి ఉంగరం ధరించడంతో ఈ వ్యాఖ్య చేశారు. మీరు జోతిష్యం బాగా చెప్తారని సోమేశ్ పేర్కొనగా.. తాను జోతిష్యం చెప్పనని, మీ నుదుటి రాత చూసి భవిష్యవాణి చెప్తానని ఘోష్ ఘాటుగా స్పందించారు. సోమేశ్ క్రాస్ ఎగ్జామినేషన్‌కు కొంత ఆలస్యంగా రావడంతో జస్టిస్ ఘోష్ అసహనం వ్యక్తం చేశారు. సోమేశ్ సైతం నిరీక్షించేలా ఆయన్ను సాక్షి కుర్చీలో కూర్చోబెట్టి 15 నిమిషాలు విరామం తీసుకోవడం గమనార్హం.



బుక్ స్టాల్‌ను సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి, తదితరులు

అమరుల చరిత్రను గ్రంథస్తం చేయాలి

తెలంగాణ అమరులకు సరైన గుర్తింపు రాలే

- రాజకీయ ప్రయోజనం పొందినోళ్లు చరిత్రను వక్రీకరించారు
- సీఎం రేవంత్‌రెడ్డి.. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో సమిధలైన ఎంతోమంది అమరుల కంటే.. రాజకీయంగా ప్రయోజనం పొందిన వారికే ఎక్కువ పేరు వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉద్యమంలో అసువులు బాసిన పోరాటయోధుల పేర్లు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. చరిత్రకారులు ఈ దిశగా తెలంగాణ చరిత్రపై పుస్తకాలు రాయాలని కోరారు. తెలంగాణ అమరుల జీవితాలను, పోరాటాలను గ్రంథస్తం చేయాలని సూచించారు. 37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనను గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో సీఎం ప్రారంభించారు. రాష్ట్ర గ్రంథాలయశాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాయుధ రైతాంగ పోరాటం, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ చరిత్ర కొంతమేరకు వక్రీకరణకు గురైందని అన్నారు.

హైదరాబాద్ బుక్‌ఫెయిర్ స్ఫూర్తిదాయకం..: తమ కలం, గళం ద్వారా సమాజానికి చైతన్యాన్ని అందించి.. ప్రజా పోరాటాలు చేసిన కవులు, కళాకారుల పేర్లు బుక్ ఫెయిర్ వేదికలకు పెట్టడం ద్వారా గొప్ప సందేశాన్ని ఇచ్చారని నిర్వాహకులను సీఎం అభినందించారు. టెక్నాలజీని, డిజిటల్ మీడియా తదితర కారణాల వల్ల పుస్తకాల ప్రాధాన్యత కొంతవరకు తగ్గిందని, ఈ పరిస్థితుల్లో హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ ఏటా పుస్తక ప్రదర్శనను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రశంసించారు. ఎమ్మెల్సీ కోదండరాం సూచన మేరకు హైదరాబాద్ బుక్ ఫెయిర్ కోసం ప్రత్యేకంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరాం, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, బుక్ ఫెయిర్ ప్రతినిధులు యాకూబ్, నారాయణరెడ్డి, బాల్‌రెడ్డి, శోభన్‌బాబు, సూరిబాబు, కిష్టారెడ్డి, సాంబశివరావు, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



మార్చి 21నుంచి పదో తరగతి పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి పరీక్షలు మార్చి 21 నుంచి మొదలవుతాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకూ ఇవి కొనసాగుతాయి. పరీక్షల టైమ్‌టేబుల్‌ను బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పరీక్షల విభాగం గురువారం విడుదల చేసింది. మొత్తం ఆరు సబ్జెక్టులు, ఏడు పేపర్లు ఉంటాయని వెల్లడించింది. సైన్స్ సబ్జెక్టును బయలాజికల్, ఫిజిక్స్ సైన్స్‌గా రెండు భాగాలుగా విభజించి పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి. సైన్స్ పరీక్షకు 9.30 గంటల నుంచి 11 గంటల వరకే సమయం ఉంటుంది.

టైమ్‌టేబుల్ విడుదల

తేదీ	పరీక్ష
21.3.25	మొదటి భాష (కాంపోజిట్ కోర్సులతో కలిపి)
22.3.25	ద్వితీయ భాష
24.3.25	మూడో భాష (ఆంగ్లం)
26.3.25	మేథమెటిక్స్
28.3.25	ఫిజికల్ సైన్స్
29.3.25	బయలాజికల్ సైన్స్
2.4.25	సోషల్ స్టడీస్
3.4.25	ఓఎస్సెస్సీ పేపర్-1 (సంస్కృతం, అరబిక్), ఒకేషనల్ కోర్సులు
4.4.25	ఓఎస్సెస్సీ పేపర్-2 (సంస్కృతం, అరబిక్)



మళ్లీ కనిపించిన పులి

ఈసారి కెమెరాకు చిక్కింది ఆడ పులి

పాతమంచిర్యాల అటవీ బీట్‌లోని గఢ్‌పూర్ అడవిలో సఫారీ మార్గంలో ఏర్పాటు చేసిన కెమెరాకు చిక్కిన పులి

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మంచిర్యాల జిల్లా ముల్కల్ల, పాతమంచిర్యాల అటవీ సెక్షన్ పరిధిలోని గఢ్‌పూర్‌లో పులులు కెమెరాకు చిక్కాయి. గఢ్‌పూర్ సఫారీ మార్గంలోని ఓ చెట్టుకు అటవీశాఖ ఏర్పాటు చేసిన కెమెరాకు రెండుసార్లు వేర్వేరు పులులు చిక్కడం గమనార్హం. గత నెల 12న ఇదే కెమెరా మగపులి వెళుతున్న ఫొటోను తీయగా, తాజాగా బుధవారం ఉదయం ఇదే దారి వెంట వెళుతున్న ఆడపులి ఫొటోను తీసింది. అటవీ అధికారులు అడుగులను పరిశీలించి పులిగా నిర్ధారించారు.

మిరప చేనులో పెద్దపులి

కౌటాల: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఓ మిరప చేనులో పెద్దపులి సంచారం కలకలం రేపింది. కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన జాడే నవీన్ మిరప చేనుకు గురువారం ఉదయం నీళ్ల పెట్టేందుకు వెళ్లాడు. చేనులో పడుకుని ఉన్న పులిని చూసి భయపడి గ్రామానికి పరుగులు తీశాడు. సమాచారం అందుకున్న కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహూ, అధికారులు పాదముద్రలు పరిశీలించి పెద్దపులి అడుగులుగా నిర్ధారించారు. మహారాష్ట్ర నుంచి వార్ధానది దాటి వచ్చినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



స్వామివారి మూలవిరాట్



రంగసముద్రం ఒడ్డున గరుడగొండపై దర్శనమిస్తున్న శ్రీరంగనాయకస్వామి ఆలయం

తెలంగాణ శ్రీరంగం

గరుడాద్రి కొండపై రంగనాథుడు | కవి, పండితుల ఆస్థానంగా భాసిల్లిన క్షేత్రం | వనపర్తి సంస్థానాధీశుల కాలంలో సభలు, సమావేశాలకు ఆతిథ్యం | ఇక్కడే రాష్ట్ర స్థాయి తెలుగు మహాసభలు

వనపర్తి:

తమిళనాడులోని శ్రీరంగం రంగనాయకుడిని వనపర్తి సంస్థానాధీశులు ఇంటి దైవంగా కొలుస్తూ పూజించేవారు. తమ సంస్థానంలోని కొర్విపాడు (పెబ్బేరు మండలం శ్రీరంగాపురం) గ్రామంలోని రంగసముద్రం చెరువు ఒడ్డున ఉన్న గరుడకొండపై శ్రీరంగాన్ని పోలిన రంగనాథస్వామి ఆలయాన్ని 345 ఏళ్ల క్రితం అప్పటి సంస్థానాధీశుడు గోపాలరావు నిర్మించినట్టు స్థలపురాణం చెబుతోంది. అనంతరం కొర్విపాడు పేరును శ్రీరంగాపురంగా మార్చారు. ద్వీపకల్పంగా దర్శనమిచ్చే ఈ దేవాలయానికి రాష్ట్రంలోనే ఓ ప్రత్యేకత ఉంది. పురాతన ఆలయాల మాదిరిగా నేలమాలిగలను సైతం నిర్మించి.. అందులో పురాతనమైన తంజావూరు పెయింటింగ్స్‌ను భద్రపరిచారు. దేవాలయాన్ని, అందులో కొలువుదీరిన స్వామివారి మూలవిరాట్‌ను తమిళనాడులోని శ్రీరంగం ఆలయంలో మాదిరిగానే ప్రతిష్ఠించారు. సంస్థానాధీశుల కాలంలో శ్రీరంగాపురం క్షేత్రం కవి, పండితులకు ఆస్థాన కేంద్రంగా భాసిల్లింది. సభలు, సమావేశాలకు ఆతిథ్యమిచ్చింది. ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాల సమయంలో చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. తిరుపతి వేంకటకవులు లాంటి మహోన్నత వ్యక్తులు ఈ క్షేత్రాన్ని సందర్శించి.. ఆతిథ్యం తీసుకున్నట్టు చరిత్ర చెబుతోంది. ఇటీవల కాలంలో ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి తెలుగు మహాసభలను ఇక్కడ నిర్వహించారు.



ఆలయ ప్రధాన గాలిగోపురం



ఆలయంలోని అద్భుతమైన శిల్పకళా సంపద

ఉట్టిపడే శిల్పసంపద

శ్రీరంగనాయకస్వామి ఆలయంలో నిర్మించిన అద్భుతమైన శిల్పసంపద భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. వివిధ శిల్ప సంప్రదాయాలతోపాటు ద్వారపాలక శిల్పాలతో ఆకాశాన్నంటే అంతస్తులతో ఆలయ గోపురం భక్తులకు స్వాగతం పలుకుతోంది. శేషశయనుడై అభయహస్తం చూపుతూ స్వామివారు, ఆయనకు ఎడమవైపున చతుర్భుజ తాయారు ఆలయంలో శ్రీలక్ష్మీదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఆలయం పక్కనే ఏడాది పొడవునా నీటితో కళకళలాడే రంగసముద్రం రిజర్వాయర్ ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తులకు కనువిందు చేస్తాయి. ఈ ఆలయంలో పలు సినిమాల షూటింగ్ నిర్వహిస్తారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని గత రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు చేస్తున్నా.. నేటికీ కార్యరూపం దాల్చలేదు.

వనపర్తి–పెబ్బేరు ప్రధాన రహదారిలోని కంచిరావుపల్లి గ్రామం నుంచి శ్రీరంగాపురం ఆలయానికి చేరుకోవచ్చు. పెబ్బేరులోని 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి ఈ ఆలయం 11 కి.మీ. దూరంలో ఉంటుంది. ఏటా ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ నుంచి ఉగాది పండుగ వరకు సుమారు 15 రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.



ప్రకృతి బింబం

ఒకవైపు ప్రకృతి అందాలు.. మరోవైపు వన్యప్రాణుల సందడి.. అలాంటి రమణీయ ప్రకృతి సోయగాలకు చిరునామా కవ్వాల్ టైగర్‌జోన్. తెల్లవారుజామున సూర్య కిరణాలు సోకి విచ్చుకున్న కలువ పువ్వు.. మోడువారిన చెట్ల నీడలు నీటిలో ప్రతిబింబిస్తూ అందమైన కళాఖండాలుగా ప్రకృతి ఆవిష్కరిస్తోంది. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్ బైసన్‌కుంటలో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ కెమెరా కంటికి చిక్కిన మనోహర దృశ్యాలివి. - జన్నారం





గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, పుట్ట సుధాకర్ యాదవ్



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సర్పంచ్‌ల సంఘం జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని సర్పంచ్‌ల సంఘం జేఏసీ కోరింది. ఈ మేరకు గురువారం అసెంబ్లీ ఆవరణలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుర్వి యాదయ్యగౌడ్, రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, మాట్ల మధు, కోశాధికారి పూడూరి నవీన్‌గౌడ్, కార్యదర్శులు గణేశ్, మల్లయ్య, మాజీ సర్పంచ్‌లు కలిశారు. అప్పులు తెచ్చి పంచాయతీలను అభివృద్ధి చేశామని, వాటికి వడ్డీ కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో పెండింగ్ బిల్లులపై స్పష్టమైన ప్రకటన చేయాలని భట్టిని కోరారు.

అమిత్‌షా వ్యాఖ్యలు అభ్యంతరకరం

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అవమానకర వ్యాఖ్యలపై దళిత హక్కుల, సామాజిక న్యాయం సమన్వయ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు నిరసనగా శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. అమిత్‌షా వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను మాత్రమే కాకుండా.. పేద ప్రజలందరినీ అవమానానికి గురిచేశాయని పేర్కొంది. అమిత్‌షా తక్షణమే క్షమాపణ చెప్పాలని, తన పదవికి రాజీనామా చేయాలని దళిత హక్కుల, సామాజిక న్యాయం సమన్వయ కమిటీ ప్రతినిధి మల్లేపల్లి లక్ష్మయ్య డిమాండ్ చేశారు.



పచ్చ కండువాలతో అసెంబ్లీకి !

రుణమాఫీపై బీఆర్ఎస్ వాయిదా తీర్మాణం

సాక్షి, హైదరాబాద్: ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు రోజుకో విధంగా అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గురువారం పచ్చ కండువాలతో వచ్చారు. బీఆర్ఎస్ శాసనసభా పక్ష కార్యాలయం నుంచి పచ్చ కండువాలతో సమావేశ మందిరానికి నినాదాలు చేస్తూ చేరుకున్నారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, వడ్లకు బోనస్ తదితర ప్రభుత్వ హామీలు అమలు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతులకు యాసంగి, వానాకాలం పంటలకు కలిపి ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ రైతులందరికీ వర్తింప చేయాలని, అన్ని పంటలకు బోనస్ చెల్లించాలని కోరుతూ శాసన సభాపతికి బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది.



నుయ్యి కాదు.. నల్లా గొయ్యి

ఈ ఫొటోలో కనిపిస్తున్నది చేదబావి అనుకుంటే సంపులో కాలేసినట్టే.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన వర్దెల్లి శ్రీనివాస్ ఇంట్లో ఏర్పాటు చేసిన నల్లా నాలుగు అడుగుల లోతులో ఉంది. కాగా వారానికి మూడుసార్లు మాత్రమే నల్లా నీళ్లు వస్తాయి. దీంతో భారీ మొత్తంలో నీటిని నిల్వ చేసేందుకు ఏడు సిమెంట్ ఓడలతో సంపును శ్రీనివాస్ నిర్మించుకున్నాడు. సంపు నుంచి నీళ్లను సులువుగా బకెట్‌తో తోడుకునేందుకు ప్రత్యేకంగా.. ఓడలపై బావి మాదిరిగా బిల్లాదులాన్ని అమర్చి గిరికను ఏర్పాటు చేశాడు. విద్యుత్ మోటార్ లేకుండా ఎప్పటికప్పుడు సులువుగా నీళ్లు చేదుకునేందుకు తనకీ ఆలోచన వచ్చినట్లు శ్రీనివాస్ తెలిపాడు. - కేసముద్రం



అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

మంత్రి సీతక్క డిమాండ్



సాక్షి, హైదరాబాద్: దేశంలో అదానీ, మోదీతో పాటు బీజేపీ మాత్రమే ఉండాలని ఆ పార్టీ భావిస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. మనుధర్మ శాస్త్రాన్ని అనుసరిస్తూ కుల, మత, ధనిక అంతరాలను సృష్టించేందుకు చూస్తున్న బీజేపీపై.. రాహుల్‌గాంధీ పోరాడుతున్నారని చెప్పారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ పేరు తలుచుకోవడాన్ని అమిత్‌షా తప్పుపట్టడం కచ్చితంగా ఆయనను అవమానించడమేనని ఆరోపించారు. దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు.

అమిత్ షాపై చర్య తీసుకోండి

లోక్‌సభ స్పీకర్‌కు ఎంపీ వంశీ వినతి



సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా పై చర్యలు తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఎంపీ వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం పార్లమెంటులో స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఒక లేఖను అందజేశారు. అమిత్ షా వ్యాఖ్యలు దళితుల మనోభావాలను దెబ్బ తీశాయని, రాజ్యాంగ విలువలను ఉల్లంఘించారని పేర్కొన్నారు. దళితులు, అణగారిన వర్గాలకు అంబేడ్కర్‌పై ఉన్న గౌరవాన్ని తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నమే అమిత్‌షా వ్యాఖ్యలని ఆ లేఖలో అభిప్రాయపడ్డారు.

ఫేక్ వీడియోలతో అమిత్ షా మాటలు వక్రీకరిస్తున్నారు

బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచారంటూ కాంగ్రెస్ నేతలు ఫేక్ వీడియోలు వైరల్ చేస్తూ, కేంద్రమంత్రి అమిత్ షా మాటలను వక్రీకరిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ, బీజేపీ అంబేడ్కర్‌ను దేవునితో సమానంగా చూస్తుందని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మోదీ.. అంబేడ్కర్ స్ఫూర్తితోనే ముందుకు వెళ్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏదో విధంగా అమిత్ షా మాటలను రచ్చ చేయాలని చూస్తోందని, అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను రెండుసార్లు ఓడించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను ఎలా అవమానించిందో ప్రజలకు తెలుసునని, ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక, బీజేపీకి మంచి పేరు రావొద్దనే ఇలా చేస్తున్నారని ధ్వజమెత్తారు.

అంబేడ్కర్‌ను గౌరవిస్తాం

బీజేపీ పక్ష నేత 'ఏలేటి'



సాక్షి, హైదరాబాద్: బీఆర్ అంబేడ్కర్‌ను గౌరవిస్తామని, ఈ విషయంలో ఎంఐఎంపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. మైనారిటీల పిల్లల కోసం చెరువులో కళాశాలను ఎలా కడతారని, ఆ కళాశాలలో ఎంతమంది హిందువుల పిల్లలు చదువుతున్నారని అక్బరుద్దీన్‌ను ప్రశ్నించారు. చెరువులో కట్టకపోతే ఎందుకు భయమని 'ఏలేటి'నిలదీశారు.

ధరణి దరిద్రం పోయినందుకు పండుగ


సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ధరణి.. అనే దరిద్రం పోయినందుకు రాష్ట్రంలోని రైతులు పండుగ చేసుకుంటున్నారని రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎస్.అన్వేశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామని చెప్పిన మాట ప్రకారం.. భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చామని స్పష్టం చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని ప్రవేశపెట్టినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ బిల్లు పెట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు అన్వేశ్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రంలో రహదారుల నిధులన్నీ ఖర్చుపెట్టాం

లోక్‌సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేటాయించిన నిధులన్నీ ఖర్చు చేసినట్లు కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. తెలంగాణలో 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లలో రూ.19,152 కోట్లు కేటాయించగా.. ఆ మొత్తంతో రహదారుల అభివృద్ధి జరిగిందన్నారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో గాయపడుతున్న వారిని రక్షించేందుకు ఆయా రహదారులపై అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ అంబులెన్స్ సేవలను రహదారులు నిర్మించిన కాంట్రాక్ట్ సంస్థలు అందిస్తున్నాయన్నారు. తెలంగాణలో జాతీయ రహదారులకు కేంద్రం ఇచ్చిన నిధులు, ఖర్చు చేసిన వివరాలు ఇలా ఉన్నాయి.

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2019-20	రూ.5,757 కోట్లు	రూ.5,757 కోట్లు
2020-21	రూ.4,868 కోట్లు	రూ.4,868 కోట్లు
2021-22	రూ.4,305 కోట్లు	రూ.4,305 కోట్లు
2022-23	రూ.8,230 కోట్లు	రూ.8,230 కోట్లు
2023-24	రూ.9,925 కోట్లు	రూ.9.925 కోట్లు

ఫోన్లూ వణుకుతాయ్

ఎలక్ట్రానిక్ వస్తువులపైనా చలి ప్రభావం ఎక్కువే



ఎండలకు రాళ్లు కూడా పగులుతాయని విన్నాం. కానీ.. చలికి ఫోన్లు సైతం పగిలిపోతాయట. వేసవితో పోలిస్తే శీతాకాలంలో స్మార్ట్‌ఫోన్లు కిందపడితే స్క్రీన్‌లు అత్యంత సులభంగా పగిలిపోతాయని ఎలక్ట్రానిక్ నిపుణులు చెబుతున్నారు. ఫోన్లతో పాటు స్మార్ట్ వాచ్‌లు, ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరుపై చలి తీవ్ర ప్రభావాన్నే చూపుతాయని పేర్కొంటున్నారు. చలి కాలం వచ్చిందంటే చాలామంది ఆరోగ్య విషయాల్లో అనేక జాగ్రత్తలు తీసుకుంటారని.. ఇకపై చలికాలంలో స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని నిపుణులు చెబుతున్నారు.
- సాక్షి, అమరావతి

- విపరీతమైన చలిలో ఫోను ఎక్కువ సమయం ఉంటే షట్‌డౌన్ అయ్యే ఛాన్స్
- పెళుసుగా ఉండే ఫోను స్క్రీన్లపై పగుళ్లకు అవకాశం
- స్మార్ట్‌వాచ్‌లు, ల్యాప్‌టాప్, కెమెరాలపైనా చలి ప్రభావం
- అతి చలిలో స్మార్ట్ ఫోన్లలో తగ్గిపోనున్న సెన్సార్ సామర్థ్యం
- చలికాలంలో ఫోన్ బ్యాటరీ మన్నిక కావాలంటే తరుచూ చార్జింగ్ పెట్టాలంటున్న నిపుణులు



చలి విపరీతంగా ఉంటే ఫోను ఆగిపోయే ఛాన్స్

- ఫోన్‌లు, స్మార్ట్ వాచ్‌లు, ల్యాప్‌టాప్‌ల ఎల్‌సీడీ, ఓఎల్ఈడీ స్క్రీన్లు నిదానంగా పనిచేయడం వల్ల ఆ సమయంలో వాటిని ఉపయోగిస్తున్నప్పుడు ఆ పరికరాల స్క్రీన్లపై కనిపించే బొమ్మలు, అక్షరాల నాణ్యత, స్పష్టత సరిగా ఉండకపోయే అవకాశం ఉంది.
- ప్రమాదవశాత్తు స్మార్ట్ ఫోను వంటివి కిందపడితే వేసవి కాలంలో కంటే శీతాకాలంలో వాటి స్క్రీన్‌లు అత్యంత సులభంగా పగిలిపోతాయి.
- ఎలక్ట్రానిక్ పరికరాలను వేలిముద్రల గుర్తింపు, ముఖ గుర్తింపు ద్వారానే త్వరగా ఆన్, ఆఫ్ అయ్యేలా పెట్టుకుంటాం. కానీ.. ఎక్కువ చలి సమయంలో సెన్సార్ విధానం సరిగా పని చేయక ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. స్మార్ట్ వాచ్‌లు, ఫిట్‌నెస్ బ్యాండ్‌లు వంటి ధరించ గలిగేవి విపరీతమైన చలిలో కచ్చితమైన రీడింగ్‌లను తెలపలేవు.
- కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లో ఉపయోగించే హార్డ్ డ్రైవ్‌లు చలి ప్రభావంతో ఆలస్యంగా ఓపెన్ కావడం వంటి పరిస్థితులు తలెత్తుతాయి.
- ఎలక్ట్రానిక్ వస్తువులలో ఉండే సున్నితమైన, అతి సున్నితమైన సర్క్యూట్లు చలికి తుప్పు పట్టే అవకాశం ఉండటంతో ఆయా వస్తువులు పూర్తిగా పనిచేయకుండా పోయే అవకాశం ఏర్పడుతుంది.
- కెమెరాలు సైతం చలి తగ్గి ఎండ పెరిగే కొద్దీ వాటి అద్దాలపై పొరగా ఏర్పడే పొగమంచు ఫొటోల్లోని బొమ్మ నాణ్యతను ప్రభావితం చేస్తుంది.
- ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ల్యాప్‌టాప్‌లలో ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీలు చల్లని ఉష్ణోగ్రతలలో పేలవంగా పనిచేస్తాయని, విపరీతమైన చలిలో బ్యాటరీ తాత్కాలికంగా పనిచేయడం ఆగిపోవచ్చు లేదా శాశ్వతంగా దెబ్బతినే అవకాశం ఉంది.
- స్మార్ట్‌వాచ్‌లు, ఇయర్ బడ్‌లు వేగంగా బ్యాటరీ నష్టానికి గురికావడంతో అవి పనిచేయడంలో ఎక్కువగా అవాంతరాలు ఏర్పడే వీలుంది.
- ఎలక్ట్రానిక్ పరికరాలకు ఉపయోగించే గాజు, ప్లాస్టిక్ వంటివి చలికి పెళుసుబారి చిన్న ఒత్తిడికే పగుళ్లు లేదా విరిగిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఇలా చేయడం బెటర్

- చలికి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వ్యక్తిగతంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో.. ఎలక్ట్రానిక్ పరికరాల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.
- శీతాకాలంలో ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ల్యాప్‌టాప్‌లకు సాధారణ కన్నా ఎక్కువసార్లు చార్జింగ్ పెడుతూ ఉండాలి. ఎక్కువ కాలం పాటు గడ్డకట్టే చలికి పరికరాలను బహిర్గతం చేయకుండా ఉంచాలి. తప్పనిసరిగా బయటకు తీసుకెళ్లాల్సి వచ్చినప్పుడు చలి సోకని కవర్లలో వాటిని ఉంచాలి.
- చలికాలంలో స్మార్ట్ ఫోన్లు సహా అన్ని ఎలక్ట్రానిక్ వస్తువులను ఆరుబయట చలిలో ఎక్కువ సమయం వినియోగించాల్సి వస్తే.. ఇంటికి చేరుకోగానే వాటిని శుభ్రం చేయడం మంచిదని సూచిస్తున్నారు.
- చల్లటి పరిస్థితులను తట్టుకునేలా రూపొందించిన ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



విలువైన డేటా కోల్పోయే అవకాశం

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఏ సమాచారమైనా పేపర్ డాక్యుమెంట్ల రూపంలో భద్రపరుచుకోవడం కంటే.. వాటిని ఫోన్లు లేదా వ్యక్తిగత కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లలో సేవ్ చేసుకుని భద్రపరచుకుంటుంటాం. అయితే ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లలో ఉండే హార్డ్ డ్రైవ్‌లు కొన్ని సందర్భాల్లో విపరీతమైన చలికి ప్రభావితమై పనిచేయకుండా పోయే ప్రమాదం ఉంది. దీంతో హార్డ్ డ్రైవ్‌లలో మాత్రమే నిక్షిప్తమై ఉండే మన విలువైన సమాచారం, డాక్యుమెంట్లను పూర్తిగా తిరిగి చూడడానికి వీలులేని విధంగా నష్టపోయే అవకాశం ఉంటుంది.

- ఎప్పటికప్పుడు కొత్త ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను ఉపయోగించేవారు తాము వాడేవి కొత్తవి కదా అని అజాగ్రత్త ఉండొచ్చు. కానీ, కొత్తవి అయినంత మాత్రాన చలికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అనుకోవడం కేవలం అపోహేనట. కొత్త ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా విపరీతమైన చలి పరిస్థితుల్లో వాటి పనితీరు తగ్గుముఖం పట్టవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా...

సీఎంను కలిసిన వక్ఫ్‌బోర్డు చైర్మన్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ గురువారం సీఎం చంద్రబాబును కలిశారు. వక్ఫ్‌బోర్డు నిర్వహణ తదితర అంశాలపై సీఎంతో చర్చించారు. వక్ఫ్‌బోర్డు నిర్వహణతో కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయనకు చంద్రబాబు సూచించారు.

టోల్ ఛార్జీల బాదుడు ఆపాలి
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 65 టోల్ ప్లాజాల వద్ద సింగిల్ ఎంట్రీ విధానంతో వాహనదారులపై పెరిగిన అదనపు టోల్ రుసుం భారాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లకు టోల్ పేరుతో కట్టబెడుతున్నా రోడ్ల నిర్వహణ నాసిరకంగా ఉందని తెలిపారు. అలాగే, అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను శ్రీనివాసరావు ఖండించారు. అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మార్కులు తక్కువగా వస్తున్నాయని తల్లి మందలింపు
కుమార్తె ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి: పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని, బాగా చదవాలని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమార్తె ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం రమణక్కపేటలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ..రమణక్కపేటలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చింతపల్లి నైపుణ్య పదో తరగతి చదువుతోంది. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని ఉపాధ్యాయులు బాలిక తల్లి సుభాషిణికి సమాచారం ఇచ్చారు. దీంతో ప్రతి రోజూ పాఠశాలకు వెళ్తున్నావు కదా! బాగా చదువుకోవాలని తల్లి గట్టిగా మందలించింది. దీనిని తట్టుకోలేక నైపుణ్య గురువారం ఉదయం కూరగాయ పంటలకు కొట్టే పురుగుల మందు తాగింది. అది గమనించిన తల్లి స్థానికుల సహకారంతో కుమార్తెను అంబులెన్సులో కాకినాడ జీజీహెచ్‌కు తరలించింది.

సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు?
ప్రభుత్వంపై వైఎస్సార్‌టీఏ ఆగ్రహం

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ సంఘాలతో వారంవారం విద్యాశాఖ అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కరించడం లేదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) ఒక ప్రకటనలో ప్రభుత్వంపై మండిపడింది. తమ ప్రభుత్వం రాగానే టీచర్లకు ఐఆర్, డీఏలు ఇస్తామని కూటమి నాయకులు చెప్పి ఆరునెలలు దాటిందని, దీనిపై ఇంతవరకు ప్రభుత్వంగానీ, పాఠశాల విద్యాశాఖగానీ స్పష్టమైన హామీ ఇవ్వలేదని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అశోక్ కుమార్‌రెడ్డి, గెడ్డం సుధీర్ పేర్కొన్నారు. ఇలాంటప్పుడు ప్రతి వారం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించడం ఎందుకని వారు ప్రశ్నించారు.

జనవరి 4న విశాఖలో నేవీ విన్యాసాలు

మహారాణిపేట: నేవీ డే అనుబంధంగా జనవరి 4న విశాఖ వేదికగా నిర్వహించనున్న నావికాదళ విన్యాసాలకు పక్కా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఏర్పాట్లపై సమీక్షించారు. సీఎం హాజరుకానున్న నేపథ్యంలో అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సామాన్య ప్రజలకు అసౌకర్యం కలగకుండా బారికేడ్లు, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి సదుపాయం, వేడుకలను ఎక్కడికక్కడ తిలకించేలా భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలన్నారు.

ఎడ్లంటే ప్రేమ.. పోటీలకు సై..



- మూడేళ్ల క్రితం రెండు కోడె దూడల కొనుగోలు
- ముద్దుగా రాముడు, భీముడని పేర్లు
- రాష్ట్రస్థాయి ఎడ్ల పందేల్లో గెలవాలని..
- వాటికి రోజూ రూ.2 వేల ఖర్చు
- జీతమంతా వాటి పెంపకానికే..
- ఇదీ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తీరు

పొదలకూరు: ఆ యువకుడికి వ్యవసాయమన్నా, పశువుల పెంపకమన్నా ప్రాణం. ఉన్నత చదువులు చదివి సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నా.. మనసంతా ఎడ్లపైనే ఉండేది. ఆ మమకారంతోనే రెండు కోడె దూడలను కొనుగోలు చేసి వాటికి రాముడు, భీముడు అని ముద్దుగా పేర్లు పెట్టుకుని పిలుస్తున్నాడు. అవి ఇప్పుడు పెద్దవయ్యాయి. రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేల్లో (బండ లాగుడు) పాల్గొని అవి ప్రథమ స్థానంలో నిలవాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నాడు.

ఆలనాపాలనకు ప్రత్యేకంగా ఒకరు

కోడెదూడలను కొనుగోలు చేసిన నాటి నుంచి వాటి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాను. వాటిని రాముడు, భీముడు అనే పేర్లతో మా కుటుంబమంతా పిలుచుకుంటున్నాం. వాటి ఆలనాపాలనకు నెల జీతం ఇచ్చి ఓ మనిషిని కూడా ఏర్పాటు చేశాను. చెబితే అతిశయోక్తిగా ఉంటుందేమో కానీ వాటి పోషణకు నిత్యం రూ.2 వేలు వరకు ఖర్చు చేస్తున్నాను. పశుగ్రాసంతోపాటు ఉలవలు, జొన్నలు కూడా పెడుతున్నాం. నేను కోడెలను కొని మూడేళ్లయింది. వాటి వయసు ఇప్పుడు నాలుగేళ్లు. పోటీలకు సిద్ధం చేసే ఉద్దేశంతో శిక్షణ ఇప్పిస్తున్నాను. తోటలోనే పరుగులు తీయించి అలసటను తట్టుకునేలా అలవాటు చేస్తున్నాను. పశువైద్యుల సలహాలు సూచనలు తీసుకుని వాటి ఆరోగ్యంపై పరీక్షలు కూడా చేయిస్తున్నాను.

ఏదో తెలియని వెలితి

ఆ యువకుడి పేరు బుధవరపు ప్రతాప్. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం బిరదవోలు పంచాయతీ ముత్యాలపేట గ్రామం. సాక్షి అతడిని పలుకరించగా ఏం చెప్పారంటే... మాది వ్యవసాయ కుటుంబం. నేను కావలి విట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో చదివాను. ఐదేళ్ల క్రితం హైదరాబాద్ హెచ్‌సీఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరాను. కరోనా సమయంలో వర్క్‌ఫ్రం హోమ్‌లో భాగంగా ఇంటి నుంచే పనిచేసేవాడిని. ఉద్యోగంలో జీతం బాగానే వస్తున్నా ఏదో తెలియని వెలితి ఉండేది. తాత, తండ్రుల నుంచి పోషిస్తున్న ఎడ్లపై అభిలాష కలిగింది. ఒంగోలు జాతికి చెందిన కోడెలు కొనుగోలు చేసి పోషించాలని భావించి మా నాన్న పెంచలయ్యతో చెప్పాను. దానికి ఆయన మొదట సందేహించినా నా ఇష్టాన్ని కాదనలేదు. తండ్రి సహకారంతో వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామంలో 8 నెలల వయస్సు ఉన్న దూడను రూ.80 వేలు వెచ్చించి, అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఏడాది వయసున్న దూడను రూ.లక్ష వెచ్చించి కొన్నాను.

ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నా

రాముడు, భీముడుకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తే రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీల్లో రాణిస్తాయని నమ్మకంగా ఉంది. ఇందుకోసం నెలకు రూ.30 వేలు వెచ్చించి వైఎస్సార్ జిల్లా చెన్నూరులో నెల కిందటే శిక్షకుడి వద్ద వదిలిపెట్టాను. ప్రతినిత్యం వాటిని వీడియోకాల్లో చూసుకుంటూ శిక్షణకు ఎలా సహకరిస్తున్నాయో తెలుసుకుంటున్నాను. నా ఎడ్ల గురించి తెలిసిన కొందరు రైతులు మంచి ధరతో కొనుగోలు చేస్తామని ముందుకొచ్చినా నేను ససేమేరా అన్నాను. బండలాగుడు పోటీల్లో అవి ప్రథమ స్థానంలో నిలవడమే నా లక్ష్యం.

జనసేన ఇన్‌చార్జికి చేదు అనుభవం

- కోనపాపపేటలో అడ్డుకున్న మత్స్యకారులు
- సమస్యలపై ఆందోళనలు చేస్తే పట్టవా అని నిలదీత



మత్స్యకారులు అడ్డుకోవడంతో కారులోనే ఉండిపోయిన శ్రీనివాస్

కొత్తపల్లి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఆయన ప్రతినిధిగా ఉన్న జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు చేదు అనుభవం ఎదురైంది. తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలపై ఆందోళన చేస్తున్నా.. ఏనాడైనా గ్రామంలోకి వచ్చారా అంటూ ఆయనను యు.కొత్తపల్లి మండలం పొన్నాడ గ్రామ శివారు కోనపాపపేటలో స్థానిక మత్స్యకారులు అడ్డుకున్నారు. దీంతో ఆయన కొంతసేపు కారులోనే ఉండిపోవాల్సి వచ్చింది. అల్పపీడనం ప్రభావంతో సముద్ర కోతకు గురైన కోనపాపపేట తీర ప్రాంతాన్ని పరిశీలించేందుకు గురువారం శ్రీనివాస్ ఆ గ్రామానికి వచ్చారు. తీరంలో ఏర్పాటు చేసిన పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలను పైపులైన్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేయడంతో మత్స్య సంపద అంతరించిపోతోందని, మత్స్యకారులు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు అన్నారు. పరిశ్రమలకు వ్యతిరేకంగా తాము ఆందోళనలు చేస్తున్నా తమ గ్రామం వైపు ఏనాడైనా కన్నెత్తి చూశారా అని శ్రీనివాస్‌ను మత్స్యకారులు నిలదీశారు. ఓట్లు వేయడానికేనా మత్స్యకారులు అని నిలదీశారు. జనసేన అధికారంలోకి వస్తే కోతకు గురవుతున్న తీర ప్రాంతానికి శాశ్వత రక్షణ చర్యలు చేపడతామన్న పవన్ కల్యాణ్ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు ఈ విషయాలను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇవ్వడంతో శ్రీనివాస్‌ను మత్స్యకారులు విడిచిపెట్టారు.

ఏఐ వినియోగానికి ప్రాధాన్యత

గూగుల్ వర్క్‌షాప్‌లో ఆర్టీజీఎస్ సీఈఓ దినేష్‌కుమార్



సాక్షి, అమరావతి: పాలనా సౌలభ్యం కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను విరివిగా వినియోగించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆర్టీజీఎస్ సీఈఓ కె. దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో గురువారం గూగుల్ కార్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఇటీవలే రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీతో గూగుల్ సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రభుత్వ శాఖల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సు వినియోగానికున్న అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలు, తదితర అంశాలపై గూగుల్ ఢిల్లీలో వర్క్‌షాప్ నిర్వహించింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సులో వస్తున్న మార్పులు, ప్రభుత్వ శాఖల్లో దాని ఉపయోగిత ఆవశ్యకత తదితర అంశాలపై గూగుల్ అధికారులతో ఆర్టీజీఎస్ సీఈఓ, ఆ సంస్థ అధికారుల బృందం చర్చించింది.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అప్రమత్తం

రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకుడు ప్రవీణ్ కుమార్



జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్, చిత్రంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకుడు ప్రవీణ్ కుమార్ సూచించారు. గురువారం విశాఖలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఓటరు జాబితా సంక్షిప్త సవరణ -2025పై సమీక్షించారు. పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. స్థానికంగా ఉన్న జనాభాకు, ఓటర్లకు మధ్యనున్న వ్యత్యాసానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలన్నారు. ఉన్నత స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి అధికారుల వరకు సరైన సమాచార మార్పిడి ఉండాలని, సమన్వయంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుంటూ వెళ్లాలని, వారి సలహాలను, సూచనలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు జాబితాలను పరిశోధించి జనాభా నిష్పత్తికి, ఓటరు నిష్పత్తికి భారీ వ్యత్యాసం వచ్చినట్లయితే క్షేత్ర స్థాయి పర్యటన చేసి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.

అందరికీ ఫైబర్ నెట్ సేవలు
ఏపీ ఫైబర్ నెట్ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి

సాక్షి, అమరావతి: తక్కువ ధరకే కేబుల్ టీవీ, టెలీఫోన్, ఇంటర్నెట్ సేవలను అందించే ఫైబర్ నెట్ సేవలను అందరికీ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీ ఫైబర్ నెట్ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి స్పష్టం చేశారు. రెండేళ్లల్లో 50 లక్షలకు కనెక్షన్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గురువారం విజయవాడలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమ నియామకాలను తొలగించి ఆ స్థానంలో కొత్తవారిని ఎంపిక చేయడానికి నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. ఇప్పటికే గత ప్రభుత్వ హయాంలో నియమితులై చంద్రబాబు ఫైబర్‌నెట్ కేసులో కీలకంగా వ్యవహరించిన మహిళా అధికారిని టెర్మినేట్ చేశారని చెప్పారు. వ్యూహం సినిమాకు రూ.2.15 కోట్లు చెల్లిస్తే ఆ సినిమాను ఫైబర్‌నెట్‌లో 1,863 మంది వీక్షించినట్లు తేలిందన్నారు.

'ఆశ్రమ' టీచర్ల డెప్యూటేషన్లు రద్దు చేయండి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గిరిజన గురుకుల పాఠశాలలకు డెప్యూటేషన్‌పై పంపించడం అసంబద్ధమైన నిర్ణయమని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు గురువారం ప్రకటనలో విమర్శించారు. తక్షణమే ఈ డెప్యూటేషన్లను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మెతో పార్వతీపురం, సీతంపేట, రంపచోడవరం, చింతూరు, కె.ఆర్.పురం ఆశ్రమ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు 250 నుంచి 350 కి.మీ. దూరం వెళుతున్నారని, ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేస్తున్నా డెప్యూటేషన్లు వేయడం సరికాదని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగేలా ఈ విధానం ఉందని తెలిపారు.

పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో 2012 నుంచి పనిచేస్తున్న పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వీరిని ఫుల్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లుగా అప్‌గ్రేడ్ చేసి, ఎంటీఎస్ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హెల్త్ కార్డులతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెగ్యులర్ ఆర్ట్, క్రాఫ్ట్, టైలర్, డ్రాయింగ్ టీచర్ల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.



శ్రీవారి దర్శనానికి 15 గంటలు


తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కాస్త పెరిగింది. క్యూ కాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధ రాత్రి వరకు 70,457 మంది స్వామి వారిని దర్శించుకోగా 22,152 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం కల్పిస్తున్నారు. సర్వ దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

మద్ది హుండీ ఆదాయం రూ.45,64,570

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. తాడేపల్లిగూడెం దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీదారు సీహెచ్ ఉదయ్‌కుమార్ బాబు, లక్కవరం ఏఎస్సై భాస్కర్ పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కింపు జరిగినట్టు ఈవో, ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు. కరూర్ వైశ్యా బ్యాంక్ సిబ్బంది సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించగా, 51 రోజులకు గాను దేవాలయ హుండీల ద్వారా రూ.43,77,549, అన్నదానం హుండీ ద్వారా రూ.1,87,021, వెరసి మొత్తం ఆదాయం రూ.45,64,570 వచ్చినట్టు ఈవో చందన తెలిపారు.

22 నుంచి ఆరాధన గురుపూజ ఉత్సవాలు

బ్రహ్మంగారిమఠం: వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠంలో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామి క్షేత్రంలో ఈ నెల 22వ తేదీ నుంచి 27వ తేదీ వరకు అమ్మవారి ఆరాధన గురుపూజ ఉత్సవాలు నిర్వహించనున్నారు. 24న మార్గశిర బహుళ నవమిన సజీవ సమాధి నిష్ఠ వహించిన రోజు కనుక ప్రధాన వేడుక నిర్వహిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారు. బ్రహ్మంగారిమఠంలో కొలువుదీరిన ఈశ్వరీదేవి.. జగన్మాతగా విరాజిల్లుతున్నారు. భక్తుల కొంగు బంగారంగా నిలిచి.. విశేష పూజలందుకుంటున్నారు. శక్తిస్వరూపిణి, సర్వ మంగళకారిణిగా ప్రసిద్ధి చెందారు. ఈశ్వరీదేవి మఠంలో ఈ నెల 22 నుంచి అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.



నేడు జాబ్ మేళా

నందలూరు : మండల కేంద్రంలోని ఆకేపాడు క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో శుక్రవారం (నేడు) ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎం శ్రీహరి తెలియజేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అన్నమయ్య జిల్లా ఉపాధి కల్పన, వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ (ఎస్ఈఈడీఏపీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో ఐసీఐసీఐ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. నిరుద్యోగ యువతీయువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలు తమవెంట తీసుకురావలెనని చెప్పారు. పూర్తి వివరాలకు 96767 36623 నెంబర్‌ను సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

21న జాబ్ మేళా

కమలాపురం : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ), సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ - ఎంటర్ ప్రైజస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్(సీడాప్) వారి ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన కమలాపురంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కమలాపురం వెలుగు-డీఆర్‌డీఏ అసిస్టెంట్ మేనేజర్, టీ.గంగాధర్, జాబ్ కో-ఆర్డినేటర్ సుబ్బలక్షుమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్(కొప్పర్తి), నవభారత్ ఫెర్టిలైజర్స్(కడప) కంపెనీలలో ఉద్యోగాల కోసం శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమలాపురం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని వెలుగు కార్యాలయంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివి 19 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు అభ్యర్థులు విద్యార్హత పత్రాలు(ఒరిజినల్, జెరాక్స్), రేషన్ కార్డు, ఆధార్ కార్డు, 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తమ వెంట తీసుకు రావాలన్నారు.

సౌత్‌జోన్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



తిరుపతి సిటీ : కాలికట్ వేదికగా ఈనెల 21 నుంచి జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టోర్నమెంట్‌కు ఎస్వీయూ పురుషుల విభాగపు ఫుట్‌బాల్ జట్టును గురువారం అధికారులు ప్రకటించారు. ఎస్వీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల నుంచి ఫుట్‌బాల్ నందు పేరొందిన 20 మందితో కూడిన ఆటగాళ్ల బృందాన్ని అధికారులు ప్రకటించి వారికి టోర్నమెంట్‌కు అవసరమైన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ మాజీ ఫుట్‌బాల్ ప్లేయర్ నజీరుద్దీన్, కోచ్ సుదర్శన్, టీమ్ మేనేజర్ గఫూర్, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ శివశంకర్ రెడ్డి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.



● త్రిష ● నయనతార ● శ్రుతీహాసన్ ● సమంత ● సాయి పల్లవి ● అనుష్క ● పూజా హెగ్డే

2024 మిస్

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అన్నది సామెత. చిత్ర పరిశ్రమలో నటీనటులకు ఈ సామెత బాగా వర్తిస్తుంది. క్రేజ్ ఉన్నప్పుడే వరుసగా సినిమాలు చేసి అటు ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించడంతో పాటు ఇటు బ్యాంక్ బ్యాలెన్స్‌లు కూడా పెంచుకోవాలి. అయితే పలువురు హీరోయిన్లు 2024ని మిస్ అయ్యారు. వారు నటించిన ఒక్క సినిమా కూడా ఈ ఏడాది విడుదల కాకపోవడం విశేషం. ఈ ఏడాది వెండితెరపై కనిపించని హీరోయిన్ల జాబితా డజనుకుపైగానే ఉంది. నయనతార, సమంత, అనుష్క, తమన్నా, త్రిష, సాయి పల్లవి, కీర్తీ సురేష్, పూజా హెగ్డే, శ్రుతీహాసన్, నిత్యా మీనన్, సంయుక్తా మీనన్, రాశీ ఖన్నా, నిధీ అగర్వాల్, మెహరీన్... వంటి పలువురు హీరోయిన్లు 2024ని మిస్ అయ్యారు. ఆ వివరాల్లోకి...

రెండు సినిమాలతో జేజెమ్మ

తెలుగు చిత్ర పరిశ్రమలో జేజమ్మగా ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకున్నారు అనుష్క. ఆ మధ్య వరుస సినిమాలు చేసిన అనుష్క నాలుగేళ్లుగా కాస్త నెమ్మదించారు. 2020లో వచ్చిన 'నిశ్శబ్దం' సినిమా తర్వాత మూడేళ్ల అనంతరం 'మిస్ శెట్టి మిస్టర్ పొలి శెట్టి' (2023) చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు ఆమె. అయితే 2024ని మాత్రం పూర్తిగా మిస్ అయ్యారు అనుష్క. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' తర్వాత తెలుగులో ఆమె కమిటైన చిత్రం 'ఘాటీ'. ఈ మూవీకి క్రిష్ జాగర్లమూడి దర్శకుడు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'వేదం' (2010) మంచి హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ కాంబినేషన్‌లోని 'ఘాటీ'ని యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. నవంబరు 7న అనుష్క పుట్టినరోజు సందర్భంగా 'ఘాటీ' సినిమా నుంచి విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్‌కి మంచి స్పందన వచ్చింది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో జరిగిన వాస్తవ ఘటనల నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్ గా ఈ మూవీ రూపొందుతోంది. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏప్రిల్ 18న విడుదల కానుంది. ఇదిలా ఉంటే 'కథనార్-ది వైల్డ్ సోర్సెరర్' అనే సినిమా ద్వారా మలయాళ పరిశ్రమలో ఎంట్రీ ఇస్తున్నారు అనుష్క. 'ఘాటీ', 'కథనార్-ది వైల్డ్ సోర్సెరర్' సినిమాలు ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నాయి. ఈ రెండు సినిమాలతో 2025లో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తారు అనుష్క.

వచ్చే ఏడాదైనా...

సౌత్‌లోని స్టార్ హీరోయిన్ల జాబితాలో సమంతది ప్రత్యేక స్థానం. అందం, అభినయంతో దక్షిణాదిలోనే కాదు... ఉత్తరాదిలోనూ తనకంటూ ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారామె. ఆ మధ్య వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న ఆమె ఈ మధ్య స్లో అయ్యారు. 2023లో 'శాకుంతలం, ఖుషి' వంటి సినిమాలతో ప్రేక్షకులను అలరించిన ఈ బ్యూటీ 2024లో మాత్రం వెండితెరపై కనిపించలేదు. అయితే 'సిటాడెల్ హనీ-బన్నీ' అనే వెబ్ సిరీస్ ద్వారా వెబ్ ప్రేక్షకులను మాత్రం అలరించారామె. విజయ్ దేవర కొండకి జోడీగా సమంత నటించిన 'ఖుషి' సినిమా తర్వాత ఆమె కమిటైన ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'మా ఇంటి బంగారం'. తన పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 28న ఈ సినిమాని ప్రకటించారు సమంత. అంతేకాదు... తన సొంత ప్రొడక్షన్ హౌస్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమాని నిర్మించనున్నట్లు ఆమె ప్రకటించడం విశేషం. బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన 'మా ఇంటి బంగారం' చిత్రం పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. మెడలో నల్లపూసలు, చీర కట్టు, పెద్ద బొట్టుతో ఉన్న సమంత లుక్ చూస్తే ఆమె గృహిణి పాత్రలో కనిపిస్తారని తెలుస్తోంది. అయితే ఆమె చేతిలో గన్, ముఖం మీద రక్తపు మరకలు, ఆమె వెనకాల టెడ్డీ బేర్, స్టవ్ మీద ప్రెజర్ కుక్కర్... ఇవన్నీ చూస్తే ఈ సినిమాలో మరొక కోణం కూడా ఉందని స్పష్టం అవుతోంది. అయితే ఈ సినిమాకి దర్శకుడు ఎవరు? ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను ప్రకటించలేదు. మరి 2025లో అయినా సమంత వెండితెర ప్రేక్షకులను అలరిస్తారా? లేదా అనేదానిపై స్పష్టత లేదు. ఇదిలా ఉంటే ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే హిందీ వెబ్ సిరీస్ చేస్తున్నారు సమంత.

డాక్యుమెంటరీతో మాత్రమే...

దక్షిణాదిలో లేడీ సూపర్ స్టార్ అనగానే నయన తార పేరును టక్కున చెబుతారు ఆమె అభిమానులు. ఓ వైపు హీరోలకి జోడీగా కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తూ ఫుల్ స్వింగ్‌లో దూసుకెళుతున్నారీ బ్యూటీ. ప్రస్తుతం ఆమె చేతిలో దాదాపు ఎనిమిది సినిమాలు ఉన్నాయి. వాటిల్లో ఐదు తమిళ, రెండు మలయాళ, ఒకటి కన్నడ చిత్రం ఉంది. కాగా చిరంజీవి హీరోగా మోహన్ రాజా దర్శకత్వం వహించిన 'గాడ్ ఫాదర్' (2022) సినిమాలో చిరంజీవి సోదరిగా నటించారు నయనతార. ఆ చిత్రం విడుదలై రెండేళ్లు దాటినా మరో తెలుగు సినిమా కమిట్ కాలేదామె. ఇతర భాషల్లో ఫుల్ బిజీగా ఉండటం వల్లనో లేకుంటే సరైన కథ కుదరకనో ఆమె తెలుగు సినిమాకి పచ్చజెండా ఊపలేదు. ఆ విధంగా దక్షిణాదిలోనే అగ్ర కథానాయికగా దూసుకెళుతున్న నయనతార కూడా 2024లో ప్రేక్షకులను పలకరించలేకపోయారు. ఆమె నటించిన ఏ సినిమా కూడా ఈ ఏడాది విడుదల కాకపోవడంతో ఆమె ఫ్యాన్స్‌కి నిరాశ తప్పలేదు. అయితే 2025లో మాత్రం దాదాపు అరడజనుకు పైగా సినిమాలతో ఆమె ప్రేక్షకులను అలరించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే... ఓటీటీలో ప్రసారమవుతున్న 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీతో ఈ ఏడాది నయనతార కనిపించడం ఆమె అభిమానులకు ఓ చిన్న ఊరట.

ప్రత్యేక పాటతో...

చిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలకు పైగా ప్రయాణం త్రిషది. తమిళ, తెలుగు, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో నటించి, తనకంటూ స్టార్ హీరోయిన్ స్టేటస్‌ని సొంతం చేసుకున్నారామె. అందం, అభినయంలో ఇప్పటికీ నేటి తరం యువ హీరోయిన్లకు గట్టి పోటీ ఇస్తున్నారు త్రిష. ఓ వైపు హీరోలకు జోడీగా నటిస్తూనే, మరోవైపు ఫీమేల్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లోనూ నటిస్తూ బిజీగా దూసుకెళుతున్న ఆమె నటించిన ఏ చిత్రం కూడా ఈ ఏడాది విడుదల కాలేదు. అయితే విజయ్ హీరోగా రూపొందిన 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' (గోట్) సినిమాలో మాత్రం ఓ ప్రత్యేక పాటలో నటించారు త్రిష. అలాగే 'బృంద' అనే ఓ వెబ్ సిరీస్‌తో బుల్లితెర ప్రేక్షకులను పలకరించారామె. అవి మినహా 2024లో పూర్తి స్థాయిలో ఆమె ప్రేక్షకులను అలరించలేదు. అయితే వచ్చే ఏడాది పలు చిత్రాలతో తెరపై కనిపించనున్నారు. ప్రస్తుతం నాలుగు తమిళ చిత్రాలు, రెండు మలయాళ సినిమాలతో పాటు తెలుగులో 'విశ్వంభర' సినిమా చేస్తున్నారు త్రిష. 'స్టాలిన్' (2006) సినిమా తర్వాత చిరంజీవి-త్రిష కలిసి నటిస్తున్న చిత్రం 'విశ్వంభర' కావడం విశేషం. ఇదిలా ఉంటే... 2025లో త్రిష నటించిన ఐదారు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రావడం పక్కా అని స్పష్టం అవుతోంది.

2023లో మూడు... ఈ ఏడాది నో

నటి, గాయని, మ్యూజిక్ కంపోజర్... ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు సొంతం చేసుకున్నారు శ్రుతీహాసన్. తెలుగు, తమిళ, హిందీ సినిమాల్లో నటిస్తూ బిజీగా దూసుకెళుతున్నారామె. 2023లో తెలుగులో ఆమె నటించిన 'వాల్తేరు వీరయ్య (చిరంజీవి), వీరసింహారెడ్డి (బాలకృష్ణ), సలార్: పార్ట్ 1- సీజ్‌ఫైర్ (ప్రభాస్) ' వంటి సినిమాలు విడుదలయ్యాయి. ఆ మూడు సినిమాలతో గత ఏడాది హ్యాట్రిక్ హిట్స్ అందుకున్న ఈ బ్యూటీ 2024లో మాత్రం తన అభిమానులను నిరాశ పరిచారు. ఈ ఏడాది ఆమె నటించిన ఒక్క సినిమా కూడా రిలీజ్ కాలేదు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న 'కూలీ' చిత్రంలో నటిస్తున్నారు శ్రుతీహాసన్. అలాగే 'చెన్నై స్టోరీ'లోనూ నటిస్తున్నారామె. ఫిలిప్ జాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ రెండు సినిమాలు 2025లో ప్రేక్షకుల ముందుకు వస్తాయని తెలుస్తోంది.

వచ్చే ఏడాది స్ట్రయిట్ సినిమాతో...

2021లో 'లవ్ స్టోరీ, శ్యామ్ సింగరాయ్, 'విరాట పర్వం' చిత్రాలతో తెలుగు తెరపై కనిపించారు సాయి పల్లవి. ఆ తర్వాత తెలుగులో స్ట్రయిట్ సినిమా ఒప్పుకోలేదు. 2022లో ఆమె నటించిన తమిళ చిత్రం 'గార్గి' తెలుగులోనూ విడుదలైంది. ఇక తమిళ చిత్రం 'అమరన్' తెలుగులోనూ విడుదల కావడంతో ఈ ఏడాది ఆ విధంగా తెలుగు ప్రేక్షకులను పలకరించారీ బ్యూటీ. సాయి పల్లవి నటిస్తున్న తాజా తెలుగు చిత్రం 'తండేల్' వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. సో... 2025లో స్ట్రయిట్ తెలుగు చిత్రంలో కనిపిస్తారామె. నాగచైతన్య హీరోగా చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది.

వచ్చే ఏడాది నాలుగు చిత్రాలతో...

తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో గోపికమ్మా, బుట్ట బొమ్మగా స్థానం సంపాదించుకున్నారు పూజా హెగ్డే. నాగచైతన్య హీరోగా నటించిన 'ఒక లైలా కోసం' (2014) సినిమాతో టాలీవుడ్‌కి హీరోయిన్‌గా పరిచయమయ్యారామె. పదేళ్ల కెరీర్‌లో మహేశ్ బాబు, అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, వరుణ్ తేజ్, అఖిల్, బెల్లంకొండ సాయిశ్రీనివాస్ వంటి హీరోలకి జోడీగా నటించారు పూజా హెగ్డే. 'ఆచార్య' (2022) సినిమాలో రామ్ చరణ్‌తో జతకట్టిన ఈ బ్యూటీ తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు. అయితే 'ఎఫ్ 3' చిత్రంలో ఓ పాటలో నర్తించారు. 2023లో ఆమె నటించిన ఒకే ఒక హిందీ చిత్రం 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' రిలీజైంది. అయితే ఈ ఏడాది మాత్రం పూజ నటించిన ఏ చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాలేదు. అయితే ప్రస్తుతం ఆమె చేతిలో మాత్రం రెండు హిందీ సినిమాలు, రెండు తమిళ చిత్రాలున్నాయి. 2024 గ్యాప్‌ని 2025లో భర్తీ చేయనున్నారు పూజ. వచ్చే ఏడాది నాలుగు చిత్రాల్లో పూజా హెగ్డే కనిపించే చాన్స్ ఉంది.

ఇదిలా ఉంటే... తమన్నా, నిత్యా మీనన్, సంయుక్తా మీనన్, నిధీ అగర్వాల్, మెహరీన్ వంటి తారలు నటించిన ఏ భాషా చిత్రం కూడా 2024లో విడుదల కాలేదు. కీర్తి సురేష్, రాశీ ఖన్నా, ప్రియమణి వంటి వారు 2024లో తెలుగు ప్రేక్షకులకు దూరమయ్యారు. కానీ, ఇతర భాషల ప్రేక్షకులను అలరించారు.

- దేరంగుల జగన్


కాంబినేషన్ రిపీట్?

హీరో చిరంజీవి, దర్శకుడు కొల్లి బాబీ (కేఎస్ రవీంద్ర) కాంబినేషన్ మరోసారి రిపీట్ అవుతుందా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్ నగర్ వర్గాలు. చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో 2023లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో బాబీతో మరో సినిమా చేయాలని చిరంజీవి అనుకుంటున్నారట. చిరంజీవి కోసం బాబీ ఒక కథ అనుకున్నారని, అన్నీ కుదిరితే ఈ కాంబినేషన్‌లో మళ్లీ సినిమా ఉండొచ్చని ఫిల్మ్‌నగర్ సమాచారం. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' సినిమా చేస్తున్నారు. ఈ చిత్రం తర్వాత అనిల్ రావిపూడితో సినిమా చేయాలని చిరంజీవి అనుకుంటున్నారట. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే, సమాంతరంగా బాబీ సినిమానూ చేయాలని చిరంజీవి ప్లాన్ చేసుకుంటున్నారట. దర్శకులు అనిల్ రావిపూడి, బాబీలతో సినిమాలు పూర్తి చేసిన తర్వాత 'దసరా' దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో చిరంజీవి సినిమా చేస్తారని తెలుస్తోంది. అయితే ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


● చిరంజీవి

కశ్మీర్‌లో యాక్షన్

నాని హీరోగా నటిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'హిట్: ది థర్డ్ కేసు'. ఈ చిత్రంలో 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకాలపై డా. శైలేష్ కొలను దర్శకత్వంలో ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 మే 1న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో నాని పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ కశ్మీర్‌లో జరుగుతోంది. నానితో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటుండగా కొంత టాకీ పార్టుతో పాటు యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నారు. ''ఈ సినిమాలో తన పాత్రకు తగ్గట్లుగా నాని అద్భుతంగా మేకోవర్ అయ్యారు. ఆయన రోల్ ఇంటెన్స్ అండ్ ఫెరోషియస్‌గా ఉంటుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: మిక్కీ జె. మేయర్.


● నాని

షాహిద్‌తో జోడీ?

హీరోయిన్ రష్మికా మందన్నా ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు. ఓ వైపు హీరోయిన్‌గా చేస్తూనే మరోవైపు లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తున్నారామె. అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రలో వికాస్ బాల్ దర్శకత్వం వహించిన 'గుడ్‌బై' (2022) సినిమాతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన రష్మిక ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే మూడు హిందీ సినిమాలు చేస్తున్న ఆమె తాజాగా మరో బాలీవుడ్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్. 'కాక్‌టైల్ 2' సినిమాలో హీరో షాహిద్ కపూర్‌కి రష్మిక జోడీగా నటించనున్నారని బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. హోమి అదజానియా దర్శకత్వంలో షాహిద్ కపూర్ హీరోగా 'కాక్‌టైల్ 2' రూపొందనుంది. ఈ చిత్రంలో శ్రద్ధా కపూర్ కూడా ఓ హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారు. మరో హీరోయిన్ పాత్రకి రష్మికని సంప్రదించారట మేకర్స్. చిత్ర కథ, తన పాత్ర నచ్చడంతో ఆమె నటించేందుకు పచ్చజెండా ఊపారని భోగట్టా. కాగా ఈ సినిమాలో హీరోయిన్ కృతీ సనన్ కూడా నటించనున్నారనే వార్తలు కూడా బాలీవుడ్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. మరి 'కాక్‌టైల్ 2'లో ముగ్గురు హీరోయిన్లు ఉంటారా? లేకుంటే ఇద్దరా వంటి విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


● రష్మికా మందన్నా

మేజర్ షైతాన్ సింగ్

నటుడు-దర్శక-నిర్మాత ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా '120 బహదూర్'. 1962లో జరిగిన ఇండియా-చైనా యుద్ధంలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించిన మేజర్ షైతాన్ సింగ్ భాటి జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ వార్ డ్రామాకు రజనీష్ ఘాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. మేజర్ షైతాన్ సింగ్‌గా ఫర్హాన్ అక్తర్ నటిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. రితేష్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్, అమిత్ చంద్ర ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా విడుదల తేదీని గురువారం ప్రకటించారు. '120 బహదూర్' సినిమాను నవంబరు 21న రిలీజ్ చేయనున్నట్లుగా వెల్లడించారు మేకర్స్. మరోవైపు దర్శకుడిగాను ఫర్హాన్ అక్తర్ చేతిలో సినిమాలు ఉన్నాయి. రణ్‌వీర్ సింగ్ హీరోగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో 'డాన్ 3' చిత్రం తెరకెక్కాల్సి ఉంది. అలాగే ప్రియాంకా చోప్రా, ఆలియా భట్, కత్రినా కైఫ్ లీడ్ రోల్స్‌లో ఫర్హాన్ అక్తర్ డైరెక్షన్‌లో 'జీ లే జరా' సినిమా కూడా ఉంది. అయితే 'డాన్ 3, జీ లే జరా' చిత్రాల చిత్రీకరణకు కాస్త సమయం ఉండటంతో, ఈలోపు '120 బహదూర్' సినిమా చేస్తున్నారు ఫర్హాన్ అక్తర్.




● ఫర్హాన్ అక్తర్

నాకున్న ప్రాణం నీదేనని..!

ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'డ్రింకర్ సాయి'. బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్రం ట్యాగ్ లైన్. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా కిరణ్ తిరుమలశెట్టి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'అర్థం చేసుకోవు ఎందుకే...' అనే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను, హేషమ్ అబ్దుల్ వాహబ్ పాడారు. ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ వసంత్ కంపోజ్ చేశారు. 'అర్థం చేసుకోవు ఎందుకే... నా చిన్ని లోకం నువ్వేనని, నాకున్న ప్రాణం నీదేనని, నాకన్నా ఎక్కువగా నిన్నే ప్రేమించానని, ప్రేమన్న మాటే నీతో తెలిసొచ్చిందని, అర్థం చేసుకోవు ఎందుకే... అర్థం చేసుకోవు ఎందుకే' అంటూ ప్రేమలోని పెయిన్‌ను తెలిపేలా ఈ పాట ఉంటుందని చిత్రయూనిట్ పేర్కొంది. పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, ఎస్ఎస్ కాంచి, భద్రం, కిర్రాక్ సీత, రీతు చౌదరి, ఫన్ బకెట్ రాజేష్, రాజ ప్రజ్వల్ ఈ సినిమాలోని ఇతర కీలక పాత్రల్లో నటించారు.


● ధర్మ

కిల్లర్ ప్రేమకథ


● పూర్వాజ్, జ్యోతి పూర్వాజ్

'శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్' వంటి వైవిధ్యమైన సినిమాలతో ఆకట్టుకున్న డైరెక్టర్ పూర్వాజ్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కిల్లర్: పార్ట్ 1 డ్రీమ్ గర్ల్'. జ్యోతి పూర్వాజ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, విశాల్ రాజ్, గౌతమ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్‌పై పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ పూర్తయింది. ఈ సందర్భంగా పూర్వాజ్ మాట్లాడుతూ– ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రం 'కిల్లర్'. లవ్, రొమాన్స్, ప్రతీకారం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలు కూడా ఉంటాయి. 'ఏ మాస్టర్ పీస్' సినిమా తర్వాత మా సంస్థలో వస్తున్న 'కిల్లర్' మూవీపై ఉన్న అంచనాలను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా చిత్రీకరిస్తున్నాం. ఔట్‌పుట్ మేము అనుకున్నట్లే బాగా వస్తోంది. త్వరలోనే షూటింగ్ పూర్తి చేస్తాం. యాక్షన్ థ్రిల్లర్‌లలో 'కిల్లర్' ఒక స్పెషల్ మూవీగా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది'' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ బొమ్మిశెట్టి, సంగీతం: ఆషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం.

సాక్షి ప్లస్
శుక్రవారం । 20-12-2024

బిజినెస్ రీల్

బీయింగ్ హ్యూమన్ నుంచి 4 పెర్‌ఫ్యూమ్ స్ప్రేలు



న్యూఢిల్లీ: బీయింగ్ హ్యూమన్ క్లోతింగ్ తాజాగా 4 సరికొత్త పెర్‌ఫ్యూమ్ స్ప్రేలను ప్రవేశపెట్టింది. ప్రముఖ బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ పుట్టిన రోజును 'భాయ్ కా బర్డే–వెయిట్‌లిఫ్టింగ్ తో బన్‌తా హై' పేరిట వేడుకగా నిర్వహిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా డిసెంబర్ 25 నుంచి 27 వరకు అన్ని కలెక్షన్లపై ఫ్లాట్ 50 శాతం డిస్కౌంటు ఆఫర్లు ఇస్తున్నట్లు వివరించింది.

ఈ-వ్యాలెట్లలోకి పీఎఫ్ సొమ్ము

త్వరలో సాధ్యమన్న కార్మిక శాఖ

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యులు తమ పీఎఫ్ క్లెయిమ్‌లను త్వరలో ఏటీఎంల నుంచి ఉపసంహరించుకోవచ్చని కార్మిక శాఖ ఇటీవలే ప్రకటించగా.. ఈ-వ్యాలెట్ల నుంచి సైతం ఈ సదుపాయం కల్పించే దిశగా పనిచేస్తున్నట్టు తెలిపింది. కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ కార్యదర్శి సుమితా దావ్రా దీనిపై స్పందించారు. ''నా సొమ్మును ఎంత సులభంగా ఉపసంహరించుకోవచ్చన్న దానిపై సభ్యుల్లో ఆసక్తి నెలకొంది. ఆటో సెటిల్‌మెంట్‌లో క్లెయిమ్ మొత్తం సభ్యుల బ్యాంక్ ఖాతాల్లోకి వెళుతుంది. దాంతో బ్యాంక్ ఏటీఎం నుంచి ఉపసహరించుకోవచ్చు. క్లెయిమ్ మొత్తం వ్యాలెట్‌లోకి నేరుగా ఎలా పంపాలన్న విషయమై మేము యంత్రాంగం రూపొందించాల్సి ఉంది. దీనిపై బ్యాంకర్లతో చర్చలు మొదలు పెట్టాం. దీని అమలు విషయమై ప్రణాళిక అవసరం''అని పర్యాటక సదస్సుకు హాజరైన సందర్భంగా మీడియాకు వివరించారు. ఆర్‌బీఐని సంప్రదించి త్వరలోనే తగిన ప్రణాళిక సిద్ధం చేస్తామని చెప్పారు.

ఉన్సూ కిమ్‌కు మరోసారి హ్యుందాయ్ ఇండియా పగ్గాలు



న్యూఢిల్లీ: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా ఉన్సూ కిమ్‌ను మేనేజింగ్ డైరెక్టర్‌గా తిరిగి నియమించినట్లు గురువారం తెలిపింది. 2025 జనవరి 25 నుంచి మూడు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. దక్షిణ కొరియాలోని హ్యుందాయ్ మోటార్ కంపెనీలో కిమ్ 1991లో చేరారు. 2022 జనవరి 1న హ్యుండై మోటార్ ఇండియా ఎండీగా బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు హ్యుందాయ్ మోటార్ కంపెనీలో గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DRREDDY	1,326.90	4.04
CIPLA	1,504.00	2.15
BPCL	294.2	2.05
SUNPHARMA	1,821.30	1.12
APOLLOHOSP	7,312.90	1.04

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJFINSV	1,592.80	-2.33
JSWSTEEL	925	-2.31
BAJFINANCE	6,915.00	-2.25
GRASIM	2,537.00	-2.2
ASIANPAINT	2,295.00	-2.15

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-12-2024

విశాఖ	600–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600–00
విజయవాడ	600–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	570–00
వరంగల్	572–00
రిటైల్ ధర	6.30

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,477
ఎన్ఎస్ఈ	1,03,053
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,03,053
ఎఫ్ఐఐ	- 4,225
డీఐఐ	+ 3,943

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.49	$ 70.58
బ్రెంట్	72.95	$ 73.39

కీలక హోదాల్లో మహిళలు పది శాతమే

- మొత్తం శ్రామిక శక్తిలో 20 శాతం లోపే..
- సీఎఫ్ఏ ఇనిస్టిట్యూట్ నివేదిక



న్యూఢిల్లీ: ఉద్యోగుల్లో మహిళల సంఖ్యను పెంచుకోవడంపై కంపెనీలు మరింత దృష్టి పెడుతున్నప్పటికీ అంతగా ప్రయోజనం కనిపించడం లేదు. దేశీయంగా మొత్తం శ్రామిక శక్తిలో మహిళల వాటా 20 శాతం లోపే ఉంటోంది. కీలక హోదాల్లో (కేఎంపీ) ఉన్న వారి సంఖ్య కేవలం పది శాతం స్థాయిలో ఉంది. ఇక బోర్డ్ డైరెక్టర్ల స్థాయిలో మహిళల సంఖ్య 20 శాతం కన్నా తక్కువే ఉంది. లింగ అసమానతలపై సీఎఫ్ఏ ఇనిస్టిట్యూట్, సీఎఫ్ఏ సొసైటీ ఇండియా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 300 కంపెనీలు తమ బిజినెస్ రెస్పాన్సిబిలిటీ, సస్టెయినబిలిటీ రిపోర్ట్‌లలో (బీఆర్ఎస్ఆర్) వెల్లడించిన వివరాల ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. దీని ప్రకారం పురుషులతో పోలిస్తే మహిళా బోర్డు మెంబర్లు, కేఎంపీలకు అతి తక్కువ ప్రతిఫలం దక్కుతోంది. మహిళా డైరెక్టర్లకు లభించే ప్రతిఫలం .. పురుష డైరెక్టర్ల వేతనాల్లో సగటున 44 శాతమే ఉంటోంది. ఇక పురుష కేఎంపీలతో పోలిస్తే మహిళా కేఎంపీలకు జీతభత్యాలు 25 శాతం కన్నా తక్కువే ఉంటున్నాయి.

మరిన్ని అంశాలు..

- ఐటీ రంగంలో అత్యధికంగా (34 శాతం) మహిళలు ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో నిత్యావసరయేతర ఉత్పత్తులు, సేవల రంగం (25 శాతం), ఆర్థిక రంగం (24 శాతం) ఉన్నాయి. యుటిలిటీస్ విభాగంలో మహిళ సిబ్బంది అత్యంత తక్కువగా (4 శాతం) ఉన్నారు.
- బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ (బీవోడీ) విషయానికొస్తే రియల్ ఎస్టేట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నిత్యావసరాలు, ఆరోగ్య సంరక్షణ తదితర రంగాల్లో లింగ సమానత్వం మరింత మెరుగ్గా ఉంది. అయితే, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎనర్జీ రంగాల్లో మాత్రం లింగ అసమానతలు ప్రస్ఫుటంగా ఉంటున్నాయి.
- దేశీయంగా కార్పొరేట్ వ్యవస్థలో లింగ సమానత్వాన్ని సాధించేందుకు మరింతగా పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో గణనీయంగా పురోగతి సాధించినప్పటికీ సీనియర్ హోదాల్లో మహిళల ప్రాతినిధ్యం, జీతభత్యాల విషయంలో వ్యత్యాసాలు ఉన్నాయి. వీటిని సరిదిద్దడంపై విధాన నిర్ణేతలు, కంపెనీలు తక్షణం దృష్టి పెట్టాలి.

స్టోరేజ్ చిప్‌సెట్స్ తయారీలోకి మైక్రోమ్యాక్స్

- తైవాన్ కంపెనీ ఫీజన్‌తో జేవీ
- నోయిడా ఫెసిలిటీలో ఉత్పత్తి
- దేశీయంగా ప్రారంభమైన ట్రయల్స్
- మైక్రోమ్యాక్స్ కో–ఫౌండర్ రాహుల్



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉన్న మైక్రోమ్యాక్స్, తైవాన్‌కు చెందిన స్టోరేజ్ చిప్ కంపెనీ ఫీజన్ తాజాగా మిఫీ పేరుతో సంయుక్త భాగస్వామ్య కంపెనీ ఏర్పాటు చేశాయి. ఈ జేవీ కృత్రిమ మేధస్సుతో (ఏఐ) కూడిన స్టోరేజ్ చిప్‌సెట్ మాడ్యూళ్లను రూపొందించి, తయారు చేస్తుంది. నోయిడా ఫెసిలిటీలో ఉత్పత్తి ప్రారంభించామని మైక్రోమ్యాక్స్ ఇన్ఫర్మేటిక్స్ కో–ఫౌండర్ రాహుల్ శర్మ గురువారం తెలిపారు. 'ఎస్ఎస్‌డీ కంట్రోలర్, ఎస్ఎస్‌డీ స్టోరేజ్ టెక్నాలజీలలో ఫీజన్ అగ్రగామిగా ఉంది. జేవీలో మైక్రోమ్యాక్స్‌కు 55 శాతం, ఫీజన్‌కు 45 శాతం వాటా ఉంది' అని శర్మ చెప్పారు. భద్రత, వ్యూహాత్మక దృక్కోణం నుండి ఏ దేశానికైనా సర్వర్స్ చాలా ముఖ్యమైన అంశం అని అన్నారు. స్టోరేజ్ చిప్‌సెట్‌ల రూపకల్పనపై సంస్థ దృష్టి సారిస్తుందని చెప్పారు.

ధర పదో వంతుకు తగ్గింపు..

ఈ వెంచర్‌తో గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ) ధరను పదో వంతు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రాహుల్ వెల్లడించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలో ఇది భారత్‌లోనే కాకుండా ఇతర మార్కెట్లలోనూ సంచలనం కలిగిస్తుందని చెప్పారు. భారత్‌లోని కొన్ని ప్రముఖ సంస్థలతో ట్రయల్స్ ఈ నెలలో పూర్తవుతాయని, 2025 మొదటి త్రైమాసికంలో వాణిజ్య పరంగా సరఫరా ప్రారంభం అవుతుందని ఆయన పేర్కొన్నారు. 'స్టోరేజ్ పరిష్కారాలను అందించే కొన్ని కంపెనీలు మాత్రమే ఉన్నాయి. స్వదేశీ స్టోరేజ్ సొల్యూషన్స్ కంపెనీ లేని దేశాలకు.. ముఖ్యంగా భారత్‌కు ఇది చాలా ముఖ్యం. మా జాయింట్ వెంచర్ మన స్వంత డిజైన్, తయారీని కలిగి ఉండటం వల్ల విదేశీ సాంకేతికతలపై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది' అని శర్మ చెప్పారు.

మూడేళ్లలో 1,000 మంది..

కంపెనీ ఫ్రెషర్లను నియమించి వారికి స్టోరేజ్ టెక్నాలజీని అభివృద్ధి చేయడంపై శిక్షణ ఇస్తుందని రాహుల్ తెలిపారు. 'మా కాన్సెప్ట్ మొదట భారత్ కోసం.. ఆ తరువాత ప్రపంచం కోసం రూపొందించబడింది. రెండు ఏళ్లలో మొదటి డిజైన్‌ను సిద్ధం చేయాలనేది మా ఆకాంక్ష. మేము ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నాం. రాబోయే మూడేళ్లలో 1,000 ఇంజనీర్లను కలిగి ఉండాలని భావిస్తున్నాం. వీరందరికీ ఫీజన్ శిక్షణ ఇస్తుంది. కంపెనీ ఇప్పటికే ఉన్న తయారీ సంస్థల నుండి వేఫర్‌లను కొనుగోలు చేస్తుంది. స్టోరేజ్ మాడ్యూల్స్ తయారీకి వాటిని ఉపయోగిస్తుంది' అని వివరించారు.

ఐవోసీ రూ.21,000 కోట్ల పెట్టుబడి

- బరౌనీ రిఫైనరీ విస్తరణకు వ్యయం
- సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్‌కు సైతం



పట్నా: ప్రభుత్వ రంగ చమురు దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) రూ.21,000 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. బిహార్‌లోని బరౌనీ రిఫైనరీ విస్తరణ, ఆ రాష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్టు ఐవోసీ ఈడీ సుమన్ కుమార్ వెల్లడించారు. 'సుమారు రూ.16,000 కోట్ల వ్యయంతో బరౌని రిఫైనరీని పెట్రోకెమికల్ ప్లాంట్‌తో కలిపి ప్రస్తుత 6 మిలియన్ టన్నుల నుండి సంవత్సరానికి 9 మిలియన్ టన్నులకు విస్తరిస్తున్నాం. 27 నగరాల్లో ఆటోమొబైల్స్‌కు, గృహాలు, పరిశ్రమలకు పైపుల ద్వారా సీఎన్‌జీని రిటైల్ చేయడానికి నెట్‌వర్క్ ఏర్పాటుకై మరో రూ.5,600 కోట్లు పెట్టుబడి పెడతాం. 200,000 టన్నుల తయారీ సామర్థ్యంతో పాలీప్రొపైలిన్ కేంద్రాన్ని కూడా 2025 చివరినాటికి ఏర్పాటు చేస్తాం. ప్లాస్టిక్ పరిశ్రమ పాలీప్రొపైలిన్‌ను ముడిసరుకుగా వినియోగిస్తోంది. 2047 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలనే ఐవోసీ లక్ష్యంలో ఈ పెట్టుబడులు భాగం' అని ఆయన చెప్పారు.

రూ.2 లక్షల కోట్ల కంటే..

110 బిలియన్ డాలర్ల విలువైన ఐవోసీ.. దూకుడుగా మూలధన విస్తరణ ప్రణాళికను రూపొందించింది. రిఫైనింగ్ సామర్థ్యం, పెట్రోకెమికల్ ఇంటిగ్రేషన్, అనుబంధ మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధన ఆస్తులను విస్తరించడానికి దశాబ్దంలో రూ.2 లక్షల కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టాలని ప్రతిపాదించింది. భారత ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తున్న నేపథ్యంలో దేశ ఇంధన అవసరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. 'ద ఎనర్జీ ఆఫ్ ఇండియాగా' సంస్థ 2050 నాటికి భారత ఇంధన అవసరాలలో 12.5 శాతం సమకూర్చడం ద్వారా ముందు వరుసలో నిలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. కంపెనీ పానిపట్ రిఫైనరీని సంవత్సరానికి 15 మిలియన్ టన్నుల నుండి 25 మిలియన్ టన్నులకు, గుజరాత్ రిఫైనరీని 13.7 మిలియన్ టన్నుల నుండి 18 మిలియన్ టన్నులకు విస్తరిస్తోంది.

సమగ్ర ఆరోగ్య సంరక్షణకు సియానా యాప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జన్యు ఆధారిత వైద్య పరీక్షల నుంచి డాక్టర్ల కన్సల్టేషన్, ఔషధాల వరకు వివిధ సర్వీసులన్నీ ఒకే చోట అందించే విధంగా సియానా హెల్త్‌కేర్ యాప్‌ను ఏసియానా సంస్థ ఆవిష్కరించింది. ఫేస్ స్కాన్ ద్వారా కృత్రిమ మేధతో (ఏఐ) అర నిమిషం వ్యవధిలోనే 25 కీలకమైన ఆరోగ్య ప్రమాణాలను ఇది తెలియజేయగలదని సంస్థ సీఈవో కిశోర్ కారుమంచి తెలిపారు. నిర్దిష్ట వార్షిక రుసుముతో జన్యుఆధారిత వైద్య పరీక్షలు సహా వైద్యుల కన్సల్టేషన్, తీసుకోతగిన జాగ్రత్తల గురించి ఎప్పటికప్పుడు ఫాలోఅప్ ఉంటుందని వివరించారు. ప్రాథమికంగా కొంత డిస్కౌంటు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతరత్రా పరీక్షలతో పోలిస్తే జెనెటిక్ టెస్టుల వివరాలతో వంశపారంపర్యంగా వచ్చే అనారోగ్యాలను ముందుగా గుర్తించి, తగు చర్యలు తీసుకోవచ్చని, అలాగే శరీర తత్వాన్ని బట్టి డాక్టరు ఔషధాలను సూచించేందుకు వీలవుతుందని ఆయన పేర్కొన్నారు.



ఈ-కామర్స్ ఎగుమతి హబ్‌లకు 5 సంస్థల దరఖాస్తు

మూడు సంస్థల షార్ట్‌లిస్ట్



న్యూఢిల్లీ: దేశీయంగా ఈ-కామర్స్ ఎగుమతి హబ్‌లను ఏర్పాటు చేసేందుకు డీహెచ్ఎల్, లెక్సీఫ్ సహా కొత్తగా అయిదు సంస్థలు దరఖాస్తు చేసుకున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అయిదింటిలో మూడు దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేసినట్లు, వీటిపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. రెండు హబ్‌లు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ సమీపంలో రాగలవని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో కార్యకలాపాలు ప్రారంభం కాగలవని వివరించారు. కస్టమ్స్, సెక్యూరిటీ క్లియరెన్స్ మొదలైనవి వేగవంతం చేసేందుకు ఇందులో సదుపాయాలు ఉంటాయి. అలాగే నాణ్యత, సర్టిఫైయింగ్ ఏజెన్సీలు కూడా ఉంటాయి. హబ్‌లను నెలకొల్పిన సంస్థల స్పందనను బట్టి దేశవ్యాప్తంగా ఇలాంటివి మరిన్ని ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం సవివరంగా మార్గదర్శకాలను రూపొందిస్తుందని అధికారి పేర్కొన్నారు. లాజిస్టిక్స్ అగ్రిగేటర్ సంస్థ షిప్‌రాకెట్, ఎయిర్‌కార్గో హ్యాండ్లింగ్ కంపెనీ కార్గో సర్వీస్ సెంటర్‌లను (సీఎస్‌సీ) ఇప్పటికే పైలట్ ప్రాతిపదికన ప్రభుత్వం ఎంపిక చేసింది. 2030 నాటికి దేశీ ఈ-కామర్స్ ఎగుమతులు 100 బిలియన్ డాలర్లకు చేరవచ్చని, రాబోయే రోజుల్లో 200–250 బిలియన్ డాలర్లకు ఎగియవచ్చని అంచనాలు నెలకొన్నాయి. అలాగే, ప్రస్తుతం 800 బిలియన్ డాలర్లుగా ఉన్న అంతర్జాతీయ ఈ-కామర్స్ ఎగుమతులు 2030 నాటికి 2 లక్షల కోట్ల డాలర్లకు చేరవచ్చని నివేదికలు చెబుతున్నాయి. ఈ-కామర్స్ ఎగుమతుల్లో అగ్రగామిగా ఉన్న చైనాలో ఎక్స్‌పోర్ట్ హబ్‌లుగా కూడా గణనీయంగా ఉన్నాయి.

బీఎన్ గ్రూప్ భారీ పెట్టుబడులు

- రూ.8,000 కోట్లు వెచ్చించేందుకు రెడీ
- కంపెనీ ఫౌండర్ అనుభవ్ అగర్వాల్



న్యూఢిల్లీ: వంట నూనెల తయారీలో ఉన్న బీఎన్ గ్రూప్ ఆఫ్రికాలో విస్తరించాలని నిర్ణయించింది. అక్కడ కార్యకలాపాల విస్తరణకు సుమారు రూ.8,000 కోట్లు పెట్టుబడి చేయనున్నట్టు మంగళవారం ప్రకటించింది. రాబోయే ఐదేళ్లలో దశలవారీ విస్తరణతో అభివృద్ధి చెందుతున్న మార్కెట్లను లక్ష్యంగా చేసుకున్నట్టు కంపెనీ తెలిపింది. 2,000 టన్నుల మొత్తం ఉత్పత్తి సామర్థ్యంతో మూడు తయారీ కేంద్రాలను స్థాపించాలని, పామ్ ప్లాంటేషన్లలో పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నట్టు తెలిపింది. బీఎన్ గ్రూప్ 2026–2027 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికం నాటికి కొత్త ప్లాంట్లలో ఉత్పత్తి కార్యకలాపాలను ప్రారంభించాలని భావిస్తోంది. 20–25 శాతం ఎబిటా మార్జిన్ అంచనా వేస్తోంది. ఈ విస్తరణ ఒక గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్‌గా మారడానికి వ్యూహాత్మక చర్య అని కంపెనీ వ్యవస్థాపకుడు, ఎండీ అనుభవ్ అగర్వాల్ తెలిపారు. విభిన్న ఆఫ్రికన్ మార్కెట్లకు అనుగుణంగా విలువ ఆధారిత వ్యాపారాలను సృష్టించడంపై దృష్టి సారించామన్నారు. పెట్టుబడిలో రూ.3,300 కోట్లు తయారీ సౌకర్యాల కోసం, మిగిలినది ప్లాంటేషన్ కొనుగోళ్ల కోసం వెచ్చిస్తామన్నారు. ప్రస్తుతం భారత్‌లో సింప్లీ ఫ్రెష్, న్యూట్రికా బ్రాండ్‌లలో ఉత్పత్తులను బీఎస్ గ్రూప్ విక్రయిస్తోంది. కంపెనీ 2023–2024 ఆర్థిక సంవత్సరంలో రూ.4,500 కోట్లకుపైగా ఆదాయాన్ని ఆర్జించింది. ఆఫ్రికాలో విస్తరణ ఫాస్ట్–మూవింగ్ కంజ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) రంగంలో కంపెనీ ఉనికిని బలోపేతం చేయడానికి విస్తృత వ్యూహాన్ని సూచిస్తుందని అగర్వాల్ తెలిపారు.

స్పెక్ట్రం బాకీలను చెల్లించిన ఎయిర్‌టెల్



న్యూఢిల్లీ: టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ తాజాగా టెలికం శాఖకు రూ.3,626 కోట్లను చెల్లించింది. దీంతో 2016లో కొనుగోలు చేసిన స్పెక్ట్రంకు సంబంధించిన అన్ని బకాయిలను పూర్తి చేసినట్లు కంపెనీ గురువారం తెలిపింది. వడ్డీ ఖర్చులు 8.65 శాతం కంటే ఎక్కువగా ఉన్నాయని సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. స్పెక్ట్రం తాలూకు ఈ ఏడాది మొత్తం రూ.28,320 కోట్లను ప్రభుత్వానికి చెల్లించినట్లు ఎయిర్‌టెల్ వివరించింది.

కంపెనీలకు ఆర్థిక మోసాల తాకిడి

- 59 శాతం భారత కంపెనీలకు ఇదే పరిస్థితి
- పీడబ్ల్యూసీ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: కంపెనీలకు ఆర్థిక మోసాల తాకిడి పెరిగిపోయింది. గడిచిన 24 నెలల్లో తాము ఆర్థిక మోసాల బారిన పడినట్టు 59 శాతం భారత కంపెనీలు వెల్లడించాయి. పీడబ్ల్యూసీ నిర్వహించిన 'గ్లోబల్ ఎకనమిక్ క్రైమ్ సర్వే 2024' రూపంలో ఈ వివరాలు తెలిశాయి. ప్రపంచవ్యాప్తంగా 2,446 సంస్థల సీఈవోలు, ఎండీలు, బోర్డు సభ్యుల అభిప్రాయాలను ఈ సర్వే తెలుసుకుంది. భారత్ నుంచి 91 కంపెనీలు సర్వేలో పాల్గొన్నాయి. ''సర్వేలో పాలు పంచుకున్న భారత కంపెనీల్లో 59 శాతం గత రెండేళ్లలో ఆర్థిక మోసాల బారిన పడినట్టు చెప్పాయి. అంతర్జాతీయ సగటు 41 శాతంతో పోల్చితే 18 శాతం ఎక్కువ. 2022 ఎడిషన్ సర్వే ప్రకారం చూసినా భారత్‌లో 7 శాతం పెరుగుదల కనిపిస్తోంది''అని ఈ సర్వే తెలిపింది. ప్రధానంగా కంపెనీల్లో ప్రొక్యూర్‌మెంట్ (కొనుగోళ్లు) విభాగంలో ఈ మోసాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నట్టు పీడబ్ల్యూసీ సర్వే తెలిపింది. తమకు ఇదొక ప్రధాన సమస్యగా 50 శాతం భారత కంపెనీలు తెలిపాయి. అంతర్జాతీయ సగటుతో పోల్చి చూస్తే 21 శాతం ఎక్కువ. ఇక 47 శాతం కంపెనీలకు కస్టమర్ల మోసాలు ఆందోళనకరంగా పరిణమించాయి. సైబర్ నేరాలు తమకు ప్రధాన సమస్య అని అంతర్జాతీయంగా 44 శాతం కంపెనీలు వెల్లడించాయి.

ఎప్పటి నుంచో ఉన్నవే..

''చారిత్రకంగా చూస్తే ప్రొక్యూర్‌మెంట్ మోసాలు అన్నవి ఎప్పటి నుంచో ఉన్నవే. ఆర్థిక ప్రయోజనం పొందేందుకు కొనుగోళ్లలో (ప్రొక్యూర్‌మెంట్) అవకతవకలకు పాల్పడడం. ఈ ఏడాది మా సర్వేలో పాల్గొన్న భారత కంపెనీల ప్రతినిధుల్లో సగం మంది ఇదే అంశంపై ఆందోళన వ్యక్తం చేశారు''అని పీడబ్ల్యూసీ ఇండియా ఫోరెన్సిక్ సర్వీసెస్ పార్ట్‌నర్ పునీత్ గర్ఖేల్ తెలిపారు. ప్రొక్యూర్‌మెంట్ మోసాలను నివారించేందుకు భారత కంపెనీలు డేటా అనలైటిక్స్‌ను వినియోగిస్తున్నట్టు ఈ సర్వే తెలిపింది. 33 శాతం ఆర్థిక నేరాలు అవినీతి, లంచాలకు సంబంధించినవేనని, గత రెండేళ్లలో టాప్–3 ప్రధాన ఆర్థిక నేరాల్లో ఇవి కూడా ఉన్నట్టు 26 శాతం భారత కంపెనీలు వెల్లడించాయి.

ఐపీవో స్ట్రీట్

కారారో ఇండియా @ రూ. 668-704

- ఈ నెల 20–24 మధ్య ఐపీవో
- రూ. 1,250 కోట్ల సమీకరణ




న్యూఢిల్లీ: ఆటో ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్ తయారీ కంపెనీ కారారో ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 668–704 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 20న ప్రారంభమై 24న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 19న షేర్లను కేటాయించనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ ప్రమోటర్ కారారో ఇంటర్నేషనల్ ఎస్ఈ రూ. 1,250 కోట్ల విలువైన వాటాను విక్రయానికి ఉంచనుంది. తద్వారా రూ. 1,250 కోట్లు సమీకరించనుంది. కంపెనీ ప్రధానంగా ఆఫ్‌హైవే వాహనాలు, వ్యవసాయం, నిర్మాణ రంగ పరికరాలలో వినియోగించే ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్‌ను రూపొందిస్తోంది. కారారో ఎస్‌పీఏకు దేశీ అనుబంధ సంస్థగా కంపెనీ 1997లో ఏర్పాటైంది. 1999లో ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్, 2000లో యాక్సిల్స్ తయారీలోకి ప్రవేశించింది. ప్రమోటర్ గ్రూప్ నుంచి ఐపీ రైట్స్ లైసెన్సింగ్ తీసుకోవడం ద్వారా క్లిష్టతరహా(కాంప్లెక్స్) ఇంజినీరింగ్ ప్రొడక్టులు, సొల్యూషన్లకు తెరతీసింది. ఆటో, కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ తయారీ దిగ్గజ(ఓఈఎం) కస్టమర్లకు ప్రొడక్టులు, సర్వీసులు సమకూర్చుతోంది. ప్రధానంగా వ్యవసాయ రంగ ట్రాక్టర్లు, నిర్మాణ రంగ వాహనాలకు యాక్సిల్స్, ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్ సరఫరా చేస్తోంది. క్లయింట్లలో టఫే, ఎంఅండ్ఎం, జాన్ డీరే ఇండియా, ఎస్కార్ట్స్ క్యుబోటా, యాక్షన్ కన్‌స్ట్రక్షన్, సీఎన్‌హెచ్, డూసన్, బుల్ మెషీన్స్ తదితరాలున్నాయి. గతేడాది(2023–24) ఆదాయం 4 శాతం బలపడి రూ. 1,770 కోట్లను అధిగమించింది. నికర లాభం 29 శాతం ఎగసి రూ. 61 కోట్లకు చేరింది.

ఐపీవోకు ఆయ్ ఫైనాన్స్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ.. ఆయ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 885 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 565 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా కంపెనీ రూ. 1,450 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులను మూలధన పటిష్టతకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లకు రుణాలు అందిస్తోంది. 478 బ్రాంచీల ద్వారా 18 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలలో సర్వీసులు విస్తరించింది. 2024 సెప్టెంబర్‌కల్లా రూ. 4,980 కోట్ల నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం)ను కలిగి ఉంది. గతేడాది(2023–24) నికర లాభం రూ. 172 కోట్లకు జంప్‌చేసింది. అంతక్రితం ఏడాది రూ. 44 కోట్లు మాత్రమే ఆర్జించింది.



సెనోరెస్ ఫార్మా @ రూ. 372-391


రూ. 582 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: స్పెషాలిటీ, కాంప్లెక్స్ ఔషధాల అభివృద్ధి, తయారీ కంపెనీ సెనోరెస్ ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 372–391 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 20న ప్రారంభమై 24న ముగియనుంది. ఐపీవోలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత వాటాదారులు మరో రూ. 82 కోట్లకుపైగా విలువైన 21 లక్షల షేర్లను ఆఫర్ చేస్తున్నారు. వెరసి ఇష్యూ ద్వారా మొత్తం రూ. 582 కోట్లకుపైగా సమీకరించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 38 షేర్ల(ఒక లాట్)కు దరఖాస్తు చేయవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధులను అట్లాంటా ప్లాంటువద్ద స్టెరైల్ ఇంజక్షన్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు వెచ్చించనుంది. అంతేకాకుండా అనుబంధ సంస్థలలో పెట్టుబడి వ్యయా లు, ఇతర కంపెనీల కొనుగోళ్లు, రుణచెల్లింపులకు సైతం వినియోగించనుంది. కంపెనీ యాంటీబయోటిక్స్, యాంటీబాక్టీరియల్, యాంటీఫంగల్ తదితర థెరప్యూటిక్‌లో కార్యకలాపాలు కలిగి ఉంది. గతేడాది (2023–24) కంపెనీ ఆదాయం రూ. 215 కోట్లకు చేరగా.. నికర లాభం దాదాపు రూ. 33 కోట్లయ్యింది.

యూరో ప్రతీక్ ఐపీవో బాట

రూ. 700-1,000 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: డెకొరేటివ్ ప్యానల్ తయారీ కంపెనీ యూరో ప్రతీక్ పబ్లిక్ ఇష్యూ ప్రణాళికల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ఈ నెలాఖరులోగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తద్వారా రూ. 700–1,000 కోట్లు మధ్య సమీకరించే వీలున్నట్లు తెలియజేశాయి. రూ. 5,000– 6,000 కోట్ల విలువలో కంపెనీ ఐపీవోకు రానున్నట్లు అంచనా. కంపెనీ యూరో ప్రతీక్, గ్లోరియో బ్రాండ్లతో ప్రధానంగా డెకొరేటివ్ వాల్ ప్యానల్స్, ప్రీమియం ల్యామినేట్స్ తయారు చేస్తోంది.



అశ్విన్ తర్వాత ఎవరు?

ఆ స్థానాన్ని భర్తీ చేసే వారి కోసం వెతుకులాట

ముందు వరుసలో వాషింగ్టన్ సుందర్


అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, అశ్విన్ (ఫైల్)

గింగిరాలు తిరిగే బంతులతో... ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టిన స్టార్ ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకగా... భారత జట్టులో అతడి స్థానాన్ని భర్తీ చేసేవారెవరు అనే చర్చ జోరుగా సాగుతోంది. విదేశీ పిచ్‌లపై ప్రదర్శనను పక్కన పెడితే... స్వదేశంలో టీమిండియా జైత్రయాత్ర వెనక అశ్విన్ పాత్ర ఎంతో ఉందనేది కాదనలేని సత్యం. అశ్విన్ అరంగేట్రం చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు సొంతగడ్డపై టీమిండియా 65 టెస్టులు ఆడగా... వీటన్నింటిలో అశ్విన్ బరిలోకి దిగాడు. ఈ మధ్య కాలంలో అశ్విన్ విఫలమైన రెండు సిరీస్‌లలో (2012 ఇంగ్లండ్‌తో, 2024 న్యూజిలాండ్‌తో) తప్ప అన్నిట్లో టీమిండియా జయకేతనం ఎగరవేసింది. ఈ గణాంకాలు చాలు అతడేంటో చెప్పేందుకు. 106 టెస్టుల్లో 537 వికెట్లు పడగొట్టి... భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచిన 38 ఏళ్ల అశ్విన్... 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' మూడో టెస్టు అనంతరం బుధవారం అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలకగా... సహచరులు, సీనియర్లు అశ్విన్ ఘనతలను కొనియాడారు. అయితే ఇకపై అశ్విన్ సేవలు అందుబాటులో లేకపోవడంతో... స్పిన్ మాంత్రికుడి స్థానాన్ని భర్తీ చేసేది ఎవరనే చర్చ ప్రధానంగా సాగుతోంది. ఇందులో వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, తనుశ్ కొటియాన్, అక్షర్ పటేల్ పేర్లు గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో వారి ప్రదర్శనలను ఓసారి పరిశీలిస్తే... -సాక్షి క్రీడావిభాగం

సుందర్‌కే చాన్స్ ఎక్కువ...

ఇప్పుడున్న పరిస్థితుల్లో అశ్విన్ స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడు ఎవరా అనే ప్రశ్నకు వాషింగ్టన్ సుందర్ అనే సమాధానమే వినిపిస్తోంది. ఈ ఇద్దరూ తమిళనాడుకు చెందిన వాళ్లే కాగా... సుందర్ కూడా అశ్విన్ బాటలోనే అటు బంతితో మాయ చేయడంతో పాటు ఇటు బ్యాటింగ్‌లోనూ సత్తా చాటగల సమర్థుడు. తాజా 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' తొలి టెస్టులో అశ్విన్‌ను కాదని టీమ్ మేనేజ్‌మెంట్ సుందర్‌కే అవకాశమిచ్చింది. సమీప భవిష్యత్తులో ఇలాగే జరిగే సూచనలు కనిపించడంతోనే అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికిన అశ్విన్... కొత్త తరానికి మార్గం సుగమం చేశాడు. అశ్విన్ తరహాలోనే టి20 ఫార్మాట్‌లో సత్తాచాటి అటు నుంచి జాతీయ జట్టు తలుపు తట్టిన 25 ఏళ్ల సుందర్... ఇప్పటి వరకు టీమిండియా తరఫున 7 టెస్టులు ఆడి 24 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో 48.37 సగటుతో 387 పరుగులు సాధించాడు. విదేశీ పిచ్‌లపై అశ్విన్ కంటే మెరుగైన బ్యాటింగ్ నైపుణ్యం సుందర్ సొంతం కాగా... ఇదే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని జట్టు యాజమాన్యం సుందర్‌ను ప్రోత్సహిస్తోంది. కెప్టెన్, కోచ్ నమ్మకాన్ని సంపాదించిన సుందర్... ఎప్పటికప్పుడు బౌలింగ్‌లో వైవిధ్యం చూపగల నేర్పరి కావడంతో అతడు ఈ జాబితాలో ముందు వరుసలో కనిపిస్తున్నాడు.

అక్షర్‌కు అవకాశం లేనట్టే!

గత కొంతకాలంగా పరిశీలిస్తే... సొంతగడ్డపై భారత జట్టు ఆడిన టెస్టుల్లో అక్షర్ పటేల్ మూడో స్పిన్నర్‌గా బరిలోకి దిగాడు. తన ఎత్తును వినియోగించుకుంటూ ఎడమ చేత్తో బంతిని స్పిన్ చేయడంతో పాటు బ్యాటింగ్‌లోనూ ప్రభావం చూపాడు. 30 ఏళ్ల అక్షర్ ఇప్పటి వరకు జాతీయ జట్టు తరఫున 14 టెస్టులు ఆడి 19.34 సగటుతో 55 వికెట్లు పడగొట్టడంతో పాటు 35.88 సగటుతో 646 పరుగులు చేశాడు. పరిమిత ఓవర్ల ఫార్మాట్లలోనూ స్పిన్ ఆల్‌రౌండర్‌గా తనదైన పాత్ర పోషిస్తున్న అక్షర్ పటేల్‌కు తన బౌలింగ్ శైలే ప్రధాన సమస్యగా మారింది. ప్రస్తుతం టీమిండియాలో సీనియర్ స్పిన్నర్‌గా ఉన్న రవీంద్ర జడేజా కూడా ఎడమచేతి వాటం బౌలరే కాగా... అక్షర్ మాదిరే బ్యాటింగ్‌లోనూ సత్తా చాటగల సమర్థుడు. దీంతో బౌలింగ్‌లో వైవిధ్యం ఉండాలి అంటే వీరిద్దరిలో ఒక్కరినే ఎంపిక చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తనుశ్‌పై దృష్టి...



ముంబైకి చెందిన కుడిచేతి వాటం ఆఫ్‌స్పిన్నర్ తనుశ్ కొటియాన్‌కు కూడా అశ్విన్ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దేశవాళీల్లో అపార అనుభవం ఉన్నా... ఇప్పటి వరకు జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేయని 26 ఏళ్ల తనుశ్... ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా భారత్ 'ఎ' జట్టు తరఫున ఆకట్టుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 33 మ్యాచ్‌లు ఆడి 25.70 సగటుతో 101 వికెట్లు పడగొట్టిన కొటియాన్... బ్యాట్‌తో 41.21 సగటుతో 1525 పరుగులు సాధించాడు. బౌలింగ్‌లో చక్కటి ప్రతిభతో పాటు అవసరమైతే లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయగల సత్తా ఉన్న తనుశ్... జాతీయ జట్టులో చోటు దక్కించుకుంటే సుదీర్ఘ కాలం కొనసాగే అవకాశాలున్నాయి. అయితే ప్రస్తుతానికి టీమిండియాలో ఉన్న పోటీని తట్టుకోవడం అంత సులభం అయితే కాదు.

రేసులో కుల్దీప్ యాదవ్

ఒకదశలో విదేశాల్లో భారత ప్రధాన స్పిన్నర్ అని హెడ్ కోచ్‌తో మన్ననలు అందుకున్న మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఆ తర్వాత పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. చైనామన్ స్పిన్నర్‌గా జట్టులోకి వచ్చిన కుల్దీప్ ప్రధానంగా పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లోనే ఆకట్టుకున్నాడు. ఇప్పటి వరకు జాతీయ జట్టు తరఫున 106 వన్డేల్లో 172 వికెట్లు... 40 టి20ల్లో 69 వికెట్లు పడగొట్టాడు. అదే సమయంలో టెస్టు ఫార్మాట్‌లో 13 మ్యాచ్‌లాడిన 30 ఏళ్ల కుల్దీప్ యాదవ్ 22.16 సగటుతో 56 వికెట్లు పడగొట్టాడు. అయితే ప్రస్తుతం అశ్విన్ స్థానం కోసం పోటీపడుతున్న వారిలో బ్యాటింగ్ పరంగా కుల్దీప్ యాదవ్ కాస్త వెనుకబడి ఉండటం అతడికి ప్రతిబంధకంగా మారింది. ఆంధ్ర ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి పేస్ ఆల్‌రౌండర్‌గా టెస్టు జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవడం ఖాయంగానే కనిపిస్తున్న నేపథ్యంలో కుల్దీప్‌కు బ్యాటింగ్ ప్రతిభతో సంబంధం లేకుండా స్వదేశీ పిచ్‌లపై ప్రధాన స్పిన్నర్‌గా ఎంపిక చేసుకునే అవకాశాలు లేకపోలేదు. వయసురీత్యా చూసుకుంటూ ఇప్పటికే 30వ పడిలో ఉన్న కుల్దీప్... అశ్విన్ వారసుడిగా పేరు తెచ్చుకుంటాడా అనేది కాలమే నిర్ణయించాలి.





యూపీ యోధాస్ జోరు

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో యూపీ యోధాస్ జోరుకు గుజరాత్ జెయింట్స్ చేతులెత్తేసింది. దీంతో యూపీ యోధాస్ 59–23 స్కోరుతో ఏకపక్ష విజయం సాధించింది. రెయిడర్లు గగన్ గౌడ (19 పాయింట్లు), భవాని రాజ్‌పుత్ (11 పాయింట్లు) అదరగొట్టగా, డిఫెండర్లు సుమిత్ (5), అశు సింగ్ (4), మహేందర్ సింగ్ (4) రాణించారు. 18 సార్లు కూతకెళ్లిన గగన్ గౌడ 13 సార్లు విజయవంతంగా పాయింట్లు తెచ్చిపెట్టాడు. మ్యాచ్‌లో నాలుగుసార్లు ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేయడం విశేషం. తొలి అర్ధ భాగం మొదలైన ఎనిమిది నిమిషాలకే యోధాస్ ఆటగాళ్లు గుజరాత్‌ను ఆలౌట్ చేశారు. 12–7తో అక్కడ మొదలైన ఆధిపత్యం ఆఖరిదాకా కొనసాగింది. ఈ అర్ధభాగం ముగిసేలోపే మళ్లీ 18వ నిమిషంలో జెయింట్స్ ఆలౌటైంది. గుజరాత్ ఆటగాళ్లలో రెయిడర్ గుమన్ సింగ్ (7), ఆల్‌రౌండర్ జితేందర్ యాదవ్ (6), రెయిడర్ రాకేశ్ (5) రాణించారు. ఇదివరకే ప్లేఆఫ్స్‌కు అర్హత సంపాదించిన యూపీ పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో యు ముంబా 43–37తో పట్నా పైరేట్స్‌పై గెలిచింది. ముంబా రెయిడర్ అజిత్ చౌహాన్ (15) పదేపదే పాయింట్లు తెచ్చిపెట్టగా, డిఫెండర్లు సునీల్ కుమార్ (5), పర్వేశ్ (4), మన్‌జీత్ (4), ఆల్‌రౌండర్ రోహిత్ రాఘవ్ (4) సమష్టిగా రాణించారు. పైరేట్స్ తరఫున రెయిడర్ దేవాంక్ (12), అయాన్ (7), డిఫెండర్లు దీపక్ (4), శుభమ్ (4) మెరుగ్గా ఆడారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్‌పాంథర్స్‌తో బెంగాల్ వారియర్స్... తెలుగు టైటాన్స్‌తో పుణేరి పల్టన్ తలపడనున్నాయి.

సెమీఫైనల్లో రష్మిక జోడీ



నవీ ముంబై: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల డబ్ల్యూ50 టోర్నమెంట్‌లో హైదరాబాద్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మికకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. సింగిల్స్ విభాగంలో ఓడిపోయిన రష్మిక... డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ రష్మిక 6–3, 1–6, 3–6తో క్వాలిఫయర్ జుజానా పావిలీకొస్కా (పోలాండ్) చేతిలో ఓడిపోయింది. 2 గంటల 5 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక 13 ఏస్‌లు సంధించి 7 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక (భారత్)–జిబెక్ కులమ్‌బయేవా (కజకిస్తాన్) ద్వయం 7–5,. 6–4తో నాక్లో థసాపోర్న్–థామ్‌చైవాట్ బున్‌యావి (థాయ్‌లాండ్) జోడీపై విజయం సాధించింది. హైదరాబాద్‌కే చెందిన సహజ యామలపల్లి, స్మృతి భాసిన్, చిలకలపూడి శ్రావ్య శివానిలకు కూడా డబుల్స్‌లో పరాజయం ఎదురైంది. క్వార్టర్ ఫైనల్స్‌లో సహజ (భారత్)–హిరోకో కువాటా (జపాన్) ద్వయం 4–6, 7–6 (7/2), 5–10తో 'సూపర్ టైబ్రేక్'లో రియా భాటియా–జీల్ దేశాయ్ (భారత్) జంట చేతిలో ఓటమి పాలైంది. స్మృతి భాసిన్–శ్రావ్య శివాని జోడీ 1–6, 1–6తో అంకిత రైనా–ప్రార్థన తొంబారే (భారత్) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

232 పరుగుల తేడాతో...

- జింబాబ్వేపై అఫ్గానిస్తాన్ ఘనవిజయం
- తమ వన్డే చరిత్రలో అతిపెద్ద గెలుపు నమోదు


సాదిఖుల్లా

హరారే: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన అఫ్గానిస్తాన్ జట్టు... తమ వన్డే చరిత్రలో అతిపెద్ద విజయం నమోదు చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన రెండో వన్డేలో అఫ్గానిస్తాన్ 232 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తుచేసింది. గతంలో దక్షిణాఫ్రికాపై 177 పరుగుల తేడాతో గెలిచిన మ్యాచ్ రెండో స్థానానికి చేరింది. సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ రద్దు కాగా... ఈ విజయంతో అఫ్గాన్ 1–0తో ముందంజ వేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. ఓపెనర్ సాదిఖుల్లా అతల్ (128 బంతుల్లో 104; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... మరో ఓపెనర్ అబ్దుల్లా మాలిక్ (101 బంతుల్లో 84; 11 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ జంట తొలి వికెట్‌కు 191 పరుగులు జోడించి జట్టుకు గట్టి పునాది వేసినా... తర్వాత వచ్చిన ఆటగాళ్లు అదే జోరు కొనసాగించడంలో విఫలమవడంతో అఫ్గాన్ ఆశించినంత స్కోరు చేయలేకపోయింది. అజ్మతుల్లా (5), రహ్మత్ షా (1), నబీ (18) ఆకట్టుకోలేకపోయారు. జింబాబ్వే బౌలర్లలో న్యూమన్ న్యామురి 3, ట్రెవర్ గ్వాండు రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో జింబాబ్వే పూర్తిగా తడబడింది. అఫ్గాన్ బౌలర్లను ఎదుర్కోలేక 17.5 ఓవర్లలో 54 పరుగులకే ఆలౌటైంది. ఆల్‌రౌండర్ సికందర్ రజా (19 నాటౌట్) టాప్ స్కోరర్. అఫ్గాన్ బౌలర్లలో నవీద్ జద్రాన్, ఘజన్‌ఫర్ మూడేసి వికెట్లు పడగొట్టారు. సెంచరీ హీరో సాదిఖుల్లా అతల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శనివారం మూడో వన్డే జరగనుంది.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సిమోనా హాలెప్

'వైల్డ్ కార్డు' కేటాయించిన టోర్నీ నిర్వాహకులు



మెల్‌బోర్న్: ప్రపంచ మాజీ నంబర్‌వన్ సిమోనా హాలెప్ వచ్చే ఏడాది జరిగే టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయింగ్ టోర్నీలో బరిలోకి దిగనుంది. ఈ మేరకు నిర్వాహకులు ఆమెకు 'వైల్డ్ కార్డు' కేటాయించారు. రొమేనియాకు చెందిన 33 ఏళ్ల హాలెప్ 2023లో డోపింగ్‌లో పట్టుబడింది. దాంతో ఆమెపై నాలుగేళ్ల నిషేధం విధించారు. ఆ తర్వాత ఈ నిషేధాన్ని తొమ్మిది నెలలకు కుదించారు. ఏడాదిన్నరపాటు ఆమె ఆటకు దూరంగా ఉండటంతో హాలెప్ ర్యాంక్ 877కు పడిపోయింది. 2018 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన హాలెప్ అదే ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గి, 2019లో వింబుల్డన్ టోర్నీలో చాంపియన్‌గా అవతరించింది.

వరుసగా రెండో ఏడాది...

నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించిన అర్జెంటీనా ఫుట్‌బాల్ జట్టు



జ్యూరిక్: ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) పురుషుల టీమ్ ర్యాంకింగ్స్‌లో విశ్వవిజేత అర్జెంటీనా జట్టు వరుసగా రెండో ఏడాదిని నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించింది. గురువారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా జట్టు 1867.25 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లోనే కొనసాగుతోంది. ఈ ఏడాది అర్జెంటీనా జట్టు కోపా అమెరికా కప్ టైటిల్ సాధించింది. ఫ్రాన్స్ రెండో స్థానంలో, స్పెయిన్ మూడో స్థానంలో ఉన్నాయి. గత నవంబర్‌లో విడుదల చేసిన ర్యాంకింగ్స్ నుంచి ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో తక్కువ మ్యాచ్‌లు జరగడంతో ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు లేవు. ఇంగ్లండ్, బ్రెజిల్, పోర్చుగల్, నెదర్లాండ్స్, బెల్జియం, ఇటలీ, జర్మనీ వరుసగా నాలుగు నుంచి 10వ ర్యాంక్ వరకు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది అన్ని జట్లకంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన అంగోలా జట్టు 32 స్థానాలు ఎగబాకి 85వ ర్యాంక్‌లో నిలిచింది. భారత జట్టు ఒక స్థానం మెరుగుపర్చుకొని 126వ ర్యాంక్‌లో ఉంది. తదుపరి ర్యాంకింగ్స్‌ను వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేస్తారు.

ఆకాంక్ష ముందంజ



ముంబై: ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ వెస్టర్న్ ఇండియా స్లామ్ స్క్వాష్ టోర్నీలో టాప్ సీడ్, భారత ప్లేయర్ ఆకాంక్ష సాలుంఖె క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఆకాంక్ష 11–3, 11–8, 8–11, 8–11, 12–10తో భారత్‌కే చెందిన తన్వీ ఖన్నాపై గెలిచింది. భారత్‌కే చెందిన రెండో సీడ్ అనాహత్ సింగ్, అంజలి కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

హైదరాబాద్ ఎఫ్‌సీ కోచ్‌పై వేటు



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ ఫ్రాంచైజీ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) తమ హెడ్ కోచ్ తంగ్బోయ్ సింగ్టోకు ఉన్నపళంగా ఉద్వాసన పలికింది. ఈ సీజన్‌లో హైదరాబాద్ జట్టు ప్రదర్శన పేలవంగా ఉండటంతో అతన్ని తప్పించింది. 13 జట్లు తలపడుతున్న ప్రస్తుత సీజన్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ 12వ స్థానంలో ఉంది. 11 మ్యాచ్‌లాడిన జట్టు కేవలం రెండింట గెలిచి ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకోగా... 8 మ్యాచ్‌లో ఓడింది. నిరాశజనక ప్రదర్శనపై అసంతృప్తితో ఉన్న ఫ్రాంచైజీ యాజమాన్యం ఉన్నపళంగా మణిపూర్‌కు చెందిన కోచ్‌పై వేటు వేసింది. అసిస్టెంట్ కోచ్ షమీల్ చెంబకత్‌కు తాత్కాలిక హెడ్‌కోచ్ బాధ్యతలు అప్పగించింది. గత ఐదేళ్లుగా సింగ్టో జట్టుతో ఉన్నాడు. మొదట్లో (2020లో) డైరెక్టర్‌గా ఉన్న అతను తదనంతరం అసిస్టెంట్ కోచ్‌గా పనిచేశాడు. గతేడాది జూలైలో హెడ్‌కోచ్‌గా నియమించారు.

మానస సరోవర్ యాత్ర పునఃప్రారంభం?

న్యూఢిల్లీ: మానస సరోవర్ యాత్ర పునఃప్రారంభం కానుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. సరిహద్దు సమస్య పరిష్కారానికి భారత్, చైనాలు ఆరు అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో బుధవారం బీజింగ్‌లో భేటీ అయ్యారు. సరిహద్దు సమస్యకు న్యాయమైన, సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన ప్యాకేజీ పరిష్కారాన్ని కోరుకుంటూనే శాంతిని కొనసాగించాల్సిన అవసరాన్ని ఇరు పక్షాలు అంగీకరించాయి. ఏకాభ్రిపాయానికి వచ్చిన అంశాల్లో టిబెట్, సీమాంతర నదీ సహకారం, నాథూలా సరిహద్దు వాణిజ్యం, కైలాస మానస సరోవర్ యాత్ర పునఃప్రారంభం వంటి అంశాలు ఉన్నట్లు తెలుస్తోంది. భారత్–చైనా ద్వైపాక్షిక సంబంధాల సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడానికి, సరిహద్దు ప్రాంతాల్లో శాంతిని కాపాడాల్సిన ప్రాముఖ్యతను ఇరు దేశాల ప్రత్యేక ప్రతినిధులు అంగీకరించారు. సరిహద్దు ప్రాంతంలో నిర్వహణ, నియంత్రణ నిబంధనలను మరింత మెరుగుపర్చాలని, విశ్వాసాన్ని పెంపొందించే చర్యలను బలోపేతం చేయాలని, సుస్థిర శాంతి, ప్రశాంతతను సాధించాలని అంగీకరించారు. వచ్చే ఏడాది భారత్‌లో ప్రత్యేక ప్రతినిధుల సమావేశాలు నిర్వహించేందుకు కూడా భారత్, చైనా అంగీకరించాయి. వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి దాదాపు నాలుగేళ్ల సైనిక ప్రతిష్టంభన తర్వాత డెమ్చోక్, డెప్సాంగ్ నుంచి భారత్, చైనాలు తమ బలగాల ఉపసంహరణకు ఒప్పందం కుదుర్చుకున్న విషయం విదితమే. అనంతరం ఈ ఉత్సాహాన్ని కొనసాగిస్తూ రెండు దేశాలు విశ్వాసాన్ని పునరుద్ధరించుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడానికి దీర్ఘకాలంగా ఏర్పాటు చేసిన యంత్రాంగంలో భాగమైన ప్రత్యేక ప్రతినిధుల చర్చలు ఐదేళ్ల విరామం తర్వాత జరిగాయి. చివరి సమావేశం 2019లో జరిగింది. గాల్వన్ లోయలో ఘర్షణల తర్వాత జరిగిన తొలి ప్రత్యేక ప్రతినిధి స్థాయి సమావేశం ఇదే కావడం గమనార్హం. గత నెలలో కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగిన విషయం విదితమే.

అంబేడ్కర్‌ను అవమానిస్తే ఊరుకునేది లేదు

అమిత్‌షా వ్యాఖ్యలపై సినీనటుడు కమల్ హాసన్ హెచ్చరిక

చెన్నై: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల దుమారంపై సినీనటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్‌హాసన్ స్పందించారు. ''అంబేడ్కర్‌ను అవమానిస్తే ఊరుకునేది లేదు. అంబేడ్కర్ ఆలోచనలపై పార్లమెంటులో అర్థవంతమైన చర్చ జరగాలి. ఇలాంటి చర్చలు పురోగతికి స్ఫూర్తినిస్తాయి. ఆ మహానుభావుడి ఆలోచనల వారసత్వానికి భంగం వాటిల్లడాన్ని ఎప్పటికీ సహించబోను. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అంబేడ్కర్ ఆలోచనలపై పార్లమెంట్‌లో చర్చించాలి''అని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కమల్ హాసన్ కోరారు. అంబేడ్కర్ చేసిన కృషిని ఆధునిక భారతదేశానికి పునాదిగా కమల్ అభివర్ణించారు. ''గాంధీజీ భారతదేశాన్ని విదేశీ అణచివేత నుంచి విముక్తం చేస్తే అంబేడ్కర్ భారత దేశాన్ని సామాజిక అన్యాయ సంకెళ్ల నుంచి విముక్తం చేశారు. అంబేడ్కర్ వారసత్వాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకత నెలకొంది''అని కమల్ అన్నారు.

కత్తి చూపి రూ.15 లక్షలు దోపిడీ

ముగ్గురు ఐటీ అధికారులు, పోలీస్ ఎస్సై అరెస్ట్

చెన్నై: ఓ వ్యాపారి వద్ద కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తిని కత్తి చూపి బెదిరించి రూ.15 లక్షలు లాక్కున్న ముగ్గురు ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారులు, ఒక పోలీస్ స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. వెల్లూరులోని ఓ వ్యాపారి వద్ద కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేసే మహ్మద్ గౌస్ ఈ నెల 17న నగదుతో వెళ్తుండగా ఎస్ఎస్ఐ రాజా సింగ్ అడ్డగించారు. అతడి వద్ద ఉన్న నగదు కట్టలకు సంబంధించి రసీదు చూపాలని, ఐటీ అధికారులకు వాటిని అందజేస్తానని చెప్పారు. అంతలోనే ముగ్గురు వ్యక్తులు కారులో అక్కడికి చేరుకుని తాము ఐటీ అధికారులమంటూ పరిచయం చేసుకున్నారు. వారిని చూడగానే రాజా సింగ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఐటీ ఆఫీసుకు బదులుగా ఎగ్మోర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు గౌస్‌ను వారు తీసుకెళ్లారు. అక్కడ కత్తి చూపి బెదిరించి, అతడి వద్ద ఉన్న రూ.15 లక్షలు లాక్కుని పంపించేశారు. దీనిపై గౌస్ ట్రిప్లికేన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా నలుగురినీ ఐటీ ఇన్‌స్పెక్టర్ దామోదరన్, ఐటీ అధికారి ప్రదీప్, సూపరింటెండెంట్ ప్రభు, ఎస్ఎస్ఐ రాజా సింగ్‌గా గుర్తించి, పోలీసులు అరెస్ట్ చేశారు.



మరణం అంచున గాజా

ఓవైపు చలి మరోవైపు ఆకలి

శీతాకాలం.. అంటేనే భూమిమీద ఉత్తరార్ధ గోళానికి పండుగ వాతావరణం. ప్రపంచంలో మూడోవంతు జనాభా ఇప్పుడు హాలిడే సీజన్ కోసం సిద్ధమవుతోంది. ఉత్తరార్థగోళ చలి ప్రభావాన్ని నేరుగా చవిచూస్తే గాజా స్ట్రిప్ మాత్రం వేడుకలకు దూరంగా ఆకలితో పోరాటం చేస్తోంది. చుట్టూ ఉన్న ప్రపంచమంతా పండుగకు సిద్ధమవుతుంటే క్షిపణుల మోతలు, బాంబుల దాడులతో ధ్వంసమైన గాజా నిరాశ, ఆకలితో మరణపు అంచున ఒంటరిగా నిలబడింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఉత్తరార్ధ గోళంలోకి వచ్చిన శీతాకాలం గాజాలో మరింత విషాదాన్ని తెచ్చిపెట్టింది. చల్లని వాతావరణం, వర్షం గాజాలో నిరాశ్రయులైన 20 లక్షల మంది పాలస్తీనియన్ల జీవితాలను దుర్భర పరిస్థితుల్లోకి నెట్టింది. ఇప్పటికే పలుమార్లు భారీ వర్షం కురిసింది. నిర్వాసితుల గుడారాలు వరదనీటిలో చిక్కుకుపోయాయి. కొన్ని కూలిపోయాయి. ఇది వేలాది నిరుపేద కుటుంబాలను మరింత కష్టాల్లోకి నెట్టింది. బాంబు దాడుల నుంచి తప్పించుకోవడానికి చాలా మంది ఇళ్ల నుంచి కేవలం కట్టుబట్టలతో బయటపడ్డారు. కొందరు శిథిలాల నుంచి బట్టలు తెచ్చుకున్నారు. కానీ అత్యధిక శాతం పాలస్తీనియన్లకు ఆ అవకాశం లేకుండాపోయింది. చలికాలం రావడంతో ఒంటిని వెచ్చగా ఉంచే సరైన దుస్తులులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న పిల్లల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కనీసం చెప్పులు కూడా కొనుక్కోలేని దుస్థితి.

ఆకాశాన్నంటుతున్న ధరలు

ప్రస్తుతం అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం ఒక కొత్త గుడారం 1,000 డాలర్ల వరకు ఉంటుంది. ఒక తాత్కాలిక షెల్టర్ వందల డాలర్లు ఖర్చవుతుంది. ఒక కొత్త దుప్పటి 100 డాలర్ల వరకు ఉంటుంది. బట్టల ధరలు మరింత పెరిగిపోయాయి. ఒక లైట్ పైజామా ధర ఇప్పుడు 95 డాలర్లు. ఒక కోటు వంద డాలర్లు. ఒక జత బూట్లు 75 డాలర్లు. చలి కాచుకోవడానికి సరిపడా ఇంధనం లేదు. ఇక 8 కిలోల గ్యాస్ ధర 72 డాలర్లకు చేరుకుంది. కలప ధర కొంచెం తక్కువ. కానీ పునరావాస శిబిరాల్లో ఉన్న ఎవరి దగ్గరా అంత డబ్బు లేదు. విపరీతమైన డిమాండ్‌ను తీర్చడానికి గాజా అంతటా సెకండ్ హ్యాండ్ దుస్తుల మార్కెట్లు వెలిశాయి. అక్కడా ధరలు ఎక్కువగానే ఉన్నాయి.

ఆహార లేమి, ఆకాశాన్నంటుతున్న ధరలు
- గంజి తాగి బతుకుతున్న పౌరులు
- పునరావాస శిబిరాల్లో విపరీతమైన చలి

ప్రబలుతున్న వ్యాధులు

వెచ్చగా ఉంచేందుకు బట్టలు, ఇంధనం లేకపోవడంతో శీతాకాలంలో జలుబు, ఫ్లూ, ఇతర వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇవి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. పోషకాహార లోపంతో బలహీనపడిన శరణార్థుల శరీరాలు విపరీతమైన భయం, బాంబుల గాయాలతో అలసిపోయాయి. అందుకే సాధారణ జలుబును కూడా వాళ్లు తట్టుకోలేక ఊరకనే జబ్బు పడుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రులు కూడా అరకొరగా పనిచేస్తున్నాయి. బాంబు దాడిలో తీవ్రంగా గాయపడిన వారికి మాత్రమే వైద్యం అందుతోంది. ఔషధాలు, సిబ్బంది కొరతతో సాధారణ రోగాలకు వైద్యం అందించలేకపోతున్నాయి. పరిశుభ్రత దాదాపు అసాధ్యంగా మారడంతో వ్యాధులు వేగంగా ప్రబలుతున్నాయి. చలివాతారణంలో సరైన విద్యుత్, ఇతరత్రా వసతులు ఏక గుడారాల్లో నిర్వాసితులు సరిగా స్నానం చేయలేక తిప్పలు పడుతున్నారు. చివరకు చేతులు కూడా శుభ్రంగా కడుక్కోలేని దైన్యం వాళ్లది.

భరించలేని మానసిక వేదన

ఆకలి శారీరక బాధే అయినా మానసిక వేదన అంతులేకుండా ఉంది. 2 లక్షలకు మందికి పైగా పిల్లలు పోషకాహార లేమితో బాధపడుతున్నారు. సరైన పౌష్టికాహారం లేక చిన్నారుల శరీరాలు ఎముకల గూడులాగా తయారయ్యాయి. వందలమంది చిన్నారులు సరైన తిండితిప్పలు లేక అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయారు. పిల్లలకు సరైన తిండికూడా పెట్టలేకపోతున్నామన్న బాధ తల్లిదండ్రులను విపరీతంగా వేధిస్తోంది. ఆకలితో చచ్చిపోతున్న పిల్లలను చూసి నిస్సహాయంగా కుమిలిపోతున్నారు. కన్నపిల్లలు కడతేరిపోతుంటే కన్నవారి కష్టాలకు హద్దు లేకుండా పోయింది. అత్యంత క్రూరమైన ఈ పరిస్థితులను దూరం నుంచి చూస్తున్న పశ్చిమదేశాలు నిశ్శబ్దంగా ఉండటం మరింత దారుణం. భూతలంపై నడిమధ్యలోనే ఉన్నా చలి, ఆకలితో పాలస్తీనా సమాజం ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ మరణంకోసం ఎదురుచూస్తోంది.

అత్యంత విలాసం.. రొట్టె ముక్క

అక్టోబర్ నుంచి గాజాలోకి వచ్చే అంతర్జాతీయ మానవతా సహాయం కూడా చాలా తగ్గిపోయింది. గాజా స్ట్రిప్ మొత్తం వినాశకరమైన కరువును ఎదుర్కొంటోంది. డిమాండ్ పెరిగి సరకు రవాణా బాగా తగ్గిపోవడంతో ధరలు విపరీతంగా పైకి ఎగశాయి. ఒక బస్తా పిండి ధర ఇప్పుడు ఏకంగా 300 డాలర్లకు పైనే ఉంది. ఇతర ఆహార పదార్థాలు కూడా ప్రియమైపోయాయి. కూరగాయల ధరలు మండిపోతున్నాయి. వేట మాంసం, కోడి మాంసం కోరుకోవడం చాలా పెద్ద అత్యాశ కిందే లెక్క. ఒకప్పుడు కుటుంబాలకు జీవనాడి అయిన బేకరీలు ఇప్పుడు ముడి సరుకులు అందక మూతపడ్డాయి. ఒక రొట్టె దొరకడమే చాలా కష్టంగా మారింది. పిండి దొరికినా అది పురుగులమయం. ఒకవేళ పురుగులు లేకుంటే అప్పటికే అది ముక్కిపోయి ఉంటోంది. దీంతో ప్రజలు ఇప్పుడు తకాయా(ఛారిటీ సూప్ కిచెన్ల)పై ఆధారపడవలసి వస్తోంది. ఉదయం 11:00 గంటలకు ఇవి తెరిచే సమయానికి పంపిణీ కేంద్రాల ముందు జనం చాంతాడంత వరసల్లో క్యూ కడుతున్నారు. వేలాది మంది శరణార్థుల కుటుంబాలకు తమ పిల్లలను పోషించడానికి ఇవి తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు.

నేను గర్వించదగ్గ క్రిస్టియన్‌ను

అయినా మత సామరస్యానికి కట్టుబడి ఉన్నా

- ఉధయనిధి స్టాలిన్ పునరుద్ఘాటన
- మత భావోద్వేగాలను రాజకీయం చేస్తున్నారన్న డిప్యూటీ సీఎం

చెన్నై: తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మత సామరస్యానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తనను తాను గర్వించదగిన క్రైస్తవుడిగా ప్రకటించుకున్నారు. గురువారం జరిగిన క్రిస్మస్ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడారు. మతం పేరుతో విభజించేవారిని, విద్వేషాన్ని చిమ్మేవారికి తాను వ్యతిరేకమని పునరుద్ఘాటించారు. 'గత ఏడాది క్రిస్మస్ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు నేను క్రిస్టియన్‌నని సగర్వంగా చెప్పాను. ఇది పలువురు సంఘీలకు చిరాకు తెప్పించింది. ఈ రోజు మళ్లీ చెబుతున్నా. నేను గర్వించదగిన క్రైస్తవుడిని. నేను క్రిస్టియన్‌ని అని మీరు అనుకుంటే, క్రిస్టియన్‌ని. ముస్లింనని మీరు అనుకుంటే, ముస్లింను. హిందువు అనుకుంటే, నేను హిందువును. నాకు అన్ని మతాలు సమానం. అన్ని మతాలు మనకు ప్రేమను చూపించమే నేర్పుతాయి'అని నొక్కి చెప్పారు. మతాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకునే వారు విద్వేషాలు, విభజనను వ్యాప్తి చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి ఆరోపించారు. 'ఇటీవల అలహాబాద్‌కు చెందిన ఓ న్యాయమూర్తి ఒక మతాన్ని కించపరిచేలా మాట్లాడటం చూశాం. ఆయన ముస్లింలపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. అలాంటి వ్యక్తి న్యాయమూర్తి పదవిలో ఉంటే ఆయన కోర్టులో న్యాయం ఎలా ఆశిస్తాం?'అని ప్రశ్నించారు. ఆయనను తొలగించడానికి లోక్ సభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి కాంగ్రెస్, డీఎంకే ఎంపీలు సంతకాలు చేసినా, అన్నాడీఎంకే ఎంపీలు మాత్రం సంతకాలు చేయలేదన్నారు. ''బీజేపీకి బానిసలుగా కొనసాగుతున్నారు కాబట్టే.. రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించిన న్యాయమూర్తిని తొలగించాలని కోరుతూ చేసిన తీర్మానానికి అన్నాడీఎంకే మద్దతివ్వలేదు''అని అన్నాడీఎంకేను విమర్శించారు. బీజేపీ–అన్నాడీఎంకే మధ్య రహస్య పొత్తు కొనసాగుతోందని, రాజ్యాంగ విలువల కంటే రాజకీయ విధేయతకే అన్నాడీఎంకే ప్రాధాన్యమిస్తోందని ఆయన ఆరోపించారు.

29 స్కూళ్లలో డమ్మీ విద్యార్థులు

సీబీఎస్ఈ ఆకస్మిక తనిఖీల్లో వెల్లడి

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) అధికారుల ఆకస్మిక తనిఖీల్లో 'డమ్మీ'విద్యార్థుల బాగోతం బయటపడింది. ఆయా సీబీఎస్ఈ అఫిలియేటెడ్ పాఠశాలల్లో వాస్తవ విద్యార్థుల సంఖ్యకు మించి ఎన్‌రోల్‌మెంట్ ఉన్నట్లు గుర్తించారు. ఢిల్లీ, బెంగళూరు, వారణాసి, బిహార్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలోని మొత్తం 29 పాఠశాలల్లో ఇలాంటి దందా జరుగుతున్నట్లు తేల్చారు. బాధిత పాఠశాలలకు నోటీసులు జారీ చేశారు. మౌలిక సదుపాయాల లేమి వంటి ఇతర నిబంధనల తీవ్ర ఉల్లంఘనకు పాల్పడిన ఈ పాఠశాలల యాజమాన్యాలపై న్యాయపరంగానూ చర్యలు తీసుకోనున్నారు. బుధ, గురువారాల్లో 29 బృందాలు ఈ మేరకు తనిఖీలు చేపట్టాయని సీబీఎస్ఈ కార్యదర్శి హిమాన్షు గుప్తా చెప్పారు. అవకతవకలను గుర్తించిన స్కూళ్లలో దేశ రాజధాని ఢిల్లీలోనివే 18 కాగా, వారణాసిలో మూడు, బెంగళూరు, పట్నా, అహ్మదాబాద్, బిలాస్‌పూర్, ఛత్తీస్‌గఢ్‌లలో రెండేసి చొప్పున ఉన్నాయన్నారు. ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రిపేరయ్యే విద్యార్థుల్లో కొందరు డమ్మీ స్కూళ్లలో ప్రవేశాలు పొంది, పరీక్షలకు సిద్ధమయ్యేందుకే పూర్తి సమయం కేటాయిస్తున్నారు. తరగతులకు హాజరు కాకుండా వీరు నేరుగా బోర్డ్ పరీక్షలు రాసేలా ఆయా స్కూళ్లు వీరికి వెసులుబాటు కల్పిస్తున్నాయి. ఏయే రాష్ట్రాల్లో మెడికల్ లేదా ఇంజినీరింగ్ సీట్లు పొందేందుకు అవకాశం ఉంటుందో చూసుకుని మరీ సంబంధిత ప్రాంతాల్లోని డమ్మీ స్కూళ్లలో ప్రవేశాలు తీసుకుంటున్నారు.

ప్రపంచమంతటా శాంతి నెలకొనాలి: భగవత్

పుణే: మన దేశంలోని మైనార్టీల విషయంలో కొందరు సలహాలు తరచుగా సలహాలు ఇస్తుంటారని, కానీ, ఇప్పుడు ఇతర దేశాల్లో మైనార్టీల పరిస్థితి ఏమిటో చూస్తున్నామని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భగవత్ చెప్పారు. ఆయా దేశాల్లో మైనార్టీల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని పరోక్షంగా సూచించారు. ఆయన గురువారం పుణేలో హిందూ సేవా మహోత్సవంలో మాట్లాడారు. ప్రపంచమంతటా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించారు. శాంతి కోసం తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కానీ, యుద్ధాలు ఆగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

దూరం జరగండని ఏనుగులకు చెప్పగలరా?

హైకోర్టు ఆదేశాలు అర్థరహితం
- కేరళలో త్రిస్సూర్ హారతిపూజ పూరం ఉత్సవంలో గజరాజుల వినియోగంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: వేలాది మంది భక్తుల సమక్షంలో జరిగే ప్రఖ్యాత త్రిస్సూర్ పూరం వేడుకలో గజరాజులను వరసగా నిలబెట్టి హారతి ఇచ్చే వైభవోపేత కార్యక్రమంలో ఏనుగులను దూరం దూరంగా నిలబెట్టాలంటూ కేరళ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. హైకోర్టు ఆచరణసాధ్యంకాని ఆదేశాలు ఇచ్చిందని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్‌కే సింగ్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. ఏదైనా అంశంలో ఉల్లంఘనలు జరగలేదని నిర్ధారణ అయినప్పుడు 'సూ మోటో పరిధి'ని దాటి హైకోర్టు యథాలాపంగా ఆదేశాలు జారీచేయకూడదని సుప్రీంకోర్టు హితవు పలికింది. పెంపుడు జీవాల ఆరోగ్య సంరక్షణ, బాగోగుల విషయంలో కేరళ పెంపుడు ఏనుగుల (నిర్వహణ)నియమాలు,2012ను విధిగా అమలు చేయాలంటూ కేరళ హైకోర్టు నవంబర్ 13న ఇచ్చిన తీర్పు అమలును సుప్రీంకోర్టు స్టే విధించిన సందర్భంగా సుప్రీంకోర్టు గురువారం పై వ్యాఖ్యలు చేసింది. సర్వాంగ సుందరంగా కేరళ సంప్రదాయ పద్ధతిలో ముస్తాబు చేసిన గజరాజులకు సమీపంలో బాణసంచా కాలుస్తూ వాటిని భయపెడుతున్నారని, గంటల తరబడి హింసిస్తున్నారంటూ జంతువుల హక్కుల పరిరక్షణ సంస్థ చేసిన అభ్యంతరాలను కేరళ హైకోర్టు గతంలో సూమోటోగా స్వీకరించి పలు సూచనలు చేసింది. యునెస్కో వారసత్వ సంపదగా ఘన కీర్తులందుకున్న కేరళలోని తిరువంబడి, పరమేక్కవూ దేవస్థానంలో హారతిపూజ పూరం ఉత్సవం సందర్భంగా ఏనుగులను వరసగా ప్రదర్శిస్తారు. గత 250 సంవత్సరాలకుపైగా ఆనవాయితీగా ఈ వేడుక జరుపుతున్నారు. ఏనుగులను హింసిస్తున్నారన్న ఆరోపణలపూ హైకోర్టు స్పందించింది. ''ఆలయ ప్రాంగణంలో ఏనుగులను ప్రదర్శించే చోటు విశాలంగా ఉండాలి. ప్రతి రెండు ఏనుగుల మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి. హారతి, కాగడా వంటి అగ్ని సంబంధ వస్తువులకు ఏనుగులను ఐదు మీటర్ల దూరంలో నిలపాలి. భక్తులను ఏనుగులకు 8 మీటర్ల దూరంలోనే ఆపేయాలి. ఏనుగులకు, భక్తులకు మధ్య బారికేడ్లు ఏర్పాటుచేయాలి. ఏనుగులకు బాణసంచా పేల్చే ప్రాంతానికి మధ్య కనీసం 100 మీటర్ల దూరం ఉండాలి. ఎండ తగలకుండా ఏనుగులకు గొడుగులాంటి ఏర్పాట్లు ఉండాలి. వాటికి అక్కడే దాణా అందించాలి. మంచి నీరు అందుబాటులో ఉంచాలి. ఈ నియమాల అమలు బాధ్యత జిల్లా కమిటీ తీసుకోవాలి''అని హైకోర్టు పలు సూచనలు చేసింది. కిక్కిరిసిన భక్తులతో కిటకిటలాడే ఆలయంలో ఇవన్నీ ఆచరణ సాధ్యంకావంటూ స్పెషల్ లీవ్ పిటిషన్ వేసి సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఆలయ దేవస్థానం తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. తమిళనాట జల్లికట్టు క్రీడ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విబేధించేలా కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది. వచ్చే ఏడాది జనవరి ఐదో తేదీన జరిగిన ఈ వేడుకలో సాధారణంగా 15 గజరాజులు పాల్గొంటాయి. సదరు నియమాలను పాటిస్తే కేవలం ఐదు ఏనుగులనే వినియోగించగలం. కేవలం మూడున్నర గంటలపాటు జరిగే వేడుకను యథాతథంగా జరగనివ్వండి''అని సిబల్ కోరారు. సిబల్ వాదనలతో జడ్జీలు ఏకీభవించారు. జంతువుల హక్కుల పరిరక్షణ సంస్థ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవేను, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ''3 మీటర్ల దూరం నిబంధన సాధ్యమా?. అసలు మూడు మీటర్ల నిబంధనను ఏనుగు ఎలా పాటించగలదు?. పక్కపక్కనే నిలబడిన ఏనుగులు ప్రేమతో ఒకదాని దగ్గరకు మరోటి జరిగినప్పుడు 'దూరం దూరం జరగండి'అని మనం చెప్పగలమా?'' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

రానా పిటిషన్‌ను తిరస్కరించండి

సుప్రీంకోర్టుకు అమెరికా ప్రభుత్వం వినతి

- 2008 ముంబై దాడుల కేసులో నిందితుడు
- భారత్ మోస్ట్‌వాంటెడ్ లిస్ట్‌లో ఉన్న ఉగ్రవాది

వాషింగ్టన్: తనను భారత్‌కు అప్పగించరాదంటూ ముంబై ఉగ్రదాడి కేసులో నిందితుడు తహవ్వుర్ రానా పెట్టుకున్న పిటిషన్‌ను కొట్టేయాలని అమెరికా ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. పాక్ మూలాలున్న కెనడా పౌరుడు రానా ముంబై దాడుల ప్రధాన సూత్రధారుల్లో ఒకరైన పాకిస్తానీ అమెరికన్ డేవిడ్ కోల్‌మాన్ హేడ్లీకి సన్నిహితుడు. ఉగ్ర ఘటనతో సంబంధముందన్న ఆరోపణలపై ఇతడిని లాస్‌ఏంజెలెస్ జైలులో ఉంచారు.

వాంటెడ్ జాబితాలో ఉన్న ఇతడిని తమకు అప్పగించాలని భారత ప్రభుత్వం కోరుతోంది. దీన్ని వ్యతిరేకిస్తూ రానా అమెరికాలోని పలు దిగువ కోర్టులు, ఫెడరల్ కోర్టుల్లో పిటిషన్లు వేశాడు. అన్ని చోట్లా ఇతడికి చుక్కెదురైంది. నవంబర్‌లో శాన్‌ఫ్రాన్సిస్కోలోని అమెరికా కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ ఫర్ ది నైన్త్ సర్క్యూట్‌లోనూ ఎదురుదెబ్బ తగిలింది. చిట్టచివరి ప్రయత్నంగా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఇక్కడా అలాంటి తీర్పే వస్తే భారత్‌కు అప్పగించడం తప్పనిసరవుతుంది. ఈ నేపథ్యంలోనే భారత్‌కు ఇతడిని అప్పగించాల్సిందేనంటూ యూఎస్ సొలిసిటర్ జనరల్ ఎలిజబెత్ బి. ప్రిలోగర్ ఈ నెల 16న సుప్రీంలో వేసిన 20 పేజీల పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో ఉపశమనం పొందే అర్హత రానాకు లేదని తెలిపారు. భారత్ ఇతడిపై మోపిన ఫోర్జరీ వంటి అభియోగాలకు రుజువులున్నాయని ఫెడరల్ ప్రభుత్వం నమ్ముతోందన్నారు.



ఢిల్లీలో కేంద్ర మంత్రి జార్జి కురియన్ నివాసంలో గురువారం రాత్రి జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలయేసు ప్రతిమ వద్ద కొవ్వొత్తిని వెలిగించారు. చిత్రంలో మంత్రి కురియన్ కూడా ఉన్నారు.

తీవ్రమైన కరువు కోరల్లో కెన్యా

40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా అనావృష్టి పరిస్థితులు
- ఆహారం, పరిశుభ్రమైన నీరు దొరకని దుస్థితి
- కలుషితమైన నీటితో ప్రబలుతున్న అంటు వ్యాధులు

కెన్యా నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత తీవ్రమైన కరువుతో కొట్టుమిట్టాడుతోంది. లక్షలాది మంది ప్రజలు తగినంత ఆహారం, నీరు లేకుండా అల్లాడిపోతున్నారు. వాతావరణ మార్పులతో తీవ్రమైన కరువు దేశ వ్యవసాయం, పశుసంపదపై పెను ప్రభావం చూపుతోంది. దీంతో కెన్యా ప్రజల జీవనోపాధి కష్టమవుతోంది. తినడానికి తిండి, తాగడానికి మంచి నీరు కూడా లేక లక్షలాది మంది ప్రజలు అంటు వ్యాధులబారిన పడుతున్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక తెలిపింది.

ఎండిపోతున్న జలాశయాలు

కెన్యాలో 40 ఏళ్లలో ఎన్నడూ లేనంత ఘోరమైన కరువు తాండవిస్తోంది. నదులు, సరస్సులు, జలాశయాల్లో నీటి మట్టాలు వేగంగా పడిపోతున్నాయి. చిన్నపాటి చెరువులు ఎండిపోతున్నాయి. ఐక్యరాజ్యసమితి నీటి అభివృద్ధి నివేదిక ప్రకారం భూగర్భ జల మట్టాలు సైతం పడిపోతున్నాయి. ఈ ప్రతికూల పరిస్థితులు దేశాన్ని తీవ్రమైన కరువులోకి నెట్టేశాయి. 15 లక్షల మందికి పైగా ప్రజలు తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ దీర్ఘకాలిక కరువు ధాటికి దాణా దొరక్క ఏకంగా 70 శాతం పశువులు ప్రాణాలు కోల్పోయాయి. పాడి ఆవులపై ఆధారపడిన వేలాది కుటుంబాల జీవనం ఇప్పుడు ఆదాయం లేక దుర్భరమైంది. ఆహార వనరులు కూడా తగ్గిపోయాయి. కరువు దెబ్బకు ఉన్న కాస్తంత ప్రధాన ఆహారాల ధరలు అమాంతం పైకిఎగశాయి. బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్న ధరలు ఐదేళ్ల సగటు కంటే 10 నుంచి 90 శాతం అధికంగా ఉన్నాయి.

ఎంత లోతు తవ్వినా..

2023లో కొన్ని ప్రాంతాల్లో దశాబ్దం కిందటి కంటే రెట్టింపు లోతులో బావులు తవ్వాల్సి వచ్చింది. తీవ్రమైన కరువు కారణంగా, చాలా మంది భూగర్భం నుంచి తీసుకువచ్చిన నీటిని తాగవలసి వస్తోంది. ఇది కూడా పరిశుభ్రంగా ఉండటం లేదు. ఈ నేపథ్యంలో దేశంలో నీటి విక్రయాలు పెరిగాయి. ఆ నీరు సైతం పరిశుభ్రంగా ఉండకపోవడంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఐక్యరాజ్యసమితి ప్రయత్నాలను ముమ్మరం చేసింది. 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకు, కెన్యా కరువు ప్రతిస్పందన పథకం కింద సుమారు 30 లక్షల మంది ప్రజలు ఏదో ఒక రకమైన కరువు సహాయాన్ని పొందారు.

ఆర్థిక సహాయం కోసం విజ్ఞప్తి

తక్కువ పారిశ్రామికీకరణతో ఇక్కడ గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలు తక్కువే. అయినా తక్కువ వర్షపాతం, గ్లోబల్ వార్మింగ్ కరువుకు కారణమవుతున్నాయి. మారుతున్న వాతావరణానికి అనుగుణంగా, భవిష్యత్తులో కరువు ప్రభావాలను తగ్గించడానికి దేశానికి ఆర్థిక మద్దతును పెంచాలని కెన్యా ప్రభుత్వం, అంతర్జాతీయ సంస్థలు కోరుతున్నాయి. ఇదే విషయాన్ని ఈ ఏడాది అజర్ బైజాన్‌లోని బాకు నగరంలో జరిగిన 2024 ఐక్యరాజ్యసమితి కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(కాప్29) సదస్సు పునరుద్ఘాటించింది. ఇలాంటి క్లిష్ట సమయాన్ని అధిగమించడానికి దేశానికి సహాయపడటానికి అభివృద్ధి చెందిన దేశాల నుంచి మరింత ఆర్థిక మద్దతు అవసరమని నొక్కి చెప్పింది.

- సాక్షి నేషనల్ డెస్క్

సాక్షి ప్లస్
శుక్రవారం। 20-12-2024

న్యాయవ్యవస్థ క్రియాశీలత అంటే..!

భారత రాజ్యాంగంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలకు సమప్రాధాన్యం ఉన్నప్పటికీ న్యాయ వ్యవస్థ తనకున్న న్యాయ సమీక్షాధికారం, క్రియాశీలతలతో చురుగ్గా పనిచేస్తూ మిగిలిన రెండు వ్యవస్థల పనితీరును పర్యవేక్షిస్తోంది. ఆ క్రమంలో న్యాయవ్యవస్థ తనకున్న సమీక్షాధికారంతో సమాజానికి, ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా తీర్పులు ఇస్తూ, మిగతా వ్యవస్థలకూ మార్గనిర్దేశం చేస్తోన్న తీరుతెన్నుల గురించి విశ్లేషణ.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

న్యాయ వ్యవస్థకు గల న్యాయ సమీక్షాధికారం భారత రాజ్యాంగంలో ఓ ముఖ్యాంశం. మన న్యాయ వ్యవస్థ రూపురేఖలు, అధికారాల గురించి విశ్లేషించేటప్పుడు ముఖ్యంగా ఉన్నత న్యాయస్థానాలకు(సుప్రీంకోర్టు, హైకోర్టులకు) గల ప్రత్యేక న్యాయ సమీక్షాధికారం గురించి స్పష్టంగా తెలుసుకోవాలి. రాజ్యానికి ముఖ్యం గా శాసన, కార్యనిర్వాహక, జ్యుడీషియరీ (న్యాయ) అనే మూడు వ్యవస్థలు ఉన్నాయి. అధికారాల విభజన (Separation of powers) ప్రకారం – ఒక వ్యవస్థ పనితీరులో మరో వ్యవస్థ జోక్యం చేసుకో కూడదు. అయితే న్యాయ సమీక్షాధికారాన్ని వీటికి మినహాయింపుగా చెప్పుకోవచ్చు.

న్యాయ సమీక్షాధికారం - నేపథ్యం

ఇంగ్లండ్‌లోని ప్రముఖ న్యాయమూర్తి ఎడ్వర్డ్ కోక్ 1610లో ఓ కేసులో తీర్పునిస్తూ.. ప్రభుత్వం చేసిన ఏ చట్టం అయినా/చేపట్టిన ఏ అధికారిక చర్య అయినా సహజసిద్ధంగా వచ్చే హక్కులకు (Natural Rights), కారణాలకు (Natural Reason) వ్యతిరేకంగా ఉంటే అలాంటి వాటిని న్యాయ స్థానాలు కొట్టేయొచ్చన్నారు. ఈ తీర్పును న్యాయ సమీక్షాధికారానికి నాందిగా పేర్కొంటారు. కానీ ఆ తీర్పు అప్పటి గ్రేట్ బ్రిటన్‌లో నిలవలేకపోయింది. అక్కడ వచ్చిన విప్లవాలు తదితర కారణాలతో 1688 తర్వాత బ్రిటన్‌లో పార్లమెంట్ ఆధిక్యత వచ్చింది.

మార్బురి వర్సెస్ మాడిసన్ కేసు

1803లో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో మార్బురి వర్సెస్ మాడిసన్ కేసులో సుప్రీంకోర్టు ప్రస్ఫుటంగా న్యాయ సమీక్ష సిద్ధాంతాన్ని గుర్తించింది. రెండు రోజుల్లో పదవీ కాలం ముగిసిపోతున్న అమెరికా అధ్యక్షుడు.. జ్యుడీషియరీ యాక్ట్ ఆఫ్ 1801ను కాంగ్రెస్‌లో ఆమోదించి, తద్వారా కొత్తగా కోర్టులను ఏర్పాటు చేసి 40 మంది న్యాయమూర్తులను నియమించారు. నియమితులైన న్యాయమూర్తులకు సెక్రటరీ ఆఫ్ స్టేట్ నియామక పత్రాలను జారీ చేసినప్పటికీ కొన్ని కారణాల వల్ల నలుగురికి మాత్రం ఇవ్వలేకపోయాడు. తర్వాత అధ్యక్షుడైన థామస్ జెఫర్సన్ ఆ నలుగురికి ఎలాంటి అపాయింట్‌మెంట్ ఆర్డరూ జారీ చేయొద్దని తన సెక్రటరీ ఆఫ్ స్టేట్ - మాడిసన్‌ను ఆదేశించాడు.దీంతో ఆ నలుగురిలో ఒకరైన విలియం మార్బురి.. సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. సెనేట్ ఆమోదంతో రాజ్యాంగబద్ధంగా నియమితుడినైన తనకు నియామక పత్రం పొందే హక్కు ఉందనీ, ఆ హక్కును ప్రస్తుత ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని పిటిషన్‌లో పేర్కొన్నాడు. అప్పటి అమెరికన్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్ ఈ కేసులో మూడు వివాదాస్పద అంశాలను గుర్తించాడు. అవి..

- మార్బురికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ పొందే హక్కు ఉందా? లేదా?
- సెక్రటరీ ఆఫ్ స్టేట్ – జేమ్స్ మాడిసన్‌కు ఆర్డర్ ఇవ్వాల్సిన బాధ్యత ఉందా? లేదా?
- ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టుకు ఉన్న అధికారం ఏమిటి?

అపాయింట్‌మెంట్ ఆర్డర్ పొందే హక్కు మార్బురికి, ఆర్డర్ ఇవ్వాల్సిన బాధ్యత మాడిసన్‌కు ఉన్నప్పటికీ.. సుప్రీంకోర్టుకు మాత్రం ఇందుకు సంబంధించి తీర్పునిచ్చే అధికారం లేదని న్యాయమూర్తి జాన్ మార్షల్ తెలిపారు. ఏ చట్టం ద్వారా పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడో అది రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందన్నారు. రాజ్యాంగం ప్రకారం రాజ్యాంగం మాత్రమే అత్యున్నత చట్టం. దాని హోదాను, విశిష్టతను రక్షించాల్సిన బాధ్యత కోర్టుపై ఉంది. అందుకే ఏ చట్టం కింద పిటిషన్ దాఖలు చేశారో అది రాజ్యాంగ వ్యతిరేకం కాబట్టి ఈ చట్టాన్ని కొట్టేస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ బాధ్యత, అధికార పరిధి ప్రకారం–రాజ్యాంగాన్ని ఉల్లంఘించినా, దానికి వ్యతిరేకంగా చట్టాలు చేసినా.. వాటిని కొట్టేసే అధికారం కోర్టుకు ఉందని స్పష్టం చేశారు. ఈ తీర్పును న్యాయ సమీక్షాధికారానికి నాందిగా, జాన్ మార్షల్‌ను న్యాయ సమీక్షాధికారానికి పితామహుడిగా పేర్కొంటారు. అమెరికాలో ఈ సమీక్షాధికారానికి కొన్ని పరిమితులున్నాయి. భారత రాజ్యాంగంలో న్యాయ సమీక్షాధికారం గురించి ప్రస్తావన లేనప్పటికీ.. కొన్ని ఆర్టికల్స్ ద్వారా ఈ అధికారం సుప్రీంకోర్టుకు, హైకోర్టులకు సంక్రమించింది.

- ఆర్టికల్ 13(1) ప్రకారం– రాజ్యాంగం అమల్లోకి రాకముందున్న చట్టాలు ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉంటే అవి చెల్లవు.
- ఆర్టికల్ 13(2) ప్రకారం–ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా రాజ్యం ఎలాంటి చట్టాన్నీ చేయకూడదు. ఒకవేళ చేస్తే అది చెల్లదు.
- ఆర్టికల్–32 ప్రకారం ప్రాథమిక హక్కుల పరిరక్షణకు కూడా న్యాయసమీక్షాధికారాన్ని ఉపయోగిస్తారు.

అదే విధంగా ఆర్టికల్ 226 కింద రిట్లు వేసే అధికారం కూడా న్యాయ సమీక్షాధికార పరిధిలోకే వస్తుంది. ఆర్టికల్ 131 ప్రకారం – అంతర్రాష్ట్ర వివాదాల వంటివి న్యాయ సమీక్షాధికారంలో భాగంగానే ఉన్నాయి. ఉన్నత న్యాయస్థానాలు చట్టాల రాజ్యాంగ బద్ధతను మాత్రమే న్యాయసమీక్ష ద్వారా పరీక్షిస్తాయి. ప్రస్తుతం చట్టాలకే పరిమితం కాకుండా.. అధికార చర్యలకు కూడా వీటిని విస్తృతపరిచారు. దీంతో కోర్టుకు చట్టాలను, ఆర్డినెన్స్‌లను, పరిపాలన చర్యలను సమీక్షించే అధికారం ఉంది. న్యాయ సమీక్షాధికారాన్ని సుప్రీంకోర్టు ఓ మౌలిక స్వరూపంగా (Basic feature) పరిగణించింది.



తీర్పులు

1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసు; ఇందిరా గాంధీ వర్సెస్ రాజ్ నరైన్ కేసు తీర్పుల్లోనూ సుప్రీంకోర్టు న్యాయ సమీక్షాధికారాన్ని మౌలిక స్వరూపంగానే పేర్కొంది. అదేవిధంగా ఆర్టికల్ 31(బి) ప్రకారం– 9వ షెడ్యూల్‌లో ఏదైనా చట్టాన్ని చేరిస్తే అది ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉందని ప్రశ్నించే అధికారం గానీ, న్యాయ సమీక్షాధికారం గానీ కోర్టులకు ఉండేది కాదు. కానీ 2007లో ఐ.ఆర్.కోయిల్హో వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో 11 మంది న్యాయమూర్తుల ధర్మాసనం.. 1973, ఏప్రిల్ 24 (basic structures doctrine was propounded) తర్వాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన చట్టాల రాజ్యాంగ బద్ధతను కూడా కోర్టులు సమీక్షించొచ్చని తీర్పునిచ్చింది

అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ చట్టం 1985 ప్రకారం– అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ మాత్రమే వేయొచ్చు. సంబంధిత రాష్ట్ర హైకోర్టులకు అప్పీళ్లను వినే అధికారం కూడా లేదు. కానీ 1997లో ఎల్.చంద్రకుమార్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఈ అంశాన్ని పరిశీలించి న్యాయ సమీక్షాధికారం అనేది మౌలిక అంశం కాబట్టి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ ఇచ్చిన తీర్పులను కూడా హైకోర్టు ఇద్దరు సభ్యులతో కూడిన ధర్మాసనం ఒక రిట్ పిటిషన్ ద్వారా సమీక్షించొచ్చని తీర్పునిచ్చింది.

- ఇలాంటి తీర్పుల నేపథ్యంలో న్యాయ సమీక్షాధికారం రాజ్యాంగపరంగా, కోర్టు తీర్పుల పరంగా రాజ్యాంగంలోని ఒక మౌలిక అంశంగా మారిపోయింది. మన దేశంలో న్యాయ సమీక్షాధికారం రాజ్యాంగ సవరణలను కూడా కొట్టేసే విధంగా ఉంది. ఉదాహరణకు తాజాగా జాతీయ న్యాయ నియామక కమిషన్(ఎన్‌జేఏసీ)కి సంబంధించిన 99వ రాజ్యాంగ సవరణను కొట్టేశారు. 2014లో వచ్చిన జాతీయ న్యాయ నియామకాల చట్టాన్ని కూడా కొట్టేశారు. ప్రపంచంలో ఇలాంటి విస్తృత న్యాయ సమీక్షాధికారం భారత న్యాయస్థానాలకు మాత్రమే ఉంది.

న్యాయ వ్యవస్థ క్రియాశీలత

న్యాయ వ్యవస్థ క్రియాశీలత (Judicial Activism) న్యాయ సమీక్ష అధికారంలో అంతర్భాగం. న్యాయ వ్యవస్థ క్రియాశీలత అంటే న్యాయ వ్యవస్థ తన విధులను, అధికారాలను మరింత చొరవగా, క్రియాశీలకంగా, ఉదారంగా వినియోగించడం! శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు అధికార విభజన అనుసరిస్తే ఒకరి విధుల్లో మరొకరు జోక్యం చేసుకోవడానికి అవకాశం లేదు. కానీ ఆధునిక ప్రజాస్వామ్య, సంక్షేమ రాజ్యాల్లో ఆయా వ్యవస్థల విధులు విస్తృతం కావడంతో ఒకరి విధుల్లో మరొకరు జోక్యం చేసుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. కానీ రాజ్యాంగం ప్రకారం– మూడు వ్యవస్థలకు సమప్రాధాన్యం ఉంటుంది. ఈ సమ ప్రాధాన్యం గురించి కింది ఉదాహరణ స్పష్టం చేస్తుంది. రాజ్యాంగ పరిషత్ సభ్యుడు టి.టి.కృష్ణామాచారి మూడు వ్యవస్థలను దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగ పరిధిలోని none of them can be an empire with in an empire అని వ్యాఖ్యానించారు. భారత్ లో న్యాయవ్యవస్థ క్రియాశీలత 1980కి ముందు తక్కువగా ఉండేది. కొన్ని అరుదైన కేసుల్లో మాత్రమే న్యాయ స్థానాలు తమ అధికారాన్ని ప్రదర్శించాయి. కానీ 1980 తర్వాత న్యాయవ్యవస్థ క్రియాశీలత పెరిగింది.

క్రియాశీలత ఎప్పుడు?

- శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు తాము చేయాల్సిన విధులను విస్మరించినప్పుడు లేదా వైఫల్యం చెందినప్పుడు న్యాయ వ్యవస్థ క్రియాశీలత ప్రదర్శిస్తుంది.
- వివిధ కారణాల వల్ల నిర్మాణాత్మక, కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో, ప్రజల కనీస అవసరాలు కూడా మెరుగుపరచలేని స్థితిలో ప్రభుత్వాలు కొనసాగితే న్యాయ వ్యవస్థ తన క్రియాశీలతను కనబరుస్తుంది.
- న్యాయ స్థానాలు స్వయం ప్రేరిత (సుమోటో) కేసులను ప్రవేశపెట్టి ప్రజల హక్కుల కోసం తగిన ఆదేశాలను జారీ చేయడం.
- స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు ప్రజా ప్రయోజనాలున్న కేసులను హైకోర్టు, సుప్రీం కోర్టుల దృష్టికి తీసుకురావడం వల్ల కోర్టులు క్రియాశీలత చూపిస్తున్నాయి.
- సంకీర్ణ, బలహీన, అస్థిర ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు న్యాయ వ్యవస్థ క్రియాశీలకంగా పని చేస్తుంది.

క్రియాశీలత రూపాలు

ప్రజాప్రయోజన వ్యాజ్యం: పేదరికం, నిస్సహాయత, అవగాహనలేమి లాంటి వివిధ కారణాలతో కోర్టును ఆశ్రయించలేని వారు ప్రజాప్రయోజన వ్యాజ్యం రూపంలో కోర్టు మెట్లు ఎక్కవచ్చు. అలాగే మూడో వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయించే అవకాశాన్ని కల్పించడం జ్యుడీషియల్ యాక్టివిజం ముఖ్య రూపం.

న్యాయ వ్యవస్థ క్రియాశీలత ద్వారా ఆర్టికల్ 21 ప్రకారం– ప్రాథమిక హక్కుల పరిధిని పెంచారు. ఉదాహరణకు జీవించే హక్కు అంటే right to live with basic human dignity అని కోర్టులు నిర్వచించాయి. 14 ఏళ్ల లోపు వారికి ఉచిత నిర్బంధ విద్యను అందించడం ప్రభుత్వం బాధ్యత అని చెబుతూ దాన్ని ఆర్టికల్ 21(ఎ)లో చేర్చారు. ఈ విధంగా ఉచిత న్యాయ సలహా పొందే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛా హక్కు మొదలైన వాటిని న్యాయ వ్యవస్థ తన క్రియాశీలతతో ప్రాథమిక హక్కుల్లోకి తీసుకొచ్చింది.

రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం కూడా న్యాయ క్రియాశీలతే. ఉదాహరణకు 99వ రాజ్యాంగ సవరణను కొట్టేయడాన్ని న్యాయ వ్యవస్థ క్రియాశీలతకు శిఖరాగ్రంగా చెప్పొచ్చు. పర్యావరణ హక్కుల్ని రక్షించడంలో న్యాయ వ్యవస్థ పాత్ర కీలకం. ఆగ్రా నుంచి దాదాపు 300 కంపెనీలను తాజ్‌మహల్‌కు దూరంగా తరలించడం కూడా న్యాయ వ్యవస్థ క్రియాశీలత వల్లే సాధ్యపడింది.

విమర్శ

న్యాయ వ్యవస్థ క్రియాశీలత పేరుతో న్యాయమూర్తులు వారి పరిధి దాటుతున్నారనే విమర్శ ఉంది. సంబంధంలేని విషయాలపై ఆదేశాలు జారీచేస్తున్నారని, విధానపరమైన విషయాల్లో జోక్యం చేసుకుంటున్నారని జస్టిస్ మార్కండేయ కట్జూ, జస్టిస్ మాథూర్ లాంటి న్యాయమూర్తులు ఓ తీర్పులో పేర్కొన్నారు. అలాగే జస్టిస్ కేజీ బాలకృష్ణన్ లాంటి న్యాయమూర్తులు న్యాయ వ్యవస్థ క్రియాశీలతను సమర్థిస్తున్నారు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల పనితీరు మెరుగ్గా లేకుంటే సాధారణ వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయిస్తారు. అందుకే న్యాయ వ్యవస్థ క్రియాశీలకం అని చెప్పొచ్చు. అలాగే నల్లధనానికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయడం, సల్వాజుడుం కేసు మొదలైన వాటిల్లో న్యాయ వ్యవస్థ క్రియాశీలతతోనే ఫలితాలు వచ్చాయి. నార్కో అనాలసిస్.. వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కుకు వ్యతిరేకమని కోర్టు తీర్పునిచ్చింది. న్యాయ వ్యవస్థ క్రియాశీలతకు కొన్ని పరిధులు ఉంటాయి. రాజ్యాంగం ప్రకారం– న్యాయ వ్యవస్థ అత్యున్నతం కాదు. రాజ్యాంగం మాత్రమే అత్యున్నతమైంది. న్యాయ శాఖ ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తూ శాసన, కార్యనిర్వాహక అంగాలు పనిచేసేలా చూడాలి!!

నార్కో అనాలసిస్‌లో వాడే రసాయనాలు?

శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. మానవ నాడీవ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ. కేంద్ర నాడీ వ్యవస్థలో మెదడు, వెన్నుపాము ఉంటాయి. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె(కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు.


టెట్/డీఎస్సీ ప్రత్యేకం
బయాలజీ

మానవ నాడీ వ్యవస్థ

మానవుడిలో మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె (కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. కపాలం అధ్యయనాన్ని క్రేనియాలజీ అంటారు. శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. ఈ వ్యవస్థ శరీరానికి వెలుపల, లోపల జరిగే మార్పులకు ప్రతిచర్యలను కలిగిస్తుంది. నాడీ వ్యవస్థ అధ్యయనాన్ని న్యూరాలజీ అంటారు. మానవ నాడీవ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ.

కేంద్ర నాడీ వ్యవస్థ

ఇందులో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి.. మెదడు. రెండు.. వెన్నుపాము. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. ఆ పొరలు (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా).. వరాశిక, లౌతుకళ, మృద్వి. ఈ పొరలకు బ్యాక్టీరియా (నిస్సేరా మెనింజైటిస్) సంక్రమిస్తే మెనింజైటిస్ వ్యాధి వస్తుంది. ఈ పొరల మధ్య ఉండే ద్రవ పదార్థాన్ని మస్తిష్క మేరుద్రవం(సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్) అంటారు. ఈ ద్రవం మెదడుకు, వెన్నుపాముకు రక్షణ కల్పి స్తుంది. మెదడులోని నాడీకణాలకు ఆహారాన్ని, ఆక్సీజన్‌ను సరఫరా చేస్తుంది.

మెదడు

మెదడు అధ్యయనాన్ని 'ఫ్రినాలజీ' అంటారు. అప్పుడే పుట్టిన శిశువు మెదడు 300–400 గ్రాముల బరువు ఉంటుంది. వయోజనుల మెదడు 1350–1400 గ్రాములు, పురుషుల్లో 1375 గ్రాములు, స్త్రీల్లో 1275 గ్రాముల బరు వు ఉంటుంది. మెదడులో 75 శాతానికి పైగా నీరు ఉంటుంది.

జంతువుల్లో అత్యంత బరువైన మెదడు (8 కిలోలు) తిమింగలంలో ఉంటుంది. ఏనుగు మెదడు 5 కిలోలు ఉంటుంది. నాడీ కణాల సంఖ్య మాత్రం మానవుల మెదడులోనే ఎక్కు వ. ఏనుగు మెదడులో 2,300 కోట్ల నాడీ కణా లు, చింపాంజీలో 700 కోట్లు, మానవుడిలో 8,600 కోట్లు ఉంటాయి.

నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం నాడీకణం (న్యూరాన్). మెదడు పనితీరుకు మూలం న్యూరాన్. మెదడు కణాల్లో న్యూరాన్లు పది శాతం ఉంటాయి. మిగతా 90 శాతం గ్లియల్ కణాలు ఉంటాయి. ఈ కణాలు పోషక పదార్థాలను అందించడంతోపాటు మెద డును శుభ్రం చేస్తాయి. మెదడు బరువు ఎక్కువ ఉన్నవారు ఎక్కువ తెలివితేటలు కలిగి ఉంటారని ఫ్రెడరిక్ టిడ్‌మాన్ పేర్కొన్నాడు.

- మానవుడి దేహం బరువులో మెదడు బరు వు రెండు శాతం మాత్రమే. కానీ శరీరం లోని మొత్తం శక్తిలో దాదాపు 20 శాతం, ఆక్సీజన్‌లో 20 శాతం, గ్లూకోజ్‌లో 25 శాతాన్ని వినియోగించుకుంటుంది.
- చుంచెలుక శరీరం మొత్తం బరువులో మెదడు బరువు 10 శాతం ఉంటుంది. మెదడుకు 5 నుంచి 7 సెకన్ల పాటు ఆక్సీజన్ అందకుంటే బ్రెయిన్ డెడ్ అవుతుంది.
- శరీరం లాగే మెదడుకూ విశ్రాంతి (నిద్ర) అవసరం.
- పెద్దవారు రోజుకు ఆరు గంటలు నిద్రపోవాలి
- క్రీడాకారులు 9 గంటలు, 18 ఏళ్ల లోపు వారు 8 గంటలు, నవజాత శిశువులు 18 గంటలు విశ్రాంతి తీసుకోవాలి.

బ్రెయిన్ మ్యాపింగ్

అత్యాధునిక స్కానింగ్, మ్యాపింగ్ పరిశోధనల వల్ల మెదడు పనితీరుపై అవగాహన ఏర్పడింది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు. మెదడు వ్యాధుల గుర్తింపు పరీక్షలు..

1. ఎలక్ట్రో ఎన్‌సెఫలో గ్రామ్ (ఈఈజీ)
2. మ్యాగ్నెటిక్ ఎన్‌సెఫలో గ్రామ్ (ఎంఈజీ)
3. మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ)
4. కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీటీ స్కాన్)
5. ఫంక్షనల్ మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ (ఎఫ్ఎంఆర్ఐ)

- స్కానింగ్‌లో రేడియోధార్మిక కిరణాలను ఉపయోగిస్తారు.
- కండరాల నొప్పులు, పక్షవాతం చికిత్సలో పరారుణ కిరణాలను వాడతారు.

నార్కో అనాలసిస్

- మెదడులోని సమాచారాన్ని యథావిధిగా బయటకు చెప్పించే ప్రక్రియ నార్కో అనాలసిస్ టెస్ట్.
- ఈ పరీక్షను అంతర్జాతీయ ఉగ్రవాదులు, ఆర్థిక నేరస్తులు, కుంభకోణాలకు పాల్పడిన వ్యక్తుల నుంచి నిజాలను రాబట్టడానికి ఉపయోగిస్తారు.
- ఈ పరీక్షలో వాడే రసాయనాలు.. సోడియం అమైటాల్, సోడియం పెంటాథాల్.

నోట్: ఈ పరీక్ష రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తి స్వేచ్ఛకు, జీవించే హక్కుకు వ్యతిరేకం. కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో కోర్టు అనుమతితో దీన్ని నిర్వహించాలి.

మెదడు - నిర్మాణం

మెదడులో మూడు భాగాలు ఉంటాయి. అవి.. ముందు మెదడు, మధ్య మెదడు, వెనక మెదడు.

ముందు మెదడు

ముందు మెదడునే సెరిబ్రమ్/మస్తిష్కం/పెద్ద మెదడు అని అంటారు. సెరిబ్రమ్ 995 గ్రాముల బరువు ఉంటుంది. దీనిలోని ఎత్తైన ప్రదేశాలను(గట్లను) గైరై అని, లోతైన ప్రదేశాలను సల్సై అని అంటారు. మస్తిష్కం 2 మస్తిష్కార్ధగోళాలు గా విభజితమవుతుంది. కుడి మస్తిష్కార్ధ గోళం ఎడమ కాళ్లు, చేతులను; ఎడమ మస్తిష్కార్ధగోళం కుడి కాళ్లు, చేతులను నియంత్రిస్తాయి.

- కుడి మస్తిష్కార్ధ గోళానికి గాయమైతే దేహంలోని ఎడమ వైపు భాగాలకు, ఎడ మ గోళానికి దెబ్బ తగిలితే కుడి వైపు భాగాలకు పక్షవాతం వస్తుంది. ఈ మస్తిష్కార్ధ గోళాలను నాడీదండం కలుపుతుం ది. మస్తిష్కానికి, మధ్య మెదడుకు మధ్యద్వారగోర్థం ఉంటుంది. ఇది రాంబాయిడల్ ఆకారంలో కనిపిస్తుంది. థలామస్,హైపోథలామస్‌గా విభజితమవుతుంది.

హైపోథలామస్ విధులు

1) భావోద్వేగాల నియంత్రణ
2) ఆకలి, దప్పిక
3) నిద్ర, మెలకువ
4) నీటి సమతుల్యత, రక్తపీడనం, శరీర ఉష్ణోగ్రత క్రమత
5) లైంగిక వాంఛ

- హైపోథలామస్.. పీయూష గ్రంథిని నియంత్రిస్తుంది. మానవుడిలో ఈ గ్రంథి ప్రధానమైంది.
- దృశ్య, శ్రవణ, స్పర్శ, వాసన, రుచిని తెలుసుకోవడానికి మస్తిష్కంలో ఐదు జ్ఞాన కేంద్రాలు ఉంటాయి.
- మస్తిష్కాన్ని ఉదర తలం నుంచి చూస్తే అందులో గదాకృతి నిర్మాణాలు కనిపిస్తా యి. వాటిని ఘ్రాణ లంబికలు అంటారు.

మస్తిష్కం విధులు

1) జ్ఞాపక శక్తి 2) తెలివితేటలు
3) ఆలోచన 4) ఊహా శక్తి
5) వివేచన 6) సమస్యల పరిష్కారం
7) అభ్యాసం 8) మాట్లాడటం

మధ్య మెదడు

- ఇది మందంగా, దృఢంగా ఉన్న చిన్న కాడ వంటి భాగం.
- ఇది హైపోథలామస్‌కు, పాన్స్‌వెరోలికి మధ్య ఉంటుంది. మధ్య మెదడు పృష్ఠ భాగంలో నాలుగు లంబికలతో 'కార్పొరా క్వాడ్రిజమైనా' అనే నిర్మాణం ఉంటుంది. ఇది దృశ్య, శ్రవణ జ్ఞానాలను కలిగిస్తుంది.

వెనక మెదడు

ఇది మెదడు చివరి భాగం. దీనిలో మూడు భాగాలు ఉంటాయి. అవి..
1) అనుమస్తిష్కం 2) పాన్స్ వెరోలి
3) మజ్జాముఖం.

అనుమస్తిష్కం (సెరిబెల్లమ్)

- దీన్ని లిటిల్ బ్రెయిన్ (చిన్న మెదడు) అని కూడా అంటారు.
- ఇది తల వెనక భాగంలో (మస్తిష్కానికి దిగువన, మజ్జాముఖానికి పైన) ఉంటుంది.

విధులు
1) శరీర సమతాస్థితిని కాపాడటం
2) నియంత్రిత కండరాల చలనాలను క్రమబద్ధీకరించడం

నోట్: మత్తుమందు ఇచ్చినప్పుడు, మద్యాన్ని అధికంగా సేవించినప్పుడు ఈ భాగం సక్రమంగా పనిచేయక మనిషి అదుపు తప్పుతాడు.

పాన్స్ వెరోలి

- ఇది మజ్జాముఖానికి వెనక, మధ్య మెదడుకు కింద ఉంటుంది. శ్వాస కండరాల కదలికలను నియంత్రించి, ఉచ్ఛ్వా సలో పీల్చే వాయువుల ఘనపరిమాణాన్ని క్రమపరుస్తుంది.

మజ్జాముఖం

ఇది మెదడు చివరి భాగం. మెదడును, వెన్నుపామును కలిపే సంధానకర్త/వారధి. ఇది అనియంత్రిత కండరాలకు సమాచారాన్ని అందిస్తుంది.

విధులు
1) శ్వాసక్రియ, నాడీ స్పందన, రక్తపీడనం, హృదయ స్పందన, పేగులు, జీర్ణాశయం, ఆహార వాహిక, మూత్రాశయం చలనాలను నియంత్రిస్తుంది.
2) వాసోమోటర్‌గా పనిచేస్తుంది(రక్తనాళా ల్లో జరిగే చర్యల వల్ల వాటి వ్యాసం మారుతుంది)
3) మింగడం, దగ్గడం, తుమ్మడం, వాంతులు, వెక్కిళ్లను నియంత్రిస్తుంది.

- మానవ మెదడులో మజ్జాముఖం అతి ముఖ్య భాగం. దీనికి తీవ్ర గాయమైతే (శ్వాసక్రియకు అంతరాయం కలిగి) వ్యక్తి మరణిస్తాడు.

వెన్నుపాము

మజ్జాముఖం.. వెనక వైపునకు విస్తరించి వెన్నుపాముగా మారి మొండెం చివరి వరకు ప్రయాణిస్తుంది. ఇది 42 నుంచి 45 సెం.మీ. పొడవు ఉంటుంది. వెన్నుపాము దాని అడ్డుకోతలో హెచ్ లేదా సీతాకోకచిలుక ఆకారంలో కనిపిస్తుంది. వెన్నుపాము లోపలి వైపు బూడిద రంగు పదార్థం, వెలుపలి వైపు తెలుపు పదార్థం ఉంటాయి. వెన్నుపాము మెదడుకు, శరీర భాగాలకు మధ్యవర్తిగా, సంధానకర్తగా పనిచేస్తుంది. అందువల్ల వెన్నుపామును టెలిఫోన్ ఎక్స్ఛేంజ్/రిలే సెంటర్ అని పేర్కొంటారు.

విధులు

అసంకల్పిత ప్రతీకార చర్యలను చూపడం. అంటే అనుకోకుండా వేగంగా, వెంటనే, అప్రయత్నంగా జరిగే చర్యలు. ఈ చర్యలు వెన్నుపాము ఆధీనంలో మాత్రమే ఉంటాయి. వీటికి మెదడుతో సంబంధం లేదు.

ఉదాహరణలు:
- వేడి వస్తువులను తాకగానే చేతిని వెనక్కి లాగడం.
- కీటకం అకస్మాత్తుగా కంటి వద్దకు రాగానే కను రెప్పలు మూయడం.
- చీకట్లో ఒక్కసారిగా కాంతి పడగానే కళ్లు మూసుకోవడం..

గతంలో అడిగిన ప్రశ్నలు

1. శరీరంలో ఉష్ణ నియంత్రణ కేంద్రం?
   1) కశేరు నాడీదండం
   2) హైపోథలామస్
   3) అనుమస్తిష్కం
   4) వెన్నుపాము
2. తుమ్మడం, మింగడం, వాంతులు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) వెన్నుపాము
3. ఆల్కహాల్, అనస్థీషియా.. మెదడులోని ఏ భాగంపై ప్రభావం చూపుతాయి?
   1) సెరిబ్రమ్ 2) సెరిబెల్లమ్
   3) మెడుల్లా అబ్లాంగేట
   4) వెన్నుపాము
4. మెదడును ఆవరించి ఉన్న పొరలేవి (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా)?
   1) మృద్వి 2) వరాశిక
   3) లౌతుకళ 4) ప్లూరా
   1) 1, 2, 3, 4 2) 2, 3, 4, 1
   3) 2, 3, 1 4) 3, 2, 1
5. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది?
   1) కండర కదలికల సమన్వయం
   2) గ్రాహకాంగం 3) జ్ఞాపకశక్తి
   4) దృష్టి
6. మెదడులోని ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) దవ్వ 4) అధో పర్యంకం
7. మానవ మెదడు సగటు బరువు?
   1) 1300 గ్రా॥ 2) 1400 గ్రా॥
   3) 1500 గ్రా॥ 4) 1350 గ్రా॥
8. ఆకలి, దప్పిక, లైంగిక వాంఛ, శరీర ఉష్ణోగ్రత దేని ఆధీనంలో ఉంటాయి?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) హైపోథలామస్
9. శరీరంలో వార్తలను గ్రహించి విశ్లేషించి సమన్వయపరిచే కేంద్రం?
   1) గుండె 2) కాలేయం
   3) మూత్రపిండాలు 4) మెదడు
10. పార్కిన్‌సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది?
    1) గుండె 2) చర్మం
    3) మెదడు 4) కాలేయం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 3; 5) 1;
6) 1; 7) 2; 8) 4; 9) 4; 10) 3.

తెలుగు సాహిత్యంలో ఆదికవి 'పాల్కురికి సోమన'

తెలంగాణ ప్రాంతానికి చెందిన పాల్కురికి సోమన తెలుగు సాహిత్యంలో ఆదికవి. ఈయన రాసిన 'బసవపురాణం' తొలి సాంఘిక కావ్యం. తెలుగులో తొలి ద్విపద కావ్యం కూడా ఇదే. ఇది ఏడు అశ్వాసాల ద్విపదం. సి.పి. బ్రౌన్ ప్రకారం ఇందులో 6288 ద్విపదలు ఉన్నాయి. పాల్కురికి తన రచనల్లో నాటి తెలంగాణా సాంఘిక జీవితాన్ని, శూద్రకులాలకు చెందిన వారి ఆచార వ్యవహారాలను కళ్లకు కట్టినట్లు చిత్రీకరించాడు. ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' కంటే ముందే ఈయన తన సాహిత్యంలో దళితుల గురించి వివరించాడు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర



తెలంగాణ కవులు - సాహిత్యం

శాతవాహన పూర్వ యుగం

పాతరాతి యుగం నుంచి తెలంగాణ ప్రాంతం నివాసయోగ్యంగా ఉండి క్రమంగా ఇక్కడ గ్రామాలు, పట్టణాలు, జనపదాలు ఏర్పడ్డాయి. క్రీ.పూ. 6వ శతాబ్దంలో భారతదేశంలో 16 మహాజనపదాలు ఉండేవి.

అవి: 1) కాశీ - వారణాసి
2) అంగ - చెంప (బెంగాల్)
3) మగధ - పాటలీపుత్రం (బిహార్)
4) అవంతి - ఉజ్జయిని (మధ్యప్రదేశ్)
5) ఛేది - శుక్తిమతి
6) వత్స - కౌశాంబి
7) పాంచాల - అహిచ్ఛత్ర
8) శూరసేన - మధుర
9) మత్స్య - విరాటనగరం
10) అస్మక - పోతన(నేటి బోధన్)
11) గాంధార - తక్షశిల
12) కాంభోజ - రాజపురం
13) కోసల - శ్రావస్తి
14) మల్ల - పావాపురి
15) వజ్జి - వైశాలి
16) కురు - ఇంద్రప్రస్థ (ఢిల్లీ).

వీటిలో అస్మక (పాళీ భాషలో అశ్మక, అస్సక, అసక అనే పేర్లతో పిలిచేవారు) జనపదం గోదావరి, మంజీరా తీరాల వెంట కొంత మహారాష్ట్ర, కొంత తెలంగాణాలో ఉండేది. ఈ జనపదంలో, ముళక జనపదంలోని నేటి కొన్ని తెలంగాణా ప్రాంతాల్లో, కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాలలో దొరికిన నాణేల ఆధారంగా శాతవాహనుల కంటే ముందే ఇక్కడ రాజ్యం ఏర్పడిందని తెలుస్తోంది.

మరిన్ని ఆధారాలు:

1. అశోకుడి 13వ శిలాశాసనంలో తెలంగాణ ప్రాంతంలోని అటవీ జాతుల గురించి వివరించారు.
2. సంగం(ప్రాచీన తమిళ కవుల సభ) సాహిత్యంలో కూడా తెలంగాణ ప్రాంత ప్రజల ఆహార, సామాజిక విషయాల గురించి ప్రస్తావించారు.

శాతవాహనులు మొదట తమ రాజ్యాన్ని తెలంగాణ (కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలు)లో స్థాపించారు.

శాతవాహన యుగానికి చెందిన కవులు - గ్రంథాలు:

గుణాఢ్యుడు: ఇతడు పైశాచీ ప్రాకృత భాషలో 'బృహత్‌కథ' రచించాడు. పైశాచీ అంటే వాడుక భాష. ఇతడు తెలంగాణ వాడుక భాషలో ఈ గ్రంథాన్ని రచించాడని చరిత్రకారులు భావిస్తున్నారు. పైశాచీ భాషపై ప్రాకృతం, ప్రాకృతంపై సంస్కృతం ఆధిపత్యం చూపాయి. ప్రాచీన తెలుగు భాషనే దేశీ భాష అని డాక్టర్ దినేశ్ చంద్ర సర్కార్ అనే పండితుడి అభిప్రాయం.

గుణాఢ్యుడిని తెలంగాణ మొదటి లిఖిత కవిగా పేర్కొంటారు. ఇతడు 'బృహత్‌కథ' గ్రంథాన్ని మెదక్ జిల్లాలోని కొండాపురంలో రచించాడని చరిత్రకారులు భావిస్తున్నారు. బృహత్‌కథను మూలకథగా తీసుకొని క్షేమేంద్రుడు 'బృహత్ కథామంజరి', సోమదేవసూరి 'కథా సరిత్సాగరం' రచించారు.

హాలుడు: శాతవాహన వంశానికి చెందిన 17వ రాజైన హాలుడు స్వయంగా కవి. ఇతడు 'గాథా సప్తశతి' గ్రంథాన్ని ప్రాకృత భాషలో రాశాడు. ఇందులో సుమారు 700 గ్రామీణ శృంగార కథలను సంకలనం చేశాడు. ఈ గ్రంథాన్ని శివస్తుతితో ప్రారంభించాడు. తెలంగాణలోని 350 కవుల గురించి కూడా వివరించాడు. తెలంగాణ శాసనాల్లో లభించిన తొలి కంద పద్యాలకు, గాథాసప్తశతిలోని పద్యాల చంధస్సుకు దగ్గరి పోలికలు ఉన్నాయి.

ఇక్ష్వాకులు (క్రీ.శ. 225-300)

శాతవాహన సామంత రాజుల్లో ఇక్ష్వాకులు ఒకరు. ఇక్ష్వాక వంశానికి చెందిన వాసిష్టిపుత్ర శాంతామూలుడు మరికొంత మంది సామంత రాజులతో కలిసి శాతవాహన చివరి రాజైన మూడో పులోమావిని ఓడించి స్వతంత్ర రాజ్య స్థాపన చేశాడు. ఈ రాజ్యాన్ని విజయపురి (నాగార్జునసాగర్)లో స్థాపించాడు. వీరి రాజ్యభాగాల విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. గుంటూరు, ప్రకాశం, కడప, కర్నూలు, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, తూర్పు గోదావరి జిల్లాలు వీరి పాలనా కేంద్రాలని డాక్టర్ కృష్ణారావు పేర్కొన్నారు.

ఇక్ష్వాకుల ప్రాధాన్యం

1. దేవాలయాలు నిర్మించిన తొలి రాజులు.
2. సంస్కృతంలో శాసనాలు ముద్రించిన తొలి దక్షిణ భారత రాజులు.
3. వీరు ప్రాకృతాన్ని పోషించినప్పటికీ తెలుగు భాష కూడా వాడుకలో ఉంది. వీరు మహాతలవర, సిరి, ఖండ, చలికి, బాపి, అంక తదితర పదాలను ఉపయోగించినట్లు ఆధారాలున్నాయి.

వాకాటకులు (క్రీ.శ. 250-550)

వాకాటకుల తొలి రాజ్యం బీరార్ (విదర్భ). వీరు ఉత్తర తెలంగాణ జిల్లాలను పాలించారు. ఈ రాజ్యస్థాపకుడు వింధ్యశక్తి. వాకాటక పాలకులు పండిత పోషకులే కాకుండా స్వయంగా గొప్ప కవులు. గుప్తుల్లో ఏకైక రాణి ప్రభావతి గుప్త (రెండో చంద్రగుప్తుడి కుమార్తె)ఈ ప్రాంతాన్ని పాలించారు.

కాళిదాసు: ఇతడు నవరత్నాల్లో ఒకడు. కాళిదాసు మొదట వాకాటక రాజ్యంలో నివసించాడు. ఇతడు మేఘదూతం (మేఘ సందేశం) నాటకాన్ని వాకాటక రాజ్యంలో రాంటెక్ (కరీంనగర్ జిల్లా రామగిరి)లో రచించాడు.

రెండో ప్రవరసేనుడు: ఇతడు 'సేతుబంధం' (సంస్కృతం) రచించాడు. ఇది శ్రీరాముడు లంకా నగరంపై చేసిన దాడిని ఇతివృత్తంగా చేసుకొని రచించిన గ్రంథం. గాథాసప్తశతిలో ఉన్న అనేక గాథల్ని ఇందులో రచించాడు.

వాకాటకుల అజంతా, ఎల్లోరా గుహల్లో 16వ, 17వ నంబరు విహార గుహలను, 19వ నంబరు చైత్య గుహను నిర్మించారు. వీరి రాజధాని వత్సగుల్మ గొప్ప సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లింది.

విష్ణుకుండినులు (358-575)

ఈ రాజ్యస్థాపకుడు ఇంద్రవర్మ. ఏలేశ్వరం, మిర్యాలగూడ, నల్లగొండ, భువనగిరి, కీసర, ఇంద్రపాలనగరం ప్రాంతాలను ఆక్రమించి ఇంద్రపాలనగరం రాజధానిగా క్రీ.శ. 358లో రాజ్యం స్థాపించాడు. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలోని రామన్నపేట సమీపంలో ఉన్న తుమ్మలగూడెమే నాటి ఇంద్రపాలనగరం.

మాదవ వర్మ: 'జనాశ్రయ చంధో విచ్ఛిత్తి' గ్రంథం రచించాడు. ఇందులో ద్విపద, త్రిపద పద్యాలతో పాటు వివిధ జాతుల పద్యాలు ఉన్నాయి.

బాదామి చాళుక్యులు (546-755)

జయసింహవల్లభుడు: ఇతడు బాదామి లేదా వాతాపి చాళుక్య వంశ స్థాపకుడు. చాళుక్యులు కృష్ణా- తుంగభద్ర నదుల అంతర్వేదికి చెందినవారని భావిస్తున్నారు. వీరు మొదట ఇక్ష్వాకుల వద్ద అధికారులుగా, సామంతులుగా ఉన్నారు. తర్వాత వాకాటక రాజ్యంలో ఉండి, ఆ రాజ్యం విష్ణుకుండినుల రాజ్యంలో విలీనమైన తర్వాత విష్ణుకుండినులకు సామంతులుగా వ్యవహరించారు. అనంతరం పశ్చిమ దిశలో బాదామి వైపు పయనించి అక్కడ స్వంతంత్ర రాజ్యం స్థాపించారు.

భవభూతి: ఇతడు 'మాలతీమాధవం' అనే గ్రంథాన్ని సంస్కృతంలో రచించాడు. భవభూతి నాడు తెలంగాణ ప్రాంతంలో సుప్రసిద్ధ కవి. ఇతడు కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో నివసించాడు. ఇతడు కాళప్రియనాథుడి భక్తుడు. కృష్ణయజుర్వేద తైత్తరీయశాఖకు చెందినవాడు. ఇతడి కీర్తి ప్రతిష్ఠలను విని యశోవర్మ తన ఆస్థానకవిగా నియమించుకున్నాడు. కాళిదాసు, భారవి లాంటి మహాకవులకు సమానంగా ప్రశంసలు పొందిన గొప్ప వ్యక్తి. ఇతడు ఉత్తర రామ చరిత, మహావీర చరిత్ర అనే నాటకాలు కూడా రచించాడు.

రాష్ట్రకూటులు

ఈ రాజ్యస్థాపకుడు దంతిదుర్గుడు. వీరు బాదామి చాళుక్యులకు సామంతులుగా ఉండి ఆ తర్వాత స్వతంత్ర్య రాజ్య స్థాపన చేశారు. తెలంగాణ ప్రాంతం కూడా రాష్ట్రకూటుల పాలనలోకి వచ్చింది. వీరి రాజధాని మాన్యఖేటం. ఈ వంశంలో చివరి రాజైన రెండో కర్కరాజు (1972-73)ను కల్యాణి చాళుక్య రాజైన రెండో తైలపుడు ఓడించడంతో రాష్ట్రకూట రాజ్యం అంతమైంది.

రాష్ట్రకూటుల సాహిత్యం:

అమోఘవర్షుడు కన్నడ భాషలో 'కవిరాజ మార్గం' గ్రంథాన్ని రచించాడు. ఇతడు 'రత్నమాలిక' అనే చంధోవిచ్ఛిత్తి గ్రంథాన్ని కూడా రచించాడు.

ముదిగొండ చాళుక్యులు

మూడో కుసుమాయుధుడు: ఇతడికి 'వినేత జనాశ్రయుడు' అనే బిరుదు ఉంది. కొరివి శాసనం నిర్మాత ఇతడే. ఇది తెలుగులో తొలి గద్య శాసనం. ఇందులో వచన రచన మృదుమధురంగా ఉంది.

వేములవాడ చాళుక్యులు

మొదటి హరికేసరి: ఇతడు వేములవాడ శాసనం నిర్మాత. రాష్ట్రకూట రాజైన ధ్రువుడికి సామంతుడు.

రెండో హరికేసరి: ఇతడు కన్నడ భాషను పోషించిన వేములవాడ చాళుక్యరాజు. ఇతడి ఆస్థానంలో పంప మహాకవి ఉన్నాడు. పంపకవి 'విక్రమార్జున విజయం' రచించాడు. ఇతడు ఆదిపురాణం, తెలుగులో జినేంద్రపురాణం కూడా రచించాడు. రెండో హరికేసరి ఇతడికి 'ధర్మపురం' గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చి సత్కరించాడు.

సోమదేవసూరి: ఇతడు 'కథా సరిత్సాగరం' గ్రంథం రచించాడు. ఇతడు మూడో హరికేసరి ఆస్థానంలో ఉన్నాడు. సోమదేవసూరికి 'శద్వాద చల సింహ' అనే బిరుదు ఉంది. ఇతడు మూడు తరాల జైనగురువుగా ఉన్నాడు. ఇతడు 'యశస్తిలక చంపువు' అనే సంస్కృత కథా కావ్యం రచించాడు.

బద్దెన: 'నీతిశాస్త్ర ముక్తావళి' గ్రంథకర్త.

రేచన: 'కవిజనాశ్రయం' గ్రంథ రచయిత.

కల్యాణి చాళుక్యులు

నల్లగొండ జిల్లాలోని కొలనుపాక వీరి సైనిక కేంద్రం. వీరు వీరశైవాన్ని ఆదరించారు. వీరి కాలంలో సంస్కృతం స్థానంలో దేశభాషలు క్రమంగా గౌరవం, రాజాదరణ పొందాయి.

కందూరి చోళులు

వీరి కాలంలో తెలుగు, కన్నడ భాషలకు ఒకే లిపి ఉండేది. వీరి శాసనాలు తెలుగు, కన్నడ లిపుల్లో ఉన్నాయి. వీరు గొప్ప కవి పోషకులు.

ఒకటో గోకర్ణుడు: 'గోకర్ణ చంధస్సు' అనే లక్షణ గ్రంథం రచించాడు.

ఉదయాదిత్యుడు: 'ఉదయాదిత్యాలంకారం' అనే లక్షణ గ్రంథం రచించాడు.

విరియాల కామసాని: గూడూరి శాసనం వేయించారు. నన్నయకు ముందే వృత్త పద్యాలు వాడిన తొలి శాసనం ఇదే.

నరహరి: ప్రసిద్ధ లాక్షణికుడు మమ్మటుడు రచించిన కావ్య ప్రణాళికకు ఇతడు 'బాల చిత్తానురంజన' పేరుతో వ్యాఖ్యానం చేశాడు. 'స్మృతి దర్పణం', 'తర్కరత్నం' ఇతడి రచనలు.

కాకతీయులు

కాకతీయులు రాష్ట్రకూట వంశానికి చెందిన వారు. వీరు మొదట తూర్పు చాళుక్యులకు సామంతులుగా ఉన్నారు. తెలంగాణా ప్రాంతానికి వచ్చి స్వతంత్ర రాజ్య స్థాపన చేశారు. ఆ తర్వాత యావదాంధ్రకు విస్తరించారు.

రెండో ప్రోలరాజు: మాటేడు శాసనం రచించాడు. కాకతీయుల మొదటి తెలుగు గద్య, పద్యాత్మక శాసనం ఇదే.

రుద్రదేవుడు లేదా ప్రతాపరుద్రుడు: ఇతడు తెలుగులో 'నీతిసారం' గ్రంథాన్ని రచించాడు. మానవల్లి రామకృష్ణ సంస్కృతంలో 'నీతిసారం' రచించాడు. ఇందులోని 111 పద్యాలను మడికి సింగన 'సకల నీతి సమ్మతం'లో ఉదహరించాడు.

అచింతేంద్రయతి: వేయి స్తంభాల గుడిలోని శాసనం (హన్మకొండ శాసనం) నిర్మాత ఇతడే. 1163లో ప్రతాపరుద్రుడు హన్మకొండలో వేయి స్తంభాల గుడి నిర్మించి, రుద్రేశ్వరాలయంగా పిలిచాడు. ఇందులో త్రికూటశైలి ప్రవేశపెట్టాడు. ఈ గుడి 2013లో 850 ఏళ్లు పూర్తి చేసుకుంది.

పాల్కురికి సోమనాథుడు (1160-1240):

ఈయన 'పండితారాధ్య చరిత్ర' రచించాడు. ఏ సంస్కృత పురాణంలో లేని స్వతంత్ర ఇతి వృత్తాన్ని తీసుకొని, పూర్తిగా దేశీయమైన భాషను ఉపయోగించాడు.

పాల్కురికి రాసిన గ్రంథాలు:

1) అనుభవసారం
2) చతుర్వేద సార సూక్తులు
3) సోమనాథభాష్యం
4) రుద్రభాష్యం
5) బసవరగడ
6) గంగోత్పత్తి రగడ
7) శ్రీ బసవాద్య రగడ
8) సద్గురు రగడ
9) చెన్నమల్లు సీసములు
10) మల్లమదేవి పురాణం (అలభ్యం)
11) శీల సంపాదన (కన్నడ)
12) బసవపురాణం
13) బెజ్జమహాదేవికథ

జాయపసేనాని (1199-1259): ఇతడు నృత్త రత్నావళి, గీత రత్నావళి, నాట్య రత్నావళి గ్రంథాలను సంస్కృతంలో రచించాడు. పాకాల చెరువు శాసనం, కలువ కొలను శాసనం రచించాడు. నృత్యానికి సంబంధించిన లక్షణ గ్రంథం రాసిన తెలుగువారిలో మొదటివాడు ఇతడే. కవి పోషకుడైన కాకతి గణపతిదేవుడికి ఇతడు బావమరిది. జాయపసేనాని గజ సైన్యాధ్యక్షుడిగా కూడా పని చేశాడు. గణపతి దేవుడు ఇతడి సోదరిని వివాహం చేసుకొని చిన్నతనంలోనే ఇతడిని తీసుకెళ్లి గుండమాత్యుని దగ్గర చేర్పించాడు. గుండమాత్యుడు ఇతడిని గొప్ప సాహిత్య, సంగీత విద్వాంసుడిగా తీర్చిదిద్దాడు. జాయపసేనాని.. భరతుడి నాట్య శాస్త్రం మొదలుకొని తన కాలం దాకా వచ్చిన అనేక నాట్య, నృత్య, శాస్త్ర గ్రంథాలను కూలంకషంగా పరిశీలించి స్వతంత్ర ప్రతిపత్తితో ప్రామాణిక గ్రంథాన్ని రచించాడు. ఇతడు తన గ్రంథాల్లో పేరిణి నాట్యం గురించి కూడా వివరించాడు. ఇతడు 'కవి చక్రవర్తి'గా ప్రసిద్ధి చెందాడు.

Number of messages used per person?



BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The number of people (1)/ who fail each year (2)/ is now in (3)/ single figure. (4)/ no error (5)
2. The experiments (1)/ were carried out (2)/ under simulation (3)/ examination conditions. (4)/ no error (5)
3. The game will be (1)/ broadcasted (2)/ simultaneously (3)/ on TV and radio. (4)/ no error (5)
4. He seemed sincere (1)/ enough when (2)/ he said he (3)/ wants to help. (4)/ no error (5)
5. My teaching style (1)/ is similar (2)/ to that of most (3)/ other teacher. (4)/ no error (5)
6. A report showing (1)/ the company's current situation shows (2)/ how people are influenced by (3)/ TV advertisements. (4)/ no error (5)
7. Market research has shown (1)/ us people want quality, (2)/ not just(3)/low prices. (4)/ no error (5)
8. Candidates which are (1)/ shortlisted for interview (2)/ will be contacted by the end (3)/ of the week. (4)/ no error (5)
9. If I was asked (1)/ to work (2)/ on Sundays, (3)/ I should resign. (4)/ no error (5)
10. Though many companies know the fact (1)/ that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ no error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. In order that training should be _____ it must be planned _____.
1) affected…thoroughly
2) affective…periodically
3) executed…properly
4) effective…systematically
5) complete…beforehand
12. Terrorist groups ______ responsibility for the shootings and bomb
1) charged…blasts
2) levied…plants
3) claimed…attacks
4) withdraw…pits
5) involved…calls
13. She is very ______ to other people's feelings.
1) sensible 2) sensibility
3) sensation 4) sensitive
5) sensitize
14. Paying children too much ______ when they misbehave can be self ______.
1) pampering…appealing
2) negligence…destruction
3) attention…defeating
4) care…appease
5) love…developing
15. Market researches often segment the population on the _____ of age and ______ class.
1) grade…economy
2) rate…affluent
3) unit…security
4) track…wealthy
5) basis…social

Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) If you knew the improved card deal is better than other cards you have, you may want to consider keeping it and cancelling the other card instead. Otherwise, cancel the card that you had decided to give up.
B) The first step in cancelling a card is to contact the card issuer. Some issuers let you cancel an account by phone. You may be transferred to a customer care officer who will try to convince you to keep the card.
C) Be sure to ask your issuer to record that the account was "closed at customer's request."
D) Make a note of the day and time you called and the person you talked to for your records. A written confirmation that an account has been closed should be sent to you from the card issuer.
E) Go ahead and listen. They may be willing to lower your interest rate, waive an annual fee or upgrade your card. Some issues have been known to offer plane tickets or travel vouchers to customers who want to cancel a card.
F) Keep this notice carefully for your records. If anything goes wrong with the account at a later date, you've got proof that you closed it.

16. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions: (Q. 21 - 25): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. We are <u>concrete</u> seeking new ways of expanding our membership.
1) evidence 2) fastly
3) purposely 4) currently
5) no correction required
22. Rumours that he <u>have flown</u> from the country were promptly scotched by his wife.
1) had to flow
2) had been flew 3) had fled
4) had been flowing
5) no correction required
23. Coal is a natural resource, which constitutes approximately 85% of the total fossil fuel <u>reservation</u> in the world.
1) reserves 2) reserved
3) reserve 4) reserving
5) no correction required
24. Even <u>among the native</u> users of English, plain and direct language is regarded as a virtue in communication.
1) between a native
2) between an native
3) among a native
4) among nativity
5) no correction required
25. Professional person at the work place frequently <u>dealing in material</u> which he must understand and also remember for future use.
1) dealt with material
2) deal in material
3) deals with materials
4) deal among materials
5) no correction required

Directions (Q. 26 - 30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

The first commercial SMS message was sent over the Vodafone GSM network in the United Kingdom on 3 December 1992, from Neil Papworth of Sema Group to Richard Jarvis of Vodafone. The text of the message was "Merry Christmas." The first SMS typed on a GSM phone is claimed to have been sent by Riku Pihkonen, an engineer student at Nokia in 1993.

Initial growth was slow, with customers in 1995 sending on an average only 0.4 messages per GSM customer per month. By the end of 2000, the average number of messages per user reached 35.

Short message services are developing very rapidly throughout the world. In 2000, just 17 billion SMS messages were sent; in 2001 the number was up to 250 billion and 500 billion SMS messages in 2004. At an average cost of USD 0.10 per message, this generates revenues in excess of $50 billion for mobile telephone operators and represents close to 100 text messages for every person in the world.

SMS is particularly popular in Europe, Asia - excluding Japan, Australia and New Zealand. Popularity has grown to a sufficient extent that the term texting has entered the common **lexicon**. In China, SMS is very popular, and has brought service providers significant profit; it is also a very influential and powerful tool in the Philippines, where the average user sends 10-12 text messages a day. The Philippines alone sends on the average 400 million text messages a day, more than the annual average SMS volume of countries in Europe, and even China. SMS is hugely popular in India, where youngsters often exchange lots of text messages, and companies provide alerts, infotainment, news, cricket scores, railway/airline booking, mobile billing and banking services on SMS. In India, metropolitan media outlets often take real-time polls and audience opinion through SMS, via reserved 4-digit numbers that redirect the information to the respective aforementioned outlets based on designated prefix codes.

26. The Asian country where SMS is not very popular is
1) Philippines 2) Japan
3) Australia 4) China
5) Europe
27. The number of messages that an average user sends in the Philippines is
1) more than the annual average SMS volume of countries in Europe, and even China
2) more than the annual average SMS volume of countries in India, and even China
3) more than the annual average SMS volume of countries in Europe, Australia and even China
4) more than or equal to the annual average SMS volume of countries in Europe, and even China
5) less than the annual average SMS volume of countries in Europe, and even China
28. Services provided by SMS to Indian users include
1) emergency services
2) fire services
3) mobile billing
4) 108 services
5) counseling
29. Average number of messages used per person
1) 10-12 messages a day
2) 400 million text messages a day
3) 100 text messages
4) 500 messages
5) 2000 messages per day
30. Lexicon means
1) glossary 2) glossy
3) lustrous 4) inventory
5) catalog

Key

1) 4	2) 3	3) 2	4) 4	5) 4
6) 5	7) 2	8) 1	9) 1	10) 3
11) 4	12) 3	13) 4	14) 3	15) 5
16) 5	17) 5	18) 2	19) 1	20) 1
21) 4	22) 3	23) 1	24) 5	25) 3
26) 2	27) 1	28) 3	29) 1	30) 1